# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక అక్టోబర్, 2012 ₹ 20



సాగరతీరం

# మిసిమి

మాసపత్రిక

"All that we are is the product of what we have thought"

*- Dammapada.*

**సంపుటి 23** అక్టోబరు **2012** **సంచిక 10**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా* **మిసిమి** *పేర పై చిరునామాకు పంపండి.*



మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ............ 3

మహాత్మాగాంధి తో... ............ 5
- *చార్లీ చాప్లిన్*

విశ్వకవి చింతన ............ 9
- *కాత్యాయనీ విద్మహే*

భావ చిత్రాలలో సామాజికాంశాలు ............ 16
- *ఆచార్య బేతవోలు రామబ్రహ్మం*

నాట్య కృషీవలుడు చిన్న సత్యం ............ 19
- *పసుమర్తి కేశవ ప్రసాద్*

తూర్పుగాలి-జపాన్ కవిత్వం ............ 21
- *ముకుంద రామారావు*

హెవీ వాటర్ ............ 27
- *దయ్యవరపు రామారావు*

అమెరికా నాటకరంగం ............ 28
- *గండవరం సుబ్బరామిరెడ్డి*

సి.ఆర్.రెడ్డి సేవలో... ............ 33
- *ఎస్.ఎస్. వెంకట్రామ్*

విశ్వరూపం ............ 40
- *స్టీఫెన్ హాకింగ్*

నాట్య విద్య ............ 48
- *వేదాంతం రామలింగ శాస్త్రి*

శ్రీమదగ్నిమహాపురాణము ............ 54
- *పుల్లెల శ్రీరామచంద్రుడు*

ముత్యాలసరాల్లో ధ్వని ............ 57
- *డాక్టరు అల్లంశెట్టి చంద్రశేఖరరావు*

నామ విజ్ఞానము ............ 59
- *ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు*

జానపదుల హాస్యం ............ 70
- *దామెర వేంకట సూర్యారావు*

దిఙ్నాగ ............ 73
- *కొమ్మనమంచి జోగయ్య శర్మ*

కవుల విలువ! ............ 75
- *పానుగంటి లక్ష్మీనరసింహారావు*

చదవండి (పుస్తక పరిచయం) ............ 76

నవ్వులు ............ 78


*ముఖచిత్రం* : ముగ్ధ మనోహరి – *చిత్రకారుడు* : అడాల్ఫ్ బొగురు

*రెండవ అట్ట* : సాగరతీరం

*మూడవ అట్ట* : తన్మయ స్నానం

*నాల్గవ అట్ట* : స్నిగ్ధ సుకుమారి

*చిత్రకారుడు* : ఫ్రెడరిక్ లీటన్


(*వివరాలు* : 39వ పుటలో....)

'నా జీవితమే నా సందేశం' అని ధైర్యంగా చెప్పగలిగిన వ్యక్తులు ప్రపంచ చరిత్రలో చాలా అరుదు. అలాంటి అరుదైన, అపురూపమైన, ప్రజల చేత ప్రేమింపబడిన, ప్రపంచ నాయకుల చేత గౌరవింపబడిన, గొప్ప గొప్ప వారి మెప్పులు పొందిన మహాత్ముని జన్మదినాన్ని మనమెలా జరుపుకోవాలి? ఆ సందేశసారాన్ని, మన జీవితాలకు అన్వయించుకోగలగటమే.

ప్రపంచ చరిత్రలో ఒకే ఒక్క చార్లీ చాప్లిన్! మహాత్ముణ్ణి చాప్లిన్ కలిసిన అపురూపమైన క్షణాలు, గాంధీ ఆదర్శాన్ని, ఆచరణను, రాజకీయ చతురతను, అహింసా సిద్ధాంతాన్ని చాప్లిన్ ఎలా అర్థం చేసుకున్నాడు?

ఈ భూమి మీద మనమెలావున్నాం? ఈ భూమి ఎక్కడవుంది, ఎలావుంది? విశ్వం ఒక్కటేనా? ఎన్నో విశ్వాలుంటే మనలాంటి ప్రాణులెక్కడైనా వున్నాయా? ఇవన్నీ శాస్త్ర విజ్ఞానం సమాధానం చెప్పగలిగిన ప్రశ్నలేనా? కాకపోతే ఏవిధంగా అర్థం చేసుకోవాలి? ఈ చర్చే 'విశ్వరూపం!'

కాలి నడకన కూచిపూడి నుంచి చెన్నపట్నం బయలు దేరి వెళ్లిన చిన్న సత్యం పెద్ద ప్రయాణం గురించి కేశవ ప్రసాద్ తెలియజేస్తున్నారు.

ఇటీవలి వరకు జపాన్‌లో కవిత్వ ప్రక్రియ లేదంటే నమ్మలేము. ఇంతవరకూ హైకూల గురించే తెలుసుకుని మన కవులు రాయటానికి ఎన్ని ప్రయత్నాలో చేస్తున్నారు. 'అసలు' జపాన్ కవితలు చదవండి.

ఎవరన్నారు పద్య కవులకు సమాజికాంశాలు పట్టవని? తెలుగు పద్యాలలో పూర్వ కవులు ప్రకృతివర్ణనలలో సమకాలీన ప్రజల జీవితాన్ని ఎలా ప్రతిబింబించారో, అలాంటి అపురూప సాహిత్య నిధుల్ని తవ్వి తీశారు బేతవోలు రామబ్రహ్మం.

పురాణాలన్నీ పుక్కిట పురాణాలు కావని – 'అగ్నిపురాణం'లోని, నిత్య జీవితంలో ఆచరించదగినవి, హేతుబద్ధమైన అంశాలెన్నిటి గురించో పుల్లెలవారు తెలియజేస్తున్నారు.



**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'అంతర్వీక్షణం'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

✶ "...*మిసిమి* సెప్టెంబరు 2012 చాలా రీడబుల్‌గా ఉంది. విలువైన విషయాలు తెలియజేశారు... *లే మిజరబుల్స్* అద్భుతం. వెంపటి చిన్న సత్యం ప్రయోగాలు మొదటిసారిగా చదువుతున్నాను... బాపన్న గారికి ధన్యవాదాలు..."

**– లంకా సూర్యనారాయణ,** గుంటూరు.

✶ "...ఈ రోజే సెప్టెంబరు సంచిక అందింది. ఆసాంతం చదివాను... ముందుగా చెప్పవలసింది గొల్లపూడి మారుతీరావు *లే మిజరబుల్స్* నాటకం గురించి అందజేసిన వివరాలు, ఆయన అనుభవం చాలా ఆసక్తికరంగా ఉంది... *స్వామినీన ముద్దు నరసింహనాయుడు...* ఈ మహనీయుడు ఆ కాలంలోనే సంఘసంస్కర్తగా చేసినపోరాటం ఎంతో విలువైనది. తరువాత వచ్చిన గురజాడ, వీరేశలింగం ప్రభృతులకు ఆదర్శం కూడా... నాకు తెలిసినంత వరకు అది *సామినేని* అనేదే సరియైన ఇంటి పేరు...

...*మిసిమి*లో అన్ని రచనలు ఆసక్తికరంగా ఉన్నాయి. లీలావతి రచన *శరీరభాష* చాలా చాలా బాగుంది. తస్సదియ్య అనే పదం కూడా చెప్పివుండవలసింది. ఒకటి, రెండు అచ్చుతప్పులు తప్ప పుస్తకం ఆసాంతం ఆకర్షణీయంగా ఉండి సంపాదకుల శ్రమ తెలియజేస్తోంది... కూచిపూడి నాట్యం, భాగవతుల గురించి మరిన్ని వివరాలు, చరిత్ర యివ్వగలిగితే ఆనందిస్తాం...

... *తిరగబడ్డ తెలుగు గెడ్డ* రాసిన సి.యస్.రావు అభినందనీయులు... ఇన్నాళ్ళకు ఒక నాటికను ఒక మాసపత్రికలో చదవగలిగినందుకు, అవకాశం కలిగించిన మీకు అభినందనలు. బందరులో జెండా వీరుడు తోట నరసయ్య, ఊరు పాగోలు. ఈయన జెండా ఎగురవేసింది రాబర్ట్‌సన్ స్కేర్ (కోనేరు సెంటరు). మద్దూరి అన్నపూర్ణయ్య, అల్లూరి సీతారామరాజు సహాధ్యాయులు. పర్వతనేని వీరయ్య చౌదరి, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, గాంధీజీకి శిష్యులే అయినా వారి మీద జరిగిన దుష్ప్రచారంతో గాంధీకి దూరమయ్యారు. ఇలాంటి వివరాలు కరణం సుబ్బారావు (ఒంగోలు) రాసిన పుస్తకంలో ఉన్నాయి..."

**– ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు,** విజయవాడ.

✶ "... *మిసిమి* మాసపత్రిక సెప్టెంబరుది తిరగేశాను – ఎంతో అద్భుతమనిపించింది. అయితే ఏ నెల కానెల బాగుంటోంది అనుకోండి. అయితే ఈ నెలలో మాత్రం నా ఆలోచనలకు తగిన సమాధానం దొరికిందా అని అనిపించింది... చిలకమర్తి వారి *సింహావలోకనం* అంటే ఆయన స్వీయచరిత్ర. 1944 నుండి కూడా ఈ వ్యవస్థలో మార్పురాని దౌర్భాగ్యం. లంచగొండితనం, ఆడపిల్లల కట్నం విషయంలోగానీ, నిమ్నజాతులపట్ల ప్రవర్తనలోగానీ...

...ఇది ఇలా ఉంటే మరికొన్ని పేజీలు తిరగేశేసరికి విశిష్ట వ్యక్తిగా *ముద్దు నరసింహనాయుడు* గురించి (హేట్సాఫ్ టు ఎడిటర్) – ఇలాంటి (విషయాలు) ఆలోచనలు గిడుగువారు, గురజాడ, కందుకూరి వారలు ముందురాలేదా అనుకున్నాను... అలా రానట్టు ఇప్పుడు తెలిసింది. ఇదంతా 1838 లోనే, అంటే సిపాయిల పితూరి ఇంకా రాలేదన్న మాట!... వేదాలను వక్రీకరించే ఒక వర్గం అయిన దౌర్భాగ్యులు స్త్రీలపట్ల – కడజాతిపట్ల ఎంత నికృష్టంగా ప్రవర్తించారో తెలుస్తోంది. సరళవ్యవహార తెలుగు రచనకు దారి చూపిన వాడు, ఇటువంటి మహనీయుని గురించి మీరు ఇచ్చిన చరిత్ర అక్షరసత్యం... ఇదేదో గురజాడకు, కందుకూరికే తెలిసినట్లు మోస్తున్నాం ఇన్నాళ్ళూ – *ముద్దు నరసింహనాయుడు* గురించి ఇకపై ఇంకా నలుగురికీ చెప్పాలి – తెలియాలి..."

**– బాలి,** హైదరాబాదు.

★ "...కాలువ మల్లయ్యగారి *ఆదిశంకరులు బౌద్ధులను గానుగలో వేసి ఆడించాడని* రాసిన వ్యాఖ్యకు ఆధారాలు చూపమన్నాను. దానికి *డాక్టరు నరసయ్యగారి ప్రశ్నకు వివరణ ఏమిటంటే – ఈ రోజుల్లో ప్రభుత్వాలు తమకిష్టంలేని రచనలను నిషేధించి సరిపెట్టుకుంటున్నాయి. ఆరోజుల్లో ఆ వాతావరణంలేదే? ఆధారాలు లేకుండా ఆ రచనలను కూడా అంతం చేసేవారుకదా?* అని దూడల రాములు ఏలూరు నుంచి ఉత్తరంలో తాను 'ఇవ్వనక్కరలేని' జవాబు సంజాయిషీగా ఇచ్చారు. రచనల నిషేధం లేదా ధ్వంసం గూర్చి నేను మాట్లాడలేదు.

...పరమతాల రచనలను ధ్వంసం కావడం చరిత్రలో ఉన్నదే. నేను సంజాయిషీ అడిగింది వ్యక్తుల హత్యల గూర్చి. దూడల రాములుగారికి ఇది అర్థంకానట్టుంది. మల్లయ్యగారు ఎక్కడో చూసి రాసి ఉంటారని, వారిని సాక్ష్యం అడిగాను. ఆయన తానెక్కడ చదివినాడో, చూసినాడో చెప్పాలి. రాములుగారికి అది ఎలా తెలుస్తుంది? అందుకే ఆయన సంజాయిషీ ఇవ్వనక్కరలేదు. 'ఆధారాలు లేకుండా' అంతం (రచనలనే కావచ్చుగాక!) చేస్తే (అని రాములుగారంటారు), మరి మీకెలా తెలిసింది రాములుగారూ? ఆధారాలు లేవుగా! చరిత్రలో పరమతాలపై దౌర్జన్యాలుండవచ్చు. *ఆదిశంకరుల మీద అభియోగం అదీ గానుగలో ఆడించి (మహాక్రూరంగా, తానే) చంపించాడని* అనే వ్యాఖ్యకు తప్పకుండా సాక్ష్యాధారాలతో చెప్పాలి. తనకెలా తెలిసిందో చెప్పాలి. అదీ మల్లయ్య గారే రాశారు కనుక వారే చెప్పాలి. ఎదురు చూద్దాం. నిరాధారంగా, బాధ్యతారహితంగా అలవోకగా మల్లయ్యగారు అనరని భావిస్తాను. రాములుగారి వద్ద ఆధారాలున్నా చెపితే అభ్యంతరం లేదు..."

**– డా.సంగనభట్ల నరసయ్య,** హైదరాబాద్.

★ "...నేను తొలిసారి, సంవత్సరం క్రిందట ప్రముఖ చిత్రకారులు ఈశ్వర్ సినిమాపోస్టర్ విషయంగా మీ కార్యాలయానికి వచ్చిన బృందంలో నేనూ ఉన్నా. ఈశ్వర్ ప్రియమిత్రుని, ఆ సమయంలో మీకు పరిచయం చేయగా మీరన్న మాట *"ఈశ్వర్‌గారి సంతకం చూస్తూ పెరిగాము, ఇప్పుడు కలిశాము"* అన్నారు. ఆయన కూడా మరోసారి మీ అభిమానాన్ని ప్రస్తుతించారు...ఆ సమయంలోనే స్వర్ణ ***మిసిమి*** (పునరుక్తి దోషముందా?) చందా కట్టడమే కాక అభిమానంతో మీరంతా మమ్మల్ని కట్టివేయటం కూడా జరిగింది. మీకు వేనవేల కృతజ్ఞతలు...ఇందుతో ఓ నూలుపోగు పంపుచున్నాను. నా అభ్యర్థన ఏమనగా మీరు ఎంతో అందంగా చేయించిన 2010, 2011 ***మిసిమి*** ప్రతుల బైండు; మరియు మే 2012 ***మిసిమి***, మరియు కొనసాగించవలసిన చందాగా స్వీకరించగలరు. ఎక్కువ తక్కువలుంటే నేను తమకు మరలా పంపగలను...శ్రీ బాపన్న ఆలపాటి వారికి శతాధికవందనాలు...

...మీ జవాబు జాబిలి కోసం చూస్తా. నమస్తే..." **– వి.ప్రమోద్‌కుమార్,** విజయవాడ.

★ "...ఈ మంచి పత్రికకు బాధ్యత గల ఏజంట్లు చాలా అవసరం. చిన్న చిన్న వూళ్లల్లో దొరకటంలేదు. చెత్త పత్రికలన్నీ తెచ్చి అమ్ముతున్నారు. ఇంత విలువైన పత్రికను తెమ్మంటే వినరు. మేము కొనలేక, చదవలేక విచారపడుతున్నాం. అంతేనా? ఎన్నో విలువైన రచనలను చదవలేక నిరాశపడుతున్నాం..."

**– చాట్రాతి ఉమామహేశ్వర వేణుగోపాలరావు,** నిజాంపేట.

★ "...*సామినేని ముద్దు నరసింహనాయుడు* గురించి మీరు ప్రచురించిన వ్యాసం ఎంతో విలువైనది – మనం ఇన్నాళ్ళు వైతాళికులు, ప్రాతఃస్మరణీయులు అని గొప్పలు చెప్పుకుంటున్న సంస్కర్తలనేవారే ప్రేరణ పొందిన *మహనీయుడు నరసింహనాయుడు*. వీరి పేరును తమ తమ స్వీయ చరిత్రలలో చెప్పకపోవటం అది వారి విజ్ఞతనే తెలియజేస్తున్నది... *శరీర భాష* సరికొత్త పోకడ... సాహసంతో నాటిక ప్రచురించారు. అభివందనలు..."

**– పెద్ది సాంబశివరావు,** గుంటూరు.

★ "...ఇంతవరకు *సామినేని నరసింహనాయుడు* చరిత్రను, పోరాటాన్ని ఎవరూ తెలుగులోనికి తేలేదు. ఆ మహత్తరమైన కార్యం ***మిసిమి*** సంపాదకులు చేయగలిగారు. మనం గొప్పవారు అని దప్పాలు కొట్టుకుంటున్న వారి డొల్లతనం కూడా బయటపడుతుంది..." **– భాస్కర్ మీనన్,** అమలాపురం.

# మహాత్మాగాంధి తో...

– చార్లీ చాప్లిన్

సర్ విన్‌స్టన్ చర్చిల్ మనందరికంటే జీవితంలో ఎక్కువ అనుభవం వున్నవాడు. జీవితంలో ఎన్నో పాత్రలు పోషించాడు. ధైర్యశాలిగా, ఉత్సాహకరంగా, ఉల్లాసంగా, చాలా గొప్పగా జీవించాడు. ఎంతో అధికారంతో జీవితం గడిపాడు. ప్రపంచంలోని సౌఖ్యాలూ అన్ని చూశాడు. జీవితం ఆయనకు పూలబాటగా గడిచింది. అతనన్నీ గెలిచాడు. ఎంతో అధికారాన్ని అనుభ వించినా, ఆ అధికారం ఆయన్ను చెడగొట్టలేదు. అంత పని జీవితంలో కూడా ఆయన తన అలవాట్లను మార్చు కోలేదు. గుర్రాల స్వారీ, గోడలు కట్టటం, చిత్రాలు వేయటం అన్నీ చేశాడు. నేను భోజనానికి వెళ్లినప్పుడు అక్కడ చలిమంట గూటి పైన పెద్ద చిత్రం వుంది. నేను చూస్తుండగా 'నేనే వేశాను' అన్నాడు. 'చాలా బాగా వేశారే' అన్నాను. "అంత కష్టం ఏమీలేదు ఫ్రాన్స్ లో ఒకతను బొమ్మ వేయటం చూశాను. నేనూ వేయగలను అని వేశాను!"

ఆ మర్నాడు ఆయన వుంటున్న కార్ట్‌వెల్ చూపించాడు. "ఈ గోడలన్నీ నేనే కట్టాను" అన్నాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. "చూసినంత తేలిక కాదు ఇటుకలు పేర్చటం. అయిదు నిమిషాల్లో చూపిస్తాను" అన్నాడు.

ఆ రోజు రాత్రి విందుకు చాలామంది యువకులు పార్లమెంటు సభ్యులు వచ్చారు. వాళ్లందరూ ఆయన కాళ్ల దగ్గరే కూర్చున్నారు. ఆ రోజు బూత్‌బీ కూడా వచ్చాడు! ఇప్పుడు ఆయనే లార్డ్ బ్రెండెన్! బ్రేకన్ కూడా వచ్చారు. తర్వాత లార్డ్ బ్రేకెన్ అయ్యాడు!

అపుడు చెప్పాను నేను గాంధీని కలుస్తాను అని – (అప్పుడు ఆయన లండన్‌లో వున్నాడు) "ఇప్పటివరకు ఈయనకు చాలా చేశాము. ఆయన నిరాహార దీక్ష చేసినా



చాప్లిన్, గాంధీ కలిసి కానింగ్ టౌన్ వచ్చినప్పుడు జనసందోహం సెప్టెంబరు 22, 1931



**డాక్టరు కటియల్ ఇంట్లో గాంధీ తో చాప్లిన్**

ఇంకేమి చేసినా ఆయన్ను ముందు కారాగారంలో పెట్టాలి. అక్కడే వుంచాలి" ఉన్నాడు బ్రేకెన్. "లేదంటే మనకు ఇండియా పోయినట్లే."

"కారాగారంలో పెట్టడం చాలా చిన్న విషయం. అది ఎలా పనిచేస్తుంది?

"మీరు ఒక గాంధీని కారాగారంలో పెడితే మరో గాంధీ వస్తాడు" అన్నాను. "ఆయన అక్కడి ప్రజలకు ప్రతినిధి. వాళ్ల ఆశలకు దీపం" అన్నాను. "ఒక గాంధీనుంచి మరో గాంధీ వస్తూనే వుంటారు" అన్నాను. చర్చిల్ నా వంక చూసి "మీరు మంచి లేబర్ సభ్యులుగా వుండదగినవారు" అన్నారు.

చర్చిల్ వ్యక్తిత్వంలోని గొప్ప విషయం – ఆయన ఓర్పు. ఎదుట వారిని గౌరవించే గుణం! ఆయన అభిప్రాయాలతో ఏకీభవించకపోయినా, మిమ్మల్ని పూర్తిగా వింటారు. గౌరవిస్తారు. ఇది చాలా మంచి గుణం. ఆ రాత్రి బూత్‌బీ, బ్రేకన్ వెళ్లిపోయారు. మర్నాడు నేను చర్చిల్‌ని చాలా దగ్గరగా గమనించగలిగాను. అదీ ఆయన కుటుంబంతో. అప్పుడు ఇంగ్లాండులో రాజకీయంగా చాలా అనిశ్చితి నెలకొంది. మేము వుండగానే లార్డ్ బీవెర్ బ్రూక్, చర్చిల్ కోసం ఫోన్ చేశారు. భోజనం చేస్తుండగా కూడా అంతరాయం గలిగించారు. అప్పట్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇంగ్లాండు ఆర్థిక సంక్షోభంలో వున్నది కూడా.

నేను చాలా ఆశ్చర్యపోయాను. ఆయన భోజనం చేస్తుండగా ఎన్నోసార్లు ఫోన్ వచ్చేది. విసుగు లేకుండా వెళ్లి మాట్లాడి వచ్చేవారు. మళ్లీ భోజనం కానిచ్చేవారు. మిగతా కుటుంబ సభ్యులకు ఇది మామూలు విషయంలాగానే అలవాటయి పోయింది.

"ఇప్పుడు మంత్రివర్గం దేశ ఆదాయ వ్యయాలను తయారు చేస్తున్నది. అది ఒక పట్టాన తేలటంలేదని ఫోను చేస్తున్నారు." భోజనాల బల్ల దగ్గర కుటుంబ సభ్యులందర్నీ కాస్త అనుమానంగా చూస్తూ అన్నారు. అప్పుడు నా వంక చూసి "ఇంక ఇప్పుడు పన్నులు వేసే అవకాశం లేదు. ఖర్చులు తగ్గించే అవకాశం ముందే లేదు."

"అంటే మీరు టీ పొడిమీద పన్నువేస్తే ఈ బడ్జెటు సరిపోతుందా?" అని అడిగాను.

ఆయన 'అవును' అనే సమాధానం చెప్పారు.

ఆయన వున్న కార్ట్‌వెల్ భవనం చాలా సాదాసీదాగా వుంది. ఆయన చదువుకునే గదీ, పడకగదీ రెండూ ఒకటే. గది నిండా పుస్తకాలు గుట్టలుగా వున్నాయి. ఒక ప్రక్క పూర్తిగా పార్లమెంటు రిపోర్టులున్నాయి. నెపోలియన్ మీద కూడా చాలా పుస్తకాలున్నాయి. "అవును, నాకు నెపోలియన్ అంటే చాలా గౌరవం, ఆరాధన" అన్నాడు.

అప్పుడు 'నీవు నెపోలియన్ సినిమా తీస్తున్నావని విన్నాను?' అడిగారు. "అవును చెయ్యాలి చాలా హాస్యానికి ఆస్కారం వుంది" అన్నాను.

తర్వాత చర్చిల్ ఆయన భార్యతోపాటు క్వాగ్లీనో హోటల్‌లో భోజనం చేస్తుండగా చూశాను. ఆ ముఖంలో చాలా అసహనం కనపడుతోంది. "ఏమిటి మీరు ఈ ప్రపంచంలోని కష్టాలన్నీ మింగి బాధపడుతున్నట్లున్నారు?" అడిగాను.

"అవును ఇప్పుడే పార్లమెంటునుంచి వస్తున్నాను. జర్మనీ గురించిన చర్చ నాకేమీ నచ్చలేదు. అది చాలా తీవ్రమైన విషయం. అవును తీవ్ర పరిణామాలు జరుగుతాయి.." అంటూ ఆలోచనలో పడిపోయాడు.

తర్వాత గాంధీని కలిశాను. నాకు గాంధీ అంటే చాలా ఆరాధనా, గౌరవం. ఆయన రాజకీయ చతురత, మొక్కవోని ఆయన మనోధైర్యాన్ని మెచ్చుకుంటాను. కాని అప్పుడు ఆయన లండన్ రావటం పొరపాటు అనుకుంటాను. ఆయన విశిష్ట వ్యక్తిత్వం ప్రాముఖ్యత అప్పటి ఇంగ్లాండు అస్థిరత్వంలో కలిసిపోయింది. ఆవిరైపోయిందన వచ్చును. ఆయన



ప్రార్థనకు ముందు గాంధీ తో చాప్లిన్

ఆధ్యాత్మిక విధానంకూడా ఎవరూ పట్టించుకోలేదు.

అప్పటి చల్లటి చీకటి లండన్ వాతావరణంలో గాంధీ కేవలం ఒక గుడ్డపీలిక మొలకు చుట్టుకుని, అదీ చిందరవందరగా చుట్టుకుని ఆయన అసంబద్ధంగా కనిపించారు. ఈ అవతారం పత్రికలలో వేయటానికి పనికి వచ్చింది. అవును ఎవ్వరైనా అందులోనూ గొప్పవారు, దూరానికి చాలా గొప్పగా కనపడతారు. నన్ను చాలామంది అడిగారు. 'మీరు గాంధీని కలుస్తారా' అని. అవును 'తప్పకుండా, చాలా ఇష్టం' అన్నాను.

ఆయన్ను నేను ఈస్ట్ ఇండియా డాక్ రోడ్‌లో చిన్న చిన్న ఇళ్లు ఉండేచోట ఒక చిన్న ఇంట్లో కలిశాను. అప్పటికే గుంపులు గుంపులుగా జనం వున్నారు. పత్రికల వాళ్లూ ఫోటోలవాళ్లూ చాలామంది వచ్చారు. మా యిద్దరి కలయిక మొదటి అంతస్తు ముందు గది (చాలా చిన్నది) లో జరగాలి. అప్పటికి ఇంకా మహాత్మా రాలేదు. ఈయనతో ఏమి మాట్లాడాలి అని ఆలోచిస్తున్నాను. అప్పటికే ఆయన గురించి చాలా విన్నాను. ఆ స్వాతంత్ర్య పోరాటం, కారాగార వాసం, నిరాహార దీక్ష, అహింసావాది – ఇంకా ఆయన యంత్రాలను వ్యతిరేకించటం, ఇలాంటివి విన్నాను.

ఆయన రాగానే చాలా కోలాహలం జరిగింది. ఆయన టాక్సీ దిగుతుండగా ఆయన్ను చుట్టుముట్టిన వారంతా ఆయన కట్టిన మొలగుడ్డను తాకాలని ఎగబడుతున్నారు. అది ఆ చిన్న సందులో గుంపులమధ్య చాలా వింతగా వుంది. ఆ అపరిచిత వ్యక్తి, ఈ చిన్న ఇంటి గుమ్మంలోకి రావటం అందరికీ అభివాదం చేయటం, పైకి వచ్చి కిటికీ దగ్గరకు వెళ్లి కింద అందరికీ మళ్లీ కనపడి చేయి వూపి లోపలికి వచ్చి, సోఫాలో మేము కూర్చోబోతుండగా ఒక్కసారి కెమెరాల మెరుపులు మమ్మల్ని ముంచెత్తాయి. నేను మహాత్ముని కుడి ప్రక్కన కూర్చున్నాను. ఇప్పుడు నాకు పరీక్షా సమయం; ఏమి మాట్లాడాలో తట్టటంలేదు. నాకు తెలియని విషయం మీద తెలివిగా మాట్లాడాలి. ఇది ఎలా సాధ్యం? నాకు కుడి ప్రక్కన ఒక యువతి కూర్చుని వుంది. ఆమె నాతో ఏదో చెప్తోంది నాకు సగం వినపడి సగం అర్థంకాక గందర గోళంగా వుంది. నేను తల వూపుతూనే గాంధీతో ఏం మాట్లాడాలి అని ఆలోచనతో వున్నాను. నేనే మొదలుపెట్టాలని తెలుసు. అంతలో 'అమ్మాయి నువ్వు కాస్సేపు ఆపితే చాప్లిన్ గాంధీ మాట్లాడుకుంటారు కదా' అని అధికారికంగా ఒక గొంతు వినిపించింది.

అంతే జనంతో నిండిపోయి వున్న గదిలో ఒక్కసారి నిశ్శబ్దం నిండుకుంది. మహాత్ముని ముఖంలో ఏ భావం వ్యక్తం కావటంలేదు. అప్పుడనిపించింది మొత్తం భారతదేశం నా మాటలకోసం ఎదురు చూస్తున్నట్లు. నేను గొంతు సవరించుకుని–

"సహజంగానే నా సానుభూతి అంతా మీ స్వాతంత్ర్య పోరాటంతోనే వుంది. కాని మీరు ఈ యంత్రాలను వ్యతిరేకించటమే నాకు అవగాహనకు రావటంలేదు" అన్నాను. ఆయన చిన్నగా నవ్వారు. నేను "యంత్రాలను తెలివిగా వుపయోగించుకుంటే మనిషి పడే కష్టమూ అతని బానిసత్వమూ చాలవారకూ తొలగిపోతాయికదా" అన్నాను.

"నాకర్థమయింది కానీ ఇవన్నీ సాధించాలంటే ముందు బ్రిటిష్ వాళ్లు మమ్మల్ని వదలి పోవాలి. ఇప్పటి వరకూ మమ్మల్ని యంత్రాలతోనే పాలిస్తున్నారు. అందుకని ఆ పాలన వదిలించుకోవాలంటే యంత్రాలనూ, యంత్రాలతో తయారయిన వస్తువులనూ వదిలించుకోవాలి కదా! అందుకని మేము ఆ విధానాన్ని ఒక బాధ్యతగా దేశభక్తిగా ప్రచారం చేస్తున్నాము. అలాగే ఎవరి బట్టలకు కావలసిన నూలు వాళ్లు వడుకుకోవాలి, మేము ఇంగ్లాండు వంటి శక్తివంతమైన దేశాన్ని ఈ విధంగానే ఎదుర్కొంటాము. మాకు ఇంకా ఇతర కారణాలు కూడా వున్నాయి. మా దేశ వాతావరణం ఇంగ్లాండు

వాతావరణానికి చాలా వ్యత్యాసం వుంది. అలాగే అలవాట్లూ అవసరాలూ కూడా వేరు. ఇంగ్లాండులో వున్న చలికీ, శీతల వాతావరణానికీ చాలా యంత్ర సహాయం కావాలి. చాలా ఆర్థిక వనరులు కావాలి. మీరు తినటానికి కత్తులూ గరిటలూ కావాలి. మేము చేతులూ వేళ్ళతో తింటాం. ఇలా చాలా చాలా వ్యత్యాసం మూలంగా మౌలికమైన విషయాలు చర్చకు వస్తాయి.”

***నేను మహాత్ముని ద్వారా చాలా స్పష్టమైన, వివరమైన పాఠం నేర్చుకున్నాను. అది భారతదేశం తన స్వాతంత్ర్య పోరాటంలో ఒక వాస్తవ దృక్పథంగల, చాలా దృఢచిత్తుని, దార్శనికుని ద్వారా ఈ సంగ్రామం ఈ పోరాటం జరగటం అదీ అహింసా మార్గంలో, చాలా ప్రశంసనీయమైన విషయంగా తెలుసుకున్నాను. అంతే కాదు గాంధీ పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు చక్కని నిర్వచనం చెప్పారు. ప్రతీవ్యక్తి అనవసర వస్తు విషయాలను వర్జించాలని, హింస చివరికి ఆత్మహననమే అని కూడా ప్రచారం చేశారు.***

అప్పటికి ఆ చిన్న గది ఖాళీ అయింది. ‘మీరు మాతో వుండి మా ప్రార్థన వింటారా’ అని అడిగారు. అప్పుడు మహాత్ముడు పద్మాసనంలో నేలమీద కూర్చున్నారు. ఆయన చుట్టూ ఇంకా అయిదుగురు అలాగే కూర్చున్నారు.

అది చూడటానికి చాలా ఆశ్చర్యకరమైన దృశ్యం. ఆరుగురు ఒక వృత్తంలో కూర్చొని, అదీ లండన్ పేదరికపు పేటలో, చిన్న గదిలో, అప్పుడే అస్తమించబోతున్న కావిరంగు సూర్యుని వెలుతురులో వారిని చూస్తూ నేను సోఫాలో కూర్చోవటం, వారు ప్రార్థనతో మౌనంగా అంతర్ముఖులవటం – ఎంత విరుద్ధమైన విషయాలు ఒకచోట చేరినాయి! ఈ వాస్తవవాదిది ఎంతో న్యాయబద్ధమైన, రాజకీయ సత్యదృష్టిగల వ్యక్తిత్వం. ఇవన్నీ ఈ చిన్న వినీవినపడని ప్రార్థనలో కరిగిపోతున్నట్లు అనిపించింది.

(త్వరలో విడుదల కాబోతున్న
*చార్లీ చాప్లిన్ (నాకథ)* గ్రంథం నుంచి)




మిసిమి
మాసపత్రిక
చందాదారులుగా చేర్పించండి
**బహుమతి**
పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా.

వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹240** పంపండి (వారి పూర్తి చిరునామాతో).

ప్రక్కన వున్న ఆస్కార్ వైల్డ్ (De Profundis) అనువాద పుస్తకాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

*(ప్రస్తుత చందాదారులు, మరో సంవత్సరము చందా పొడిగించినా ఈ పుస్తకం పొందగలరు.)*




మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

మిసిమి
మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi



# విశ్వకవి చింతన

- *కాత్యాయనీ విద్మహే*

*"నా బుద్ధిలో అన్నిటి కంటే కవిత మీద నాకు అధికమయిన అధికారమున్నది... నా చిన్ననాటి, నా చిరకాలంనాటి అనురాగిణి- సంగిణీ-కూడా అదే "* (చిన్నపత్రాలు, 30 ఆషాఢం 1893, రవీంద్ర వ్యాసావళి, ద్వితీయసంపుటం, 1962, పు:123) అని చెప్పుకొన్న విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అదే సమయంలో 'నా తలలో ఎన్నో భావాలు ఉదయిస్తవి అవి సరిగ్గా కవితలో ప్రకటించతగినవి కావు' (122) అని కూడా అంగీకరించాడు. అందువల్లనే కావచ్చు, అసంఖ్యాకంగా వ్యాసాల రూపంలో, ఉత్తరాల రూపంలో, స్వగతాల రూపంలో, యాత్రారచనల రూపంలో, డైరీల రూపంలో, సంభాషణల రూపంలో భిన్నాంశాల మీద చర్చలు చేశాడు. వ్యాసాల ద్వారా సమకాలీన ప్రపంచంతో రవీంద్రుడు చేసిన సంభాషణ, సంవాదం ఏ తాత్త్వికస్థాయిలో సాగిందో, మన ఆలోచనా ప్రపంచాన్ని తట్టిలేపటంలో వాటి పాత్ర ఏమిటో పరిచయం చేయటానికి ఈ వ్యాసం.

*రవీంద్ర వ్యాసావళిని* రెండు సంపుటాలుగా కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. మొదటి సంపుటం- మల్లవరపు విశ్వేశ్వరరావు అనువాదకుడు. రెండవ సంపుటం- అనువాదకుడు రాయప్రోలు సుబ్బారావు ప్రచురించబడ్డాయి. ఈ రెండు సంపుటాలలో *రవీంద్రుని స్వీయజీవితానుభవ కథనాలు, యాత్రారచనలు, డైరీలు, ఉత్తరాలు, సంభాషణ పూర్వకమైన చర్చలు, వ్యాసాలు* కలిసివున్నాయి. మొత్తంమీద వున్న వ్యాసాలు అరవై.

విశ్వకవి వ్యాసరచన 1885 నాటికి ప్రారంభమైంది. 1861లో ఆయన పుట్టాడు. పాతికేళ్ళ వయసుకు వ్యాసరచన మొదలైంది. 1941లో మరణించే వరకు అర్ధశతాబ్దికిపైగా ఆయన వ్యాసరచన కొనసాగింది. సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, రాజకీయ, తాత్త్విక అంశాలపై విశ్వకవి చేసిన నిరంతర చింతనకు ఈ వ్యాసాలు నిదర్శనాలు. వీటిని అధ్యయన సౌలభ్యం కొరకు ఐదురకాలుగా వర్గీకరించవచ్చు. 1. మహాపురుషుల గురించి వ్రాసినవి, 2. రాజకీయార్థిక నీతికి సంబంధించినవి, 3. విద్యారంగానికి చెందినవి, 4. భాషాసాహిత్యాలకు సంబంధించినవి, 5. సంస్కృతీ పరమైనవి.

బుద్ధుడు, రామమోహనరాయ్, విద్యాసాగరుడు, బంకించంద్రుడు, మహాత్మాగాంధీ, రవీంద్రుని ఆరాధనకు పాత్రులైన మహాపురుషులు. వీరిలో బుద్ధుడిని, మహాత్మా గాంధీని ఉత్తమ మానవ విలువల ద్రష్టలుగా, ప్రచారకులుగా గౌరవించాడు రవీంద్రుడు. సర్వదేశముల ఎడల, సర్వ మానవులు ఎడల భేదమెరుగని శ్రద్ధాభావం బుద్ధుని తపశ్చర్యలో ఇమిడివుందని, అక్రోధం ద్వారా క్రోధాన్ని జయించమని ఉద్బోధించిన బుద్ధుని అవసరం అతను నివసించిన కాలం కంటే సమకాలంలో వుందని రవీంద్రుడు భావించాడు. అట్లాగే సత్యాగ్రహాన్ని ప్రబోధించినందువల్ల అహింసానీతిని అవలంబించినందువల్ల గాంధీ ఆయనకు ఆదర్శప్రాయుడైనాడు. రాజకీయపు స్వార్థకాలుష్యం నుంచి కూడా విముక్తుడు కనుక గాంధీ రవీంద్రునికి గౌరవించదగిన వాడయినాడు.

ఈ సందర్భంలో రాజకీయ స్వార్థ దురంధరులను' *రవీంద్రుడు తీవ్రంగా విమర్శించి, వాళ్ళను పొలిటీషియన్లు* అని ఒక ప్రత్యేక జాతిగా పేర్కొన్నాడు. *పొలిటీషియన్లు పనిమంతులు. వారు పనులు జరగాలంటే అసత్యం అవసరమని తెలుస్తారు* అని చెప్పి వారి స్వభావాన్ని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాసం రవీంద్రుడు 1938లో వ్రాశాడు. 1912 నాటికే గురజాడ అప్పారావు పొలిటీషియన్లు ఒక

(విశ్వకవి నూట యాభైయవ జయంతి సందర్భంగా...)

జాతిగా, అనుకొన్న పని సాధించటానికి తప్పులు, లోపాలు కప్పిపుచ్చుకోవటానికి ఎన్ని అబద్ధాలైనా ఆడటం పొలిటీషియన్ల లక్షణంగా గుర్తించి కన్యాశుల్కం నాటకంలో గిరీశం ముఖంగా వ్యాఖ్యానించటం ఈ సందర్భంగా గుర్తుకువస్తున్నది.

ఇక రామమోహనరాయ్, విద్యాసాగర్, బంకించంద్రుల జీవితాల గురించి వ్రాసిన వ్యాసాలు రవీంద్రుని ఆత్మీయతలో భాగం. వంగసమాజ ఉన్నతికి, సాహిత్యసంస్కృతుల నిర్మాణానికి దోహదపడిన వ్యక్తులుగా వాళ్ళ నాయన చూశాడు. తన బెంగాలీ ప్రాదేశికలను, అస్తితను గౌరవకరంగా చెప్పుకొనే బలాన్నిచ్చిన వాళ్ళుగా వాళ్ళను ఆయన ప్రస్తుతించాడు.

రామమోహనరాయ్, తాను చేపట్టిన సంఘసంస్కరణలకు వెన్నుదన్నుగా ప్రాచీన ఋషుల మతాన్ని వ్యాఖ్యానించి బ్రహ్మధర్మంగా స్థాపించి నందుకు రవీంద్రుడు అతనిని ప్రశంసించాడు. 'నవ్య వంగదేశ సృష్టికి ప్రథమ కర్త' గాను, వంగదేశ గద్యసాహిత్యానికి పునాదులు వేసినవాడు గాను రామమోహనరాయ్ ప్రత్యేకతను *బంగ్లా జాతీయ సాహిత్యం* అనే వ్యాసంలో నిరూపించాడు.



బంకించంద్ర

బెంగాలీ గద్యాన్ని వ్యవహార యోగ్యంగా, కళానైపుణ్యంతో తీర్చదిద్దిన వాడుగా విద్యాసాగరుడి గురించి చెప్పాడు రవీంద్రుడు. విద్యాసాగరుడి జీవిత తత్వం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని పోరాడి జయించటంలో వుందని సోదాహరణంగా వివరించటంతో పాటు *విద్యాసాగరుని చరిత్ర* అనే వ్యాసంలో మరొక ముఖ్యమైన పని చేశాడు విశ్వకవి. గొప్పవారైన స్త్రీల విషయంలో వారి ఇతిహాసమంతా వారి పుత్రుల చరిత్రలోనో, వారి భర్తల కార్యకలాపాలలోనో ఇమిడిపోయి వుంటుందని గుర్తించి పేర్కొన్నాడు. ఆ లోపాన్ని పూరించటానికి విద్యాసాగరుడి తల్లి గురించి ప్రత్యేకంగా చెప్పాడు.

అంతేకాదు, స్త్రీల సుఖ సంక్షేమాలు, స్వాతంత్ర్యం అంటే పరిహాసాస్పదంగానూ, ప్రహసనోపకరణంగానూ భావించే క్షుద్రత్వం కాపురుష లక్షణమని ప్రతిపాదించి స్త్రీజాతి పట్ల వున్న వాత్సల్య భక్తి భావాల కారణంగా విద్యాసాగరుడు మహత్తర 'పురుషధర్మ పాలకుడు' అవుతున్నాడని పేర్కొన్నాడు. మహిళలపట్ల రవీంద్రుని దృక్పథం ఎంతగా ఆధునికమైందో ఈ వ్యాసం వల్ల తెలుస్తున్నది. మాతృభాషను బలీయంగా, మహనీయంగా తీర్చిదిద్ది నందుకు, ప్రాచీన హిందూ శాస్త్రాల ఎడల ఐతిహాసిక విమర్శ పెట్టినందుకు రవీంద్రుడు బంకించంద్రుని అభిమానించాడు. దేశీయ శాస్త్రాలలోని యథార్థాన్ని గ్రహించగల సామర్థ్యం లేని యూరోపీయులు, శాస్త్రగత అంశాలను నిష్పాక్షికంగా, వస్తుగతంగా అన్వేషించి విమర్శించటానికి సంకోచించే, భయపడే దేశీయ పెద్దలూ చెరొకవైపూ వుండగా వీరి మధ్య నిలబడి ఇతిహాసాన్ని ఉద్ధరించే పనికి బంకించంద్రుడు తన రచనల ద్వారా పూనుకొన్నాడని రవీంద్రుడంటాడు.

* * *

బ్రిటిషు వలస పాలనలో ఇంగ్లీషు విద్య, ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యం వంటివి గొప్ప ఆకర్షణలై భారతీయులను ఇంటి నుండి బయటకు, పల్లెల నుండి నగరాలకు లాక్కెళుతున్న తరుణంలో స్వదేశీ సమాజ స్వాభావికతను పరిరక్షించుకోవలసిన అవసరం గురించి ఆలోచించాడు రవీంద్రుడు.

బ్రిటిషు దొరతనం సర్కారు ఏ మాత్రం స్వదేశీ సమాజానికి చెందినది కాదని, సమాజానికి బాహిరమైందని, *ఆ సర్కారు నుండి ఏమి ఆశించినా ఆ మేరకు సామాజిక స్వాతంత్ర్యాన్ని మూల్యంగా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించాడు.* గృహము, బాహిరము, ఇంటాబయట అనే ద్వంద్వాల గురించి చెప్పి, శక్తిని బయట ప్రయోగించినా హృదయం గృహంలోనే నిలుపుకోవాలి అని చెప్పాడు. అంటే ఇంగ్లీషు విద్య తదితర వలసపాలన ప్రయోజనాలకు బయట సమాజంలో ఎంత వెంపర్లాడినా, ఎంత సంపాదించుకొన్నా ఇంటిని భారతీయ సంస్కృతితో నిలపాలనేది ఆంతర్యం.

1885లో జాతీయ కాంగ్రెసు ఏర్పడి దేశీయుల రాజకీయ ప్రయోజనాల కోసం ఆరాటపడుతూ సభలూ, సమావేశాలు నిర్వహిస్తూ వున్న తరుణంలో, పాలనలో భాగస్వామ్యాన్ని ఆశిస్తున్న సమయంలో వ్రాసిన *స్వదేశీ సమాజము* (1905) వ్యాసంలో రవీంద్రుడు *పొలిటికల్ సాధన యొక్క ఏకైక చరమోద్దేశము దేశ హృదయమును ఏకమొనర్పడం* అని అంగీకరిస్తూనే అంతమాత్రాన దేశ

భాషను, దేశ సంప్రదాయాన్ని విడిచిపుచ్చి కేవలం దేశ భాషను, విదేశీయ హృదయాకర్షణార్థమై చేసే ప్రయత్నం 'పాలిటిక్స్' కానేరదని స్పష్టం చేశాడు. స్వరాజ్య ఆకాంక్ష బలపడుతూ చరఖావడకటం స్వరాజ్య సాధనకు అవసరమైన కార్యక్రమంగా ప్రజలలో ప్రచారం చేస్తున్న సమకాలపు సందర్భం నుండి రవీంద్రుడు *పథము–పాథేయము* (1909); *కర్త ఇచ్ఛానుసారమే కర్మ* (1918); *సత్యాహ్వానము* (1922); *సమస్య* (1924); *స్వరాజ్యసాధన* (1926) మొదలైన వ్యాసాలు వ్రాశాడు.

సామాజిక దౌర్భాగ్యాలకు విదేశీపాలనను కారణంగా చూపిస్తూ కాలక్షేపం చేసే జీవనవిధానాన్ని రవీంద్రుడు నిరసించాడు. మనిషికీ మనిషికీ మధ్య ఉండ వలసిన ఆత్మీయసంబంధం, సమాజపు కర్తవ్యాలకు పూచీపడవలసిన మానవ బాధ్యతల గురించి ఆయన దీర్ఘంగా ఆలోచించాడు.



రామమోహనరాయ్

స్వాతంత్ర్యోన్ముఖంగా ప్రజలను ఉద్రేక పరచి సమీకరించటమే కాదు, స్వాతంత్ర్యాన్ని పొందటానికి అర్హులుగా ఆ ప్రజలను ఎంతగా సుశిక్షితులను చేస్తున్నా మనేది ముఖ్యమంటాడు రవీంద్రుడు. *కర్మహీనమైన కరద్వయంలో సమస్త శుభాలు ఆంగ్లేయులే ఒలక బోస్తారని అనుకోవటం ఆత్మవంచన* అని హెచ్చరించాడు.

దేశంలో అనైక్యతకు, విచ్ఛిన్నతకు, జడతకు మూలమైన సనాతన సంప్రదాయంలోని మూఢతను విమర్శకు పెట్టకుండా, దాని నుండి విముక్తికి జాగృతం కాకుండా స్వాతంత్ర్యం ఎలా సాధ్యమన్నది రవీంద్రుడి ప్రశ్న.

వంగదేశ విభజన పరిణామాలను, వందేమాతర ఉద్యమ గతిని గమనిస్తూ రవీంద్రుడు దానిమీద సంశయాలను వ్యక్తం చేయటానికి గానీ, ప్రశ్నించటానికి గానీ వీలులేని ఒకానొక నియంత్రణ ఉద్యమనాయకత్వంలో వుండటాన్ని గురించి ఆందోళన పడ్డాడు. కార్యసాధనకు అన్యాయాన్నీ, అత్యాచారాన్నీ సహాయకాలుగా తీసుకొనటం ప్రమాదకరమని అభిప్రాయపడ్డాడు. అభిప్రాయభేదాలను, ఆశయ వైరుధ్యాలను కర్రపైకెత్తి బలప్రయోగం చేయటం ద్వారా ఏకీకృతం చేశామనుకొనటం భ్రమ అంటాడు. *లాఠీ ప్రభుత్వపు ఉత్పీడనం పైకి కనిపించేదయితే ఇది అంతకంటే భయంకరమైందని* అంటాడు.

విదేశీయులు మనలను పాలిస్తున్నారు. ఆ బాధ తొలిగితే అన్ని బాధలూ తొలుగుతాయి అనుకొనటం, అనటం పొరపాటని రవీంద్రుని అభిప్రాయం. *స్వరాజ్యం పొందితే ఆ తర్వాత స్వాభావిక సంబంధంతో అన్ని పనులూ జరిగిపోతాయనటం డబ్బు సంపాదించి ఆ తర్వాత తల్లిని పోషిస్తాననటం వంటిదని, ముందర ఫౌంటేన్ పెన్ సంపాదించాలి. ఆ తర్వాత మహాకావ్యం వ్రాస్తాననటం వంటిదని* విమర్శించాడు. సమాంతరంగా జరగవలసిన ఉద్యమాల గురించిన చేతన రవీంద్రుని ఆలోచనలలో, అభిప్రాయాలలో కనబడుతుంది. ఒకదేశం తనను తాను నిర్మించుకొనటం పట్ల జరగవలసిన కృషి లోపించిందని రవీంద్రుడు పడిన వేదన ఇది.

స్వాతంత్ర్య సంపాదనకు ప్రాణగతమైన ఐక్యత అన్నిటికంటే ముఖ్యం అంటాడు రవీంద్రుడు. అంగ ప్రత్యంగాల అనైక్యతను కప్పిపుచ్చటానికి ప్రస్తుతానికి *ఎలాగో ఒకలాగా ఒక కోటు సంపాదించి ఒళ్ళంతా కప్పుకోగలిగితే, ఆ కోటు యొక్క ఐక్యత వల్ల ప్రత్యంగముల ఐక్యత దానంతట అదే కలుగుతుందని అనుకొనటం ఆత్మవంచన* అని హెచ్చరించటం ఆనాటి జాతీయోద్యమ వైఖరుల మీద చేసిన విమర్శే అయినా ఈనాటి ఉద్యమ వైఖరులకు కూడా అనువర్తింపచేసి ఆలోచించు కొనవలసిన అంశమే.

మనుషుల మధ్య మతాతీత ఐక్యత, మానవాత్మ మేల్కొనటం స్వాతంత్ర్య సముపార్జనకు మొదటి షరతులని అందుకనుకూలంగా మనుషుల మనసులను వికసింపచేసి సంస్కారాలను అభివృద్ధి పరచటానికి సూక్ష్మస్థాయిలో జరగవలసిన పనుల గురించి రవీంద్రుడు భావించాడు.

ఆ క్రమంలోనే గ్రామం, పల్లీ సంస్కృతి నిర్మాణంలో అందరి భాగస్వామ్యం, మనుష్యులందరిని సమ్మిళితం చేయగల వ్యవస్థల ఉద్ధరణ గురించి ఆయన అనేకమార్లు చెప్పాడు. అదే సమయంలో భిన్న జాతులున్న దేశంలో ఐక్యత గురించిన ఆలోచన భిన్నత్వాన్ని చంపేసేది కాకూడదని రవీంద్రుడు కోరుకున్నాడు. విశేషత్వాన్ని విసర్జించటం ద్వారా కలిగే

సౌలభ్యం మూడునాళ్ళ ముచ్చటేనన్నాడు. దీనత్వం వల్ల, అధీనత వల్ల, బలాత్కారం వల్ల జరిగే కలయిక సత్యంకాదు, శాశ్వతం కాదు అని అభిప్రాయపడ్డాడు. స్వతంత్రం యొక్క విలువ గ్రహించిన మనుషులు ఎన్ని కష్టాలు ఎదురైనా అధిగమించి తమను తాము ఉన్నతీకరించుకోగలిగిన పరిస్థితులలోనే మనుషుల మధ్య సంధానం వాంఛనీయమని పేర్కొన్నాడు. జాతుల భిన్నత్వాన్ని, జీవన వైవిధ్యాన్ని నాశనం చేసే ప్రపంచీకరణ, ప్రాంతీయ అస్తిత్వ చేతనా ఉద్యమాలను సమైక్యత పేరు మీద సమసి పోయేలా చేయాలనుకొనే ఆధిపత్య రాజకీయం రెండూ వర్తమాన సమాజం ముందున్న సవాళ్ళు. 1930ల నాటి రవీంద్రుడి ఆలోచనలకు అభిప్రాయాలకు ఈ సందర్భంలో ప్రాసంగికత కనబడుతుంది.

ఆర్థిక సమానత గురించి కూడా రవీంద్రుడు తర్కించాడు. సంపదను అల్పసంఖ్యాకులైన ధనికులు అనుభవిస్తున్నారని, అధికసంఖ్యాకులు దాని నుండి వంచితులు అవుతున్నారని రోగాలకు, నేరాలకు అది కారణమై సమాజానికి నష్టం కలిగిస్తున్నదని రవీంద్రుడికి తెలుసు. అసమానతలు పూర్తిగా తొలగవు కానీ సంపదల సృష్టికి అవసరమైన శక్తులను అభివృద్ధి చేసుకొనే అవకాశాలు అధిక సంఖ్యాకులకు అందుబాటులో ఉండే మానవీయ సమాజం ఉండాలని వాంఛించాడు. గ్రామ ఆర్థిక వ్యవస్థ పునాదిగా సమసమాజ నీతిని నిర్మించవచ్చునని సూచించాడు. ఆ రకంగా విశ్వనాథ సత్యనారాయణ గ్రామీణ జీవిత దృక్పథం రవీంద్రుడి దృక్పథానికి దగ్గరిదిగా కనబడుతుంది.

స్వాతంత్ర్యాన్ని కోరే జనానికి విద్యా విజ్ఞానాలు, ఆరోగ్యం, ఆనందం సాధింపదగినవి అని రవీంద్రుని అభిప్రాయం. అందువల్ల ఆయన ప్రముఖంగా విద్యారంగంపై తన దృష్టిసారించాడు. *విద్యాశిక్షణలో వైపరీత్యం* (1893); *విద్యావిధాన మేళనము* (1922); *విద్యావ్యాప్తి* (1933) మొదలైన వ్యాసాలను ఆ క్రమంలోనే వ్రాశాడు.

***పాఠ్యాంశాల కంఠోపాఠ విధానం తప్ప స్వతంత్రంగా వేరే పుస్తకాలు చదవటానికి గానీ, ఇష్టం వచ్చినట్లు ఆడుకొనటానికి గానీ అవకాశంలేని విద్యావిధానంలో పిల్లలు వ్యాధిగ్రస్తులవుతున్నారని రవీంద్రుడు వేదన పడ్డాడు.*** మాతృభాషలో శిక్షణ లేకపోవటం వలన పిల్లలు మనుషులుగా ఎదగటానికి అవసరమైన భావనాపరమైన, చింతనాపరమైన వనరులు అందిరావటం లేదని ఆయన అంటాడు. *జీవితానికి, విద్యవల్ల వచ్చే విజ్ఞానానికి సంబంధం లేకపోవటం వల్లనే వ్యక్తులలో విపరీత ప్రవృత్తులు చోటు చేసుకుంటున్నాయిని అంటాడు.* విద్యాశిక్షణ విధానాన్ని, జీవితాన్ని మేళనం చేయగలిగింది బంగాలీ భాష, సాహిత్యం మాత్రమే అని తన ప్రాంతపు పిల్లల భవిష్యత్తు దృష్ట్యా సంభావించాడు రవీంద్రుడు. తెలుగులో మాట్లాడారని ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పిల్లలను క్రూరంగా దండిస్తున్న ఇంగ్లీషు పిచ్చి పాఠశాల విద్యలోకి ప్రవేశించిన సమకాలీన సందర్భంలో రవీంద్రుడి విద్యాభావనలు చర్చకు, ప్రచారానికి అనితర ప్రాధాన్యం వుంది.

ఈ విద్య కూడా సర్వజనులకూ అందుబాటులో లేదని రవీంద్రుడు గుర్తించాడు. ప్రజాసామాన్యంలో చాలా కాలం నుంచి జ్ఞానపు అనావృష్టి ఏర్పడిందంటాడు. నూతన విద్యా ప్రవాహం సార్వజనీన దేశాభిముఖంగా లేదని కుండీలలో మాదిరి పరిమిత ప్రదేశాలలో నిలిచిపోయిందని అంటాడు. విశ్వవిద్యాలయాలు మస్తిష్కస్థానం వహించి దేశ శరీరమంతటికి విద్యాశక్తి స్రోతస్సును ప్రవహింప చేయగలగాలన్నది ఆయన కల. స్కూళ్ళకు, కాలేజీలకు బయట విద్యావ్యవస్థవ్యాప్తిని ఆకాంక్షించాడు. స్వీయ ప్రయత్నంతో ఎవరైనా సరే చదువుకొనటానికి అవసరమైన రీతిలో జిల్లాస్థాయిలో పరీక్షా కేంద్రాలను విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని ఈనాటి దూరవిద్యా విధానాన్ని గురించి ఆనాడు ఊహించాడు.

*ఆత్మగౌరవ రక్షణకు, విద్యా విషయ జ్ఞానానికి ఉన్న సంబంధాన్ని గుర్తించాడు కనుకనే అందుకోసం ఆంగ్లభాష గుమ్మం దగ్గర కాచుకు కూర్చునే పరిస్థితి పోవాలన్నాడు.* దేశభాషలలో విద్యాభావనను అత్యవసర మైనదిగా పేర్కొన్నాడు. రాజకీయరంగంలోస్వరాజ్యం పొందటాన్ని గురించి ఆరాటపడే వాళ్ళు, విద్యారంగంలో స్వరాజ్యం పొందటాన్ని గురించి ఉత్సాహ పడరేమి అని నిలదీశాడు జాతిని. విశ్వవిద్యాలయాలు విశ్వజ్ఞానపు సంపత్తిని స్వదేశీయ సంపత్తిగా మార్చగలిగేవిగా ఉండాలని, మాతృభాషలో విద్యాశిక్షణ అందుకు ఒకటే మార్గమని రవీంద్రుడు అభిప్రాయపడ్డాడు.

* * *

రవీంద్రుని వ్యాసాలలో భాషాసాహిత్యాలకు సంబంధించినవి నాల్గవ వర్గం. భాష, భావ వినిమయంలో

ఒక సాధనమని గుర్తులు లేదా సంకేతాల రూపంలో అది వ్యవహారంలోకి వచ్చిందని ఆ రకంగా వర్ణాలు, శబ్దాలు అన్నీ సంకేతాలేనని సోపపత్తికంగా భాషాశాస్త్రకారుడివలె వివరించాడు రవీంద్రుడు. కావ్యభాషకు, శాస్త్రభాషకు వుండే భేదాన్ని చెప్పాడు. శబ్దాలు కేవల అర్థాన్ని బోధిస్తుండగా విశేష గతిక్రమంలో అవి అంతకంటే అధికార్థాన్ని బోధిస్తాయని, విశేష గతిక్రమానికి దోహదం చేసేది ఛందస్సని చెప్పి రవీంద్రుడు శబ్దాలకు వాటి జడత్వ ధర్మం నుండి ముక్తి కలిగించటం కోసమే ఛందస్సు అంటాడు. స్థిరమైన శబ్దాలతో చిత్తసామగ్రిని కదిలించాలంటే వాటికి వేగాన్ని సమకూర్చాలని ఛందస్సు అందుకు ఉపకరిస్తుందని స్పష్టం చేశాడు.

సాహిత్యం మానవహృదయాన్ని, మానవచరిత్రను చెప్పాలన్నది రవీంద్రుడి ప్రతిపాదన. సాహిత్య రచనలో భావానికి ఉండే ప్రాధాన్యతను గురించి చెపుతూ భావాన్ని స్వీయంగా చేసుకొని మరల దానిని సాధారణీకృతం చేయటమే సాహిత్యం అంటాడు. సాహిత్యం ప్రకృతికి అద్దం కాదంటాడు. ప్రకృతి ప్రత్యక్షంగా అనుభవానికి వస్తుంది. సాహిత్యంలో అప్రత్యక్షంతో అనుభవం కనుక సాహిత్యం ప్రకృతికి అద్దం పట్టటం అసత్యం అంటాడు. సౌందర్యానికి అధికతర ప్రాధాన్యతనిచ్చాడు.

లోకంలో సౌందర్యమనే ఈ చుట్టరికమే మన మనస్సును నడుపుతున్నది అని రవీంద్రుడి నమ్మకం. *సౌందర్యం మానవులను ఉన్నతీకరించి సంస్కారవంతులను చేసి ఆనందానుభవం దగ్గరకు తీసుకు వెళ్తుంది* అంటాడు రవీంద్రుడు. సహితత్వం సాహిత్యానికి ప్రధానలక్షణమని చెప్పిన రవీంద్రుడు సహితత్వానికి రెండు శక్తుల మధ్య, జాతుల మధ్య, వర్గాల మధ్య, వ్యక్తుల మధ్య వుండవలసిన ఏకాంశం ఏదో ఒకటి ఉండాలని, భారత దేశంలో యావజ్జనమండలాన్ని ఒక దగ్గరకు చేర్చగలిగిన శక్తిధర్మం అని పేర్కొన్నాడు.

సాహిత్యం సహిత శబ్దం నుండి పుట్టిందని, సహిత అన్నమాటలో సమ్మిళిత ధర్మం వుందని, సమ్మిళితం అంటే భావం భావంతో, భాష భాషతో కలియటం కాదు. మనుష్యులతో మనుష్యులు, అతీతంతో వర్తమానం, దూరంతో సామీప్యం, అంతరంగ యోగసాధనతో మేళనం కావటం అంటాడు. సాహిత్యంలో వస్తు రసములలో రసానికే రవీంద్రుడు ప్రాధాన్యతనిచ్చాడు. కాలం మీద కవిత్వాన్ని నిలపగలిగేది రసమేనని అతని అభిప్రాయం. ఇది ఆధునికమనీ, నూతనమనీ ప్రత్యేక వస్తు సామగ్రితో ఏనాడూ తయారు కాదంటాడు. సాహిత్యం ఉపాధ్యాయ బాధ్యత వహించదని, వహించరాదని రవీంద్రుని అభిప్రాయం. లోకహితం కోసం వ్రాయటమనే లక్ష్యం సాహిత్యపు విలువను తగ్గిస్తుందని, కాలాంతర వ్యాప్తికి అవరోధం అవుతుందని ఆయన అంటాడు. అర్థనైతికత, రాష్ట్రనైతికత, సామాజికనైతికత రససృష్టి వలయంలోకి ప్రవేశించి అధికారం చెలాయించటం గురించి చెపుతూ రవీంద్రుడు వాటి కనుసన్నలలో మెలిగే రచయితలు రసరాజ్యానికి ఆవల వుంటారని చెప్పాడు.

కావ్యానందాన్ని అనుభవించటానికి లోకులే సాహిత్యాన్ని చదివే సాధన చేయాలంటాడు రవీంద్రుడు. అయితే భిన్న వర్గాలున్న సమాజంలో అటువంటి సాధనకు అందరికీ అవకాశం వుండదని రవీంద్రుడికి తెలుసు. రాజకుమారుడికి సాధనకు వున్న సమయం రైతుబిడ్డకు వుండదు అని చెపుతూనే అది సామాజిక వ్యవస్థావాదం, దానిని సవరించే పని ఎవరైనా చేస్తే చేయవచ్చుగానీ ఆ కోణం నుండి సాహిత్యాన్ని సవరించాలను కొనటం ఆయన దృష్టిలో సరి అయింది కాదు.

బెంగాలీ భాషా సాహిత్యాల పట్ల ఆత్మగౌరవ అభిమాన లక్షణాలతో వూగిపోతాడు రవీంద్రుడు. మానవులలో ఆత్మప్రకాశానికి, ఆత్మీయతకు ప్రధాన వాహనం వారి భాష అంటాడు. కనుకనే అన్నిటి కంటే మానవుడికి స్వభాషా దైన్యాన్ని దూరం చేయటం మొదటి కర్తవ్యం అంటాడు. రాష్ట్రీయ స్వాధికారం కోసం వందేమాతరం అని గర్జించిన జాతి మాతృభాష గురించి పట్టించుకోవటం లేదని ఆందోళన చెందాడు. ప్రతిదేశమూ తన స్వకీయ భాషతోనే పూర్ణంగా అభివృద్ధిచెందుతుందని, అప్పుడే అన్యదేశ భాషతో సహజ సమాన సంబంధం స్థాపించగలుగుతుందని రవీంద్రుడు అన్నాడు.

*భిన్న భాషా సమూహాలున్న దేశంలో అందరినీ ఏకం చేయటానికి ఏదో ఒక భాషను దేశవ్యాప్తంగా వాడుకలోకి తెచ్చేందుకు అప్పటికే ప్రారంభమైన ప్రయత్నాలను ఆయన ఖండించాడు. అది నిజమైన సమన్వయానికి, ఏకత్వానికి దారితీయదని, బాహ్యాపాశాలతో మనుషులను కలపలేమని, శృంఖలాలతో కలయిక శృంఖలాల కలయికే అవుతుందని అభిప్రాయడ్డాడు.* భిన్నత్వంలోని సౌందర్యాన్ని నిలుపుకొనటం



కాళిదాసు శాకుంతలం

అవసరమంటాడు. అదే సమయంలో మనుషుల మధ్య వుండవలసిన ఐక్యతను ఆయన విస్మరించలేదు. బంగాలీ స్వజాత్యభిమానం మితిమీరితే మేళనయజ్ఞం విఘ్నం అవుతుందని హెచ్చరించాడు. జాతీయ, ప్రాంతీయ, అభిమానాలు వుండవలసిందే కానీ అవి దురభిమానాలుగానో, దురహంకారంగానో మారకూడదన్నదే రవీంద్రుడి కామన.

సాహిత్యవిమర్శలో విశ్లేషణ పద్ధతిని రవీంద్రుడు నిరాకరించాడు. సాహిత్యంలో సమగ్రతను అర్థం చేసుకొనటానికి అది అడ్డు అవుతుందంటాడు. విశ్లేషణ అంటే సాహిత్య అంగాంగాలను ముక్కలు ముక్కలు చేసి చూడటం, అలా చూడటం వలన సాహిత్యవస్తువులోని ఏకరూప సౌందర్యం, సృష్టి సౌందర్యం, అభావమవుతుందని ఆయన అభిప్రాయం.

జానపదసాహిత్యం నుండి శిష్టసాహిత్యం వరకూ అన్నింటినీ రవీంద్రుడు అభిమానించాడు. అధ్యయనం చేశాడు. *శాకుంతలం* ఆయనకు చాలా ఇష్టమైన నాటకం. దానిని షేక్సిపియర్ టెంపెస్టు నాటకంతో పోల్చి వ్రాసిన వ్యాసం చెప్పుకోదగింది. బాహ్యసాదృశ్యం కనబడినా ఆంతరిక అనైక్యత వాటిమధ్య వుందని ఆ వ్యాసంలో ఆయన విస్తృతంగా చర్చించి నిరూపించాడు. కావ్యాలలో ఉపేక్షితలు అని *రామాయణం*లో ఊర్మిళ, *శాకుంతలం*లో అనసూయ, ప్రియంవద, *కాదంబరి*లో పత్రలేఖ – ఈ నాలుగు స్త్రీ పాత్రల గురించి రవీంద్రుడు వ్రాసిన వ్యాసం విలక్షణ కోణం నుండి సాగింది. మనుషులు వాళ్ళ స్థితి, స్థాయి ఎలాంటివైనా, ఎంత అప్రధానంగా కనిపించినా చరిత్రగతికి వాళ్ళు ఎంత దోహదం చేస్తారో చూపిస్తూనే అలాంటి వారు చరిత్రలో విస్మరించ బడటాన్ని, వాళ్ళ ఆంతర్యాలలోని కల్లోలాన్ని గురించి పట్టించుకోకపోవటాన్ని వేలుపెట్టి చూపించాడీ వ్యాసంలో.

కావ్యమైనా, నాటకమైనా ప్రధానంగా భావుకుల వివేక సామర్థ్యాలమీదనే అర్థవంతం, రసవంతం అవుతుందని రవీంద్రుడి అభిప్రాయం. కావ్యంలో అప్రత్యక్షాన్ని ప్రత్యక్షం వలె సంభావించగల మానసిక కల్పనాశక్తి పాఠకులలో వుండాలని అదే విధంగా నాటకంలో ప్రేక్షకులకు కూడా ఆ అవకాశం వుండాలని, నాటక రచయితలు ప్రేక్షకుల కల్పనా శక్తిపై విశ్వాసం వుంచి అభినయానికైనా, రంగస్థల నేపథ్య చిత్రణకైనా తగుపాటి స్థానమే ఇవ్వాలని అంటాడు. అందుకు అవకాశంవున్న వీధి నాటకాన్ని అభిమానించాడు. తాను ఎంతో అభిమానించిన *శాకుంతల* నాటకం విషయంలో ఆ అవకాశాన్ని వదులుకొన్న ఘట్టాలను ఉటంకిస్తూ కాళిదాసును అభిశంసించాడు.

జానపద సాహిత్యంలో పిల్లల పాటలను గురించి వ్రాస్తూ 'పరస్పర అవయవ సంబంధం' సుసంలగ్న కార్యకారణ సూత్రం వంటి ప్రమాణాలతో వాటిని విలువకట్టరాదని, వాటిలోని అద్భుత చిత్రణలపై దృష్టిపెట్టాలని అక్కడ సరిహద్దుల నిర్ణయంకానీ, ఆకార నిర్ణయంకానీ, అధికార నిర్ణయంకానీ ఉండదని చెప్పిన విషయం జానపద పరిశోధకులెవరైనా గమనంలో వుంచుకోవలసినవే.

* * *

రవీంద్రుని వ్యాసాలలో *భారతవర్షపు ఇతిహాసధార*, *భావుకత – పవిత్రత* (1909), *తపోవనము* (1910), *ధర్మపు అధికారము* (1912), *భారతవర్షీయ వివాహము* (1926), *నారి* (1937), మొదలైనవి భారతీయ సంస్కృతి గురించిన చర్చ కేంద్రంగా వ్రాయబడ్డాయి. భరతవర్షపు విశిష్టతను, సంస్కృతి ఉన్నతిని లేదా వైవిధ్యాన్ని చెప్పటానికి ఎక్కువగా ఆయన సాహిత్యాన్నే ఆధారం చేసుకొన్నాడు. అందువల్ల వీటిని సాహిత్య వ్యాసాలలో భాగంగా చూసినా చూడవచ్చు.

ఆర్య అనార్య సంఘర్షణను, సమ్మేళనాన్ని సామాజిక శాస్త్రాల సహాయంతోనూ, సాహిత్య ఆధారాలతోనూ వ్యాఖ్యానించాడు రవీంద్రుడు. ముఖ్యంగా *రామాయణా*న్ని అందుకు చక్కగా వాడుకొన్నాడు. వశిష్ఠ, విశ్వామిత్రుల సంబంధాన్ని బ్రాహ్మణ, క్షత్రియ వైరుధ్యాల సమన్వయాల

చరిత్రగా చూడటాన్నిగురించి, ఆర్య, అనార్య సంయోగబంధాన్ని చేకూర్చటానికి జరిగిన మహోద్యమ నాయకులుగా *రామాయణ కథ*లోని జనక విశ్వామిత్రులను, రామచంద్రుడిని నిరూపించి చెప్పిన విధం ఆసక్తికరంగా వుంది. *రామాయణం* తరువాతి కాలంలో కుటుంబ ధర్మ ప్రతిపాదన గ్రంథంగా, రాజ ధర్మ ప్రతిపాదన గ్రంథంగా ప్రచారంలోకి రావటాన్ని గురించి కూడా రవీంద్రుడు ప్రస్తావించాడు. ఆ రకంగా *భారతవర్షపు ఇతిహాసధార* వ్యాసం సామాజిక చరిత్ర పరిణామాలను సాహిత్యం ద్వారా అర్థం చేసుకొనే ప్రక్రియను ఆసక్తికరంగా చేసింది. ఇది *భారత రామాయణాల*పై కొత్త కోణాల నుండి జరగవలసిన పరిశోధనల గురించిన ఆలోచనలను రేకెత్తిస్తుంది.

*తపోవనం* వ్యాసంలో ప్రకృతి మానవజీవితంలో ఎంత ప్రధాన భాగమో శాకుంతలానికి అన్వయిస్తూ నిరూపించాడు. *ఉత్తర రామచరిత* నాటకాన్ని కూడా ప్రస్తావించాడు. *రామాయణం*లో వనవాసాన్ని, *భారతం*లో వనవాసాన్ని ఈ దృష్టితో కొత్తగా అధ్యయనం చేయటానికి సూచనలిచ్చింది ఈ వ్యాసం. *భారత వర్షీయ వివాహము* వ్యాసంలో వివాహవిధి పరిణామాలను *భారత రామాయణాలు, కాళిదాసు కృతులు* ఆధారంగా నిరూపించటమే కాదు వివాహంలో ఇచ్ఛకు వుండాల్సిన స్థానం గురించి, దాంపత్య ప్రేమ గురించి, దాని బరువంతా స్త్రీలు మోయాల్సిరావటం గురించి, స్త్రీ ప్రపంచం, పురుష ప్రపంచం వేరు వేరుగా వుండటం గురించి, పురుషుడికి చెందిన వెలుపలి ప్రపంచంలో స్త్రీ శక్తి వినియోగం గురించి ఎన్నో ఆలోచనలు చేశాడు.

*నారి* వ్యాసంలో ఆధునిక మహిళ ఆవిర్భావం గురించి ఆ సందర్భంలో ఉత్పన్నమయ్యే సమస్యల గురించి చర్చించాడు. స్త్రీ జీవిత సంస్కారాలు బహుయుగాల నుండి ఇంటిసీమలకు పరిమితమై అభివృద్ధిచెందాయని బాహ్య ప్రపంచానికి చెందిన విశాలమైన అనుభవ జ్ఞానం వాళ్ళకు పొందే అవకాశం లేక పోయిందని అయితే ఆధునిక యుగంలో వ్యక్తిగత సంసారాల సరిహద్దులు దాటి విశ్వానికి చెందిన స్త్రీలుగా వాళ్ళు విస్తరించాల్సిన అవసరం ఏర్పడిందని రవీంద్రులు గుర్తించి చెప్పాడు. సమాజంలోకి విస్తరించే క్రమంలో స్త్రీలు ఆత్మరక్షణకు, ఆత్మగౌరవం కాపాడుకొనటానికి తమ బుద్ధినీ, విద్యనూ పెంపొందించు కొనవలసిన అవసరం వుందని చెప్పాడు. రాజ్యతంత్రం, అర్థనీతి, సమాజ శాసన తంత్రం పురుష నిర్మితాలని రవీంద్రుడు అంగీకరించటమే కాదు అందువల్ల వాటిలో ఒక వైపే మొగ్గిన అసమగ్రత వుందని చెప్పాడు. ఇళ్ళకు చెందిన స్త్రీలు సమాజంలోకి రావటం వల్ల ఈ లోపం సవరించ బడుతుందని భావించాడు. బాహ్యజీవితంలో వచ్చే ఈ పరివర్తన స్త్రీల ఆంతరిక ప్రవృత్తులను ప్రభావితం చేస్తుందని, ఈ కొత్త సంబంధాల వల్ల స్త్రీలలో విమర్శనాజ్ఞానం పెరుగుతుందని ఆ క్రమంలో వాళ్ళు పొరపాట్లు చేస్తారేమో, చిక్కులు కొనితెచ్చు కొంటారేమోనన్న సందేహం వున్నప్పటికి రవీంద్రనాథ ఠాగూరు ఆధునిక యుగానికి అర్హులు కావటానికి కావలసిన యోగ్యతను స్త్రీలు సంపాదించుకొనాలని నిర్ద్వంద్వంగా పేర్కొన్నాడు.

*శరీరానికి మస్తిష్క మెటువంటిదో మానవ సమాజానికి ధర్మ మటువంటిది. ఈ ధర్మము యొక్క ఆదర్శమే సర్వదా లోపల నుంచి మానవ ప్రకృతిలోని సమస్తమగు వికృతులతోనూ యుద్ధం చేస్తుంటుంది* – అని చెప్పిన రవీంద్రుడు *జీవితం మీద అధికారం ధర్మానిదే* కావాలంటాడు. ధర్మం పేరుమీద మూఢమైన కులాచారాలను విశ్వాసాలను ఆచరించటం, ధర్మాన్ని హృదయ సహజప్రకృతికన్నా నీచం చేయటమే నంటాడు. ఆ క్రమంలో మనిషి స్వాభావిక లక్షణం అభావం అయిపోతున్నదని హెచ్చరించాడు. వివేచన మనుష్యధర్మమని, వివేచన వున్నపుడు స్వీకరించవలసినదేది, వదిలించుకోవలసిది ఏది అన్న స్పష్టత ఏర్పడుతుందని అది మానవులను ఉన్నతికి తీసుకొని పోతుందని రవీంద్రుడు అభిప్రాయపడ్డాడు. *అస్పష్టత నుండి స్పష్టతకు ప్రస్థానమే ముక్తి* అని *కర్మయోగం* వ్యాసంలో అన్నాడు రవీంద్రుడు. *పనిని ఆనందాన్ని ఒకదాని నుండి మరొకదానిని వేరుచేసి చూడ వద్దని, పనిలో విశ్వాసం జీవితంలో ఆనందం, నిరంతరం ఏకముఖంగా కొనసాగటంలోనే సార్థక్యం వుందని స్పష్టం చేశాడు.*

సనాతన భారతీయ తాత్త్విక చింతనా బలంతో ఆధునికమవుతున్న భారతీయ సమాజాన్ని, మానవ ప్రవృత్తులను, సంబంధాలను వ్యాఖ్యానించటం రవీంద్రుని వ్యాసాలలో కీలకాంశం. తద్వారా ఆయన ఈ సమాజాన్ని ఒకడుగు ముందుకే నడిపించటానికి దోహదపడ్డాడు. బాహిర ప్రయోజనాలు, తాత్కాలిక ప్రయోజనాలు కాక జీవితంలో విలువల కోసం తపన రవీంద్రుడి వ్యాసాలసారం.

మి

## భావ చిత్రాలలో
# సామాజికాంశాలు

- బేతవోలు రామబ్రహ్మం

ప్రాచీన కావ్యాలు అంటే చాలు అవి అన్నీ నేల విడిచిన సాములనీ, సమకాలీన సమాజం వాటిలో కనిపించదనీ, ఒక కల్పిత జగత్తుకి సంబంధించినవనీ ఇలా ఏవేవో అభిప్రాయాలు మనలో చాలామందికి ఉన్నాయి. వీటిని పూర్తిగా కాదనలేము కానీ పద్యకావ్యాల్లోనూ సామాజికాంశాలు చాలానే కనిపిస్తున్నాయి అని మాత్రం గట్టిగా చెప్పగలం. కావ్య రచనకు తీసుకున్న కథ- ఏ కాలానిదైనా రాస్తున్న ప్రతి కవీ తాను జీవిస్తున్న కాలం నాటి సమాజాన్ని వీలున్నంత వరకు తన రచనలో ప్రతిబింబింప జేయడానికి, అలా చేసి ఒక కొత్తదనాన్నీ, తనదైన ముద్రనూ పదిల పరచడానికీ తపన పడ్డాడు. అయితే, కథా శరీరంలో వీటిని చొప్పించలేడు కనక దానితో అంతగా ప్రమేయం లేని వర్ణనల్లో వీటిని జత పరచి భావ చిత్రాలు రూపొందించి సంబరపడ్డాడు. అవే అతడిని నిలబెట్టిన కవిత్వాంశాలు కూడా అయ్యాయి.

రాజసౌధాన్నీ, ప్రాకారాన్నీ, దాని చుట్టూ ఉండే అగడ్తనీ కవులు అందరూ వర్ణించారు. ఒకటే వస్తువు. కానీ ఎవరి ప్రత్యేకత వారిది. కొందరు శ్లేషలతో, కొందరు శబ్దాలంకారాలతో, కొందరు సూక్ష్మాంశాలతో, కొందరు ఉపమానాలతో, కొందరు ఉత్ప్రేక్షలతో- ఇలా ఎవరి గొంతును వారు వినిపించారు. ఇందరిలోకీ తళుక్కున మెరిసినవాడు పింగళి సూరన. తన కాలానికి ఒక కొత్త ఫ్యాషనుగా, డిజైనుగా వాడకంలోకి వచ్చిన అద్దకం పనిని, సామాజికాంశాన్ని, జతపరచి తన వర్ణనని తళతళలాడించాడు.

ద్వారకాపుర లక్ష్మి- ప్రాకారం అనే చీర కట్టుకుందట. సౌధాగ్రాల కాంతులు దాని మీద పడి అది బంగారు చీర లాగా ఉన్నదట. ఆ చీరకి కింది భాగాన అంచులాగా అమరిందట అగడ్త. అగడ్త నీటిలో పచ్చని నాచు తీగలున్నాయి. వాటి మధ్యలో వికసించిన పద్మాలున్నాయి. ఇవి ఆ చీర అంచు మీద అద్దకం పని చేసిన డిజైనులాగా ఉన్నదట బంగారు చీర. నల్లని అంచు (కరకంచు). దాని మీద నాచు తీగలూ పద్మాల డిజైను. ఈ అలంకరణతో ఠీవిగా నిలబడిన ఆ పురలక్ష్మికి- ఆకాశ గంగ సిగలో తురుముకున్న మల్లెపూదండ అయ్యిందట. *కళాపూర్ణోదయం*లోని (1-112) పద్యమిది. కరక్కాయి రసంతో చీరలకు నల్లటి అంచులు వెయ్యడమూ, దానిమీద లతలూ పువ్వులూ అద్దడమూ-ఈ సామాజికాంశాన్ని వెలిసిపోకుండా, చిరిగిపోకుండా శాశ్వతంగా ఉండేట్టు అక్షర బద్ధం చేసిన మహానుభావుడు పింగళి సూరన.

బహుశ కొత్తదనం కావాలంటే ఏ కవిగానీ ఇంతే చేస్తాడనుకుంటా. కవిత్వమంటే ఏమీలేదు పారాణి కలపడమే. మన దగ్గర పసుపుంటే సున్నం తెచ్చి కలపడం, సున్నమే ఉంటే పసుపు తెచ్చి కలపడం. అందరూ ముత్యాలూ ముత్యాలూ అంటూ వర్ణించిన నక్షత్రాలని తానూ వర్ణించబోయి కుందుర్తి వెంకటాచల కవి *మిత్రవిందాపరిణయం*లో (5-11) ఒక సామాజికాంశాన్ని జత కలిపాడు. తారకలు ముత్యాలే. కాకపోతే ఆ ముత్యాలని ఆకాశంలో రాల్చినవారూ పేర్చినవారూ ఎవరు? ఎలా చేశారు? అని ప్రశ్నించుకొని ముత్యాల వేటని చూపించాడు. కాలము- అనే ముత్యాల వ్యాపారి (బేహారి-బేరి) సాయంసంధ్య అనే ఒక ఎర్ర రంగు ఓడమీద సముద్రంలోకి బయలుదేరాడు. తనతో పాటు సూర్యుడు అనే గజ ఈతగాణ్ణి తీసుకువెళ్ళాడు. అతడికి పొడవాటి కిరణాల తాళ్ళు కట్టి నడిసముద్రంలోకి దింపాడు. వాడు సముద్రం అట్టడుగుకు వెళ్ళి పెద్ద పెద్ద ముత్తెపు చిప్పలు పోగు చేసి, తాళ్ళు వెనక్కి లాగగా వచ్చి ఓడ మీదకి చేరాడు. ఆ ముత్తెపు చిప్పల్ని ఇప్పుడు ఆ బేహారి నిబ్బరంగా పగల గొట్టాడు. (బాదం కాయలు కొట్టినట్లు) పగల కొట్టి అకాశం అనే నేలమీద వాటిలోంచి ముత్యాలను- మేలిమి జాతి ముత్యాలను (సుపాణులు) రాల్చాడు. అవే ఈ తారకలు అన్నాడు కుందుర్తి కవి. రజ్జువులు కట్టి ఈతగాణ్ణి నీటిలోకి దించడం సముద్రంలో కాక్‌పిట్ కోసం గాలించడం లాగా ఉంది ఈ సన్నివేశం. అప్పటి ముత్యాల వేట మరింక ఏ కావ్యంలోనూ కనిపించదు.

అప్పటి సమాజంలో తరచుగా జరిగే దొంగ తనాలు- ఇళ్ళు దోచుకోవడాలు, పొద్దుగూకుతుందంటే చాలు భయపడి గృహస్థులు తీసుకొనే జాగ్రత్తలు- వీటిని జోడించి

ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఫోన్ : 9848169769

*రామాభ్యుదయం*లో అయ్యల రాజు రామభద్రుడు ఒక తేటగీతి రచించాడు.

సాయంకాలమయ్యింది. ఇంకాసేట్లో చంద్రుడనే దొంగోడు వచ్చేస్తాడు. అందుకని పద్మిని అనే గృహిణి భయపడిపోయి తన దగ్గర ఉన్న వికాస ధనాన్ని ఒక రాగి బిందెలో పెట్టి పడమటి సముద్రం అనే పెరటి నూతిలో పడేసిందట. అస్తమిస్తున్న సూర్యబింబం సదరు రాగి బిందె అన్నాడు.

**కలువ చెలి దొంగ రాయిడి కలుగునింక**
**ననుచు మును మున్ను పద్మిని తన వికాస**
**ధన ముంచి నీట నిడు రాగి తార్పు వోలె**
**పడియె పడమటి కడలిలో పద్మహితుడు** *(2-91)*

అప్పటికీ ఇప్పటికీ వారవనితలు దోపిడి కత్తెలే. పడమటి దిక్కు ఒక వారకాంత. ఆవిడ రాజుగారి (చంద్రుడు) ఇలాకాలో ఉంది. కానీ ప్రతిరోజు సాయంకాలంపూట సూర్యుడు (మిస్టర్ రవి) అనే విటుడు తన ఇంటి చుట్టూ తిరుగుతున్నాడు. పోనీలే అని ఈవిడ కరుణించింది. అతడికున్న కట్టు బట్టలతో సహా ఊడ్చేసి బికారిని చేసేసి, ఒకనాడు రవీ!రవీ! అడిగో నా రాజుగారు వచ్చేస్తున్నాడు అని (ఉదయించే చంద్రుణ్ణి చూపించి) బెదరగొట్టి ఇంటిలోంచి బయటకి నిర్దాక్షిణ్యంగా తోసేసింది. పాపం వాడేమో బిక్కచచ్చిపోయి సముద్రంలో దూకేశాడు. ఇది మరో కవి చేసిన సూర్యాస్తమయ వర్ణన. గద్దరి వేశ్యల్ని ఆకాశానికి ఎత్తేశాడు!

కవికి ప్రతిభ అంటూ ఒకటి ఉండాలే కానీ సమాజంలో కనిపించే దేన్నయినా, కావ్యంలో తటస్థపడే దేనితోనైనా జత కుదిరిస్తాడు. ఆహా పుట్టిస్తాడు. *అచలాత్మజాపరిణయ* కర్త వేశ్యల్ని సోమిదమ్మలుగా- యజ్ఞ పత్నులుగా వర్ణించాడు. శ్లేష సహాయంతో ఇద్దరి లక్షణాలకూ సయోధ్య కుదిర్చాడు. ఓరి నీ పుణ్యం పుచ్చా! అనిపించాడు. (1-17)

ఎవరికి ఏ వస్తువును ఏ వస్తువుతో ముడిపెట్టాలని అనిపిస్తుందో అనూహ్యం. పెళ్ళిళ్ళు కుదిర్చినట్టే. సంసారం హాయిగా సాగుతోందా లేదా అన్న దొక్కటే మనకు కాబట్టిన (కావాల్సిన) అంశం.

ముత్తయిదువులు నోముల్లో వాయినాలు ఇచ్చి పుచ్చుకొంటూ ఉంటారు. ఈ సాంస్కృతికాంశాన్ని మన తెలుగువారి ఆచారాన్ని తారాపథానికి చేర్చాడు *హంసవింశతి* కర్త. జన్మ జన్మలకి సుమంగళిగానే తానుండాలని కోరుకొంటూ ఇంద్రాణి (తూర్పు దిక్కు) ఒక నోము నోచిందట. దాని ముంగింపులో శ్రీమతి వరుణాని (పడమర) పేరంటానికి పిలిచింది. సూర్యుడు అనే పసుపు రాసిన ఆకాశం అనే చేట నిండా పోసి వాయినంగా అందించింది. అప్పుడు ఆ వరుణానిగారు పడమటి సముద్రపు కెరటాలు అనే పైట చెంగు దాని మీద కప్పి, లేదా విప్పి సదరు పసుపు చేట వాయినం అందుకుంది. *పుచ్చుకుంటి నమ్మా వాయినం-అని అందుకుని ఊరుకుంటే ఎలాగ? ఇచ్చినావిడ కోరిక తీరుగాక* అని ఆశీర్వదించాలి. అలా దీవించి అక్షతలు జల్లాలి. *వరుణాని జల్లిన ఆ అక్షతలే ఈ నక్షత్రాలు* అన్నాడు *హంసవింశతి* కర్త.

**ప్రతి జన్మంబు సుమంగళీత్వ గరిమన్ బ్రాపింప నింద్రాణి సు**
**వ్రత చర్యన్ వరుణానికిన్ రవి హరిద్రా చూర్ణ రాశిన్ సభ**
**స్తత శూర్పంబున వాయనం బొసంగ ప్రత్యక్సింధు వీచీ పటా**
**వృతి యొప్పన్ గొని చల్లు నక్షతలు నాన్ పెంపొందె తారౌఘముల్.**

గోదావరి జిల్లాల వోతుబరుల ఇళ్ళల్లో పెళ్ళి ఊరేగింపులప్పుడు పాలేళ్ళు నిచ్చెన దీపాలు నెత్తిన మోసుకొంటూ రెండు వైపులా బారులు తీరి నడుస్తారు. నిచ్చెన దీపాలు అంటే ఇప్పుడు చాలా మందికి తెలియక పోవచ్చు. కాంతి ఎక్కువగా రావడం కోసం దీపాలను ఒకదాని మీద ఒకటి నిచ్చెనలాగా అమర్చి ఆ నిచ్చెనను నెత్తిమీద నిలబెట్టుకుంటాడు పాలేరు. దీపనిశ్రేణిక అనాలి సంస్కృతంలో. ఇది ఎప్పుడో కంటపడింది అత్తసూరి పాపయ్య కవికి. చెన్న *బసవ పురాణం*లో *'ఖ్యాత మహీధ్ర సంగత దవాగ్నుల నిచ్చెన దీపముల్'* అని మొదలు పెట్టి ఆకాశ వీధిలో పెళ్ళి కొడుకుగా చంద్రుడు ఊరేగిన దృశ్యాల్ని కళ్ళకు కట్టించాడు.

ఊరేగింపు అయ్యింది. పడమటి దిక్కున ఈ చంద్రబింబం తెల్లబారి అస్తమిస్తోంది. ఇటు తూర్పున ఎర్రగా సూర్యబింబం ఉదయిస్తోంది. కాలము అనే గారడీ వాడు ఆకాశం అనే రంగస్థలం మీద, దశ దిశలు అనే అందగత్తెలు ఆసక్తిగా చూస్తుంటే చంద్రబింబం అనే అద్దాన్ని తన ఎడమ చెవి రంధ్రంలోకి చొప్పించి వెంటనే కుడి చెవి రంధ్రం నుంచి ఎర్రటి బంగారపు బిళ్ళను (హేమ చక్రము) తీశాడట. అదే సుమా ఉదయిస్తున్న సూర్యబింబం- అని అబ్బురపరచింది

*బిల్హణీయం.* ఈ ఇంద్రజాల మహేంద్రజాలాల కలగలుపు చాలా కావ్యాల్లో ఒక దాన్ని మించి ఒకటి మనోహరంగా కనిపిస్తాయి.

ఒకటేమిటి రకరకాల చేతి వృత్తులు. రస విద్యలు, లోహ విద్యలు, వినోద క్రీడలు, యుద్ధ క్రీడలు, పగటి వేషాలు, గృహోపకరణాలు, పనిముట్లు, నల్ల గోరింటలు (గెంటెనుల్), పిండి వంటలు, పాడి పంటలు, ఆచారాలు, కుత్సితాలు, కుహకాలు– సమస్త సామాజిక సాంస్కృతికాంశాలు మన ప్రాచీన పద్య కావ్యాల్లో కనిపిస్తాయి, వినిపిస్తాయి, మురిపిస్తాయి. మాకు ప్రవేశం దక్కలేదే అని ఏ ఒక్కటీ, ఏ ఒక్కరూ గంటు పెట్టుకోవలసిన పనిలేదు. ఆ కావ్యాల్లోకి మనం ప్రవేశించగలిగితే చాలు. అన్నీ పలకరిస్తాయి.

పాడిపంటలంటే గుర్తుకు వచ్చింది. ఇప్పుడు మనం తింటున్న బియ్యంలో నాలుగైదు రకాలు మాత్రమే మనకు తెలుసు. హంస, పద్మ, సోనామసూరి– ఇలాగ, నిన్నటిదాకా అక్కుళ్ళు, కృష్ణకాటుకలు, మొలకొలుకులు, బంగారు తీగలు, బుడం బియ్యం ఇత్యాదులు తెలుసు. మొన్నటి సమాజంలో ఎన్ని రకాలుండేవో చెప్పలేను. అన్నీ పద్య కావ్యాల్లో కనిపిస్తాయి. కొన్నిటిని శ్లేష చమత్కృతితో పొదిగిన ఒక సీస పద్యం నాడెం చూడటానికి మచ్చుగా అందిస్తాను.

సీ॥ పారిజాతములు సంపాదించితిమి పుష్ప
మంజరుల్ గూర్చుట మాకు బరువె?

బలు తీగమల్లె లుపార్జించితిమి చాల
కుసుమముల్ చులకనగ గూర్ప లేమె?

కణజముల్నిండ బంగారు తీగెలు గూర్ప
చాలమే మరి ముత్తెసరులు గూర్ప?

అర్థి ప్రయాగంబు లార్జింప నార్జింప
గానోప మెట్లు గంగాజలంబు

లందు బహువిధ చిత్ర ధాన్యములు గూర్చి
ధరణి సుర పూజన విధావధాను లగుచు
వరలుచుందుదు రప్పూరీ వరమునందు
సుగుణ మాణిక్య ఖనులైన శూద్ర జనులు.

(కవి జన రంజనము 1–13)

ఇంతటి వైవిధ్యంతో నిండిన పద్య రత్నాలను నన్నయ నుంచి *నయనోల్లాసం* దాకా (1920) కావ్యాలు గాలించి ఎనిమిది వేలకు పైగా సేకరించి *వర్ణన రత్నాకరము* పేరుతో నాలుగు సంపుటాలు బృహత్సంకలనంగా అందించిన మహానుభావుడు ప్రాతః స్మరణీయుడు దాసరి లక్ష్మణ స్వామి నాయుడు. నాటినుంచి పునర్ముద్రణకైనా నోచుకోక అజ్ఞాతంలో ఉండి పోయిన ఈ *రత్నాకరాన్ని* అనంతపద్య సాహితీ పద్మనాభ స్వామివారి నేల మాళిగను ధైర్యంగా సాహసంగా మేము తెరిచాం. ఈనాటి చదువరుల సౌకర్యం కోసం వాడుక భాషలో పాఠకమిత్ర వ్యాఖ్యతో, 200 నుంచి 250 పద్యాలు ఒక్కొక్క సంపుటిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని *ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం* అందిస్తోంది.

సాహితీ ప్రియులు సంతోషిస్తారనీ, ఆదరిస్తారనీ ఆశిస్తూ కొండనాలికకు కబురందించే వ్యాసం ఇది.

***మిసిమి*** పాఠకులకు ప్రత్యేకం.

## మానవవాదం

**మా**నవుడు జిజ్ఞాసువు దశకు చేరినప్పటి నుంచీ క్రమక్రమంగా మానవత వైపుకు పురోగమిస్తూ వచ్చాడు. ప్రపంచంలోని మానవ సమాజాలన్నింటిలోనూ ఎంతో కొంత మానవవాద ఛాయలు వ్యక్తమవుతూ వచ్చాయి. అంటే, మానవుడెంత ప్రాచీనుడో, మానవవాదం కూడా అంతే ప్రాచీనమైందిగా పరిగణించవలసి వస్తుంది.

అయితే, మానవ సమాజంలో అనాదినుంచి ఈనాటివరకు కొనసాగుతున్న అరిష్టాలన్నిటికీ కారణమేమిటి? అని ప్రశ్నించు కొన్నప్పుడు మానవతకు మూలమైన నైతికత లోపించడమే కారణమన్న సమాధానం వస్తుంది. అనాది నుంచీ మానవవాద భావన వస్తున్నా, తీవ్రమైన నైతిక విభేదాలు, ఉద్వేగాలు దాన్ని అడ్డుకుంటూ వచ్చాయి. ప్రేమ, కరుణ, ఔదార్యం, క్షమ, శాంతి స్థానాలలో క్రౌర్యం, హింస, దోపిడీ, దుర్మార్గం, దౌర్జన్యాదులు చోటు చేసుకొంటూ వచ్చాయి. వీటికి హేతువేమిటి? అనే ప్రశ్నకు మనం సమాధానం చెప్పకోవాలి. అప్పడే మనకు ఒకప్పటి మానవవాద భావాలకు, ఇప్పటి మానవవాద భావాలకు తేడా తెలుస్తుంది.



# నాట్య కృషీవలుడు
# చిన్న సత్యం

– *పసుమర్తి కేశవ ప్రసాద్*

**కూ**చిపూడి నాట్య సంప్రదాయాన్ని ప్రచారంలోకి తెచ్చిన లక్ష్య లక్షణ వేత్తలైన భాగవతులలో పద్మభూషణ్ డాక్టరు వెంపటి చిన్న సత్యం కూడా ఒకరు. వెంపటి వంశస్థులు సహజ పాండిత్యానికి ప్రతీకలు. *లయబ్రహ్మ, కలియుగ సత్యభామ* వెంపటి వెంకటరాయశాస్త్రి, ప్రముఖ పద్యనాటక రచయిత మరొక వెంపటి వెంకట నారాయణశాస్త్రి, సంఘసంస్కర్త, హరిజనోద్ధారకుడు, నిత్యకళారాధకుడు వెంపటి పరదేశి, ప్రఖ్యాత చలనచిత్ర నృత్య దర్శకుడు వెంపటి పెద సత్యం, చిన్న సత్యం పూర్వీకులు. ఎప్పటి కప్పుడు ప్రజాభిరుచిని పరిశీలిస్తూ, సంప్రదాయ భూమికను పరిరక్షిస్తూ, ఎన్నో సంస్కరణలు చేసి ప్రజాదరణను పట్టి నడవడంలో చిన్న సత్యం అందెవేసిన చేయి.

కూచిపూడి గ్రామంలో వెంపటి వెంకట చలమయ్య, వరలక్ష్మమ్మ దంపతులకు ఏకైక మగసంతానంగా 1929 అక్టోబర్ 15న చిన్న సత్యం జన్మించారు. చిన్న సత్యం అసలు పేరు వెంపటి సత్యనారాయణ వరప్రసాద్. కాలక్రమంలో చిన్న సత్యంగా మార్పు చెంది ప్రచారంలోకి వచ్చింది. బాల్యం నుండి తన వంశకీర్తి ప్రతిష్టలకు తగినట్లుగా తాడేపల్లి పేరయ్యశాస్త్రి, వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి, పసుమర్తి కొండలరాయుడుల వద్ద నాట్యంలో అక్షరాభ్యాసం నుంచి ఆట భాగం వరకు సుశిక్షితులైనారు. అనంతరం బ్రతుకు తెరువు కోసం మద్రాస్ మహానగరానికి కాలినడకన పయనమయ్యారు.

చిన్న సత్యం తన పెదతండ్రి కుమారుడైన వెంపటి పెద సత్యం వద్ద నాట్యంలోని మెలుకువలను గ్రహించి తన భవిష్యత్తును తీర్చిదిద్దుకొనుటకు నూజివీడు మీదుగా బెజవాడ కాలినడకన చేరుకున్నారు. అక్కడ డబ్బు కొరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బెజవాడలోని మల్లాది సూర్యనారాయణ నాటక కంపెనీలో చిన్న పాత్రను పోషించి ఆయన యిచ్చిన ఐదురూపాయల పారితోషకంతో మరల నడక ప్రారంభించారు. గుంటూరు చేరగా మార్గం మధ్యలో తన వద్ద వున్న డబ్బులు అయిపోయాయి అని గ్రహించి నిరాశచెందక, మరల నిగ్రహంతో నడక ప్రారంభించారు. మజిలీలు, మజిలీలుగా ప్రయాణం సాగిస్తూ మార్గంలోని దేవాలయాల్లోని తీర్థప్రసాదాలతో ఆకలిదప్పికలు తీర్చుకుంటూ నెల్లూరు ప్రాంతంలోని వెంకటాచలం చేరారు.

రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న చిన్న సత్యంను స్టేషన్‌మాస్టర్ లేపి వివరములు తెలుసుకొని భోజనం పెట్టి తర్వాత రైలెక్కించి మద్రాస్‌కు పంపారు. మద్రాస్ చేరేనాటికి చిన్న సత్యం వయస్సు 19 సంవత్సరాలు. మద్రాస్ చేరి చేరగానే తన పెద తండ్రి కుమారుడైన వెంపటి పెద సత్యం వద్ద నాలుగు సంవత్సరాల శిష్యరికంచేసి నాట్యంలోని మెలుకువలు నేర్చుకున్నారు. నాట్యం నేర్చుకుంటూ 1950లో మెట్రిక్యులేషన్ కూడా పూర్తిచేశారు.

1951 ఏప్రిల్ 4న కూచిపూడిలో శ్రీ లలితా నాట్య కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన శ్రీ సిద్ధేంద్రయోగి వార్షిక జయంత్యుత్సవాలలో ఆజాద్ హింద బాలికా పాఠశాల, మచిలీపట్నం విద్యార్థులచే కూచిపూడి నాట్యప్రదర్శనలు చేయించి రజత ఫలకములు బహుమతులుగా పొందారు. అన్న పెద సత్యం ప్రోత్సాహంతో చలనచిత్ర పరిశ్రమలో నృత్యదర్శకులుగా పనిచేశారు. 1952లో రాజరాజేశ్వరి ఫిలిం కంపెనీ వారి *పేదరైతు* సినిమాకి తన అన్న పెద సత్యంతో సహాయ నృత్య దర్శకునిగా పనిచేశారు. 1953లో *మంజరి* అనే చలన చిత్రానికి (తెలుగు, తమిళం) సహాయ నృత్య దర్శకునిగా అదే సంవత్సరం వేదాంతం రాఘవయ్య చిత్రీకరించిన *దేవదాసు* సినిమాలో తిరువాన్కూరు సోదరీ మణులలో ఒకరైన లలిత చేత పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో *పరాముఖమేలనయ్య; ఇంత తెలిసియుండి* అనే అంశాలను ప్రదర్శింపచేసి ప్రశంసలు పొందారు. ఈ చిత్రం రెండు భాషల్లోనూ శత దినోత్సవాలు జరుపుకుని గొప్ప సంచలనం సృష్టించింది కూడా. తదాది వరుసగా *జయసింహ* (1956), *చరణదాసి, పాతాళ భైరవి, కలిమిలేములు,* (1962), *నర్తనశాల* (1963), *సి.ఐ.డి.* (1965), *రంగులరాట్నం* (1966), *బంగారు పంజరం* (1968), *శ్రీకృష్ణవిజయం* (1970), *అభిమానవంతులు* (1973), *అమెరికా అమ్మాయి*

పసుమర్తి కేశవ ప్రసాద్, ఫోన్ : 9949618846

(1976), *లైలామజ్ను, లవకుశ, సంపూర్ణరామాయణం, ఆరాధన* మొదలైన చలన చిత్రాల్లో *పద్మశ్రీ*, నందమూరి తారక రామారావు, *మహానటి* సావిత్రి, హేమా మాలిని, యల్.విజయలక్ష్మి, వాణిశ్రీ, చంద్రమోహన్, మినూ ముంతాజ్‌ల ద్వారా నాట్యాంశములను ప్రదర్శింప చేయించిన ఘనత డాక్టరు వెంపటి వారిదే. చిత్ర పరిశ్రమలో గొప్ప పేరు తెచ్చుకున్న నృత్య దర్శకులలో వెంపటి చిన్న సత్యం కూడా ఒకరు.

చలనచిత్ర పరిశ్రమలో వుంటూనే కూచిపూడి నాట్యానికి తనవంతు కృషిసల్పే విషయంలో నిరంతరాలోచనల్లో, వున్న సమయంలో బి.యన్.రెడ్డి చిన్న సత్యంను కావలి జవహర్ భారతి కాలేజి యాజమాన్యం కోరిక మేరకు పంపారు. పదిరోజులపాటు వుండి నృత్యాల్లో విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణయిచ్చి ఆ బృందం వెంట మైసూరులో జరిగిన అంతర్విశ్వ విద్యాలయ యువజనోత్సవాల్లో పాల్గొన్నారు. ఇది వారి జీవితంలో గొప్ప మలుపు. తదుపరి రవీంద్రుని శతజయంతి సందర్భంలో 1960లో సామాజిక ఇతి వృత్తాన్ని ప్రధానంగా అస్పృశ్యత అంశంపై బౌద్ధం నేపథ్యంలో సృష్టించిన *చండాలిక* సత్యంగారిని మరొమెట్టు పైకి తీసుకెళ్ళింది.

రవీంద్రుని పథకానికి స్పష్టమైన రూపకల్పన చేసిన యస్.వి.భుజంగరాయ శర్మ దీన్ని కవితామయంగా నిర్వహించారు. కూచిపూడి నాట్యశైలిలో ప్రయోగించబడిన నృత్యనాటకం సామాజిక ప్రయోజనాన్ని ఆశించి, సమకాలీనతను సంతరించుకుంది. అనుటలో ఏమాత్రం సందేహంలేదు. అట్లాగే జన్మభూమి ఋణం తీర్చుకునే ప్రయత్నంలో బందా కనకలింగేశ్వరరావు నేతృత్వంలో *క్షీర సాగర మథనం* అనే కూచిపూడి తొలి నృత్య నాటకాన్ని కూచిపూడి భాగవతములో ప్రదర్శింపచేయించటం, దానికి చిన్న సత్యం నృత్య దర్శకత్వంతో పాత్రధారునిగా (శివుడు) వుండటం కూచిపూడి చరిత్రలోనే గొప్ప సంచలనం- చిన్న సత్యంకు కీర్తికిరీటం. ఆ ప్రదర్శనల ద్వారా వచ్చిన సొమ్ముతో కూచిపూడి గ్రామంలోని సిద్ధేంద్ర కళాక్షేత్రంలో ఆడిటోరియం నిర్మాణం జరిగింది. ఈ విధంగా చిన్న సత్యం మాతృభూమి ఋణం తీర్చుకునే ప్రయత్నం కూడా చేశారు.

సుమారు పుష్కరకాలం గడచిన చిన్న సత్యం జీవితం సినిమా ప్రపంచంతో ఇమడలేక అసంతృప్తితో సతమత మవుతూ వున్న తరుణంలో ఒక చక్కని ఆలోచన స్ఫురించింది. దాని పరిణామమే *కూచిపూడి ఆర్ట్ అకాడమీ* స్థాపన. కూచిపూడిలో మిడిమిడిగా అస్త వ్యస్తంగా మాత్రమే ప్రచారంలో ఉన్న కూచిపూడి నాట్య ప్రక్రియను శాస్త్రీయమైన రూపం కల్పించి, ప్రజల దగ్గరకు తీసుకువెళ్తే, తెలుగు వారి జాతీయ నాట్యకళకు తనవంతుగా ఏదైనా చేసినట్లు, అవుతుందని, జన్మ సార్థకమవుతుందని భావించి అకాడమీని నెలకొల్పటం జరిగింది. కూచిపూడి కళ కలకాలం సజీవంగా నిలచి ప్రజల్లోకి వెళ్ళాలంటే దీనిని స్త్రీలకు సాంప్రదాయంగా నేర్పించటం అవసరమని గుర్తించారు. మొదట్లో ఈ కళను స్త్రీలకు నేర్పటమేమిటని ఎన్నో విమర్శలకు, హేళనలకు గురైనా అన్నీ భరించారు. ఆత్మవిశ్వాసంతో దీక్షతో ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొంటూ ముందుకుసాగారు.

కూచిపూడి భాగవతులతో *క్షీర సాగర మథనాన్ని* చేయించి కువిమర్శలనే విషాన్ని తన కంఠమందుంచుకుని నిరంతరం నాట్యమే తన ఊపిరి, ప్రాణం, జీవిత లక్ష్యంగా ఎంచుకుని, అభివృద్ధి, స్థిరత్వం, క్రొత్తదనం అనే త్రిగుణాలతో సమ్మిళితం చేసి తన జీవిత నౌకను ముందుకు సాగించిన స్థిత ప్రజ్ఞుడు అపర సిద్ధేంద్రయోగి చిన్న సత్యం. మద్రాసులో వుంటూ దేశీయ నృత్యకళా ప్రదర్శనలేకాక విదేశాల నృత్యరీతులు, వారు ప్రదర్శించే పద్ధతులు చూసి ఆకళింపు చేసుకుని వాటిని తన కూచిపూడి శైలికి మలచారు. దీనివలన నాట్య స్వరూపం మారలేదు సరికదా మన్నిక పెరిగింది.

తదనంతరకాలంలో పద్మభూషణ్ డాక్టరు వెంపటి చిన్న సత్యం దర్శకత్వంలో అనేక నృత్యరూపకాలు *మేనకా విశ్వామిత్ర, శాకుంతలం, కుమారసంభవం, విప్రనారాయణ చరిత్ర, పద్మావతీ శ్రీనివాసం, కళ్యాణరుక్మిణీ, శివధనుర్భంగం,* మొదలైన వివిధ అంశాలతో ప్రపంచ రసికులకు మనోల్లాసం చేకూర్చి విశ్వవిఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులుగా ఖండ ఖండాతంరాలలో పేరు ప్రతిష్ఠలు, సన్మాన సత్కారాలు, గౌరవ మర్యాదలు, మన్ననలు, పురస్కారాలు, పట్టా ప్రదానాలు పొందిన కీర్తిశాలి, నాట్యధురీణుడు, డాక్టరు వెంపటి. ఆయన అనుకున్నవన్నీ సాధించి, నిరూపించి, ఇతరుల్ని నిస్తేజుల్ని చేశారు.

కడపటి కోరికగా జాతిపిత గాంధి, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూల జీవితచరిత్రను కూచిపూడి నృత్యరూపకాలద్వారా ప్రదర్శించాలనే ఆయన తపన నెరవేరలేదు.

---

(అక్టోబరు 15, వెంపటి చిన్న సత్యం జయంతి)



# తూర్పుగాలి జపాన్ కవిత్వం

*- ముకుంద రామారావు*

**8వ** శతాబ్దం వరకూ జపానులో కవిత్వం లేదనే చెప్పుకోవాలి. మౌఖికంగా ఉన్నా ఎక్కడా గ్రంథస్థం కాలేదు. 8వ శతాబ్దం చివర్లో వచ్చిన (759) (ప్రాంతంలో), *మన్ యోషు* (పదివేల ఆకుల సేకరణ)నే, జపాను సాహిత్యంలో మొట్టమొదటి ప్రసిద్ధ కావ్యసంకలనం. 20 సంపుటాలుగా విస్తరించిన ఈ బృహత్ కావ్యానికి రచయితలు, సంగ్రహకర్తలు, వారిలో అనామకులు అనేకులున్నారు. కవయిత్రుల్లో రాజకుమార్తె నుకాటా కూడా ఒకరు. *మన్ యోషు* కు మూలాధారాలు అనేకం. హీయక సామ్రాజ్యకాలంలోనే దీనికి బీజాలు పడ్డాయని భావిస్తారు.

అయితే ఎక్కువభాగం మౌఖిక సంప్రదాయాల నుండి సేకరించినవే. అందులోని ఒక కవి, ఒటోమో నో యాకామోచీ, ఈ సంకలనానికి ముఖ్య సంగ్రహకర్త. నిర్వహణ సరిలేక, కొన్ని విషయ ప్రాధాన్యతతోను, కొన్ని కాలాన్ని అనుసరించి, కొన్ని కవిత్వ రీతుల ఆధారంగా, పొంతన లేకుండా తయారైన సంకలనమిది. విశదీకరిస్తూ కవితకు ముందూ చివరా, కొన్ని కవితలకు వివరణలూ ఉన్నాయి. ఇందులో 265 *ఛొక,* 4207 *టంకా,* 62 *సెడొక,* 1 *తన్రెంగా,* 1 *బుస్సోకుసెకిక,* 4 *చైనా కవితలు* (దాదాపు 4500 కవితలు) ఉన్నాయి. *మన్ యోషు* పూర్తిగా చైనా అక్షరాలతో రాయ బడటం విశేషం (జపానులో దాన్ని కంజీ అంటారు). అది ధ్వని ప్రాధాన్యత కోసమేనని చెబుతారు. యుద్ధం, దేశ వ్యవహారాలు, స్వదేశీ కీర్తన, సంపద అన్వేషణ, రాజవంశీకుల ఔన్నత్యం, పతనం, అప్పటి చారిత్రక సంఘటనలు, విషాదాలు, తాత్విక ఆలోచనలు మొదలైనవన్నీ ఇందులోని కవితా వస్తువులు. చాలా చోట్ల చైనా కవిత్వ ప్రభావం కొట్టొచ్చినట్టు కనబడుతుంది.

ఎవరో తెలియని యువతిని ఉద్దేశించి రాసిన ప్రేమ కవితలు ఇందులో చాలా ఎక్కువ. అలాగే దేశభక్తి పూరితమైనవి, ఇప్పటికీ అవి వాడుకలో ఉన్నాయి. ఛందస్సుననుసరించి జానపద గేయాలు లేదా నమ్మకాలమీద ఆధారపడ్డ కవితలతోనే ఈ కావ్యం మొదలవుతుంది. వాటి రచయితలెవరో తెలీదు. అవి పూర్వ రాజులవిగా తీసుకో బడ్డాయి. ఆ కావ్యం మొదటి కవిత యుర్యాకు (457-479) చక్రవర్తిది. నిజానికి *కొజికి, నిహోన్షోకి* జపాను సాహిత్యంలో పురాతన గ్రంథాలైనా, చరిత్ర, పురాణ గాథలతో నిండి ఉన్నాయి. అక్కడక్కడ కొంత భాగం మాత్రం, కవిత్వ ఛాయలున్నా, కవిత్వంతోనే పూర్తిగా ఉన్నది మొదటి నుండీ *మన్ యోషు* నే.

జపానుకు మొదటి నుండీ కవిత్వ సాంప్రదాయం లేదు. చైనా టాంగ్ సామ్రాజ్య కాలంలోనే, జపానులో చైనా కవిత్వం ద్వారా, కవిత్వ ప్రక్రియ మొదలయింది. జపాను భాషలోనే చైనా కవిత్వాన్ని రాసుకుని, కవిత్వాన్ని చదువుకోవటం, నేర్చుకోవటం ఆరంభించారు. రాను రాను, తమదీ అంటూ కొన్ని కవిత్వ ప్రక్రియలు *టంకా, హైకూ* రూపంలో వచ్చాయి.

నిజానికి జపాను భాషకూడా ఇప్పటి రూపాన్ని సంతరించు కోవటానికి చాలా శతాబ్దాలు పట్టింది. దానికి కారణం ఆ భాష. ఇరుగుపొరుగున ఉన్న అనేక దేశ భాషల మిశ్రమం కావడం. 40 శాతం వరకూ అందులోది చైనా భాషనే. కొరియన్ భాష ప్రభావం కూడా తక్కువేమీ కాదు. *మన్ యోషు*, నరయుగం (710-794) లో వచ్చింది.

ముకుంద రామారావు, ఫోన్ : 9908347273

**'మన్ యోషు' ముఖ్యమైన కవులు:**

జపాను మొదటి గొప్ప కవిగా భావించే, కాకెనొమొటొ నొ హిటొమరొ (662-710) గురించి చాలా తక్కువే తెలుసు. అసుకా సామ్రాజ్యంలో హిటొమరొ ఆస్థాన కవిగా ముగ్గురు చక్రవర్తులు - టెమ్ము (673-686), దీర్జిటో (690-697), మొమ్ము (697-707) దగ్గర పని చేశారు. దీర్ఘకవితలు (ఛొక) రాయడంలో అగ్రగణ్యుడు. 380 వరకూ హిటొమరొ కవితలనుకున్నవి ఇప్పటివరకూ దొరికాయి. వాటిలో 75 *టంకా* కవితలు.

1. **నీ జుత్తు తెల్లబడింది / నాకు ముడిపడ్డ**
   **నీ హృదయం మాత్రం స్థిరంగా ఉండిపోయింది**
   **దాన్ని నేనెప్పుడూ విప్పను**
2. **శరత్కాల కొండ మీద / దారుల్ని రంగుటాకులు దాచాయి**
   **నాకు తెలియని దార్లమ్మట తిరుగుతూ**
   **నా పడుచుని ఎలా చేరుకోవాలి**
3. **నా పడుచు నాకోసం ఎదురుచూస్తుంది**
   **కామో కొండరాళ్ళ మీద / నా శరీరం పడుంటుందని తెలీక**

తాత్విక విషయాలు, పిల్లలు, సామాన్యులు, నివసించిన ప్రదేశాల ప్రభావం **యమనోయి నొ ఒకుర** (660-733) కవిత్వంలో ఎక్కువగా కనిపిస్తాయి. కొరియా నుండి వచ్చి, జపానులో స్థిరపడ్డ కుటుంబం. 701 లో ఒకుర చైనా రాయబార కార్యాలయంలో పనిచేశారు. అశాశ్వతమైన మానవజీవితం, బీదరికం, ముసలితనం, కుటుంబం, పిల్లలు, స్నేహితుల నుండి వియోగం, వీరిని బాధించిన అంశాలు. కన్‌ఫ్యూశియస్ ఆలోచనల ప్రభావం ఒకుర మీద ఉంది.

1. **మనం జీవితాన్ని / దుర్దశల లోయ అనుకుంటాం**
   **ఎంత కఠినమైన విపత్తైనా**
   **ఏమీకానట్టు ఎగిరిపోవడానికి / పక్షులం కాదు కదా**
2. **ఏ అగ్గీ పొగరాజేయటం లేదు / కుండలో కేవలం**
   **సాలెపురుగు గూడు అల్లుకుంటోంది / వండటమెలాగో కూడా**
   **మేము మరచిపోయాం / రాత్రి పక్షిలా మేము**
   **నీరసమైన గొంతుతో అరుస్తున్నాం**

ఒకుర సమకాలికుడు **ఒటొమొ నొ టాబిటో** చైనా టావో సిద్ధాంతానికి ప్రభావితుడైన వాడు. *టంకా* కవిత్వ పద్ధతిలో కవిత్వ పద్ధతిలో కవిత్వం రాశారు.

**రేగుపండ్ల మొగ్గలు / నాతో కలలో మాటాడాయి**
**మేము అత్యంత సొగసైన పువ్వులం/ దయచేసి మనం తేలుదాం నీకోసం**

టాబిటో కుమారుడు **ఒటొమొ నొ యకమొచి** (718-785). *మన్ యోషు* లో చివరి ముఖ్యమైన కవి. *మన్ యోషు* లో 46 *ఛొకా*, 433 *టంకా* కవితలు యకమొచివే ఉన్నాయి. ప్రాకృతిక ప్రపంచం, మానవ అనుబంధాల ఆనంద విషాదాలు, సమయ స్పృహ, వ్యాకులం, యకమొచి కవితల్లో కనిపిస్తాయి. *మన్ యోషు* లోనే ఉన్న తోటి కవయిత్రి కాసా కోసం అనేక ప్రేమ కవితలు రాశారు.

1. **ప్రపంచంలో బతుకు / శాశ్వతం కాదని తెలిసినా**
   **శీతల శరత్కాల గాలి / ఆమెని ఎలా గుర్తు చేస్తోందో నాకు?**
2. **కోరిక మూలానే / ఎవరైనా చస్తున్నారంటే**
   **చావు నాకు / మళ్ళీ మళ్ళీ వచ్చేది / వేయిసార్లు**
3. **కేవలం కాస్సేపే / మేము కలిసున్నాం**
   **అయినా మేము నమ్మాము / మా ప్రేమ వేల సంవత్సరాలు నిలుస్తుందని**

*మన్ యోషు* తర్వాత పదవ శతాబ్దం ప్రథమార్ధం వరకూ చెప్పుకోదగ్గ కవిత్వం రానేలేదు. *టంకా* మాత్రమే విరివిగా వాడుతూ *కొకిన్షూ* అప్పుడే వచ్చింది. మళ్ళీ 12వ శతాబ్దంలోనే మరో గొప్ప కవిత్వం వచ్చింది. *కొకిన్షూ* కు ముందు *ఇసె మొనొగటరి* (ఇసె గాథలు) పదవ శతాబ్దంలోనే వచ్చింది. 143 గాథలతో, వచనం కవిత్వం కలగలిసిన కావ్య గాథలివి. అనేకమంది ఈ గాథల రచయితల్లో, **అరివర నొ నరహర** (825-880) బహుశా ఒకరని అంటారు. ప్రేమ, రాజకీయాలు, ప్రవాసానికి సంబంధించిన గాథలే ఈ కావ్యంలో ఎక్కువ. ఒక యువకుడు పూజారిణి మధ్య సంభాషణ చూడండి.

**పూజారిణి:**

**నువ్వే ఇక్కడకొచ్చావా? / నేనే నీ దగ్గరకొచ్చానా?**
**గుర్తు రావడం లేదు / అది కలా, నిజమా?**
**మెలకువలో ఉన్నానా, నిద్రపోయానా?**

**యువకుని సమాధానం:**
**గాఢాంధకారంలో / నా మనస్సుకి మబ్బుపట్టింది**
**నన్ను నేను కోల్పోయాను / అది కలో నిజమో?**
**నువ్వే నిర్ణయించుకోవాలి**

పది, పదిహేనవ శతాబ్దాల మధ్య చక్రవర్తుల ఆదేశాను సారం వచ్చిన 21 సంపుటాల్లో *కొకిన్షూ* మొదటిది. ఇందులో 1111 కవితలున్నాయి. ఒక్క తొమ్మిది తప్ప అన్నీ *టంకా* పద్ధతిలో రాసినవే. *కొకిన్షూ*కి, రెండు పీఠికలున్నాయి. ఒకటి కి హోత్సురయుకి జపాను భాషలో రాసింది, ఇంకొకటి కి నొ యొషిమొచి, చైనా భాషలో రాసింది. *కొకిన్షూ* నిజానికి *కొకిన్వకాషూ* సంక్షిప్త నామం. అంటే ప్రాచీన ఆధునిక జపాను కవిత్వం, 21 సంకలనాల్లో మొదటిది. ఇందులో కవితలు పూర్వ శతాబ్దాల్లోవే కాకుండా, సమకాలికుల కవితలు కూడా చేర్చారు. ఛోకుసెన్షూ చక్రవర్తి ఆజ్ఞమేరకు ఆరంభమయింది.

ఇలా చేయాలని మొదట ఆలోచన చేసింది చక్రవర్తి ఉడా (867-931), కానీ 915-920 మధ్య పూర్తి చేయించ గలిగింది డైగో చక్రవర్తి (885-930). తతిమా 20 సంపుటాలూ నవల పద్ధతిలో ఇలా తీర్చిదిద్దారు. *వసంతం* (1,2), *వేసవి* (3), *శరత్తు* (4,5), *చలికాలం* (6), *అభినందనలు* (7), *వీడ్కోలు* (8), *యాత్రలు* (9), *శబ్దచిత్రాలు* (10), *ప్రేమ* (11,12,13,14,15), *శోకం* (16), *వివిధాలు* (17,18,19), *ఆస్థాన కవిత్వం* (20). ఈ విధంగా మొదటి భాగమంతా ముఖ్యమైన ఋతువులు మీద ఉంటే, రెండవ భాగం ఎక్కువగా ప్రేమకు సంబంధించినది.

ఇందులో 130 మంది కవుల పేర్లు తెలుసుకోగలిగారు, 450 కవుల పేర్లు తెలియలేదు. 5 కంటే ఎక్కువ కవితలున్న కవుల్లో ముఖ్యమైనవారు - ట్సురయుకి (102), మిట్సునె (60), టొమొనొరి (46), టడమినె (36), సధువు శొసై (36), నరిహిర (30), ఇసే (22), ఫుజివర నొ టొమొయుకి (19), కొమాఛి (18), హెంజో (17), కియొవర నొ ఫుకయబు (17), ఫుజివర నొ ఒకికజె (17), అరివర నొ మొటొకట (14), ఓయి నొ ఛిసటో (10), సకౌ నొ కొరెనొరి (8) మొదలైనవారు.

అప్పటి ప్రముఖమైన నలుగురు కవులు, కినొ ట్సురయుకి, కి నొ టొమొనొరి, ఒసికొచి నొ మిట్సునె, మిబు నొ టాడమినె; అంతకుముందు సంకలితం కాని గొప్ప కవితల్ని, అప్పటి గొప్ప కవితల్ని చేర్చి *కొకిన్షూ* కవిత్వ సంకలనానికి పూనుకున్నారు. వీరిలో ట్సురయుకి గురించి మాత్రమే కొద్దిగానైనా తెలుసుకోగలిగారు. అదీ ట్సురయుకి, ఈ సంకలనానికి ప్రధాన సంపాదకుడిగా పీఠిక రాయడాన్ని. వ్యక్తిగత జీవిత విశేషాలు తెలియలేదు. టొమొనొరి ఈ సంకలనం వచ్చిన వెంటనే చనిపోయారు. టాడమినె ఈ సంకలనం తరువాత ఏమయారో తెలీదు. మిట్సునె పూర్వ చక్రవర్తి ఉడా పోషణలో ఉండి 925లో మరణించారు.

*కొకిన్షూ* సంకలనంలోని నియమాలు పద్ధతులూ, తరువాత సంకలనానికి మార్గదర్శనం చేశాయి. అదే పద్ధతి వచనంలో కూడ అనుసరించడం మొదలయింది. ముఖ్యంగా ఈ సంకలనంలో, దేశవాళీ జపాను భాష, కవిత్వానికి అనుకూలంగా ఉన్నదే వాడారు. తక్కువ పదాల్లో అనంత అర్థాన్ని, అనేక వ్యాఖ్యానాలకు తావిచ్చే విధంగా కవిత్వాన్ని మలిచారు.

హీయకయుగం (794-1185)లో, అదీ తొమ్మిదవ శతాబ్దం ప్రథమార్థంలో వకా కవిత్వ పద్ధతి అధునాతనుల మనుకునే వారే ఎక్కువగా వాడేవారు. ప్రాకృతిక ప్రపంచానికి మానవ అనుభవాలకీ మధ్య, సరిహద్దుల్ని చెరిపేస్తూ, కాలానుగుణ్యంగా మారుతున్న మనిషి ప్రకృతి సంబంధాలు, వినయంగా సరళ సుందరంగా చెప్పే ప్రయత్నం కొనసాగింది. కానీ తొమ్మిదో శతాబ్దం చివరికి కొందరికే సొంతమైన వకా కవిత్వం జనసామాన్యానికి దగ్గరయింది. ఫలితంగా ఈ పద్ధతిలో కవిత్వ పోటీలు కూడా నిర్వహించగలిగారు. హీయక శకం లోని ఈ ఆరుగురు కవుల్ని ప్రతిభావంతులైన ఆరుగురు కవులుగా పేర్కొంటారు - ఒటొమొ కురునుషి, ఒనో నొ కొమఛి, అరివర నొ నరిహిర, కిసెన్ హోషి, సోజోహెంజో, ఫున్యా నొ యసుహిడె.

**ఇది ఆ చంద్రుడేనా / మనం చాన్నాళ్ళక్రితం పాలుపంచుకున్న**
**ఆ వసంతం కాదా ఇది / అప్పట్లానే**
**నేనొక్కడినే మారలేదని / నాకు అనిపిస్తోంది**

- అరివర నొ నరిహిర

*కొకొన్షూ* లానే 13వ శతాబ్దం ప్రథమార్థంలో షికొకొన్షూ (నూతన సనాతన ఆధునిక కవిత్వ సంకలనం) వచ్చింది. వకా కవిత్వ పద్ధతిలో, ఈ సంకలనంలో 1979 కవితలున్నాయి. *మన్ యోషు, కొకిన్షూ* కాలంలోని కవితలు కూడా ఇందులో ఉన్నా, ఎక్కువ భాగం కవితలు సంకలనకర్తల సమకాలికులవి. 20 పుస్తకాల్లో విస్తరించిన ఈ కవిత్వం పూర్వ చక్రవర్తి గొటొబా (1180-1239) ఆజ్ఞానుసారం తయారుచేశారు. ఇందులో కూడా రెండు పీఠికలు (ఫుజివర నొ యొషిట్సునె (1169-1206), ఫుజివర నొ ఛికట్సునె (1151-1210)) ఉన్నాయి, అయితే రెండూ జపాను భాషలో రాసినవి. 20 పుస్తకాలూ దాదాపు *కొకిన్షూ* పద్ధతిలోనే నిర్వహించినా, *షింటో, బౌద్ధ* కవితల్ని వేర్వేరు పుస్తకాల్లో సంకలన పరిచారు. 1205 లో ఈ సంకలనం, ఆవిష్కరణ ఉత్సవం కూడా జరుపుకున్నారు. అయినా ఆ తరువాత కూడా ప్రవాసంలోకి పోయిన గొటొబా చక్రవర్తి ఈ సంకలనంలో మార్పులు చేర్పులూ చేస్తూ పోయారు. ఫుజివర నొ టైక (1162-1241), మినమొటొ నొ మిఛిటొమొ (1171-1227), ఫుజివర నొ అరీ (1155-1216), ఫుజివర నొ ఇఎటక (1158-1237), ఫుజివర నొ మస్టనె (1170-1221), జకురెన్ (-1202) ఈ పుస్తకాల సంకలనకర్తలు.

**తేలుతున్న క్షణికమైన / వసంతస్వప్న వంతెన**
**కూలిపోతోంది / ఆకాశంలో వేలాడుతున్న**
**నవారు మేఘం / పర్వతశిఖరం నుండి కొట్టుకుపోతోంది**

– పుజివర నొ టైక

జపానులో యాత్ర, దినచర్యల్ని గ్రంథస్థం చేసే ప్రక్రియ కవిత్వపరంగా మొదటి నుండీ ఉంది. *టోసానిక్కి* (టోసా డైరీ), *కగెరొ నిక్కి* (కగెరొ డైరీ) అలా వచ్చినవే. వకా కవిత్వ పద్ధతిలోనే సాగిన ఈ రెండు డైరీలు జపాను సాహిత్యంలో మరిన్ని ఉత్తమ గ్రంథాలకు నాందిగా పనికొచ్చాయి. 935లో వచ్చిన టోసా డైరీ రచయిత, *కొకిన్షూ* సంకలనకర్త కొ నొ ట్సురాయుకి (872–945). పూర్వ గవర్నరు దక్షిణ షికొకు టోసా పట్టణంలో ఓడ ఎక్కి ఇంటికి తిరిగొస్తున్న 55 రోజులు ఆ తరువాత సమయానికి సంబంధించిన, కవితాత్మక దినచర్య విశేషాలు ఇందులో ఉన్నాయి. అంతకుముందు సంకలనాల్లో అంత ప్రాముఖ్యత లేని విధంగా, స్త్రీలూ పురుషుల్లా రాయగలరని, పురుషులూ స్త్రీల్లా రాయగలరని బలంగా చెప్పబడింది.

**పంపుతున్న అలల్ని / దయచేసి, ఇంకా ఎక్కువ పంపు**
**కోరుకుంటున్నదాన్ని / మరచిపోవడానికి వీలుగా**
**తరువాత నేనొచ్చి / గవ్వల్ని సేకరిస్తూ గడుపుతాను**

971లో వచ్చిన కగెరొ నిక్కి కవయిత్రి/రచయిత్రి మిఛిట్సున నొ హహ (936–995) (మిఛిట్సున తల్లి). *జీవితం అశాశ్వతమైనది, అస్థిరమైనది, రాజుని పెళ్ళాడినా చివరికి సుఖపడకపోవచ్చు, చెప్పనివి చెప్పినట్టు ప్రచారమవుతాయి, వచనం కూడా కవిత్వమంత అందమైనది* అని చెప్పుకుంది ఇందులో. 15 సంవత్సరాల దినచర్య మొదటి పుస్తకంలోను, తరువాత మూడు సంవత్సరాల దినచర్య రెండవ పుస్తకంలోను, అలాగే మరో మూడు సంవత్సరాల దినచర్య మూడో పుస్తకంలో వెలువరించింది. కవిత్వంతో బాటు వచనం ఉన్నా, అది కవితాత్మక వచనం.

*ఆమె అంటుంది:*

**ఏముంది చేయడానికి? / నీ హృదయం చంద్రుడిలాంటిది**
**కొండ కొసల్నే పట్టుకు వేలాడక / బహిరంగ ఆకాశంలోకి**
***పోతున్నట్టు***

*అతనంటాడు:*

**నా హృదయ చంద్రుడు / విస్తరించిన ఆకాశంలోకి పోతాడని**
**నువ్వంటున్నా / తన ప్రతిబింబాన్ని / ఈ జలాశయంలోనే**
**వదులుతాడు**

అతను అక్కడే ఉండాలనే ఆశ ఆమెది, అయినా అలా చెప్పదు, ఆ ఆశను మాత్రమే వ్యక్త పరుస్తుంది.

**ప్రపంచానికి, జపాను ప్రసాదించిన హైకూ కవిత్వం:**

హైకూ అంటే గుర్తొచ్చే బషో, 1644లో ఇగ ప్రాంతంలోని ఉయినో లో, సాముురాయి కుటుంబంలో పుట్టినపుడు అతని పేరు మత్సువో కిన్సకు. అది ఎడొ కాలానికి (1600–1868) చెందినసమయం. ఆ కాలం ప్రథమార్థంలోనే అధికారికంగా జపానును మిగతా ప్రపంచంతో కలవకుండా నిషేధాజ్ఞలు విధించారు. అది పదిహేడవ శతాబ్దం చివరికి సాంస్కృతికంగా జపాను నిలదొక్కుకోవటానికి ఎంతగానో పనికివచ్చింది. బషో ఎనిమిదేళ్ళ ప్రాయంలో ఇగ లో ఉనొ దగ్గర, స్థానిక ప్రభువుకు బంటుకింద చేరారు. కానీ ఆ ప్రభువు కొడుకు అతని కంటే కాస్త పెద్దయిన సెంగిన్ తో స్నేహం ఏర్పడింది. వీరిద్దరూ కవిత్వాభిమానులు కావడం, బషోకు కవిత్వపరంగా బాగా పనికొచ్చింది. కానీ 1666 లో సెంగిన్ హఠాత్ మరణంతో, బషో 20 ఏళ్ళప్రాయం అనేక ఒడిదుడుకులకు లోనయింది. అది తట్టుకోవటానికి బషోకు చాన్నాళ్ళు పట్టింది. 28 ఏళ్ళప్పుడు ఎడొ (ఇప్పటి టోకియో) కి వచ్చి హైకూ మీద అవిశ్రాంత కృషి చేశారు. ఒక ధనికుడు యిచ్చిన అరటి కుటీరం (బషో) లో ఉండి కవిత్వంతో గడిపే వారు. బషోలో ఉండటంతో కొన్నాళ్ళకు అతని పేరు బషోగా మారిపోయింది.

అతనికి 30 ఏళ్ళు వచ్చేసరికి హైకూ కవిగా స్థిరపడి పోయారు. కవిత్వంలో పరిపక్వదశకు చేరుకుని, హైకూ అంటే బషో కవిత్వమే అన్న ఖ్యాతిని తెచ్చుకున్నారు. 40 ఏళ్ళకు బషో కవిత్వం, కొంత ధార్మికపరమైనా, చాలా వరకు జెన్ ఆత్మని సంతరించుకుంది. చివరి పదేళ్ళూ అనుయాయులు, శిష్యబృందంతోకలిసి, ఒక్కోమారు ఒంటరిగా కూడా సందర్శన ల్లోనే గడిపారు. ఆ క్రమంలో అనేక యాత్రాస్థలాల్ని, కవుల్ని, ప్రదేశాల్ని చూశారు. చూసినవి దినచర్యగా రాసుకున్నారు. అలా అన్నీ తిరుగుతూ 28 నవంబరు 1694న ఒసాకాలో 50 ఏళ్ళప్పుడు మృత్యువాత పడ్డారు. హైకూ కవిత్వాన్ని రాయడమే కాకుండా, హైకూకి సంబంధించిన సిద్ధాంతకర్తగా, యాత్రాసాహిత్య కర్తగా కూడా గుర్తింపు పొందారు. హైకూ ఉన్నన్నాళ్ళూ బషో ఉన్నట్టే ఎవరికైనా, అలా జపాను నుండి ఇప్పటికీ బతికున్న కవి బషోనే.

**బషో రాసిన ముఖ్యమైన గ్రంథాలు ఇవి:** 1. *నొజరషి కికొ* (1684 – వెయ్యివరకూ హైకూలు) 2. *అత్సుమె కు* (1687 – సేకరించిన కవితలు) 3. *ఒకు నొ హొసొమిఛి* (1689 – లోతట్టు ఉత్తరానికి ఇరుకైన దారి) 4. *సగ నిక్కి* (1691 – సగ డైరీ).

**బషో కవిత్వ ఇతివృత్తాలు ఇవి:** చూసినదానికి, విన్నదానికి ఏదో అర్థం తప్పకుండా ఉంటుంది, కానీ దానిని లోపలి ప్రపంచంలో వెతకాలి. సరైన సమయంలో, సరైన విధంగా, ప్రకృతిలో అద్భుతాల్ని అర్థం చేసుకోవాలి. ప్రపంచ రహస్యాల్ని తెలుసుకుందుకు సరళంగా ఆశ్చర్యంగా అందులో లీనమవాలి.

బషోవి అనేక ప్రసిద్ధ హైకూ కవితలున్నాయి. ఎక్కువగా పేర్కొనబడే కవితలు మచ్చుకి కొన్ని.

1. **పాత కొలను / కప్ప గెంతుతే / నీటి శబ్దం**
2. **ఈ దారిలో / ఎవరూ పోకుండా / ఆకురాలుకాలం ఆఖరవుతోంది**
3. **పుట్టకొక్కుకు / తెలియని చెట్టు ఆకేదో / అంటుకుంది**
4. **వసంతం పోతుంది / పక్షులు ఏడుస్తాయి**
   **చేపల కళ్ళు కన్నీటితో నిండుతాయి**
5. **నిద్దరోతున్న సీతాకోకచిలుకా / మేలుకో మేలుకో**
   **నిన్ను నా సహవాసిని చేసుకోవాలనుంది**

జపానులో నలుగురు కవుల్ని ముఖ్యమైన హైకూ కవులుగా గుర్తిస్తారు. వారిలో 1. బషో (1644–1694) 2. బుసోన్ (1716 – 1783) 3. ఇస్సా (1763 – 1827) 4. షికి (1869 – 1902). ఆ క్షణం అందంలో అద్భుతాల్ని బషో, ప్రకృతి స్వభావాన్ని బుసోన్, ప్రపంచంలో మనిషిమీద ఇస్సా, స్వాభావికమైన అనుకూల లక్షణాలు షికి కి ముఖ్యం.

బుసోస్ యోసా అద్భుత చిత్రకారుడు, కవి. బుసోన్ కవితలు ఏదో ఒక తత్వాన్ని కాకుండా నిర్ణాయకమైన సూచన చేస్తుంది. ఏదో ఒక శాంతయుతమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తుంది. వర్ణనాత్మక శైలితో దృశ్యాన్ని వాస్తవం కంటే ఊహాత్మకంగా తయారుచేస్తుంది.

1. **గాలిపటం / ఆకాశంలో ఎగురుతుంది / నిన్న ఎగిరిన దగ్గరే**
2. **నలుగురైదుగురు గుండ్రంగా నాట్యం చేస్తున్నారు**
   **వాళ్ళపైని / చంద్రుడు దాదాపు పడేట్టున్నాడు**

కొబయాషి ఇస్సా కవిత్వం రాయడం 40 ఏళ్ళపాటు ఒక దినచర్యగా బతికి, 18వేల కవితలు రాశారు. అనేక శైలులు, అంశాలు ఇస్సా కవిత్వంలో ఉన్నా, ఎక్కువ భాగం కవితలు ఇస్సా జీవితం నుండి వచ్చినవే.

1. **చనిపోయిన మా అమ్మ / సముద్రాన్ని చూసిన / ప్రతీసారీ**
2. **ఊరిలో మా ఇంటిలో / కీటకాలు సైతం / కుదతాయి**
3. **అవి ఇవి / అన్నీ నీకే వదిలేస్తాను / సంవత్సరాంతాన**

షికి మసౌక – బషో హైకూల కంటే, బసోన్ హైకూలు గొప్పవిగా భావించేవారు షికి. షికి కవితలు క్లుప్తంగా ఉన్నా దృశ్యమానం చేసే నేర్పు మూలాన, షికి హైకూలకు అభిమాను లెక్కువ.

1. **కొలనులో పద్మం ఆకులు / నీటిమీద స్వారి / జూన్ లో వర్షం**
2. **రైలెళ్ళాక / సుడులుగా పొగ / లేత గుబురు**
3. **నులివెచ్చని వర్షం /ఉత్త ముళ్ళ మీద**

20 వ శతాబ్దం ప్రథమార్ధంలో, చాలామంది కవులు, 31 మాత్రల *టంకా* కవిత్వమన్నా, 17 మాత్రల హైకూ అన్నా, వారిని ఏదో చట్రంలో బంధించినట్టు భావించడం మొదలెట్టారు. ఫలితంగా అప్పటినుంచి, ప్రపంచవ్యాప్తంగా అప్పటికే వ్యాప్తిచెందిన వచన కవిత్వం వైపు మొగ్గు చూపడం మొదలెట్టారు. స్వేచ్ఛా కవిత్వానికి అది నాంది అయ్యింది.

సంప్రదాయ జపాను కవిత్వానికి రెండు ముఖ్య ధారలున్నాయి. కన్షి కవిత్వం, వకా కవిత్వం.

**కన్షి కవిత్వం:** చైనా అక్షరాలు, సాహిత్యం ఆధారంగాసాగిన ప్రచలిత జపాను కవిత్వం.

**వకా కవిత్వం:** *టంకా,* హైకూ ఈ రెండు కవిత్వ పద్ధతులతో కొనసాగిన కవిత్వం.

1882 లో ఆంగ్లంనుండి, ఫ్రెంచి నుండి, ఇతర భాషల నుండి అనువాదం చేసి సంకలన పర్చిన 'కొత్త కవి పుంత', పశ్చిమదేశాల కవిత్వ ప్రభావానికి దారితీసింది. అయినా జపానుకే పరిమితమైన *టంకా,* హైకూ పద్ధతుల్ని కాపాడు కుంటూనే, కొత్త ప్రయోగాల్ని కానీ, ఇతర దేశాల ప్రభావంతో రాసిన కవిత్వం గానీ వచ్చింది.

ఆధునిక కవులుగా పేరు పొందిన వాళ్ళలో – రీ ఓ కన్ (1758–1851), మసోక షికి (1867–1902), యొనెజిరొ నొగుచి (1875–1947), యొసనొ అకికొ (1878–1942), సైతొ మొకిఛి (1882–1953), టకుముర కొటరో(1883–1956), సకుతరొ హగివర (1886–1942), ఇషికవటకుబొకు(1886–1912), కెంజిమియజవ (1896–1933), తనికవ షుంతారో (1931–), మసతొ టొమొబె (1950–) మొదలైనవారున్నారు. కొందరు ఆధునిక కవులు వారి కవిత్వం గురించి కొంత తెలుసు కుందాం. రీ ఓ కన్ తైగూ ప్రజాదరణ పొందిన జపాను, జెన్ బౌద్ధ భిక్షువు, కవి. చైనాలోని హన్షన్ కవి లాగ, అతని చేష్టలతోను, కవిత్వంతోను ఆకట్టుకున్నాడు. రీ ఓ అంటే మంచి, కన్ అంటే విశాలమైన. తైగూ (పెట్టుకున్న పేరు) అంటే పెద్ద మూర్ఖుడు. కవిత్వం గురించి ఎంత తెలిసినా, తెలిసిందనుకోడు.

**ఎవరంటారు నా కవితలు కవితలని / నా కవితలు కవితలు కావు**
**నా కవితలు కవితలు కావని మీకు తెలిసినపుడు**
**అప్పుడు మాటాడుకుందాం మనం కవిత్వం గురించి**

యొసనొ అకికొ కవయిత్రి, క్రియాశీలి, విమర్శకురాలు. *టంకా* కవిత్వానికి కాల్పనికతను జోడించి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. అకికొ భర్త టెక్కన్ యొసనొ కూడా కవి. వీరిద్దరూ కలిసి *మైజో* అన్న సాహిత్య పత్రిక నడిపి అనేక కొత్త కవుల్ని వెలుగులోకి తీసుకొచ్చారు. జాతీయ భావాల్ని ప్రచారం చేస్తూ చైనా జపాను యుద్ధాన్ని నిరసించారు. స్త్రీవాదిగా కూడా పేరు తెచ్చుకొని, *బుంకా గుకిన్* స్త్రీల కళాశాల నడిపారు.

**కొండలు కదిలి వస్తున్న రోజు – అని నేనంటే**
**ప్రజలు నమ్మరు, కొండలు నిద్రమబ్బులో ఉన్నాయి**
**కదిలి చాన్నాళ్ళయింది. అవి కోపం మంటల్లో కాలిపోయున్నాయి.**
**సరే ఇదీ నమ్మకపోయినా / ప్రజల్లారా నమ్మగలుగుతే నమ్మండి**
**నిద్రిస్తున్న స్త్రీలు మేలుకోబోతున్నారు కదలడానికి**

జపాన్, టోకియో నగరంలో జన్మించిన షుంతారో తనికవ (15 డిసంబరు 1931 – ) ప్రముఖ యుద్ధానంతర కవిగా, ప్రపంచ వ్యాప్తంగా తెలిసిన అత్యాధునిక కవి. తనికవ పశ్చిమ దేశాల ప్రభావంతో సంప్రదాయ జపాన్ కవిత (*హైకూ, టంకా, సెన్రూ*) రూపురేఖల్ని మార్చిన మానవీయ కాస్మిక్ స్పృహ ఉన్న ప్రతిభాశాలి. జపాన్ నుండి నోబెల్ బహుమతికి అర్హుడైన కవిగా గత కొన్ని సంవత్సరాలుగా ఊహాగానాల ప్రచారం జరుగుతూనే ఉంది.

**ప్రశ్న జవాబు :**

**ఒకరికొకరం పరస్పరం ప్రశ్నలై / ఎప్పుడూ జవాబులు రాసినపుడు**
**మా పదాలు చివరికి / వ్యక్తిగత హృదయాల బావుల్లో మునిగిపోతాయి**
**ప్రపంచమే ప్రశ్న అయినపుడు / నేను మాత్రమే జవాబు**
**నేనే ప్రశ్న అయినపుడు / ప్రపంచం మాత్రమే జవాబులిస్తుంది**
**కవిత్వం చివరికి రక్తం తప్ప మరేమీకాదు**
**దిక్కుమాలినస్థితి లోపల నక్షత్రాలు పరిభ్రమిస్తూనే ఉంటాయి**
**సంభాషణ నా లోపల మాత్రమే / ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండిపోయి**
**ఈ విధంగానే పరిపక్వమవుతుంది**

జపాను పూర్వ కావ్యాలు చాలా వరకు, బృహత్ సంకలనాలే. చక్రవర్తుల దగ్గర నుండి కవిత్వాన్ని భద్రపర్చుకోవాలన్న, నేర్చుకోవాలన్న ఆరాటం అడుగడుగునా కనిపిస్తుంది. కవిత్వం తెలిసిన ఎవరైనా జపాను *హైకూ* గురించి వినని కవులుండరు. ప్రపంచంలోని అనేక భాషలు *హైకూ*ని అనువాదం చేసుకున్నాయి, అనుసరించాయి కూడా. మన తెలుగులో కూడా అంతే విస్తృతంగా ఈ పని జరిగింది. ఇస్మాయిల్, గాలి నాసరరెడ్డి, బి.వి.వి.ప్రసాద్, దబ్బికార్, పెన్నా లాంటి ఎందరో కవులు ఈ మార్గంలో నడిచారు.

---

## అనుభవాలు



**ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ**

నేను రష్యా వెళ్ళినప్పుడు విల్‌నూస్‌ని ఓరియంటల్ డిపార్టుమెంటులో డైరెక్టరైన ఎడ్వర్‌దాస్ అనే పండితుడు నేను సంస్కృత కవయిత్రినని తెలుసుకుని బెల్ట్ ఆఫ్ పోయెట్స్‌ను నాకు బహూకరించారు. జకోస్లవేకియాలో మా కాతిథ్యమిచ్చిన మిస్ మరియమ్ నల్లావికా అనే రష్యన్ రచయిత సంఘాధిపతికి ఇంగ్లీషులో వ్యాఖ్యానాలున్న భగవద్గీతను నేను ఆమెకిస్తుంటే, ఆమె తన కాలి చెప్పులను విప్పి, అతి వినయంగా ఆ పుస్తకం మీద తనకున్న భక్తి ప్రపత్తులను చాటుతూ తీసుకున్నది. అది చూసి నేను ఆశ్చర్య పోయాను. *మీ కమ్యూనిస్టు దేశాలలో భగవద్గీతపై ఇంతటి గౌరవం చూపుతారా* అని అడిగాను. అందుకామె *కర్మపరమైన సందేశాన్ని ప్రపంచమంతటికి ఆదర్శపూర్వకంగా చాటి చెప్పిన ఒకే ఒక మహద్గ్రంథం భగవద్గీత. దానికి మా రష్యాలో స్థానం లేదంటారా* అని ఎదురు ప్రశ్న వేసింది. అమెరికాలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ దగ్గర ఆగ్రా రాధస్వామి అనుయాయులైన రెండు వేలమంది స్పెయిన్ దేశీయులను చూశాను. లిథువేనియాలో ఇటలీ చర్చి, ఫ్రాన్సు చర్చిలుండటం చూసి *మీకు ఇన్ని రకాలైన చర్చిలున్నాయా* అని ఇంటర్‌ప్రెటర్ విక్టర్‌ని అడిగాను. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క రకంగా వుంటాయన్నాడు. మొత్తం 242 భేదాల ధర్మసూత్రాలు వున్నాయన్నాడు. అయితే మా భారతదేశంలో 20, 25 మత భేదాలకంటే లేవు. అయినా మేమంతా *ఏకం సద్విప్రాబహుధావాదులు* అనే పరమేశ్వర తత్త్వం మీద విశ్వాసముతో వున్నాము. అయితే *మీరు ఆరాధించే భగవంతుని పేరేమిటి?* అని అడిగాను. వెంటనే ఆయన క్రీస్తు అని అనకుండా 'హహహహ' అని అన్నాడు. నేను *బాబూ హహహహ గంధర్వరాజు శబ్దము* అన్నాను. అందుకతను ప్రపంచంలో మహాత్ముడొక్కడే. మనం భిన్న భిన్న భేదాలతో సతమతమవుతున్నామన్నాడు.

లిండర్స్‌లో ఉన్నప్పుడు వారి కోరికపై నేను భగవద్గీతలోని విశిష్ట కర్మభక్తి అని ప్రబోధించిన భక్తియోగాన్ని గూర్చి ప్రవచించాను. అక్కడికి వచ్చిన యూనివర్సిటీ లైబ్రరీ అసిస్టెంట్ ఫ్రెడ్రిక్‌తో నేను *ఏమండీ మీ క్రైస్తవమతంలో 242 భేదాలున్నాయా* అని అడిగితే, చాలా వున్నాయి. 460 దాకా వున్నాయన్నాడు. ఇలా నా అనుభవాలు కోకొల్లలు.

**– ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ**

# హెవీ వాటర్

*- దయ్యవరపు రామారావు*

**జీ**వితంలో ఏదో సందర్భంలో మన గురించి మనమే చెప్పుకోవలసిన అవసరం వస్తుందనుకుంటాను. కనీసం ఉత్తరం కూడా రాసే అలవాటులేని నాకు ఈ విషయాలను మీతో చెప్పుకోవాలని అన్పించడం కాస్త వింతగానే వుంది. *హెవీ వాటర్* ప్లాంట్ వున్న మణుగూరులో ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో ముప్పయ్యేఏళ్లు పని చేసి తప్పుకున్నాను. గవర్నమెంటు చాకిరీలో తెలుగేదో, ఇంగ్లీషేదో తెలియని పరిస్థితిని మీరు భరించాలి. అందరి లాగానే నాకు పెళ్లి చేశారు పెద్దలు – ఉద్యోగం వుంది కాబట్టి పిల్ల దొరకటం అంత కష్టం కాలేదు. సంసారం – ఇద్దరాడపిల్లలు ఒక వంశోద్ధారకుడు. వాళ్ల పెంపకం, చదువులు, ఉద్యోగం ఇవన్నీ మనం నడిచినా, పరుగెత్తినా, బండిలో వెళ్లినా – కాలం మాత్రం దాని వేగంలో మార్పు లేకుండానే నడుస్తూనే వుంటుంది. కరెంటు పనిలో, *హెవీవాటర్* ($H_30$) అంటే ఇవి మామూలు నీళ్లు కాదు! ఈ వాతావరణంలో నేను రాటుదేలిపోయాను. నాకు తెలియకుండానే ఆడపిల్లల పెళ్లిళ్ళు, సాగనంపటాలు; అన్నీ జరిగిపోయినాయి. నేను రాయిలాగే, దేనికీ స్పందన లేకుండానే రోజులు గడిచి పోయాయి. నా కొడుకు చదువు – ఏదో ఉద్యోగం, తర్వాత వాడికీ పెళ్లి చేశాను. ఈ లోపుగానో, తర్వాతో నేను విశ్రాంతి(?) తీసుకోవాలని ప్రభుత్వం మర్యాదగానే పంపింది. ఆడపిల్లలకు పిల్లలు కలిగారు – నా కొడుకు అప్పుడే 39 ఏళ్ల వాడయ్యాడు. ఏమి దురదృష్టమో వాడికి సంతాన ప్రాప్తిలేదు. కోడలు వాడిని ఏడిపిస్తోందని, వాడు మానసికంగా కృంగి పోయాడని – వాడు ఆత్మహత్య చేసుకున్నపుడే మాకు తెలిసింది. సెల్ ఫోన్ల రోజుల్లో ఇదీ కమ్యూనికేషన్!

అప్పుడూ రాయిలాగానే వుండిపోయాను. కోడలు కోర్టుకెక్కింది. ఆస్తి కోసమే– కోర్టులు – లాయర్లు జడ్జీలు అన్నీ అన్నీ రాళ్లలాగానే కన్పించాయి. దేనికి ఏడ్వాలో, దేనికి పోరాడాలో నాకు దిక్కుతోచక ఇంకా మొద్దు బారిపోయాను.

ఇంత ఎండిపోయిన జీవన విధానంలో కూడా నాకు ఒక అలవాటుంది. అదే పుస్తకాలు (తక్కువగానే) చదువుతాను. అవికూడా నన్ను ఎటూ తీసుకు వెళ్లటం మానివేశాయి. ఏదయినా మొదలుపెట్టడం– ఏముంది దీనిలో? అనుకోవడం– ఆ లోపం నాదో, ఆ రచనదో తెలియక అక్కడితో ఆపివేసే వాడిని. నాకు ఒకరిద్దరు స్నేహితులున్నారు. నువ్వు చాల రఫ్ అండ్ టఫ్‌గా మారిపోయావు అంటారు. నిజంగా రాటు దేలిపోయానా? గుండె గిడసబారిపోయిందా అనుకుంటాను. వెన్న అయితే కరగబెట్ట వచ్చు – కొవ్వొత్తి వెలిగించ వచ్చు – కాని నన్ను నేను ఏ విధంగా కరిగించు కోవాలి? అదేదో సినిమాలోలాగా రాయిలా మారిపోతానా అని అనుమానం కూడా వచ్చింది. నాది సాదాసీదా బ్రతుకే– రొటీన్‌లో రాటు దేలింది. తర్వాత చెట్టంత కొడుకు కూలిపోవటం – కోడలు (కూతురులా చూసుకున్నాం) కోర్టుకెక్కటం – కేవలం ఇవేనా కారణాలు? ఏమో నేను ఎవ్వరినీ తిట్టలేను– ఈ సమాజంలోని సంస్థలన్నీ మొద్దుబారి పోయాయనుకుంటాను. వాటర్, హెవీ వాటర్ అయిపోయినట్లు, మనుషులు – మానవత్వం మరచి పోతున్నారు. నేను అలాగే అయిపోయాను.

నాకున్న స్నేహితులలో ఒకరు– దుకాణం నడుపు తున్నాడు. నేనో సాయంత్రం ఆ దుకాణంలోకి వెళ్లాను. ఆయనా పుస్తకాలు తెప్పించి చదువుతాడు. *ఇదిగో రామారావు– ఇది తీసుకు వెళ్లి తీరుబడిగా చదువు*– అని ఇవ్వబోయాడు–అబ్బా ఏముంటుందయ్యా, అన్నా మామూలుగా... అంటున్నపుడు *కాదు రామారావు చదవమన్నాగా* అని చేతికిచ్చాడు.

ఇంటికి వచ్చిన తర్వాత బల్లమీద పడవేశాను పుస్తకాన్ని– ఇంతలో చీకటి పడింది. దీపాలు వెలిగాయి. పడకకుర్చీలో కూర్చుని యథాలాపంగా పుస్తకం తీసి – ఆయన గుర్తుపెట్టింది చదవటం మొదలు పెట్టాను. ఒక పేరా చదివాను, ఒక కాలమ్ చదివాను – ఒక పేజీ కూడా. ఆపి, మళ్లీ మొదటి నుంచీ చదివాను. నా కండరాలు కదులుతున్న శబ్దం విన్నాను. పూర్తిగా చదివాను – ఎప్పుడు వచ్చిందో, నా ప్రక్కన నాభార్య, నేను తదేకంగా పుస్తకం చదవడం చూసి కూర్చుంది. *అదేమిటండీ, మీ కళ్లవెంట నీళ్లు వస్తున్నాయి ఎందుకు ఏడుస్తున్నారు?* అని అమాయకంగా అడిగింది – నేను మౌనంగానే వుండిపోయాను – నాతో యాభై ఏండ్లు కాపురం చేసి – నేను ఎప్పుడూ ఏడవని – ఒక రాయినని – నిర్ణయించుకున్న ఆమె నా కళ్లవెంట హెవీవాటర్ కారటం నమ్మలేక పోవటంలో ఆశ్చర్యం ఏముంది?

“ఇది నా కథేనే, నా బ్రతుకంతా గుర్తు వచ్చిందే– మానాన్న – ఆయనతో నేను సైకిలు మీద తిరిగిన రోజులు– తర్వాత నాతో నా కొడుకు తిరిగినరోజులు– అయ్యో వాడు ఏమయ్యాడో ” – అంటూ బావురుమన్నాను. కొంత బరువు దించుకున్నాను.

*కథనం... – కె.* మి

# అమెరికా నాటకరంగం

*- గండవరం సుబ్బరామిరెడ్డి*

ఐరోపా, ఇంగ్లాండ్, ఐర్లాండ్ దేశాలను కుదిపేసిన ఆధునిక నాటకోద్యమం అమెరికా చేరడానికి బాగా ఆలస్యమైంది. ప్రత్యేక ప్రతిపత్తి గల నాటకరంగం ఆవిర్భవించడానికి 19వ శతాబ్ది పూర్వార్థం వరకూ ఆగాల్సివచ్చింది. అంతకు పూర్వం అమెరికాలో నాటక ప్రదర్శనల వాసన లేదని కాదు. అప్పుడప్పుడూ కొన్ని ప్రదర్శనలు జరిగినా, ఇంగ్లాండు నాటక బృందాల నిర్వహణలో సాగేవి. అమెరికా, ఇంగ్లీషు వలస రాజ్యంగా ఉండటం ఒక కారణమైతే, నాటక ప్రదర్శనల విషయంలో శాసనాలు కఠినంగా ఉంటూ సాంస్కృతిక రంగానికి అడ్డుగోడలు కావడం మరోకారణం. వీటివల్ల అమెరికాలో నాటక కళావికాసానికి తీవ్ర అవరోధాలు ఏర్పడ్డాయి.

యుద్ధానంతరం 1783లో అమెరికాకు సంపూర్ణ స్వాతంత్ర్యం లభించిన తరువాత గానీ నాటకరంగంలో ఆశారేఖలు ప్రసరించలేదు. అప్పటి నుంచి అమెరికన్ నాటకరంగం క్రమక్రమంగా బాలారిష్టాలను దాటి అభివృద్ధి పథంలోకి అడుగుపెట్టింది. అయితే ఇంగ్లీషు నాటక బృందాలు విడిచిపోయిన నాటక విధానాల పరిష్వంగం నుంచి అమెరికన్ నాటకరంగం బయట పడటానికి చాలాకాలం పట్టింది.

ఇంగ్లీషు వలస రాజ్యంగా ఉన్న కాలంలో అమెరికా వాసులకు నాటకం రుచి చూపించిన ఘనత లెవీస్ హల్లమ్(1714-1756) సంచార నాటక బృందానికి దక్కుతుంది. ఈ ఇంగ్లీషు నాటక కంపెనీ, వర్జీనియా రాష్ట్రంతో ప్రారంభించి అనేక రాష్ట్రాలలో పర్యటించి ప్రదర్శనలిచ్చింది. ఈ కంపెనీలో అందరూ కుటుంబ సభ్యులు కావటం విశేషం. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించేవారు. 1780 నాటికి అమెరికన్ నాటకకర్తలు, నటీ నటులు స్వతంత్ర నాటకరంగం వైపు దృష్టి సారించారు. ఏది ఏమైనా 18వ శతాబ్దంలో చెప్పుకోతగిన నాటకాలు వెలుగు చూడలేదు. స్థానిక కళాకారులను సమీకరించి నాటకాలు ప్రదర్శించడం మొదలు పెట్టిన ప్రారంభ దశలో, కొన్ని పాత్రలకు ఇంగ్లీషు నటులను పిలిపించి, వారిచేత పాత్రధారణ చేయించి, ప్రదర్శించారు. కాలక్రమేణ ఈ పద్ధతికి స్వస్తి చెప్పారు. దేశీయ కళాకారులే నాటకాలు ఆడటం ప్రారంభించారు. 19వ శతాబ్దంలో అమెరికన్ నాటకరంగం స్వరూప స్వభావాల్లో గణనీయమైన మార్పులిచ్చాయి. దీనికి *అంకుల్ టామ్స్ కేబిన్* నాటకం నాంది పలికింది. మానవత్వానికి మచ్చగా మిగిలిన ఆనాటి బానిసల వ్యవస్థకు చరమగీతం పాడాలనే తపనతో, ఒక మహాదాశయంతో హారియట్ బీచర్ స్టౌవ్ రచించిన *అంకుల్ టామ్స్ కేబిన్* (1852) నవల ఆధారంగా, *జార్జ్ ఎల్ ఐకిన్* అదే పేరుతో రాసిన నాటకం అత్యంత ప్రజాదరణ పొందింది.

నవలకు అంతర్జాతీయ ఖ్యాతి లభించడంతో, నాటకీకరణకు కూడా ఆదరణ లభించింది. ఐకిన్ ఈ నాటకాన్ని మొదట్లో మూడు అంకాలకు పరిమితం చేసినా, ప్రజాదరణను దృష్టిలో ఉంచుకొని ఆరు అంకాలకు విస్తరించాడు. గీతాలు, నృత్యాలు పొందుపరచడమే గాక సాంకేతిక విలువలను కూడా సమకూర్చడం వల్ల ప్రదర్శనలో నిండుతనం వచ్చింది. కొద్దికాలంలోనే *అంకుల్ టామ్స్‌కేబిన్* 325 ప్రదర్శనలకు నోచుకోవడం ఆ నాటకం ప్రాచుర్యానికి గీటురాయి అయింది. ఇదే నవలను మరికొందరు రచయితలు కూడా నాటకీకరించడం జరిగింది. కాని ఆ నాటకాలేవీ ఐకిన్ నాటకం ముందు నిలబడలేకపోయాయి. 19వ శతాబ్ది చివరి సంవత్సరాలలో లండన్ నుండి నాటక కంపెనీలు వచ్చి నగరాల వారీలగా ప్రదర్శనలిచ్చేవారు. ఇదంతా కాంట్రాక్టు పద్ధతే. అవీ ఎక్కువగా హాస్య నాట్య ప్రధానం; ఇలాంటి ఒక *కార్నో కంపినీ*తోనే చార్లీ చాప్లిన్ అమెరికా వచ్చాడు!

20వ శతాబ్దంలో కూడా *అంకుల్ టామ్స్‌కేబిన్* ప్రదర్శింపబడటం దాని విశిష్టతకు ప్రబలోదాహరణ. ప్రజల్లో నాటకాభిరుచి పెరిగిన కారణంగా అనేక నాటక సమాజాలు వెలిశాయి. ప్రతి సమాజం తాము ప్రదర్శించే నాటకాలతో రిపర్టరీని ఏర్పరచుకోవడం జరిగింది. అయితే త్వరత్వరగా నాటకాలు మార్చడం వల్ల ప్రదర్శన వ్యయం మోయలేని భారమైంది. అందుకని రెండు మూడు నాటకాలనే ఎక్కువకాలం ప్రదర్శించడం మొదలు పెట్టారు.

ఇతర రాష్ట్రాలలో నాటకప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి *థియేట్రికల్ సిండికేట్* (నాటక సమాఖ్య) న్యూయార్క్‌లో ఏర్పడింది. నాటక సమాజాలకు ఇది సౌకర్యం కలిగించినా, సిండికేట్ గుత్తాధిపత్యం వల్ల కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. నాటక రంగానికి న్యూయార్క్ కేంద్రీకృత వ్యవస్థగా నేటికీ నిలిచి ఉంది. 20వ శతాబ్దం మొదటి రెండుపాదాల్లో నాటకరచనలో, ప్రదర్శన విధానంలో నూతన పోకడలు వెల్లివిరిశాయి. నాటక శిల్పంలో ఐరోపా దేశాల్లో ప్రారంభమైన నూతన ఆవిష్కరణలు మెల్లమెల్లగా అమెరికా చేరుకున్నాయి. *రాబర్ట్ ఎడ్మండ్ జోన్స్* (1887–1954), *లీ సైమన్* (1888–1967) అనే సాంకేతిక నిపుణులు యూరప్‌లో విస్తృతంగా పర్యటించి, నూతన పద్ధతుల్ని అధ్యయనం చేసి, వాటిని అమెరికన్ నాటకరంగంలో ప్రవేశపెట్టారు. 1910–1920 మధ్యకాలంలో వికసించిన *లిటిల్ థియేటర్స్* కూడా నూతనత్వానికి దోహదం చేసింది.

యూజినీ ఓ నీల్ (1888–1953) (నోబుల్ పురస్కారగ్రహీత – చార్లీ చాప్లిన్‌కి పిల్లనిచ్చిన మామగారు) నాటక రచయితగా ఈ కాలంలోనే వెలుగులోకి వచ్చాడు. ఆధునిక నాటకకర్తలలో అగ్రతాంబూలం ఇతనిదే. తొలినాటి అమెరికన్ నాటకాలలో కొత్తరక్తం ఎక్కించి, దిశానిర్దేశం చేసిన ఘనత కూడా ఈయనదే. మొదట్లో *బియాండ్ ది హొరైజన్* (1920), *అన్నా క్రిస్టీ* (1920) వంటి వాస్తవిక నాటకాలు రాసినా ఒకే పద్ధతికి కట్టుబడలేదు. యూరప్‌లో వచ్చిన నూతన ప్రయోగాలు స్వీకరించి, అభివ్యక్తి ధోరణిలో *హెయిరీ ఏప్* (1921), *ఎంపరర్ జోన్స్* (1920) వంటి నాటకాలను రచించి నాటకరంగంలో సంచలనం రేపాడు.

*బియాండ్ ది హరైజన్‌లో* కర్షక జీవితంలో సుఖ దుఃఖాలను చిత్రించాడు. అన్నదమ్ముల మధ్య ఏర్పడిన అపోహలు విషాదాంతానికి దారి తీయడం ఆ నాటకంలో ఇతివృత్తం. అది మధ్యతరగతి జీవితానికి సంబంధించింది కాగా *అన్నా క్రిస్టీ* దిగువ తరగతి జీవితానికి సంబంధించింది. సముద్రం మనుషులను ఎలా విడదీస్తుందో, బ్రతుకుబాటను ఎలా చిందర వందర చేస్తుందో సహజ సుందరంగా అభివ్యక్తం చేశాడు ఈ నాటకంలో. కష్టజీవుల శ్రమను దోచుకొనే దుర్మార్గులకు సుఖశాంతులు ఉండవనీ, చేసిన పాపం వారిని భయం రూపంలో వెంటాడి వేధిస్తుందనీ, అదే దుర్మార్గుల పాలిటి నరకమనీ ద్యోతకం చేస్తుంది *ఎంపరర్ జోన్స్.*

సుమారు 20 నాటకాలు రాసిన యూజినీ ఓ నీల్‌కు నాలుగుసార్లు పులిట్జర్ బహుమతులు లభించాయి. 1936లో *నోబెల్ ప్రైజ్ ఫర్ లిటరేచర్* కూడా యూజినీ ఓ నీల్‌ను వరించింది. ఈ ప్రతిష్టాత్మక బహుమతిని పొందిన అమెరికన్ నాటకకర్త ఈయనొక్కడే. *డిసైర్ అండర్ ది ఎల్మ్స్* (1924), *స్ట్రేంజ్ ఇంటర్లూడ్* (1926), *ఐస్‌మేన్ కమెత్* (1939), మొదలైన నాటకాలు ఓనీల్ కీర్తిని ఇనుమడింపచేశాయి. ఈ శతాబ్దంలో రెండు సంస్థలు అమెరికా నాటక రంగంలో పెనుమార్పులు తేవడానికి దోహదం చేశాయి. వాటిలో ఒకటి థియేటర్ గిల్డ్. ఇది 1919లో ప్రారంభించబడి, పదేళ్ళపాటు కొనసాగింది. యూరప్ నాటకరంగంలో ఉన్న నూతన ప్రయోగాలతో కూడిన నాటకాలను అమెరికాలో ప్రదర్శించి, నూతనత్వానికి వాకిళ్ళు తెరిచింది. విదేశీ నాటకాలనే కాకుండా ప్రముఖ అమెరికన్ నాటక కర్తల నాటకాలను కూడా ప్రదర్శించి ఆ రచయితలకు ఖ్యాతి ఆర్జించిపెట్టింది.

ఎల్మర్ రైస్ రచించిన *ది యాడింగ్ మెషీన్* (1923), యూజినీ ఓనీల్ *స్ట్రేంజ్ ఇంటర్లూడ్* (1926), సిడ్నీ హవార్డ్ రాసిన *దె న్యూ వాట్ దె వాంటెడ్* (1927), మాక్స్‌వెల్ ఆండర్సన్ నాటకం *ఎలిజబెత్ ది క్వీన్* (1930), మొదలైనవి. థియేటర్ గిల్డ్‌లో చీలిక ఏర్పడి 1931లో *గ్రూప్ థియేటర్* అనే పేరుతో వేరే సంస్థ ప్రారంభమైనది. సామాజిక స్పృహతో సమకాలీన సమస్యలతో కూడిన నాటకాలను ప్రోత్సహించడం, నటులకు శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ గరపడం తన లక్ష్యాలుగా చేసుకొని కృషి చేసింది. ఈ సంస్థ కూడా పదేళ్ళలో కాలగర్భంలో కలసిపోయింది. గ్రూప్ థియేటర్ ద్వారా *హెరాల్డ్ క్లర్‌మెన్, ఎలిజా కర్జన్* వంటి ప్రతిభావంతులైన దర్శకులు, లీ జెకబ్, మోరిస్ కార్నోవ్‌స్కీ వంటి అగ్రశ్రేణి నటులు వెలుగులోకి వచ్చారు. స్టానిస్లవ్‌స్కి నటశిక్షణ విధానానికి అమెరికాలో వారసులుగా నిలిచి ఎంతో సేవ చేశారు.

రెండవ ప్రపంచయుద్ధం 1945లో ముగిసేవరకు వాస్తవిక వాదమే అమెరికన్ నాటకరంగంలో రాజ్యం చేసింది. అప్పటికే నూతన ప్రయోగాలు నాటకరంగంలో వచ్చి చేరినప్పటికీ వాటిని కూడా కొంత మేరకు తనలో ఇముడ్చుకొని, వాస్తవిక నాటకాలు వర్ధిల్లుతూ వచ్చాయి. వాస్తవిక వ్యతిరేక పద్ధతులలో కలగలిపి నాటకాలు రాసిన రచయితలలో *టెన్నిస్సె విలియమ్స్* (1914–1983) ప్రముఖుడు.

1945 నుంచి వెలుగులోకి వచ్చిన *టెన్నెస్సె, ది గ్లాస్ మేనేజరి* (1944), *ఎ స్ట్రీట్‌కార్ నేమ్డ్ డిజైర్* (1947), *సమ్మర్ అండ్ స్మోక్* (1948), *ది రోజ్ టాటూ* (1951), *సడన్లీ లాస్ట్ సమ్మర్* (1958) వంటి ప్రసిద్ధ నాటకాలు రాశాడు. ఆశ నిరాశల మధ్య నలిగిపోతూ ఘర్షణకు లోనయ్యే, మధ్యతరగతి మనుషుల మనస్తత్వానికి అద్దం పడుతుంది *ది గ్లాస్ మేనేజరి* నాటకం. నాలుగు పాత్రలకే పరిమితమైన ఈ నాటకం ప్రదర్శన సౌలభ్యానికి పెట్టింది పేరు.

ఈ నాటకం టెన్నిస్సె విలియమ్స్‌కు ఎనలేని ఖ్యాతి తెచ్చి పెట్టింది. అణచి పెట్టుకున్న లైంగిక కోర్కెలు మనుషులను ఎలా చిత్రవిచిత్రంగా వేధిస్తాయో, ఎలాంటి పరిణామాలను సృష్టిస్తాయో వివరించే నాటకం *ఏ స్ట్రీట్‌కార్ నేమ్డ్ డిజైర్.* టెన్నిస్సె నాటకాలల్లో ప్రతీకాత్మక ధోరణి విస్తృతంగా కనిపిస్తుంది. టెన్నిస్సె నాటకాల్లో ప్రతీకాత్మక ధోరణి విస్తృతంగా కనిపిస్తుంది. టెన్నిస్సె, ఓనీల్‌తో పాటు సరిసాటి అయిన రచయిత అని అమెరికా విమర్శకుల అభిప్రాయం. టెన్నిస్సె రాసిన *ది బాటిల్ ఆఫ్ ఏంజెల్స్* (1940), *క్యాట్ ఆన్ ఎ హాట్ టిన్ రూఫ్* (1955), *ది మిల్క్‌ట్రైన్ డజ్‌నాట్ స్టాప్ హియర్ ఎనీమోర్* (1963) మొదలైనవి రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శించబడిన ప్రసిద్ధ నాటకాలలో కొన్ని. ఫ్రాయిడ్ భావజాలాన్ని నాటకాల్లో ప్రవేశపెట్టిన నాటకరచయితలలో టెన్నిస్సె విలియమ్స్ ఆద్యుడు.

అమెరికా నాటకరంగానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ప్రసిద్ధ రచయితలలో ఆర్థర్ మిల్లర్ (జ.1915) ప్రముఖుడు. సమకాలీన సమస్యలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన రచయిత. *ఆల్ మై సన్స్* (1947) నాటకం ద్వారా ప్రసిద్ధి చెందిన ఈ రచయిత *ది క్రూసిబుల్* (1953), *ఆఫ్టర్ ది ఫాల్* (1964), *ది ప్రైజ్* (1968) నాటకాలలో నాటకరంగంలో నిలదొక్కుకోగలిగాడు. అయితే *ది డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మన్* (1949) ఈయనకు నాటకరంగంలో సుస్థిర స్థానం కల్పించింది. ఆర్థర్ మిల్లర్ అనే పేరు వినగానే *ది డెత్ ఆఫ్ ఎ సేల్స్ మన్* నాటకమే స్మృతి పథంలో తళుక్కుమంటుంది. *ది డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మన్* ఆలోచింపజేసే ఓ విషాదాంత నాటకం. విజయాన్ని సాధించడమే మనిషి గొప్పతనానికి గీటురాయి అని, మనిషి ఔన్నత్యాన్నీ, విలువను, అతను సాధించిన విజయంతోనే ముడిపెట్టి గౌరవించే అమెరికన్ ప్రజల సామాన్య అభిప్రాయాన్ని ఆధారంగా తీసుకొని, అద్భుతంగా రచించిన ఉత్తమ నాటకం ఇది. 20వ శతాబ్దంలో విశిష్ట నాటకంగా దీన్ని అమెరికన్లు భావిస్తారు. గతంలో జరిగిన సంఘటనలను దృశ్యాలు (ఫ్లాష్‌బ్యాక్) కథాగమనానికి అందాన్ని, ఆకర్షణను సమకూర్చాయి. విల్లీలోమెన్ అనే అసమర్థుని జీవయాత్రను నాటకరూపంలో చూసి జాలిపడని పాఠకుడుగానీ, ప్రేక్షకుడు గానీ బహుశా ఉండరేమో! ఆర్థర్ మిల్లర్ రచనలన్నీ వాస్తవిక నాటకాల కోవకు చెందినవే.

ఉత్తమ ప్రదర్శన విలువలకు పేరుమోసిన బ్రాడ్ వే నాటకాలు యుద్ధానంతర కాలంలో అధిక వ్యయంతో కూడినవి కావడంతో ఆఫ్ బ్రాడ్వే నాటకాలు మొదలయ్యాయి. మంచి నాటకాలు న్యూయార్క్ లోనే కాకుండా సమీపంలో తక్కువ వ్యయంతో లభించే థియేటర్లలో వివిధ సమాజాల పక్షాన ప్రదర్శించబడే విధానం అమలులోకి వచ్చింది. దీనితో ఇతర రాష్ట్రాలలో కూడా బ్రాడ్వే నాటకాలు చూడగలిగే అవకాశం లభించింది. సంగీత వినోద రూపకాలు (Musical comedies) కూడా యుద్ధానంతరకాలం నుంచీ ప్రజాదరణ పొందుతూ వచ్చాయి.

ఈ శతాబ్ది రెండవ పాదంలో నాటకరచనలో కొత్త ఒరవడిని సృష్టించిన రచయిత ఎల్మర్ రైస్ (1892–1967). వృత్తిరీత్యా న్యాయవాది కావడం వల్ల ఈయనకు నాటకరచనలో న్యాయశాస్త్ర పరిజ్ఞానం అక్కరకొచ్చింది. 1914లో ఎల్మర్ రాసిన *ఆన్ ట్రయల్* అనే నాటకంలో కోర్టు దృశ్యాలు ప్రవేశపెట్టడంలో నూతనత్వం ప్రస్ఫుటమైంది.

న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా జరిగిపోయిన సంఘటనలను ఫ్లాష్‌బ్యాక్ దృశ్యాలుగా చూపించడం ప్రదర్శనా విధానంలో ఓ కొత్తమలుపు. అమెరికన్ నాటకాలలో ఫ్లాష్‌బ్యాక్ సీన్లు ప్రవేశ పెట్టిన ప్రథముడు ఎల్మర్ రైస్. కొత్తదనం కోసం అన్వేషించే ఎల్మర్ రైస్, జర్మనీలో ప్రాచుర్యంలోకి వచ్చిన అభివ్యక్తి (Expressionism) నాటకశైలిని స్వీకరించి *ది ఏడింగ్ మెషీన్* (1923) అనే నాటకం రాశాడు. ఈ నాటకమే అతనికి పేరు తీసుకువచ్చింది. అమానవీయకరణ గురించి అభివ్యక్తి శైలిలో రచించబడిన ఈ నాటకం మేధావుల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. ఎల్మర్ రైస్ నాటకాలలో నియంతృత్వం మీద దాడి, కష్టజీవులపై కారుణ్య దృష్టి ప్రతిబింబిస్తాయి. *ఉయ్ ది పీపుల్స్* (1933), *విన్నర్స్* (1954) మొదలైన

నాటకాలు కూడా ప్రజాదరణ పొందాయి. అమెరికాలో అసంబద్ధ నాటకశైలికి (Theatre of the Absurd) అంకురార్పణ చేసినవాడు ఎడ్వర్డ్ అల్బీ (జ. 1928). ఈయన రాసిన *ది జూ స్టోరీ* (1958), *హూ ఈజ్ అఫ్రయిడ్ ఆఫ్ వర్జీనియా ఉల్ఫ్* (1962), *టినీ ఆలిస్* (1964), *ఎ డెలికేట్ బ్యాలెన్స్* (1966), *సీ స్కేప్* (1975) మొదలైన నాటకాలు అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాయి. *ఎ డెలికేట్ బ్యాలెన్స్, సీ స్కేప్, త్రీ టాల్ ఉమెన్* నాటకాలకు పులిడ్జర్ బహుమతులు లభించాయి. నాటకకర్తగా అతని పేరు అమెరికా నాటక చరిత్రలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొంది.

అమెరికా నాటకరంగానికి అంతర్జాతీయ ఖ్యాతి సముపార్జించిన పదిమంది గొప్ప రచయితలలో థారంటన్ వైల్డర్ (1897–1975) ఎన్నదగినవాడు. ఈయన రచించిన నాటకాలు రాశిలో కొంచెమే అయినా వాసిలో పేరెన్నికగన్నవి. ఈయన ఆరు ఏకాంకికలు, మూడు నాటకాలు రచించాడు. వైల్డర్ మొదట్లో వాస్తవికతా వాదం వైపు మొగ్గు చూపినా, క్రమంగా నూతన ప్రయోగాలపై దృష్టి నిలిపాడు. నిజానికి వైల్డర్‌ను అగ్రశ్రేణి రచయితగా నిలబెట్టినవి ప్రయోగాత్మక నాటకాలు కావడం విశేషం.

1931 నుంచి నాటకరచన చేస్తున్నా రచయితగా పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది 1937లోనే. *అవర్ టౌన్* (1938) అనే నాటకం వైల్డర్ రచనా జీవితంలో పెద్ద మలుపు. సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రయోగాత్మకంగా నాటకాన్ని మలిచిన తీరు ప్రేక్షకులను అబ్బురపరచింది.

దృశ్యబంధ నిర్మాణం, రంగస్థల పరికరాలు మొదలైనవి లేకుండా మూకాభినయం (Mime) ప్రక్రియతో కావ్యార్థాన్ని అభివ్యక్తం చేస్తూ, అక్కడక్కడా నిశ్చల దృశ్య విధాన ప్రక్రియ (ఫ్రీజ్)తో నాటకాన్ని నడిపిస్తూ, ప్రేక్షకుల ఊహాశక్తికి పదును పెట్టే విధంగా రూపొందించిన ఆ నాటకం పండిత పామరుల ప్రశంసలు పొందింది. అనవసరపు హంగులు లేకుండా సాంకేతిక విలువలతో నాటక ధ్యేయాన్ని సామాజికులకు సులభగ్రాహ్యం చేసిన ఈయన శిల్ప నైపుణ్యాన్ని నాటకాభిమానులు ఎంతో ప్రశంసించారు. అప్పటికి ప్రాచుర్యంలో లేని తాదాత్మ్య విచ్ఛిత్తి అనే ప్రక్రియ *అవర్ టౌన్* లో చోటు చేసుకోవడం ఆశ్చర్యకరమైన విషయం. *ది స్కిన్ ఆఫ్ అవర్‌టీత్* (1942) అనే నాటకం కూడా ఈయన ఖ్యాతిని ద్విగుణీకృతం చేసింది. *అవర్ టౌన్, ది స్కిన్ ఆఫ్ అవర్ టీత్* నాటకాలకు పులిడ్జర్ బహుమతులు లభించాయి. ఈ శతాబ్దిలో సుమారు వందమంది నాటకరచయితలు తమ నాటక రచనలతో అమెరికా నాటకరంగాన్ని సుసంపన్నం చేశారు. వారిలో నీల్ సైమన్, డేవిడ్ రబి, అర్థర్ కోపిట్, షామ్ షెపార్డ్, బెర్నార్డ్ స్లేడ్, థామస్ హెగ్గిన్, విలియమ్ సరోయన్, షేర్‌వుడ్ ఆండర్సన్ తదితరులు పేర్కొనదగిన రచయితలు.

*నీల్ సైమన్* (1927) 1961లో రచయితగా రంగ ప్రవేశం చేసి సుమారు 25 నాటకాలు రచించాడు. తన నాటకాల్లో హాస్యం అంతర్లీనంగా ఉండడం చేత రంగస్థలం మీద బాగా రాణించాయి. కనక వస్తు వాహనాల సంపాదన కోసం మధ్య తరగతిపడే తపన ఈయన నాటకాల్లో గోచరిస్తుంది.

*కమ్ బ్లో యువర్ హారన్* (1961), *ఆడ్ కపుల్* (1965), *చాప్టర్ టు* (1977), *నీల్‌సైమన్‌*కు పేరు తెచ్చిన నాటకాలు. డేవిడ్ రబి(1940) వియత్నామ్ యుద్ధ సంబంధిత నాటకాలను రచించాడు. హింస, జాతిద్వేషం, అసంగత వీరోచిత కార్యాలు ఈయన రచనల్లో పుష్కలంగా ఉంటాయి. కుటుంబ సమస్యలతో కూడిన *స్టిక్స్ అండ్ బోన్స్* (1971), *స్ట్రీమర్స్* (1976) అనే నాటకాలు రబికి పేరు తెచ్చిపెట్టాయి. ఆర్థర్ కోపిట్ నాటకాలు పరిశోధనాత్మకంగా ఉంటాయి. *వింగ్స్* (1978), *ది ఎండ్ ఆఫ్ ది వరల్డ్* (1984) ఈయన ప్రసిద్ధ నాటకాలు.

ప్రయోగాత్మక నాటకాలపై అత్యుత్సాహం చూపే నాటక సమాజాల ధోరణి వెర్రితలలు వేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. 1968లో బ్రాడ్‌వే ఆధ్వర్యంలో *హేర్* అనే నాటకం సభ్యతాపరిధుల్ని అధిగమిస్తూ న్యూయార్క్‌లో ప్రదర్శితమైంది. ఆ ప్రదర్శనలో నటీనటులు వివస్త్రలై నటించడం, రంగస్థలంపై అసభ్య పదజాలం ఉపయోగించడం సభ్యప్రపంచానికి జుగుప్సావహంగా తోచింది. ప్రజాభిప్రాయాన్ని మన్నించి ఆ నాటకాన్ని విరమించుకోక తప్పింది కాదు. ఈ హేర్ నాటకాన్ని ఇతరదేశాల్లో కూడా ప్రదర్శించబడటం జరిగింది. *చే, ఓహ్ కల్‌కటా* అనే పేర్లతో హేర్ నాటక ధోరణిలో కొద్దిగా చేర్పులు మార్పులతో మరో రెండు నాటకాలు కూడా 1970 లో ప్రదర్శితమయ్యాయని తెలుస్తోంది.

**బ్లాక్ థియేటర్:** నల్లజాతి నాటకరంగం. నీగ్రోలు బానిసత్వం నుంచి విముక్తి పొందిన తరువాత తమదైన



**స్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైర్ నాటకంలో ఒక దృశ్యం**

సంస్కృతిని, సాహిత్య కళారూపాలను పరిరక్షించుకోవలసిన అవసరం ఏర్పడింది. అందులో భాగంగానే నాటకరంగం అభివృద్ధి కోసం శ్రద్ధ వహించారు. 1960లో *లీ రాయ్ జోన్స్* తదితరులు కలసి బ్లాక్ ఆర్ట్స్ రిపర్టరీ థియేటర్ స్కూల్ పేరిట న్యూయార్క్‌లో ఒక సంస్థకు అంకురార్పణ చేశారు. ఇది ఎక్కువ కాలం కార్యక్రమాలు నిర్వహించకపోయినా నాటకకళ పట్ల అభిమానాన్ని ప్రోది చేయడంలో ఈ సంస్థ ప్రేరణ కలిగించిందని చెప్పవచ్చు.

1964 నాటికి దేశంలో 40 నల్లజాతి కళాబృందాలు వెలిశాయంటే బ్లాక్ థియేటర్ కృషి వృథాకాలేదని అర్థమవుతుంది. ఆ కళా బృందాలలో *నీగ్రోఎన్‌సెంబుల్ కంపెనీ, ది న్యూ లఫాయెట్ థియేటర్, ది స్పిరిట్ థియేటర్* నాటక రచయితలను, నాటక సమాజాలను ప్రోత్సహించడంలో ప్రధాన పాత్ర వహించాయి. ఈ కళాబృందాల నీడలో అనేక మంది నల్లజాతి నాటకకర్తలు ఎదిగారు.

*లోరైన్ హన్స్‌బెరి* (1930-1965) రాసిన *ఎ రైసిన్ యిన్ ది సన్* నాటకం బహుళ ప్రచారం పొందింది. చికాగో నగరంలో ఒక నల్లజాతి కుటుంబం అహర్నిశలూ చెమటోడ్చి పని చేసినప్పటికీ కష్టాల కడలిలో ఇడుములు పడిన దైన్య జీవితం గురించి హృదయంగమంగా చిత్రించబడింది ఆ నాటకంలో. లీరాయ్ జోన్స్ *ది టాయ్‌లెట్* నాటకం వేర్పాటు వాద ధోరణిలో సాగింది.

*స్లేవ్ షిప్* (1967) అనే నాటకం ఆఫ్రికా నుంచి బానిసలుగా తెచ్చిన నాటి నుంచి అప్పటి వరకు అనుభవించిన బాధల గాథలను సాకల్యంగా వివరిస్తుంది. డగ్లస్ టర్నర్ వార్డ్ రాసిన *డే ఆఫ్ ఆబ్సెన్స్* (1967), *ది రెకనింగ్* (1969), *లోనీఎల్డర్, సర్ మోనీస్ ఇన్ డార్క్ ఓల్డ్‌మెన్* (1969), *లెస్లీలీ ది ఫస్ట్ బ్రీజ్ ఆఫ్ సమ్మర్* (1975) మొదలైన నాటకాలు బ్లాక్ థియేటర్‌లో ప్రసిద్ధి చెందిన నాటకాలు. బ్లాక్ థియేటర్‌ను సంపన్నవంతం చేసిన నాటకరచయితలలో రిచెర్డ్ వెస్లే, మెల్విన్ వాన్ పీబుల్స్, రోనిమిల్నర్, ఒస్సీ డేవిస్, ఆండ్రియన్నీ కెనిడీ, బెన్ కోల్డ్‌వెల్ ముఖ్యులు. జాతుల మధ్య సామరస్యాన్ని కూర్చే దిశలో ఈ నాటకకర్తల కృషి అవిచ్ఛిన్నంగా సాగుతూ ఉంది.

1970 తరువాత వచ్చిన నాటక కర్తలు సృష్టించిన నాటకాలు ఎక్కువ కాలం నిలబడలేకపోతూ, ఒక్కో ప్రాంతానికే పరిమితమవుతున్నాయి. ఎక్కువ ప్రదర్శనలకు నోచుకోవడం లేదు. మారిన ప్రజాభిరుచులు దీనికి కొంతకారణం కావచ్చు. ఓనీల్, మిల్లర్, టెన్నిస్సె నాటకాల్లో ప్రదర్శన విలువలతో పాటు సాహిత్య విలువలు నిక్షిప్తమై ఉండేవి. నేటి నాటకాల్లో ముఖ్యంగా ప్రయోగాత్మక నాటకాల్లో ప్రదర్శన విలువలకే పెద్ద పీట, సాహిత్య విలువలు మృగ్యం. సమకాలీన నాటకకర్తల రచనల్లో *లైటర్ వీన్* లోరాసే ధోరణి ప్రస్ఫుటమవుతోంది.

ప్రస్తుతం మ్యూజికల్ కామెడీలకే అగ్రతాంబూలం లభిస్తోంది. షేక్స్‌పియర్, ఇబ్సన్, మోలియర్, బెర్టోల్డ్ బ్రెష్ట్, పింటర్, షా వంటి విదేశీయ నాటకకర్తల రచనలు అమెరికాలో ఇంకా ఆదరింపబడుతూ ఉన్నాయి.

అమెరికాలో ఔత్సాహిక నాటకరంగం నామ మాత్రమే. మొదటినుంచీ వృత్తి నాటకరంగమే రాజ్యమేలుతూ ఉంది. ఏది ఏమైనా సమకాలీన అమెరికన్ నాటకరంగం కేవలం వినోద ప్రక్రియలకే ప్రాధాన్యమిచ్చి శాశ్వత విలువలను విస్మరిస్తుంది అన్నది ఒక చేదు నిజం.

**అ**మెరికా నాటకరంగం న్యూయార్క్ బ్రాడ్‌వే నుంచి ప్రారంభమవుతుంది. ఏ నటీనటులయినా బ్రాడ్‌వే (న్యూయార్క్ లో ఒక జిల్లా) లో నటించకుండా హాలివుడ్‌కు చేరుకోలేరు. ఈ నాటక ప్రదర్శనలు మధ్యాహ్నం 2 గం॥ల నుంచి అర్ధరాత్రి వరకూ అనేక థియేటర్లలో జరుగుతూ ఉంటాయి. ప్రవేశ రుసుము 70 డాలర్ల వరకు ఉంటుంది. ఒక్కొక్క నాటకాన్ని తయారు చేయడానికి 10 మిలియన్ల డాలర్లు ఖర్చు అవుతుంది. చాలా నాటకాల స్క్రిప్ట్ నోబుల్ పురస్కారం పొందిన రచయితలచే వ్రాయబడతాయి.



# సి.ఆర్.రెడ్డి సేవలో...

- ఎన్.ఎస్. వెంకట్రామ్

*ఎన్.ఎస్.వెంకట్రామ్ 1949-51 అవధిలో మైసూరు విశ్వవిద్యాలయ ప్రో ఛాన్సలర్‌గా పనిచేసిన డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డి ఆప్త కార్యదర్శి. 1980 నవంబరు-డిసెంబరులో బెంగుళూరు జయనగర్‌లోని దీపక్ నర్సింగ్‌హోమ్‌లో వెంకట్రామ్ భార్య కొనవూపిరిలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో డెభైఏడేళ్ల వెంకట్రామ్ నాతో సి.ఆర్.రెడ్డిగారి గురించి ఎంతో గౌరవ మర్యాదలతో, భావోద్వేగంతో మాట్లాడారు. రెడ్డితో తన పరిచయం గురించి వ్యాసం పంపేస్థితిలో లేనని కాలం కలిసి వస్తే తప్పకుండా పంపుతానని వాగ్దానం చేశారు. బహుశా నేనాయన్ను కలిసిన రెండో, మూడో రోజున ఆయన భార్య మరణించారు. ఎన్.ఎస్.వెంకట్రామ్ హైద్రాబాద్ నుండి జనవరి 1981లో నాకు స్వయానా టైపు చేసి పంపిన ఇంగ్లీషు వ్యాసానికి ఇది అనువాదం.*

---

**1911** నాటిమాట. బహుశా నాకు అప్పుడు ఏడెనిమిదేళ్లు వుండొచ్చు. వేసవి సెలవులు. మేమప్పుడు నేటి కర్నాటక రాష్ట్రంలోని శివమొగ్గలో వుండేవాళ్ళం. మా అన్న అప్పుడు మైసూరు మహారాజా కాలేజీలో చదువుతుండే వాడు. అతనితో పాటే శివమొగ్గలోని నలుగురైదుగురు యువకులు అదే కాలేజీలో చదువుతుండే వుండేవాళ్లు. వేసవి సెలవులకని అందరూ శివమొగ్గ కొచ్చారు.

సాయంకాలం పూట వాళ్లందరు వూరిబయట షికారు కని వెళ్లేవాళ్లు వెంట నన్నూ తీసుకెళ్లమని బతిమాలేవాణ్ణి. అప్పుడప్పుడు మా అన్న నన్నూ తన స్నేహితులతో పాటు షికారుకు తీసుకెళ్లేవాడు. వాళ్ల సంభాషణలు ఎక్కువగా మైసూరు మహారాజా కాలేజి గురించి, అక్కడ పాఠాలు చెప్పే ప్రొఫెసర్ల గురించి వుండేవి. వాళ్ల మాటలు ఇంగ్లీషు, కన్నడ భాషల కలగాపులగంగా వుండేవి.

నాకు వాళ్లమాటల్లో 'రెడ్డి' అన్న పదం తరచుగా వినపడేది. *రెడ్డి హాగె ఇన్నొబ్బ ప్రొఫెసర్ ఇల్లయ్య* (రెడ్డిలాగా మరో ప్రొఫెసరు లేడోయ్) *ప్రొఫెసర్ ఆద్రు ప్రొఫెసర్ హాగె కాణొల్ల* (ప్రొఫెసరు అయినా ప్రొఫెసరులాగా వుండడు) వాళ్లమాటల బట్టి వాళ్ల ప్రొఫెసరు బుగ్గమాసాలతో, చారల సూటులో డాబుగా దర్పంగా వుంటాడని నా కల్పన. ప్రపంచజ్ఞానం ఏ కోశానా లేని వయస్సునాది. 'రెడ్డి' అంటే సి.ఆర్.రెడ్డి అనీ, ఆయన పేరుమోసిన ఆచార్యుడనీ, జగమెరిగిన విద్యావేత్త అని తెలుసుకోవటానికి నాకు చాలా ఏళ్లే పట్టాయి. మా అన్న స్నేహితుల మాటల ద్వారా నా కప్పుడు రెడ్డిగారి గురించి తెలిసిన సంగతులవి. సి.ఆర్. రెడ్డిగారు నవ్వుమొగంతో గబగబా నడుస్తూ, దూసుకు పోతూ క్లాసురూములో ప్రవేశించేవారు.

విద్యార్థులు రెడ్డిగారు క్లాసు రూములోకి ఎప్పుడు వస్తారా అని కాచుకు కూర్చొనే వారు. తరగతి గది నిండుగా వుండేది. ఇతర తరగతి విద్యార్థులు కూడా వచ్చి కూర్చునే వారు. గంటసేపు ఇట్టే గడిచిపొయ్యేది. అప్పుడే గంట గడిచిందా అని విద్యార్థులు ఆశ్చర్యపొయ్యేవారు.

రెడ్డిగారు పాఠాలు బోధించడంతో పాటు, ఆ విషయాలకు సంబంధించిన విశేషాల్ని ఎంతో ఆసక్తికరంగా చెప్పేవారు. ఆయన ఓ విజ్ఞాన సర్వస్వంలా తోచేవారు. విద్యార్థులందరూ ఆయన పాఠాలు చెవులు రిక్కించి వినేవారు. పాఠం మధ్య ఆయన వేసే ఛలోక్తులు విని విద్యార్థులు హాలు దద్దరిల్లేలా నవ్వేవారు. అప్పుడప్పుడూ ఆయన విసిరే వ్యంగ్య బాణాలు మొద్దుదద్దమ్మల్ని ఉలిక్కి పడేలా చేసేవి. మా అన్న, ఆయన మిత్రుల సంభాషణల్లో పదేపదే ప్రస్తావించబడే ఆ

---

ఆంగ్లం నుంచి అనువాదం - ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, ఫోన్: 9964082076

'రెడ్డి'గారిని చూసే భాగ్యం, ప్రత్యక్షంగా కలుసుకొని మాట్లాడే అదృష్టం నాకు ఇన్నేళ్ల తర్వాత కాని దొరికింది కాదు. 1949వ సంవత్సరం నేను చాలా ఏళ్లు మైసూరు ప్రభుత్వ పాఠశాలల్లో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పనిచేసి, బెంగుళూరులోని డి.పి.ఐ (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్స్) కార్యాలయంలో డెప్యుటేషన్ మీద పనిచేస్తున్నాను. ఓ రోజు డైరెక్టరుగారు నన్ను పిలిపించి *నీవు రేపు ఉదయం డా.సి.ఆర్. రెడ్డిగారిని కలుస్తావా?* అని అడిగారు. నేను ముందు వెనుకలు ఆలోచించ కుండా సరే అని తలవూపాను.

*డా.సి.ఆర్ రెడ్డిగారు రిచ్‌మండ్ హౌస్‌లో వుంటున్నారు. ఆయన గొప్ప మేధావి, పరిపాలనాదక్షుడు. నిఖార్సయిన వ్యక్తి. ఆయన అంచనాలకు నీవు సరిపోతావని నేనే నిన్ను సిఫారసు చేశాను చూద్దాం* అన్నారు డైరెక్టరుగారు.

అప్పుడు మైసూరు రాష్ట్ర ముఖ్యమంత్రి క్యాసంబళ్లి చెంగలరాయరెడ్డి. ఆయన, సి.ఆర్ రెడ్డి మైసూరు మహారాజా కాలేజిలో ప్రొఫెసరుగా వున్నప్పుడు, వారి శిష్యులు. మైసూరు రాష్ట్ర విద్యావిధానంలో మార్పులు తీసుకురావాలని, రాష్ట్రాన్ని ఆదర్శవిద్యాకేంద్రంగా తీర్చిదిద్దాలన్న మహదాశయంతో ముఖ్యమంత్రి డా.సి.ఆర్ రెడ్డిని బెంగుళూరు రప్పించారు. విద్యావిధాన సంస్కరణా సమితి – ఏకసభ్య సమితికి డా.సి.ఆర్. రెడ్డిగారే అధ్యక్షులు. ఆయనకు చేదోడువాదోడుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు సి.డి.ఎస్. చెట్టి కార్యదర్శిగా వచ్చారు. ఇదీ కథ.

డైరెక్టరుగారి ఆదేశం మేరకు నేను మరుసటి రోజు పొద్దున డా.సి.ఆర్. రెడ్డిగారున్న రిచ్‌మండ్ హౌస్‌కు వెళ్లి ఆయన ఆఫీసు గది తలుపు తట్టాను. *కమిన్ వెంకటరాం* అన్న గంభీరస్వరం వినపడింది. డా.సి.ఆర్. రెడ్డిగారు నన్ను పేరుపెట్టి పిలవడంతో ఆయన ఆత్మీయతకు సంతోషించి, ధైర్యంతో గదిలో ప్రవేశించాను. నా చిన్నప్పుడు – అంటే దాదాపు నలభయ్యేళ్ల క్రితం నేనూహించిన రీతికి భిన్నంగా కనపడ్డారు డా.సి.ఆర్.రెడ్డిగారు. నా గురించి కుశలప్రశ్నలు వేశారు. నాలో వున్న సిగ్గు, బిడియం, భయం అన్నీ తగ్గిపోయాయి. కాస్సేపటి తర్వాత ఆయన ముగ్గులోకి దిగారు. *ఇప్పుడున్న సెంకడరీ పాఠశాల విద్యాప్రణాళిక ఎలా వుందంటావ్?* ఆయన సూటిగా ప్రశ్నించారు. ఆయన నాద్వారా విషయాలు సేకరించాలనుకొంటున్నారా లేదా నా తెలివితేటల్ని పరీక్షించదలుచుకొన్నారా అన్న విచికిత్స కలిగింది. ధైర్యం తెచ్చుకొని సార్! ఈ విద్యావిధానం 1937 నాటిది. ఈ కోర్సులో మొదటిభాగంలో ఇంగ్లీషు ప్రధాన భాషగా వుంటుంది. కన్నడం, తెలుగు, సంస్కృతం, ఉర్దూ వీటిలో ఒక భాషను విద్యార్థులు ఎన్నుకోవల్సి వుంటుంది. గణితం, విజ్ఞానం, చరిత్ర, భూగోళం, పర్షియన్, సంస్కృతం మొదలైనవి ఐచ్ఛిక విషయాలుగా వుంటాయి. రెండో భాగంలో వృత్తిపరమైన విషయాలు వుంటాయి – వ్యవసాయం, సెరికల్చర్, ఫౌండ్రి, ఎలెక్ట్రిక్ వైరింగ్, చేనేత, వాణిజ్య శాస్త్రం, టైప్ రైటింగు మొదలైనవి. *ఓహ్! బాగుంది కాని ఈ వృత్తిపరమైన కోర్సులు చదివేవారు ఎంతమంది? ఈ కోర్సులు ఎన్ని పాఠశాలల్లో బోధింపబడుతున్నాయి?*

*ఈ కోర్సుల్ని చదివే విద్యార్థులు చాల తక్కువ మంది వున్నారని, మైసూర్ సంస్థానం మొత్తంలో ఒకటో, రెండో పాఠశాలల్లో ఈ కోర్సులున్నాయని* బదులిచ్చాను. ఒక పాఠశాలలో ఈ కోర్సులో కొన్నింటిని చదవాలని విద్యార్థులు చేరితే, బోధనావకాశాలు లేనందువల్ల వాటికి బదులు సంస్కృతం, డ్రాయింగు విషయాలు బోధించాల్సి వచ్చింది. ఓహ్! అంటూ ఓ అరనిముషం తలపట్టుకొన్నారు రెడ్డిగారు.

ఇక్కడి సెకెండరీ విద్యావిధానం ఎంతో వైవిధ్యంతో కూడుకొని వుంది. కాని అదంతా పేపర్ మీదే వుండిపోయింది. మీరంతా కలిసి ప్రణాళికను ఎందుకు అమలు చేయలేకపోయారు? ఓ కొత్త విధానాన్ని తయారు చేస్తారు. దాన్ని అమలు చేయక ముందే మరో ప్రణాళికను సిద్ధం చేస్తారు. ఒట్టి మార్పులు చేస్తూపోతుంటే ప్రగతి సాధించగలమా? విద్య ఎప్పుడూ ఒంటెత్తు పోకడలో సాగకూడదు.

దేశం అభివృద్ధి చెందాలంటే విద్య బహుముఖాలుగా విస్తరించాల్సి వుంటుంది. మైసూరు ప్రభుత్వం నన్ను ప్రస్తుత విద్యావిధానం గురించి ఓ రిపోర్టు ఇమ్మని కోరింది. మూడు ముక్కల్లో చెప్పాలను కొన్నాను – *మొదట మీరు ప్రవేశపెట్టిన ప్రణాళికల్ని త్రికరణశుద్ధిగా అమలు చెయ్యండి. అప్పుడు కాని నన్ను పిలవద్దండీ* రెడ్డిగారి మాటల్లో దృఢనిశ్చయం వ్యక్తమయింది. రెడ్డిగారు నన్ను మరుసటి ఉదయం కలవమన్నారు. అలా మొదలైంది మా ఇద్దరి కలయిక–పరిచయం. ఆయన నన్ను *సహాయకార్యదర్శిగా* పని

చేయమన్నారు. రెడ్డిగారు *ఏక వ్యక్తి సమితి* అయితే ఆంధ్రవిశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రారు సి.డి.ఎస్.చెట్టి కార్యదర్శి. రెడ్డిగారి అధ్యక్షతలో మరి కొంతమంది ప్రముఖులు సభ్యులుగా వుండేవాళ్లు.

– డి.పి.ఐ శ్రీ యమ్. నారాయణరావు, ప్రభుత్వ న్యాయ కళాశాల, ప్రిన్సిపాలు శ్రీ సింగరవేలు మొదలియారు, మైసూరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా.బి.ఎల్. మంజునాథ్. నేను ఆ సమితి సభ్యుణ్ణి కాకున్నా, సమావేశం జరిగేటప్పుడు నన్ను కూడా వుండమనేవారు. అప్పుడప్పుడు మీ అభిప్రాయం ఏమిటంటూ నా వైపు చూసేవారు. చాలా తక్కువ కాలంలో డా.సి.ఆర్ రెడ్డిగారు తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. అంతేకాదు విశ్వవిద్యాలయ నిర్వహణకు సంబంధించిన బిల్లును కూడా ఆయన వివరంగా విశ్వవిద్యాలయ వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం వుండకూడదనీ, అవసరమైన ఆంక్షల్నీ, ఆజ్ఞల్నీ పొందుపరుస్తూ సమర్పించారు.

రెండు మూడు నెలల విరామం తర్వాత డా.సి.ఆర్ రెడ్డిగారు 1949 దసరాసెలవుల్లో మైసూరు విశ్వవిద్యాలయ ప్రోఛాన్స్లర్‌గా బాధ్యత స్వీకరించారు. మైసూరులో *వెస్ట్ లేక్* ఆయన నివాసం, కార్యాలయంగా నేను ఆయన ఆప్త కార్యదర్శిగా బాధ్యత స్వీకరించాను. ఆయన నేతృత్వంలో పనిచేయడం నా జ్ఞానపరిధిని విస్తృతం చేసిందని గట్టిగా చెప్పగలను. ప్రోఛాన్స్లర్ సి.ఆర్.రెడ్డి గారి అధ్యక్షత కింద పనిచేస్తున్న సందర్భంలో ఎంతో మంది ప్రముఖుల పరిచయ భాగ్యం కలిగింది. ఎన్నెన్నో రసవత్తర ఘట్టాలు నడిచాయి. రకరకాల అనుభూతులూ, అనుభవాలూ సిద్ధించాయి. కొన్నింటిని మాత్రం మనవి చేస్తాను.

సి.ఆర్.రెడ్డిగారు డిగ్రీస్థాయిలోనూ, పోస్టుగ్రాడ్యుయేట్ స్థాయిలోనూ, కో ఆపరేటివ్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన విషయాల్ని ప్రవేశపెట్టాలని పాఠ్యక్రమాన్ని సిద్ధపరిచి పంపమని అప్పటి కో ఆపరేటివ్ సొసైటీస్ శాఖ రిజిస్ట్రారైన హిరణ్యయ్యగారిని పురమాయించారు. ఆయన సకాలంలో సిలబస్ పంపారు. ఓ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు రెడ్డిగారిని కలవడానికి సమయం కేటాయించుకొన్నారు. కాని రెడ్డిగారికది భోజనవేళ. కార్యదర్శి సి.డి.ఎస్. చెట్టిగారు ఇంటర్వ్యూ వేళ నిశ్చయించారు. కాబట్టి రెడ్డిగారు మిన్నకుండిపోయ్యారు. 12.45 గంటలైనా హిరణ్యయ్యగారి జాడలేదు. రెడ్డిగారు నన్ను పిలిచి *ఎక్కడయ్యా ఆ హిరణ్యయ్య? అజాపజాలేదు. ఆయన ఓ పెద్దశాఖకు అధ్యక్షుడు కావొచ్చుగాక. ఈ మనిషి ఎవరో కాని విచిత్రంగా వున్నాడే?* అంటూ విసుక్కొన్నారు.

మధ్యాహ్నం 2 గంటలకు వూడిపడ్డాడు హిరణ్యయ్య. ఆ రోజు ఉదయం నంజనగూడులో రాష్ట్ర సహకార సంఘ సమ్మేళనంలో పాల్గొని ఆదరాబాదరా పరిగెత్తుకొచ్చాడు. *నేను చాలా ఆలస్యంగా వచ్చాను. రెడ్డిగారిని చూడటానికి వీలవుతుందా?* బిక్కు బిక్కుమంటూ హిరణ్యయ్య నన్నడిగాడు. రెడ్డిగారు అప్పుడే భోజనం ముగించారు. నేను లోపలికెళ్లి హిరణ్యయ్య వచ్చారని రెడ్డిగారితో చెప్పాను. *ఓహో! ఎట్టకేలకు ఆయనొచ్చారా? లోపలికి రమ్మను* – రెడ్డిగారన్నారు. హిరణ్యయ్య భయం భయంగా లోపలికొచ్చి తన ఆలస్యానికి ఇలా సంజాయిషీ ఇచ్చారు – *నంజనగూడులో జరుగుతున్న రాష్ట్రస్థాయి సహకారసంఘ సమ్మేళనం ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించాల్సిన సహకార శాఖామంత్రి ఉదయం 9.30 గంటలకు రావాల్సి వుంది. కాని ఆయన 12 గంటలకు వచ్చారు. మంత్రిగారు సభముగించి వెళ్లిపోగానే నేను ఆఘమేఘాల మీదుగా మీదగ్గరకు వచ్చాను.*

అప్పుడు డా.సి.ఆర్. రెడ్డిగారు తాపీగా హిరణ్యయ్యా! *అందులో నీ తప్పేమీలేదు మంత్రిగారు సమావేశానికి ఆలస్యంగా వచ్చారు. పాపం! ఆయనేమి చేస్తారు? బెంగుళూరు నుంచి నంజనగూడుకు వచ్చేదారిలో ఆయనకు ప్రజలు అడుగడుగునా ఫిర్యాదులు ఇస్తూ కొందరు, వినతి పత్రాలు సమర్పిస్తూ మరి కొందరు, జేజేలు పలుకుతూ ఇంకొందరు, ఆయన ముఖారవిందాన్ని చూడాలనే ఉబలాటంలో మరి కొంతమంది అడ్డుపడి వుంటారు. ప్చ్! ప్రజాతంత్రం ఇలానే పనిచేస్తుంది మరి!* అన్నారు. డా.రెడ్డిగారు మా ఇద్దర్నీ తేరిపార చూస్తూ *మీ ఇద్దరిలో చాలా పోలికలున్నాయే* అని అన్నారు ఆశ్చర్యంతో.

*'మేమిద్దరం అన్నదమ్ములం'* అన్నారు హిరణ్యయ్య రెడ్డిగారు నావైపు తిరిగి *ఆ మాట నాతో ముందే చెప్పి ఏడవొచ్చుగా!* రెడ్డిగారు గట్టిగా అన్నారు. మేం ఇద్దరం చిరునవ్వు నవ్వి మిన్నకుండిపోయ్యాం. ఓ రోజు ఓ మర్యాదస్తుడైన పెద్దమనిషి, సంస్కృతం పండితుడు

డా. రెడ్డిగారిని చూడ్డానికొచ్చారు. ఇద్దరూ ఓ గంటసేపు ముచ్చటించుకొన్నారు. తర్వాత రెడ్డిగారు తన కారు డ్రైవర్ని పిలిచి, ఆ పెద్దమనిషిని ఇంటి దగ్గర వదిలిపెట్టి రమ్మని చెప్పారు. అలాగే తోడుగా నన్నుకూడా వెళ్లమన్నారు. నేను తలవూపి ఆ పండితుల వారిని, వారి ఇంటి దగ్గర వదిలిపెట్టి వచ్చాను. తిరిగొచ్చిన నాతో రెడ్డిగారిలా అన్నారు – *డ్రైవరుండగా మిమ్మల్ని ఆ పెద్దమనిషి వెంట వెళ్లమని చెప్పినందుకు మీరేమీ అనుకోలేదు కదా?* రెడ్డిగారు వెంటనే ఇలా అన్నారు.

*శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానకవి అల్లసాని పెద్దన. ఆయన షష్టిపూర్తి దగ్గర కొచ్చింది కాని శ్రీ కృష్ణదేవరాయల ప్రభుత్వ యంత్రాంగం షష్టిపూర్తి ఉత్సవాలు జరుపలేదు. అల్లసాని పెద్దన* ***ఆంధ్రకవితాపితామహులు*** *కదా! ఆయన పట్ల ప్రజలు ఎలాంటి గౌరవాదరాలు ప్రదర్శిస్తారో చూద్దామన్న కుతూహలం రాయలవారికి కలిగింది.*

*విజయనగర ప్రజలు తమ తాహతు కొద్దీ అల్లసాని పెద్దనగారి షష్టిపూర్తి మహోత్సవం జరిపారు. నగరవీధుల వెంట ఆయన్ను పల్లకీలో కూర్చుండపెట్టి ప్రజలే ఆ పల్లకిని తమ భుజాల మీదుగా మోశారు. రాజభవనం ముందు ఆ పల్లకి ఆగింది. అప్పుడు రాయలవారు తామే స్వయంగా వెళ్లి, ఆ పల్లకీని కొంతదూరం మోసి పెద్దనగారి పట్ల తమ గౌరవాన్ని ప్రదర్శించారు. చక్రవర్తి గారేమిటి? ఒక కవిగారి పల్లకీని మోయడమేమిటి?* రాయల కొలువు లోని కొంతమంది ప్రముఖులు ముక్కు మీద వేలేసు కొన్నారు. అప్పుడు రాయలవారు ఆ ప్రముఖులతో ఇలా అన్నారు – *చదువుల తల్లి సరస్వతి పెద్దనగారి గుండెల్లో కొలువు తీరింది. నేను మోసింది ఆ తల్లి కొలువున్న పల్లకీనే! వెంకట్రావ్* (ఈ వ్యాస రచయిత) *నీవు ఓ మహాపండితుని ఇంటి దగ్గర దిగపెట్టి పుణ్యం కట్టుకొన్నావు* – డా. రెడ్డిగారి పెదవులపై సంతృప్తి సూచకమైన చిరునవ్వు మొలిచింది.

రెడ్డిగారు ఆవయస్సులో కూడా (70 ఏళ్ల) తెగ చదివేవారు. ఆయన మంచం మీద పడుకొని లేదా బళ్లల్లో ప్రయాణిస్తూన్నప్పుడు ఏదో ఓ మంచి పుస్తకం చదువుతూ, మధ్య మధ్య పుస్తకం మడిచిపెట్టి ఆలోచిస్తూ వుండేవారు. ఆయన గొప్ప చదువరి, మరీ చెప్పాలంటే అంతకంటే గొప్ప చింతనశీలుడు. ఓరోజు ఆయన నన్ను యూనివర్శిటీ లైబ్రరీ నుంచి ఏవైనా మూడునాలుగు మంచి పుస్తకాలు తీసుకు రమ్మన్నారు. *ఆధునిక రచయితల పుస్తకాలు ఏవైనా తెమ్మంటారా?* – అని అడిగాను. *ఒద్దొద్దు నేను చదివిన పాతపుస్తకాలు, మరీ మరీ చదవాలనిపించే పాతపుస్తకాలే తీసుకురండి – గిబ్బన్ రచనలు... అలాంటివి.* గిబ్బన్ రాసిన *రోమన్ సామ్రాజ్య ఉదయాస్తమానాలు* అలాంటి మరికొన్ని క్లాసిక్ పుస్తకాలు తెచ్చిచ్చాను. *మీరు గిబ్బన్‌ను చదవాలండీ. మీచేతుల్లో వున్నది అచ్చుయిన పుస్తకం కావొచ్చు. కాని అది చదువుతూంటే మీ కళ్ల ముందు రోమను సామ్రాజ్య గత వైభవం కళ్లకు కట్టినట్లవుతుంది. రణరంగంలో వురుకుతున్న గుర్రపు డెక్కల చప్పుడు, ఖడ్గాల ఝణఝణలు, భేరీల ధమధమలు, వీరుల సింహనాదాలు, నేల కొరుగుతున్న సైనికుల ఆర్తనాదాలు అబ్బ!... వొళ్లు ఝల్లు మనిపిస్తుంది.*

*మీ చేతుల్లో వున్నది ఓ చరిత్ర పుస్తకం కాదు. ... మీ కళ్లముందు ఓ ఘనమైన, వైభవోపేతమైన సామ్రాజ్యం నాట్యమాడుతుంది. ఏ కొద్దిమంది ఆధునిక రచయితలో అలాంటి గొప్ప పుస్తకం రాయగలరు.* రెడ్డిగారు ఒళ్లు మరిచి పోయారు.

మా మామగారు అప్పటి మైసూరు సంస్థానపు దివాను. మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారి ఆంతరంగిక కార్యదర్శిగా వుండేవారు. సి.ఆర్.రెడ్డిగారు అప్పట్లో మైసూరు ప్రభుత్వ విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్ (1918–21)గా పని చేస్తూవుండేవారు. ఆ అవధిలో ఎంతో మంది మేధావులు, పండితులు, కళాకారులు, రాజకీయ నాయకులు రెడ్డిగారిని కలిసేందుకు వచ్చేవారు. రెడ్డిగారు గొప్ప స్నేహశీలి, మాటకారి, సంభాషణా చతురులు, వక్త. ఎంతమంది మధ్య వున్నా సరే, తమ మేధాబలం వల్ల, హాస్య చతురత వల్ల చుక్కల్లో చంద్రునిలా వెలుగుతుండేవారు.

ఓ సారి రెడ్డిగారు బెంగుళూరు మెడికల్ కాలేజికి వెళ్లారు. ఆయన అకస్మాత్తుగా, చెప్పా పెట్టకుండా నేరుగా ప్రిన్సిపాలు గదికి వెళ్లారు. కొద్ది సేపట్లోనే అక్కడి ప్రొఫెసర్లను, యువ లెక్చరర్లను, విద్యార్థుల్ని కలిసి వారితో సంభాషించారు. రెడ్డిగారు ఎంతో ఉత్సాహంగా, హుందాగా కనిపించారు. తర్వాత కారెక్కి వీడ్కోలు చెప్పే సమయంలో విద్యార్థి సంఘం కార్యదర్శి 'విజిటర్స్ బుక్' తెచ్చి, డా.రెడ్డిగారిని తమ అభిప్రాయం రాయమన్నారు. అప్పుడు రెడ్డిగారు తమ

అభిప్రాయం రాయడానికిగాను పెన్నుకోసం కోటుజేబులు తడుముకొన్నారు. అప్పుడు అక్కడే నిలబడివున్న డా.శేషాచలం బంగారు పాళీవున్న తళతళా మెరిసే పెన్ను రెడ్డిగారి చేతి కందించారు. రెడ్డిగారు సంతకం చేసిన తర్వాత డా.శేషాచలం తన పెన్ను వాపసు తీసుకోవడానికని చెయ్యి ముందుకు చాచాడు.

అప్పుడు డా.రెడ్డిగారు చిరునవ్వు ఒలికిస్తూ, *శేషాచలం! రాయడానికని ఎవ్వరైనా పెద్దలకు పెన్ను ఇస్తే, దాన్ని వాపసు చెయ్యమని అడగరు కదా?* అన్నారు. అప్పుడు డా.శేషాచలం *మీవంటి మహనీయులు వాడిన పెన్నును మీ జ్ఞాపకార్థంగా వుంచుకోవడం నా అదృష్టంగా భావిస్తాను సార్.* రెడ్డిగారు బిగ్గరగా నవ్వి ఆ పెన్ను శేషాచలంకు వాపసు చేశారు. కారు కదుల్తుండగా రెడ్డిగారు నాతో ఇలా అన్నారు – *వెంకట్రామ్, మాటకారితనంలో నన్ను మించినవారు ఎవ్వరూ లేరని నేను లోలోన గర్వపడుతుంటాను. కాని ఈసారి డా. శేషాచలం నన్ను ఓడించివేశాడు* అంటూ డా.రెడ్డిగారు బిగ్గరగా నవ్వారు. రెడ్డిగారికి తన సంభాషణా చాతుర్యంతో ఎంతో ధీమా. కాని ఎప్పుడైనా ఎవరయినా తన్ను ఓడిస్తే, మరింతగా సంతోషించేవారు.

రెడ్డిగారికి విశ్వవిద్యాలయం ఆశయాలపట్ల, కార్యనిర్వహణపట్ల ప్రత్యేకమైన అభిప్రాయాలుండేవి. విశ్వవిద్యాలయం పాఠ్య ప్రవచనాలు, పరిశోధనలు, పరీక్షలు నడపడంతో పాటు చుట్టు పక్కల వున్న పరిసరాల్ని, వ్యవసాయాన్ని, పరిశ్రమలను, సంస్కృతిని ప్రతిబింబించాలనీ, పరిరక్షించాలనీ విశ్వసించారు. ఓ రోజు నన్ను పిలిచి, బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం గురించి 'నోట్సు' సిద్ధం చెయ్యమని చెప్పారు. నేను కొద్దిరోజులు కష్టపడి నోట్సు తయారు చేసి రెడ్డిగారి ముందుంచాను. నానోట్సు ఇలా ప్రారంభమవుతుంది. "The University of Birmingham is part and parcel of the industrial life around." "Part and parcel! is this English, your English? well, your are just a High School chap boy!" రెడ్డిగారు నా మీద విరుచుకు పడ్డారు.

రెడ్డిగారి మాటలు నన్ను కలవరపెట్టలేదు. నాకు అవమానాకరంగానూ తోచలేదు. ఎందుకంటే రెడ్డిగారి మాటల్లో క్షణికఆవేశం తప్ప, ఇతరుల్ని బాధపెట్టే తత్త్వం వుండదన్న సంగతి నాకు బాగా అనుభవమే. *సార్, కొంచెం ఫుట్‌నోట్ వైపు చూడండి అవి నా మాటలు కావు. బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సర్ జాన్ ప్రీస్ట్‌లీ గారి మాటలు. ఆయన నిఖార్సయిన ఆంగ్లేయుడు.* అప్పుడు రెడ్డిగారు తొణకకుండా ఆఁ, అది సర్ జాన్ ప్రీస్ట్‌లీ గారి ఇంగ్లీషు కావచ్చు. కాని నేను రాసేది విక్టోరియన్ మధ్య యుగం నాటి ఇంగ్లీషు, కాదంటే కాస్త దాని కంటే మునుపటిది.

రెడ్డిగారు ఉపన్యాసాలివ్వడంలో కాని, స్నేహితులతో మాట్లాడటంలో కాని, చర్చల్లో కాని, వాద వివాదాలు చేసేటప్పుడు కానీ ఎంతో ప్రతిభను ప్రదర్శించేవారు. అలాంటి సమయాల్లో, సందర్భాల్లో ఆయన హాస్య, వ్యంగ్యోక్తులు మబ్బుల్లో మెరుపుతీగల్లా మెరిసేవి. చాలా చాలా సందర్భాల్లో ఆయనదే పై చెయ్యిగా వుండేది.

రెడ్డిగారు మైసూరు ప్రభుత్వానికి విశ్వవిద్యాలయం గురించి సమర్పించిన నివేదిక గురించి రెండు మూడు నెలలైనా ఆయనకు దాని గురించి ఎలాంటి సమాధానం రాలేదు. రెడ్డిగారికి చిరాకుకలిగింది. ఆయన ప్రభుత్వపు నత్తనడక కార్యాచరణ గురించి విసుక్కోసాగారు. అప్పుడప్పుడే వార్తా పత్రికల్లో మైసూరు విశ్వవిద్యాలయానికి ఓ వైస్ ఛాన్సలర్, ఓ ఛాన్సలర్ (గవర్నరు) వుండగా కొత్తగా ప్రో వైస్ ఛాన్సలర్ పదవి కల్పించడమేమిటి? అంటూ వూహాగానాలు వెలువడు తున్నాయి. వాతావరణం వేడెక్కసాగింది. ఓ రోజు లెఫ్టినెంట్ కల్నల్ క్రాఫర్డు మైసూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. బి.ఎల్. మంజునాథ్ గారిని, ప్రో ఛాన్సలర్ సి.ఆర్.రెడ్డిని, మరో ఇద్దరు ముగ్గురు విద్యావేత్తల్ని తేనీటి విందుకు ఆహ్వానించారు.

రెడ్డిగారు నన్ను కూడా తమ వెంట తీసు కెళ్లారు. తేనీరు తాగుతూ క్రాఫర్డు దొరగారు *రెడ్డిగారూ! వైస్ ఛాన్సలర్‌కు, ప్రో ఛాన్సలర్‌కు ఏమైనా వ్యత్యాసముందా?* అని అడిగారు. రెడ్డిగారు కాస్సేపు మాట్లాడలేదు. తర్వాత వైస్ ఛాన్సలర్ భుజంమీద చెయ్యివేస్తూ ఇలా అన్నారు– *మేమిద్దరమూ పొడుగర్లు కాం. కాని నా మిత్రుని కంటె – వైస్ ఛాన్సలర్ వైపు చూపిస్తూ, నేను కాసింత పొడవైన వాణ్ణి. మాఇద్దరి మధ్య భేదమింతే.* తర్వాత వాళ్ల సంభాషణ వేరే విషయాలవైపు మళ్లింది.

రెడ్డిగారి రాతలు సంక్షిప్తంగా, తప్పులు లేకుండా వుండేవి. ఆయన శైలి గంభీరంగా, హుందాగా అయితే సరళంగా వుండేది. ఆయన చాలామటుకు డిక్టేట్ చేసేవారు. ఆ డిక్టేషన్‌ను టైప్ చేసి ఆయనకు చూపిస్తే, అందులో ఆయన సవరణలు, కొట్టివేతలు చాలా తక్కువగా వుండేవి. *ఉత్తమమైన రచనలో ఎన్ని పదాలు వున్నాయన్నది ముఖ్యమైన విషయంలో కాదు; తీసివేయదగ్గవి ఎన్ని తక్కువ పదాలు వుంటే అది అంత ఉత్తమమైన రచన అవుతుందని* ఆయన నాతో అనేవారు.

ఐక్యరాజ్యసమితికి సంబంధించిన ఓ ఆంగ్ల సంస్థ ఆధ్వర్యంలో మైసూరులోని జగన్మోహన ప్యాలెస్‌లో మైసూరు మహారాజు శ్రీ జయచామరాజ ఒడయరు గారి ద్వారా ప్రారంభించబడే ఓ అంతర్జాతీయ సమావేశం జరిగింది. ఆ ప్రారంభోత్సవ ఉపన్యాసాన్ని రెడ్డిగారే రాశారో లేదా ఆయన ద్వారా సవరణకై పంపాలో నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. మొత్తం మీద ఆ ఉపన్యాసం మా ఆఫీసులో టైపు చెయ్యబడిందన్న మాట మాత్రం సత్యం. నాకాసంగతి తెలియదు. కాని ఆ టైపు కాపీని మాత్రం కాకతాళీయంగా నేను చూడటం తటస్థించింది. ఆ ఉపన్యాసంలో ఓ చోట ఓ చిన్న తప్పు దొర్లినట్లు నాకనిపించింది. కాని అది తప్పో కాదో అన్న విచికిత్స కలిగి మిన్నకుండిపోయాను. మరుసటి రోజు పొద్దున రెడ్డిగారిని చూడటానికి వెళ్లాను. ఆయన వెస్ట్ లేక్ మైదానంలో నడుస్తున్నారు.

*మీరు డ్రాఫ్ట్ కాపీ టైపు ప్రతి చూశారా?* రెడ్డిగారు నన్ను ప్రశ్నించారు. పూర్వాపరాలు తెలుపకుండా అడిగిన ఆ ప్రశ్నకు నేను వెంటనే బదులివ్వలేదు. *బహుశా మీకు తెలిసుండకపోవచ్చు. అయినా మీరు సొంత బుద్ధితో ఏపనీ చెయ్యరుగా! చెప్పితే కాని చెయ్యరు. ప్చ్!* పెదవి విరిచారు రెడ్డిగారు. *నేను ఆ టైపు ప్రతి చదివాను సార్!* – నేను మెల్లగా అన్నాను. *అలాగా! ఆ కాపీ ఎలా వుందంటారు? మీ అభిప్రాయ మేమిటి?* – రెడ్డిగారు కుతూహలం కనపరిచారు.

*నేనేం చెప్పగలను సార్! కాపీ బాగుంది. కాని ఓ చిన్న పొరపాటు దొర్లిందేమో అని నా అనుమానం* – మెలమెల్లగా నేనన్నాను. *ఏంటా పొరపాటు?* జిజ్ఞాస చూపించారు రెడ్డిగారు. అప్పుడు నేనిలా చెప్పాను. *As war begins in the minds of men, so too peace must begin in the minds of men.* *అన్న సూక్తి రూజ్‌వెల్ట్ చెప్పారని వుంది. కాని ఆ మాటలన్నది బ్రిటన్ ప్రధానమంత్రి అట్లీ కదా? అదే నా కొచ్చిన అనుమానం. మొదటే ఆ మాట చెప్పి ఎందుకేడ్వలేదు?* రెడ్డిగారు కాస్త గట్టిగా అన్నారు.

*ఆ ఉపన్యాసం నిన్న సాయంకాలం టైపయింది. ఇప్పుడింకా ఉదయం తొమ్మిదిగంటలు కూడా కాలేదు. పైగా నా ఊహ నిజమో కాదో అన్న అనుమానం నాకింకా పోలేదు.* – నేను నసిగాను. *మరి, ఆ అనుమానమేదో కాస్తా తీర్చుకురండి త్వరగా వెళ్లండి* – రెడ్డిగారు నన్ను పురమాయించారు. ఆ సూక్తిని చదివిన పుస్తకం పేరు జ్ఞప్తి కొచ్చింది. నేను మైసూరు యూనివర్సిటీ లైబ్రరీకి వెళ్లి ఆ పుస్తకం చదివి ఆసూక్తి అట్లీ గారిదే అన్న నిర్ణయానికి వచ్చి, రెడ్డి గారికి ఆ విషయం చెప్పాను. అప్పుడు రెడ్డిగారు వెంటనే మహారాజావారి ఆంతరంగిక కార్యదర్శి షఫీ దొర సాహెబ్ గారికి ఫోన్ చేసి ఇలా చెప్పారు.

*షఫీ గారూ ! మహారాజా వారి ఉన్యాసంలో రూజ్‌వెల్ట్ అన్నారు అన్న మాటలస్థానంలో అట్లీ అన్నారు అని తప్పుదిద్ది అచ్చువేయించండి. ఇది చాలా జరూరు.* కాని షఫీగారు ఫోనులో *సార్! ఆ ఉపన్యాసం అచ్చయిన ప్రతులు నాటేబుల్ మీదున్నాయి. ఇప్పుడు మధ్యాహ్నం. 12 గంటలు. సాయంకాలం 4 గంటలకు మహారాజావారు ఆ ఉపన్యాసం చదవాలి.*

*ఆ తప్పును సవరించేంత వ్యవధి లేదు* అని అన్నారు. *మహారాజావారి ఉపన్యాసంలో ఎంత చిన్న పొరపాట్లయినా సరే, వుండటానికి వీల్లేదు. మీరు వెంటనే ఆ ప్రతులు ప్రెస్సుకు పంపించి, ఆ తప్పును సవరించి పెట్టండి* అని రెడ్డిగారు చెప్పారు. ఆ కొద్ది సమయంలోనే సవరణ జరిగింది. సరికొత్త ప్రతులు సిద్ధమయ్యాయి. ఆ సమావేశంలో పాల్గొన్న సి.ఆర్ రెడ్డిగారు. ఎంతో సంతోషించారు. సమావేశం నుంచి రాగానే నన్ను ఇంటికి పిలిపించుకొని ఆనందంతో *వెంకట్రామ్ మీరు చేసిన సాయం చిన్నదేమీ కాదు. మీకు నేనెంతో రుణపడివున్నాను. కృతజ్ఞతలు. రేపు మీరు ఆఫీసుకి రావాల్సిన అవసరం లేదు. సెలవు తీసుకోండి.* అని చెప్పారు. గురువుగారు శిష్యుని అభినందించినట్లు నాకు అనిపించింది. రెడ్డిగారి హృదయవైశాల్యం అలాంటిది.

*మిగిలింది 46వ పుటలో....*

# అట్టమీద బొమ్మలు

**అట్టమీద బొమ్మ :** *చిత్రకారుడు* – అడాల్ఫ్ బొగురు



ముగ్ధ మనోహరి



అడాల్ఫ్ బొగురు

బొగురు – Adolphe William Bougureau జర్మన్ అకడమిక్ చిత్రకారుడు (1825–1905)చరిత్ర, ఇతిహాస చిత్రకారునిగా పేరు గాంచినవాడు.

**మూడవ అట్ట :** The bath of Psyche అన్నది 1890లో (ప్రస్తుతం టేట్ గ్యాలరీ, లండన్‌లో ఉంది) వేశాడు. సైకీ గ్రీకు పురాణ సంబంధమైన అందమైన అతివ. ఆమె సౌందర్యానికి అసూయపడిన ఎఫ్రడైట్ తన కొడుకైన Eros (బాల మన్మథు)ని ఆమెను ఎందుకు కొరగాని ఒక వ్యక్తిపై మరులుకొనేలా చూడమని పంపుతుంది. అతను ఆ పని చేయలేకపోయాడు, ఎందుకంటే సైకీ సౌందర్యానికి అతడు దాసుడయ్యాడు కాబట్టి.

ఆంగ్లేయ చిత్రకారుడు, పేరు ప్రఖాతులు గల ఒక డాక్టరు గారి ఏకైక కుమారుడు ఫ్రెడరిక్ లీటన్ 1830–1896. పుట్టింది ఇంగ్లండ్‌లోనయినా పెరిగింది, చదివింది యూరోప్‌లో, అదీ ఒక్కచోట కాదు. బెర్లిన్, మ్యూనిక్, ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ) ఫ్లారెన్స్, రోమ్ (ఇటలీ). చిన్నతనం నుంచీ పూర్వ గ్రీకు, రోమన్ గాథలంటే ఇష్టం. ఆ ఇష్టమే అతన్ని చిత్రకళకు దరి చేర్చింది. 10 సం॥ల పిన్న వయసులోని తనలో మొలకెత్తిన కళాతృష్ణ వటవృక్షంగా పెరగటంతో 17 సం॥ల వయసు వచ్చేసరికి అకడమిక్ చదువును పక్కన బెట్టి– Stadilshes institute లో చేరాడు. వాన్ స్టెనిల్ (Van Stenle) వద్ద శిష్యునిగా చేరాడు ఆ గురువు ప్రభావం అతని మీద ఎంతగానో ఉంది.

1852 సం॥లో రోమ్‌లో నివసిస్తున్నపుడు మొదటిసారిగా వేసిన మెడోనా చిత్రం అతనికి గొప్ప గుర్తింపు తెచ్చింది. ఆ గుర్తింపు ఎంత ఎక్కువంటే అప్పటికే ప్రీ రాఫలైట్ లో ప్రథమ చిత్రకారుడయిన మిలేస్‌తో లండన్ రాయల్ అకాడమీ అధ్యక్ష పదవికి పోటీపడేటంతగా. ఆ తరువాత మాతృభూమికి చేరుకుని అక్కడే స్థిరపడ్డారు. అతని శైలి జర్మనీ దేశ సంబంధి. కానీ కాలం గడిచే కొద్దీ దానిలో క్లాసికల్ భావాలు కలిపి – ఒక ప్రత్యేక శైలిని సృష్టించుకున్నాడు.



స్నిగ్ధ సుకుమారి



ఫ్రెడరిక్ లీటన్

లీటన్ చిత్రాలు వర్ణసముచ్చయానికి, సౌందర్యానికి ప్రతీకలు. 1878వ సంవత్సరంలో రాయల్ అకాడమీ, లండన్‌కు అధ్యక్షునిగా ఎన్నిక కాబడి, అప్పటి ఆచారం ప్రకారం (అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డ వారందరికి) నైట్ హుడ్ పొందాడు. లీటన్ చిత్రాలలో చూపిన ప్రతిభను శిల్పాలలో కూడా చూపించ గలిగాడు.

ఎన్నో దేశాలలో సంచరించాడు, ఎన్నో భాషలు నేర్చుకున్నాడు. బహుముఖ ప్రజ్ఞాశాలి లీటన్. అతను వేసిన చిత్రాలలో ప్రముఖమయిన మరో చిత్రం పావలోవా. ఇది ఆ చిత్రానికి మోడల్‌గా పని చేసిన ఆమె పేరు. (నాలుగో అట్ట)

రెండు, మూడు, నాలుగవ అట్టమీద బొమ్మలు : *చిత్రకారుడు* – ఫ్రెడరిక్ లీటన్




# విశ్వరూపం

*– స్టీఫెన్ హాకింగ్*

విశ్వ విఖ్యాత భౌతిక శాస్త్రజ్ఞుడు, విశ్వావిర్భావ రహస్యాలను శోధిస్తున్న మహామేధావి స్టీఫెన్ హాకింగ్, లెనార్డ్ లోడినౌ (Leonard Mlodinow) సంయుక్త రచన *ది గ్రాండ్ డిజైన్.*

ఈ సృష్టికి మూలమేది? విశ్వాలు ఎలా ఏర్పడ్డాయి? ఈ భూగ్రహం మీద మనమెందుకున్నాం? 'వాస్తవికత' మూల స్వభావమేమిటి? మనలాంటి సంక్లిష్ట జీవుల్ని ప్రకృతి ఎందుకు తయారు చేసింది? ఇన్ని చిక్కుముడుల వెనక దాగిన ***మహా పథకం*** ఏమిటి? ఇలాంటి విషయాల గురించి శాస్త్రీయ వివరణ సాధ్యమా? – స్థూలంగా యిదీ ఈ భౌతిక తాత్త్విక గ్రంథంలో చర్చించిన అంశం.

ఒకప్పుడిలాంటి సమస్యల్ని తాత్త్వికులు పరిశోధించారు. కాని, శాస్త్రీయమైన ఆవిష్కరణల ముందు తాత్త్విక వివరణలు, పేలవంగా నిస్సారంగా కనిపించాయి. అత్యాధునిక పరిశోధనలతో, విశ్వరూపాన్ని గురించిన మన అవగాహనలో మౌలికమైన మార్పు వచ్చింది. ఈ శాస్త్ర ప్రస్థానంలో, ముఖ్యంగా క్వాంటం థీయరీ ఒక మైలురాయి. దీనిని అనేక రకాలుగా సిద్ధాంతీకరించారు. అసలు, క్వాంటం థీయరీ విలక్షణతే అది.

'విశ్వానికి' కూడా ఒకే చరిత్ర, ఒకే వివరణ లేదు. అనేక వివరణలున్నాయి. అంతే కాదు, విశ్వాల సంఖ్య కూడా అనేకం. అనంతం. ఇలా, మాట్లాడుకుంటూ పోతే, సమస్య క్రమంగా జటిలమవుతుంది. ఇంద్రియాలు గ్రహించిన సమాచారాన్ని మన మేధస్సు విశ్లేషించి, భౌతిక ప్రపంచాన్ని గురించి మనకొక రూపం కల్పిస్తుంది. కాని, ఆధునిక భౌతిక శాస్త్రం దీన్ని అంగీకరించదు. ఇంద్రియ జ్ఞానానికి పరిమితులున్నాయి. అది దోషరహితం కాదు. మరి, ఈ బహుళ వాస్తవికతలను అర్థం చేసుకోవటానికి, ఏదీ, యిద మిత్థంగా యింతే అని గిరిగీసుకోకుండా, నిత్యనూతనమైన శాస్త్రజ్ఞానం ఆధారంగా మరో ఆవిష్కరణ జరిగింది. అదే M- థియరీ. *గ్రాండ్ డిజైన్* లోని చర్చ అంతా ఈ సిద్ధాంతం ఆధారంగానే కొనసాగుతుంది.

నిజానికి, మామూలుగా మనం అర్థం చేసుకునే పద్ధతిలో యిది సిద్ధాంతం కాదు. అనేక సిద్ధాంతాలు కలిసిన ఒక నమూనా. వాస్తవికతను, ఒక్కొక్క కోణంలో, ఒకొక్క దశలో, ఒక్కొక్కరు ఒక్కో రకంగా అర్థం చేసుకుంటాం. ఇలాంటి భిన్న వాస్తవికతలను తనలో యిముడ్చుకోగలిగిందే M- థియరీ.

సమగ్రమైన అవగాహన ఎలా అని మాత్రమే కాక, 'ఎందుకు' అనే ప్రశ్నకు కూడా సమాధానం కావాలి.

శూన్యానికి బదులుగా విశ్వమెందుకుంది?

మనమెందుకున్నాం?

మనకు తెలిసిన సిద్ధాంతాలుగాక, యితర సిద్ధాంతాలు లేవా?

ఆదిమానవునికి ప్రకృతి పట్ల వున్న అవగాహనా రాహిత్యమే దైవభావనకు దారితీసింది. ప్రేమకూ, యుద్ధానికీ, ఆకాశానికీ, సముద్రాలకూ, నదులకూ, తుఫానులకూ, భూకంపాలకూ, అగ్ని పర్వతాలకు కూడా దేవుళ్ళున్నారనుకున్నారు. దేవుళ్లు సంతోషిస్తే ఈ లోకంలో శాంతి, సుఖాలు లభిస్తాయి. లేకపోతే, క్షామం, అంటురోగాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి అని విశ్వసించారు.

200,000 B.C. ప్రాంతంలో అవతరించింది మన జాతి – Homo Sapiens. వ్యావసాయక సమాజంలో సుమారు 7000 B.C. నాడు కనిపించింది బొమ్మల లిపి.



**స్టీఫెన్ హాకింగ్, లెనార్డ్**

మరికొన్ని వేల యేండ్లకు గణితాన్ని ఒక శాస్త్రంగా అభివృద్ధి చేశారు ప్రాచీన భారతీయులు.

అరిస్టాటిల్ (384 BC - 322 BC) చెప్పిన దానినిబట్టి, థేల్స్ అనే ఆయన అప్పటిలోనే ఈ ప్రపంచాన్ని మాయా మర్మాలు లేకుండా అర్థం చేసుకోవచ్చు- దీనికోసం కొన్ని సూత్రాలను మన చుట్టూ జరిగే సంఘటనలను బట్టి తయారు చేసుకోవచ్చని ప్రతిపాదించాడు. అంతేగాక అప్పటి వరకు వింత వింత కథలతో ముడి పెట్టబడిన సూర్య, చంద్ర గ్రహణాలకు కారణం చెప్పి 585 BC లో వచ్చే గ్రహణాన్ని లెక్కగట్టి చెప్పాడు!




గాజు పాత్రలో బంగారు చేప.

అయినప్పటికీ, ప్రకృతిని గురించిన మన ఆధునిక అవగాహన ఏడవ శతాబ్దంలోనే ప్రారంభమైంది. ఈ దిశలో కృషి చేసిన తొలి శాస్త్రజులు జోహాన్స్ కెప్లర్ (1571–1630), గెలీలియో (1564–1642) 'Law' అనే మాటవాడలేదు కాని శాస్త్రీయ పరిశోధనా పద్ధతులకు పునాది వేశారు.

ప్రకృతిలో ఏదైనా ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంటే దాన్ని 'Law' అంటాం (సూత్రీకరిస్తాం). ఉదాహరణకు ‘సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు’ గతాన్ని గురించి, వర్తమానాన్ని గురించేగాక, భవిష్యత్తులో కూడా జరుగుతుందని చెబుతుంది ఈ సూత్రం!

ఇంతవరకూ, ప్రకృతిసూత్రాలను గణితశాస్త్ర పరిభాషలో మాత్రమే సూచిస్తున్నారు. **ఇప్పుడు శాస్త్ర చర్చలకు, తాత్త్విక మీమాంస తోడైంది.**

సూత్రాలు వున్నాయనుకుంటే, వాటి మూలాలెక్కడ వున్నాయి? ఈ సూత్రాలకు మినహాయింపులున్నాయా? వీటిని ధిక్కరించే అద్భుతాల సంగతేమిటి?

ఒక సూత్రాల సముదాయం మాత్రమే వున్నదా లేక ఒకటికన్నా ఎక్కువ సముదాయాలు వున్నాయా?

ఈ ప్రశ్నలకు, శాస్త్రజ్ఞులు, తత్త్వవేత్తలు, మతగురువులు భిన్నమైన సమాధానాలు చెప్పారు. ప్రకృతి సూత్రాలు తయారు చేసింది దేవుడే అన్నారు కెప్లర్, గెలీలియో, డెకార్డ్, న్యూటన్. శాస్త్రజ్ఞులు ఈ మార్మికానుభవాన్ని అంగీకరించరు. అద్భుతాలని నమ్మరు. కాని, వాస్తవికతను మాత్రమే శాస్త్రజ్ఞులు అంగీకరిస్తారను కున్నా, ‘వాస్తవికత’ అంటే ఏమిటి అనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతుంది గదా?

* * *

చేపల్ని గుండ్రంగా వుండే గాజుపాత్రలో పెంచ వద్దని సలహా యిచ్చారు కొందరు. దీని క్కారణం, వంగిన గాజుపాత్ర గుండా చూసిన చేపలకు, బయటి దృశ్యం వక్రీకరణ చెందుతుంది. అసలు మనం వక్రీకరణ కాని దృశ్యాలను చూస్తున్నామా? చేపల్లాగే, మనం కూడా ఒక పెద్ద గుండ్రటి పాత్రలో లేమా? మనకు కనిపించే దృశ్యం ఒక బృహత్ కటకం ద్వారా, వక్రీకరణ కావటం లేదా?

మనం చూసే దృశ్యానికీ, గాజుపాత్రలో వున్న చేప చూసే దృశ్యానికీ తేడా వున్నదన్నది మాత్రం స్పష్టం.

కొన్నాళ్ల క్రితం వచ్చిన ఒక సినిమా *ది మాట్రిక్స్*లో కూడా వాస్తవానికీ, భ్రమకూ వున్నతేడా ప్రేక్షకున్ని దిగ్భ్రమకు గురిచేస్తుంది. సూపర్ కంప్యూటర్‌లు సృష్టించిన చాక్షుస సత్యంలో మనం వుంటున్నామన్నది కథాంశం. మనందరం, అదృశ్య కంప్యూటర్లు సృష్టించిన ఊహాజీవులం కామని చెప్పగలమా?

భిన్నవాస్తవికతల గురించి చర్చించినప్పుడు మనకు అవసరమవుతుంది, నమూనా ఆధారిత వాస్తవం. ఈ నమూనా దృశ్యరూపంలో కాక గణిత పరిభాషలో వుంటుంది. ఆధునిక శాస్త్రాలను, గణితంలో తప్ప, మరో పద్ధతిలో అర్థంచేసుకొనడం వీలుపడదు.

నమూనా ఆధారిత వాస్తవంలో ఈ నమూనా వాస్తవమా? అని అడగటంఅర్థరహితం. అది మన పరిశీలనకు

Philosophy Philo = Love; Sophio = Wisdom ( Latin & Greek)



Plank Nernst, Einstein, Planck, Millikan, Laue (1931)

అనుగుణంగా వున్నదా? అని మాత్రమే ప్రశ్నించు కోవాలి. అంటే, భిన్న పరిశీలనా ఫలితాలను బట్టి భిన్నమైన నమూనాలు వాస్తవికంగా కనిపిస్తాయి. ఎవరి పరిశోధనకు అనుకూలమైన నమూనాలను వాళ్ళు ఎంపిక చేసుకోవచ్చు. చేప స్థానంలో మనం వున్నామనుకుంటే, గాజుపాత్ర గుండా చూసే వాస్తవికత మనకు అవసరం. గాజుపాత్ర వెలుపల వున్నా మనుకొంటే వాస్తవికత భిన్నంగా వుంటుంది.

ఈ నమూనా ఆధారిత సత్యం వల్ల మరో సదుపాయం కూడా వుంది. సృష్టి యిలా ఎందుకుంది? మనమెందు కున్నాం? వగైరా ప్రశ్నలకు సమాధానలు వెదకక్కరలేదు. నేనున్నప్పుడు గదిలో బల్ల వుంది. నేను గదిలోంచి బయటికి వెళ్ళాక, అదింకా అక్కడే వుందని ఎలా చెప్పగలను? మనం చూడలేని ఎలక్ట్రాన్స్, క్వార్క్స్ వున్నాయిగద. కణాల పరమాణువుల మాటేమిటి?

కాలప్రవాహంలోని ఒకానొక మలుపులో Big Bang జరిగిందనుకుంటే, అంతకు ముందు ఏముంది?

***బిగ్ బాంగ్ సిద్ధాంతం పై ప్రయోగాలు చేసేది*** *The Large Hadron Collider.* ***ఇది స్విట్జర్లెండ్ ఆల్ఫ్ పర్వతాల క్రింద ఒక పెద్ద సొరంగంలో వుంది. 2012 లో ఈ ప్రయోగ ఫలితంగా కాంతివేగం కంటే ఎక్కువ వేగంగా ప్రయాణించగల పదార్థ కణాలను గుర్తించారు. అవి*** *Neutrions.* ***ఇవి విద్యుత్ చార్జి పరంగా తటస్థంగా వుంటాయి. కాంతి వేగం క్షణానికి లక్షా ఎనభై ఆరువేల మైళ్ళు. (మూడు లక్షల కిలోమీటర్లు)***

శాస్త్రీయమైన ఆలోచనావిధానం ప్రారంభమైన తొలి రెండువేల సంవత్సరాలలో, అనుభవం లేదా సహజ జ్ఞానం ఆధారంగా ప్రకృతిని అర్థం చేసుకున్నారు మానవులు. సాంకేతిక పరిజ్ఞానం, ప్రయోగాలకు అవసరమైన అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత, స్వానుభవానికి అతీతమైన శాస్త్రజ్ఞానముందని తెలియ వచ్చింది

ఇరవయ్యవ శతాబ్ది తొలి దశాబ్దాలలో సూత్రీకరింపబడిన క్వాంటం ఫిజిక్సు, అణు, పరమాణు దశల్లో ప్రకృతి స్వభావం ఏమిటో వివరిస్తుంది. న్యూటన్ లాంటి వాళ్ల క్లాసికల్ సిద్ధాంతాలు, కేవలం పరిశీలన మీద ఆధారపడినవి.

గ్రహాలు, నక్షత్రాలు యితర విశ్వ పదార్థాలు స్థిరంగా వున్నాయనుకుని, స్థిరమైన కక్ష్యల్లో ప్రయాణిస్తున్నాయనుకుని చేసిన నిర్ధారణలవి. ఇవేవీ మనకు స్పష్టంగా తెలుసుకునే అవకాశం లేదంటుంది క్వాంటం ఫిజిక్సు. కాని, ఏమీ తెలియని విషయాల గురించి సూత్రీకరణలు చెయ్యడం సమంజసమా? కాని ఆ సామాన్య సూత్రీకరణ వెనక దాగిన బహుళ వాస్తవికతలను అధ్యయనం చేస్తుంది ఆధునిక భౌతిక శాస్త్రం.

క్వాంటం ఫిజిక్స్ గురించి యింకా మాట్లాడుకునే ముందు కనీసం ఒకటి రెండు విషయాలు తెలుసుకోవాలి. పదార్థ కణాలు అలల లాగ వుంటాయన్నది మొదటి అవగాహన.

మరో ముఖ్యమైన సమాచారం, మనం ఎంత తెలుసుకున్నా, ఎన్ని అత్యాధునిక పరికరాలు, కంప్యూటర్లు ఉపయోగించినా, 'ఇదమిత్థంగా యిదీ' అని దేన్నీ నిర్ధారించలేం. *పాచికలు వేస్తే ఏది పడుతుందో దేవుడు మాత్రమే చెప్పగలడు* అంటాడు ఐన్‌స్టీన్. క్వాంటం ఫిజిక్సు ప్రకారం శాస్త్రజ్ఞానం ఎప్పుడూ అసమగ్రమే. ఈ సైన్సుకు ఆద్యుడు జర్మన్ దేశస్థుడైన మాక్స్ కారల్ ఎర్నస్ట్ లూడ్‌విగ్ లాంక్ (Max Karl Ernst Ludwig Planck, 1918 నోబెల్ విజేత). కాని తరువాతి రోజుల్లో ఐన్‌స్టీన్ దీన్ని గురించి కొన్ని సందేహాలు లేవనెత్తాడు.

ప్రకృతికి సూత్రీకరణలు చెయ్యటం అసాధ్యమని అంగీకరించినప్పటికీ, అనుభవాన్ని, పరిశీలనను బట్టి, యిలా జరిగే అవకాశముందని అనుకోవడం కద్దు. శాస్త్రజ్ఞానం అసంపూర్ణం అన్నంత మాత్రాన, ఎవరికి వారు స్వీయ మానసిక ధోరణిలో *నేను చెప్పిందే సత్యం అనవచ్చు* అని కాదు. ప్రయోగాలు, పరిశీలన, అధ్యయనం తర్వాత, తత్కాలానికి పరిమితమైన హేతుబద్ధ, శాస్త్రీయ అవగాహనతో మాత్రమే ప్రకృతిని అర్థం చేసుకోవాలి.

పరీక్ష చేసి నిర్ధారించగలిగిందే నిజం అంటుంది సైన్సు.

* * *

ఎన్నిరకాల వాదించినా, ఈ సృష్టిని, ఈ విశ్వాన్ని కొన్ని సూత్రాల ఆధారంగానే అర్థం చేసుకోగలం. గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని 1687లో ప్రతిపాదించాడు న్యూటన్. ప్రతి వస్తువూ, మరొక వస్తువును, తన ద్రవ్యరాశిని బట్టి ఆకర్షిస్తుంది. ఎంత చక్కగా, ఎంత ఖచ్చితంగా చెప్పాడన్నారు అందరూ. స్కాటిష్ ఫిజిసిస్ట్, జేమ్స్ క్లర్క్, మాక్స్‌వెల్ 1880 లలో, విద్యుతయస్కాంత తరంగాలు సెకండుకు 300,000 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయన్నాడు. 1884లో సర్ విలియం థాంసన్ డైనమిక్స్‌లో మనం నమ్మకంగా మాట్లాడగలిగింది ఈథర్‌ను గురించి మాత్రమే అన్నాడు. 1905లో, 26 సంవత్సరాల ఐన్‌స్టీన్ తన పరిశోధనా వ్యాసం *On the Electrodynamics of Moving Bodies* ప్రచురించాడు. తరువాత దీన్నే స్పెషల్ థియరీ ఆఫ్ రిలేటివిటీ అన్నారు. దీని ప్రకారం కాలం సంపూర్ణ ప్రతిపత్తి కాదు. అంటే, న్యూటన్ అంచనా తప్పు. అయితే ఈ భూమ్మీద నివసించే మనలాంటి సామాన్యులకు, న్యూటన్ సిద్ధాంతాల అవసరమున్నంతగా, ఐన్‌స్టీన్ దూర–కాల సిద్ధాంతాలు వర్తించవు. ఇప్పుడు భౌతికశాస్త్రజ్ఞులు దూర–కాలాలను ఒకే మాటగా అర్థంచేసుకుంటున్నారు. దీన్నే *నాలుగో పరిమాణం* అంటారు. దూరం లేదా స్థలం ఆధారంగానే కాల నిర్ధారణ జరుగుతుంది.

ఇప్పటికి, ప్రకృతి గురించి మనకు తెలిసిన ముఖ్యాంశాలు నాలుగు.

1. *గురుత్వాకర్షణ శక్తి :* విశ్వంలో, అన్నివస్తువులూ పరస్పరం ఆకర్షించు కుంటున్నాయి.

2. *విద్యుదయస్కాంతం:* అంటే, ఎలక్ట్రిక్‌చార్జి వున్న కణాలను మాత్రమే ఆకర్షించే శక్తి. రసాయన, జీవశాస్త్రాలను విద్యుదయస్కాంత శక్తి ఆధారంగానే అర్థం చేసుకుంటారు.

3. *బలహీన అణుధార్మిక శక్తి:* విశ్వం ఏర్పడటానికి మూలశక్తి. నిత్య జీవితంలో యిది మనకు అనుభవంలోకి రాదు.

4. *బలమైన అణుధార్మిక శక్తి:* అణుకేంద్రకంలోని ప్రోటాన్లను, న్యూట్రాన్లను కలిపివుంచేదిదే. అంతకన్న చిన్న కణాలు క్వార్క్స్ కలిస్తేనే ప్రోటాన్లు, న్యూట్రాన్లు ఏర్పడతాయి. సూర్యుడి ఉనికికి మూలం బలమైన అణుధార్మిక శక్తి. న్యూక్లియర్ పవర్ సృష్టించటానికి కూడా యిది అవసరమే. ఇది మన నిత్యానుభవంలోనికి రాదు. Quantum Eletrodynamics (QED) ని, 1940లలో ప్రచారంలోకి తెచ్చిన ముఖ్యుడు రిచర్డ్ ఫేన్ మాన్.

ఈ విశ్వం 13.7 బిలియన్ సంవత్సరాల క్రితం ఆవిర్భవించిందని శాస్త్రజ్ఞులు ప్రస్తుతం అంచనావేస్తున్నారు. ***1920లో 100 అంగుళాల టెలిస్కోపు ద్వారా నక్షత్ర కాంతుల్ని అధ్యయనం చేసిన ఎడ్విన్ హబుల్, నక్షత్రాలు దూరంగా కదిలిపోతున్నాయన్నాడు. ఈ పరిశీలన ఆధారంగా, 1929లో విశ్వం విస్తరిస్తున్నదని ప్రతిపాదించాడు.*** అంతకు కొన్నాళ్ల క్రితం, 1927లో ఒక ఫిజిక్సు ప్రొఫెసర్ (ఇతడు రోమన్ కాథలిక్ ప్రీస్టు కూడా) జార్జెస్ లిమీటర్ (Georges Lemaitre) ప్రస్తుతం విశ్వం వున్న దశనుండి దాని ఆవిర్భావ దిశగా పయనించి, ఆ మొదటి క్షణాన్ని 'Big Bang' అన్నాడు. ***విశ్వం ఆవిర్భవించిందంటే అది అవిర్భవించని దశ కూడా వుందన్న మాట.*** కాని అది మన వూహకందదు. అది దూర కాలాలకు అతీతము. ఫేన్ మాన్ వివరించిన క్వాంటం థియరీ ప్రకారం, మనం విశ్వాన్ని పరిశీలిస్తున్నామంటే, మనమూ అందులో ఒక భాగమే. మనం కాలంలో తేలుతున్నామని అర్థము. అంటే, మన పరిశీలనకు గమ్యమేది? లక్ష్యమేది?

(చదవండి: *కాలజ్ఞానం*, సెప్టెంబరు *మిసిమి* 2003)

శతాబ్దాల క్రితం, శాస్త్రజ్ఞులు విశ్వంలో ఈ భూమికో ప్రత్యేకత వుందను కున్నారు. ఇప్పుడు, మన పాలపుంతలోనే బిలియన్ల నక్షత్ర వీధులు వున్నాయి. వందల బిలియన్ల నక్షత్రాలున్నాయనీ, అనేక నక్షత్రాలకు అనేక సౌర కుటుంబాలున్నాయనీ తెలుసుకున్నాం. ***అసలు, మన విశ్వం***



**ప్రొఫెసర్, మీ సూత్రం చుట్టూ గీతగీసినంత మాత్రాన అది యూనిఫైడ్ థియరీ అవదేమో?!**

*కూడా అనేక విశ్వాలలో ఒకటి మాత్రమే.* ఎంత పరిశోధించినా, ఎన్ని ప్రయోగాలు చేసినా, ఎన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించినా, ఏ ఒక్క విషయమూ, స్పష్టంగా, యిద మిత్థంగా యిదింతే అనలేమనీ గ్రహించాం. (Ultimate Theory ప్రతిపాదించాలనుకునే వాళ్లను యిది నిరుత్సాహ పరుస్తుంది.) (చదవండి: *సూక్ష్మజీవి*, జనవరి ***మిసిమి*** 2012)

ముఖ్యంగా, సైన్సు ప్రస్థానంలోనే మనము ఒక కీలకదశలో వున్నాం. అన్నింటినీ వివరించగల, ఏ ఒక్క భౌతిక సిద్ధాంతాన్ని మనం తయారుచేయలేమని గ్రహించాలి. మన లక్ష్యాలను ఆ దిశగా పునర్నిర్వచించుకోవాలి. మన పరిశోధన అంశాన్ని బట్టి, లక్ష్యాన్నిబట్టి, దానికి అవసరమైన తార్కికతను బట్టి, కొన్ని సూత్రాలు ఏర్పరుచుకుంటాం.

ఈ సూత్రాలు సందర్భాన్ని బట్టి మారిపోతుంటాయి. ఖగోళ పరిశోధనలో, ఒక విశ్వానికి సంబంధించిన సూత్రాలు మరొకదానికి వర్తించవు. కాని, మనం చక్కని వివరణలకు, హేతుబద్ధమైన చర్చలకు, అలవాటుపడ్డాం. కొంతకాలం తర్వాత అంతా అర్థమై పోతుందిలే అనే ధీమాతో బతుకుతున్నాం. కాని, ప్రకృతికి, ***మనమీద ప్రత్యేక ప్రేమానురాగాలేమీ ఉండవలసిన అవసరంలేదు.***

ఇది అనేక విశ్వాలున్న ఒక మహా విశాల ప్రదేశం. అయితే, 'జీవ'మున్న విశ్వాలెక్కువగా వున్నట్టు కనిపించటం లేదు. మరి, యిన్ని లక్షల కోట్ల విశ్వాలున్న సృష్టిలో, మనముంటున్న విశ్వానికే ఎందుకీ ప్రత్యేకత ఆపాదించ బడింది? ఏ దయాళువు మన విశ్వాన్ని పత్ర్యేకంగా సృష్టించాడు? సైన్సు, యిలాంటి విషయాల గురించి కూడ మాట్లాడగలదా? ఈ అనంత విశ్వం భౌతికమా, తాత్త్వికమా? మనం ఎందులో వున్నాం? ఇది తెలిసేదెలా?

*శరీరాలు కేవలం యంత్రాలే. కాని 'మనసు' ఏ శాస్త్ర సూత్రానికీ లోబడి వుండదు!* అని డిస్కార్టిస్ అన్నాడు.

మన జ్ఞానేంద్రియాలు సేకరించిన సమాచారాన్ని మెదడు సమీకరిస్తుంది. దాన్ని బట్టే మనకు లోకాన్ని గురించిన 'ఊహ' ఏర్పడుతుంది. ఇదే నమూనా ఆధారిత వాస్తవం. ఇళ్లు, చెట్లు, మనుషులు–యిలా అన్ని వస్తువులనూ, రూపాలనూ నిర్దిష్టంగా చూడగలగటానికి కారణం ఇంద్రియ గ్రహణ శక్తులే.

అసలు, 'జీవి'ని ఎలా నిర్వచిస్తాం? పునరుత్పత్తి చేయగలిగిన వాటినే మనం జీవులు అనటం సబబు. గణిత




శాస్త్రజ్ఞుడు జాన్ వాన్ న్యూమాన్ ప్రకారం, 10 ట్రిలియన్ చతురస్ర పరిమాణం, మనిషి సెల్ లోని మాలెక్యూల్స్ సంఖ్య ఇది. దీనిలో కూడా జీవులు వుంటాయి. ఇవి పునరుత్పత్తి చేయగలవు కాని వీటికి స్థిరమైనరూపం లేదు. జీవులన్నింటికీ తమ ఉనికిని గురించిన స్పృహ వుంటుందా? దీని గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. ఇది మనుషులకే ప్రత్యేకం అంటారు కొందరు. ఈ స్పృహవల్లనే, విచక్షణ ఏర్పడుతుంది.

ఒక జీవిలో విచక్షణ వుందో లేదో ఎలా తెలుస్తుంది? ఉదాహరణకు ఒక గ్రహాంతర జీవి మన వద్దకు చేరిందే అనుకుందాం. దానికి విచక్షణాజ్ఞానం వుందో లేదో మనకెలా తెలుస్తుంది? రోబోలను ముందే ప్రోగ్రాం చేస్తాం. జీవులు, స్పృహవుంది గనక, ఏం చెయ్యాలో ఆలోచిస్తాయి. అంటే, రోబోల చర్యల్ని, ప్రవర్తనను మనం ముందే అంచనా వెయ్య వచ్చును. కాని జీవుల ప్రవర్తనను పసిగట్టలేం. రెండు, మూడు కణాలు ప్రతిస్పందించినప్పుడు ఏమి జరుగుతుందో మనం అంచనా వెయ్యలేకపోతున్నాం.

అటువంటిది, సుమారు వెయ్యి ట్రిలియన్ ట్రిలియన్ పార్టికల్స్ వున్న రోబో మనకు కనిపించినప్పటికీ, అది జీవికాదని మాత్రం ఎలా నిర్ధారణగా చెప్పగలం?

నిరంతరంగా కొనసాగు తున్న లోకాన్ని నిర్వచించటానికి అవసరమైన సూత్రంలో శక్తి అనే అవగాహన ముఖ్యమైనది. శక్తి అంటే పరిమాణానికి మరోపేరు. కాలంతో దీనిలో మార్పు రాదని కూడా అర్థం చేసుకోవాలి.



జెట్‌లో జీవి

ప్రకృతిలోని పరమాణువుల సముదాయమైన మనం, సృష్టిని అర్థం చేసుకునే క్రమంలో ఇంత దూరం ప్రయాణించామంటే అదే ఓ గొప్ప విజయం.

మన పరిశీలన, అధ్యయనం ఆధారంగా చేసిన సూత్రీకరణలు నిజమని నిరూపితమైతే, 3000 సంవత్సరాల నుంచి వస్తున్న మన పూర్వీకుల కోరిక నెరవేరినట్టే.

ఆనాడే, ఒక వేద ఋషి ఈ *మహా* పథకం గురించి యిలా గానం చేశాడు.

***సృష్టికి ముందు వుండటమూ, వుండక పోవటమూ లేదు;***
***భూమి లేదు, ఆకాశం లేదు...***
***మృత్యువు లేదు, అమృతత్వం లేదు;***
***రాత్రి లేదు, పగలు లేదు;***
***అప్పుడు అంతా చీకటి చేత ఆవరించబడిన పెంజీకటి...***
***సృష్టి రహస్యం ఎవరికి తెలుసు?***
***ఎవరు దీన్ని సృష్టించారు...***
***పరమాత్మకు కూడా తెలియదేమో....***

– నాసదీయ సూక్తం.

***విశ్వరూపం,*** *భౌతికదృష్టికి అందక తాత్విక చింతన అలవాటు చేసుకున్నాడు మానవుడు. కంటికి కానరాని దాన్ని ఆలోచనతో దర్శించాడు. అర్థంకాని దాన్ని బ్రహ్మమన్నాడు. 'అహం బ్రహ్మాస్మి'* అని కూడా అన్నాడు.

***– (ముక్తవరం పార్థసారథి, అశ్విని.కె.)***

---

# స్టీఫెన్ హాకింగ్

**శ**రీరమే బంధిఖానా అయితే, దినచర్యే పరాధీనమైతే, మాటలే మూగపోతే, మామూలు మనుషులు – ఎందుకీ దీనమైన బ్రతుకు – ముగిద్దామని కృంగిపోతారు. కాని – ఇంకా ఏమి వనరులు మిగిలి ఉన్నాయి – వాటిని ఏ విధంగా ఉపయోగించాలి అనే ఆలోచన – గుండె నిబ్బరం – మొండితనం – ఒక్క స్టీఫెన్ హాకింగ్‌కే తెలుసు! తనకు వినికిడికి చెవులు– చూడటానికి చురుకైన కళ్ళు – ఆలోచించటానికి మేధస్సు వున్నాయి. వీటితోనే అపరిమితమైన మేధో చైతన్యంతో, నిరంతర కృషితో ప్రపంచశాస్త్రవేత్తల సరసన చోటు సంపాదించుకున్నాడు.

శాస్త్రపరంగా స్టీఫెన్ సిద్ధాంతాలు – ఈ విశ్వాంతరాళం ఎప్పుడు పుట్టింది – ఎలా పుట్టింది – కాలయానం – బ్లాక్ హోల్ – ఇవి సామాన్యులకు అర్థం కాని భౌతిక, ఖగోళ శాస్త్ర విషయాలు – మనం వీటి జోలికి పోవద్దు. వ్యక్తిగా ఒక శక్తిగా స్టీఫెన్ని చూద్దాం. అతని అంతరంగాన్ని పరికించుదాం.



అందరిలాగానే అతను కాలేజీ చదువు సాగిస్తున్నాడు. 21 సం॥ వయసులో "మోటార్ న్యూరాన్" జబ్బు అతన్ని ఆవహించటం మొదలు పెట్టి 5–6 సంవత్సరాలలో చక్రాల కుర్చీలో పడవేసింది. అప్పటికే జేన్‌ని ప్రేమించడం – పిల్లలు కలగటం కూడా జరిగిపోయింది.

డాక్టర్లు ఎక్కువ కాలం బ్రతకవని కూడా చెప్పారు.

ఇటువంటి విపరీత పరిస్థితిలో – అతను తనలోని అపార మేధాశక్తిని అందుబాటులోకి తెచ్చుకుని శాస్త్ర పరిశోధనలు చేసి పరిశోధనా పుస్తకాలు ప్రచురించి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ప్రముఖ ప్రొఫెసరుగా వెలుగుతున్నాడు.

*నాకు ఎటువంటి మినహాయింపులు ప్రత్యేకతలు వద్దు. నన్ను మామూలుగానే చూడండి* అంటాడు. అతన్ని చూసి జాలిపడితే మండి పడతాడు.

బ్రతుకు బంధిఖానా అనుకునే ఈనాటి జనానికి – కాలం కష్టాలమయం అనుకునే సోమరిపోతులకు – మన దుస్థితికి మన చుట్టూ వున్న వారే కారణం అని తిట్టుకునే వంకరాయుళ్లకు స్టీఫెన్ జీవితం ఒక దివిటీ!

అందుబాటులో వున్న వనరులను ఎలా ఉపయోగించాలో తమలో వున్న అపారమైన శక్తియుక్తులను అందుబాటు లోనికి తెచ్చుకుని ఏదైనా ఎలా సాధించాలో తన జీవితాన్ని ఉదాహరణగా వుంచి ఉన్న జీవితాన్ని అనుక్షణం సరదాగా అనుభవిస్తున్న స్టీఫెన్ హాకింగ్‌కి జేజేలు పలుకుదాం!

**– కె.**

## సి.ఆర్.రెడ్డి సేవలో...

*38వ పుట నుంచి.....*

కొడగు (కూర్గు) కమీషనరు ఓ సారి రెడ్డిగారికి పెద్దబుట్ట నిండా నారింజ పళ్లు పంపారు. ఆ సమయంలో వారం రోజులపాటు మద్రాసు వెళ్లిన రెడ్డిగారు మైసూరుకు తిరిగి రాగానే నౌకరు అనంతరాజు ఆ పళ్లబుట్ట గురించి చెప్తూ తపాలాను ఆయనకు అందించాడు. అప్పుడు రెడ్డిగారు *ఏమిటి ఈ పళ్ళు వచ్చి రెండు మూడు రోజులైనా మీలో ఒక్కరూ వాటిని తినలేదా? ఇంత రుచికరమైన నారింజపళ్లను తినకుండా మీరు ఎలా ఉండగలిగారు? మీరిద్దరూ వొట్టి దద్దమ్మలోయ్!* – అని నవ్వారు. *అయిందేదో అయింది. కొన్ని పళ్లు మీరిద్దరూ మీఇళ్లకు తీసుకు వెళ్లండి. మరికొన్ని పనిమనుషులకు పంచండి. రెండు మూడు పళ్లు వుంచి పోండి.* – రెడ్డిగారు మావైపు చూస్తూ అన్నారు. ఇది రెడ్డిగారి పంథా!

రెడ్డిగారు యూనివర్సిటీ బిల్లు గురించి సమర్పించిన నివేదిక గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారమూ రాలేదు. నాకు ఆఫీసులో అట్టేపని లేక పోయింది. రెడ్డిగారు వూరకే చేతులు కట్టుకొని కూర్చునే స్వభావం కలవ్యక్తి కారు. ఓరోజు నాతో ఇలా అన్నారు – *వెంట్రామ్! నేను విశ్వసాహిత్యంలో రామాయణం గరించి తెలుసు కోవాలను కొన్నాను. మీకు ఇందులో ఏమైనా అభిరుచి వుంటే లైబ్రరీల నుంచి సామగ్రి సేకరించడంలో నాకు సాయం చేయగలరా?* అని అడిగారు. నేను తలవూపాను.

మరుసటి రోజు నుంచి నేను మైసూరు విశ్వవిద్యాలయ గ్రంథాలయంలోనూ, ఓరియంటల్ లైబ్రరీలోనూ చాలాసేపు గడపసాగాను. ఆఫీసుకు నామ్‌కే వాస్తే వెళ్లి వస్తుండేవాణ్ణి. ఓ దినం. క్లర్కు నరసింహమూర్తి *సార్, రెడ్డిగారు నిన్న ఉదయం, సాయంకాలం రెండుపూటలా ఆఫీసుకు వచ్చారు. ఈ రోజు ఉదయం కూడా వచ్చారు. మిమ్మల్ని మరీ మరీ అడిగారు. మీరు కనపడకపోయేసరికి ధుమధుమలాడారు కూడా. ఈ రోజు మధ్యాహ్నం ఒకవేళ ఆఫీసుకు వస్తే, సాయంకాలం రమ్మని* చెప్పి కోపంగా వెళ్లిపోయారు. నాకు పై ప్రాణం పైనే పోయినట్లయింది.

ఆ సాయంకాలమే రెడ్డిగారిని చూడటానికి వెళ్లాను. ఆయన అప్పుడు పచ్చిక మీద పచార్లు చేస్తున్నారు. *ఈ మధ్య మీరు ఆఫీసులో కనబడటం లేదు. ఏం రాచకార్యాలు వెలగ బెడుతున్నారో తెలుసుకోవచ్చా?* ఆయన మాటల్లో గడుసుదనంతో కూడుకొన్న కోపం బాగా వ్యక్తమయింది.

*మీ పని మీదే వున్నాను, సార్!* – నేను వినయంగా చెప్పాను. రెడ్డిగారు గతుక్కుమన్నారు. *మీ చేతిలో ఏవో పేపర్లున్నట్లున్నాయి?* రెడ్డిగారు అడిగారు. ఔను! సార్, మీరిచ్చిన పనికి సంబంధించినవే. నా సమాధానం. *సరే, ఆ కాగితాలేవో నా కిచ్చి వెళ్లండి* – రెడ్డిగారు ఆజ్ఞాపించినట్లే మాట్లాడారు. *ఆ మరో మాట. ఆఫీసులో కనిపిస్తూ వుండండి. జాగ్రత్త.* రెడ్డిగారి మరో ఆదేశం.

నేను సేకరించిన సామగ్రి గురించి రెడ్డిగారి అభిప్రాయం ఎల వుంటుందోనంటూ రెండుమూడు రోజులు బిక్కు బిక్కుమంటూ గడిపాను. ఆఫీసుకి మామూలుగా వెళ్లి వస్తున్నాను. ఓ రోజు రెడ్డిగారు నన్ను తమ గదిలోకి పిలిచారు. *వెంకట్రామ్! మీరు సేకరించిన విషయాన్ని మీ బ్రహ్మరాతను ఎంతో కష్టపడి చదవగలిగాను. చాలా ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. ఈజిప్టు రామాయణంలో రాముడూ సీతా అక్కా తమ్ముళ్లా? చాలా వింతగా ఉంది. అవును, నిజమే! రాజ్యాధికారం ఇతరులకు వెళ్ళకుండా వుండటానికై అక్కా తమ్ముళ్లకు పెళ్లి చేయడం అక్కడి ఆనవాయితీ కాబోలు. ఓ తెలుగు పండితుడు పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్య శాస్త్రిగారు రామాయణం గురించి రాసిన ఓ విమర్శనా గ్రంథానికి నేను పీఠిక రాయాల్సి వుంది. ఆ విద్వాంసుడు నన్నే రాయమని పట్టుపట్టి కూర్చున్నాడు. నేను మీరు సేకరించిన విషయాన్ని వాడుకొంటే మీకెలాంటి అభ్యంతరం లేదు కదా?* రెడ్డిగారి ఈ మాటలకు నేను సంతోషంతో తలవూపాను. ఆ ప్రసంగం అంతటితో ముగిసింది.

రెండు రోజుల తర్వాత రెడ్డిగారు నన్ను పిలిపించి ఇలా అన్నారు – *నేను యూనివర్సిటీ బిల్లు గురించి సమర్పించిన నివేదిక ఏమయ్యిందో తెలియదు. అటు ప్రభుత్వం కాని, ఇటు యూనివర్సిటీ కాని పట్టించుకొన్న పాపాన పోలేదు.* నేను వెంటనే ఫైల్లోంచి రెడ్డిగారి నివేదిక టైపు ప్రతి బయటికితీసి దాన్ని డాక్టరు రాధాకృష్ణగారి, డాక్టరు ఆర్కాటో లక్ష్మణస్వామి గారి నివేదికలతో చేర్చి నోట్సురాసి, టైపు చేసి రెడ్డిగారి కిచ్చాను. ఆయన దాన్ని పరిశీలించి కొన్ని మార్పులు, చేర్పులు చేసి మళ్ళీ నాకే ఇచ్చారు. నేను మళ్ళీ ఆ ప్రతిని సాఫు చేసి రెడ్డిగారికి చూపించాను. ఆయన దాన్ని ఓ.కే!

చేసి *దీన్ని అచ్చు వేసి పెడ్తారా?* అని అడిగారు. నేను వెంటనే మైసూరు ప్రభుత్వ ముద్రణాలయం సూపరింటెండెంటు గురుబసప్పను పిలిపించి దాన్ని ముద్రించి పెట్టమన్నాను. ఆ మహానుభావుడు వెంటనే దాన్ని అందంగా ముద్రించి, రెండు మూడు ప్రతులు తెచ్చి నాకిచ్చారు. నేను వెంటనే ఆ ముచ్చటైన చిన్న పుస్తకాన్ని రెడ్డిగారికిచ్చాను.

రెడ్డిగారు ఎంతో సంతోషించి *నేను మైసూరులో చేసిన మొదటి ఆశ్చర్యం ఇదే!* అని అన్నారు. *ఈ పని చేసిందెవరు?* అని రెడ్డిగారు అడగ్గా నేను గురుబసప్ప పేరు చెప్పాను. *ఆయనకు నా అభినందలను చెప్పి, నన్నొకసారి చూడమని* చెప్పండి అన్నారు. నేను గురుబసప్పగారికి కబురు పెట్టాను. మరుసటి రోజు సాయంకాలం గురుబసప్ప రెడ్డిగారి బంగళాకు వచ్చారు. ఆ సాయంకాలం ముగ్గురం తేనీరు తాగాం. రెడ్డిగారు గురుబసప్పకు ముక్తసరిగా కృతజ్ఞతలు చెప్పి వూరకుండి పొయ్యారు.

1950వ సంవత్సరపు చివర్లో అనుకుంటాను. ఏదో సందర్భంగా మైసూరు వచ్చిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు సి.ఆర్.రెడ్డిగారిని చూడాలన్న అభిలాష వ్యక్తం చేశారట. ఈ విషయం నాకు సి.ఆర్.రెడ్డిగారి గుమస్తా నరసింహమూర్తి ద్వారా తెలిసింది. విశ్వేశ్వరయ్యగారు రెండు రోజులకు రెడ్డిగారిని కలుస్తారనగా, రెడ్డిగారు నాతో *వెంకట్రామ్! రేపు సర్ విశ్వేశ్వరయ్యగారు నన్ను కలుస్తున్నారు. తెలుసా? అంటూ ఆనందాశ్చర్యాలతో అన్నారు.* మరుసటి రోజు పొద్దున మళ్లీ నాతో వెంకట్రామ్! ఈ రోజు సాయంకాలం సర్ విశ్వేశ్వరయ్య గారు నన్ను కలుస్తున్నారోయ్! అంటూ నాతో ఉత్సాహంగా అన్నారు. రెడ్డిగారు ముప్ఫై ఏళ్ళు వెనక్కి వెళ్లి అప్పటి జ్ఞాపకాల్ని కలబోసుకొన్నారు కాబోలు.

రెడ్డిగారు బెంగుళూరులో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్ (నేటి డి.పి.ఐ)- 1918-21గా వున్నప్పుడు సర్.విశ్వేశ్వరయ్య గారు మైసూరు దివానుగా వుండేవారు. అప్పుడు ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు తీవ్రంగా వుండేవని విన్నాను. కారణాలు నాకు తెలియవు కాని ఆ సమయంలోనే (1921) సి.ఆర్.రెడ్డిగారు తన వుద్యోగానికి రాజీనామా ఇచ్చారట. మరుసటి రోజు ఉదయం రెడ్డిగారు ఎంతో వుల్లాసంగా కనిపించారు. *వెంకట్రామ్! విశ్వేశ్వరయ్యగారిని కలవడం ఎంతో ఆనందంగా వుంది.* చాలా *ఏళ్ల క్రితం* నేను *ఆయనపై కత్తులు దూశాను. ఆ పోరాటంలో నేను ఓడిపోయాను. కాని ఇప్పుడు తల్చుకుంటే ఒళ్లు జలదరిస్తుంది. ఈ నడిమి కాలంలో ఎన్ని మార్పులు వచ్చాయని! అభిప్రాయ భేదాలు మర్చిపోతాం. నిన్నటి శత్రువులు మిత్రులుగా మారిపోతారు.* ఆయన మాటల్లో నాకు విషాదం తొంగి చూసినట్లనిపించిది.

ఓ రోజు రెడ్డిగారు మాటల సందర్భంలో నాతో ఇలా అన్నారు–మన *దేశం నిండా ద్రష్టలు, మేధావులు, ఆదర్శ వాదులూ వున్నారు. అలాగా వొట్టి వాగుడుకాయలూ వున్నారు. ఆత్మస్థైర్యం, మంచి పట్టుదల వున్న మనుష్యులే ఈ ప్రపంచంలో ఏమైనా సాధించ గలుగుతారు. సర్దార్ పటేల్ లాంటి ఉక్కు మనుష్యులు – భారతదేశపు బిస్మార్కు లాంటి వాళ్లు చాలా కొద్దిమందే. నా దృష్టిలో మైసూరు ప్రాంతంలో హెచ్.సి.దాసప్ప (ఈ యువకుడు రెడ్డిగారి శిష్యుడు ప్రసిద్ధ న్యాయవాది, రాజకీయనాయకుడు కూడా.) లాంటి యువ కిశోరాలు ఒకరిద్దరే వున్నారు. వీళ్ల శక్తి సామర్థ్యాలు పటేలుగారితో పోల్చదగ్గవి కావు. కాని పరిమితమైనవే ఐనా పేర్కొన దగ్గవి* – రెడ్డిగారి మాటల్లో సంతృప్తి తొణికిసలాడింది.

ఆ రోజు రెడ్డిగారి పుట్టిన దినం. నేను ఆయనకు శుభాకాంక్షలు తెలపడానికై రెండు నిమ్మపళ్లు తీసుకెళ్లి, ఆయన చేతికిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపాను. మాటల మధ్యలో నేను *సార్, షష్టిపూర్తి జీవితంలో ఓ మహత్తరమైన మైలురాయి నట్లే, ఈ సప్తతి కూడా అలాంటిదే ఓ మైలురాయి* అని అన్నాను. *ఆయన ఔనౌను నేను ఆ మహత్తరమైన మైలురాయిని సమీపిస్తున్నాను* అని అన్నారు. ఆ మహానుభావుడు ఏ అర్థంలో అన్నారో తెలియదు కాని కొన్ని నెలల తర్వాత ఆయన ఆ మహత్తరమైన మైలురాయి దగ్గరే ఆగిపొయ్యారు. ఆ మేధావి డాక్టరు సి.ఆర్. రెడ్డిగారికి, ఆ వర్ణమయ వ్యక్తిత్వంగల కార్యశూరునికి ఇదే నా శ్రద్ధాంజలి.



వెంకట్రామ్



# నాట్య విద్య

- వేదాంతం రామలింగ శాస్త్రి

**నా రచనలు - నృత్యీకరణలు:**

*ఓం*కారం *పరబ్రహ్మ స్వరూపం*గా నమ్మే జాతిమనది. *పరబ్రహ్మమే సృజించిన మహావిద్యలలో లలితకళలు ఒక ప్రముఖ స్థానాన్ని కలిగి ఉండుట వల్ల వాటిని సాక్షాత్పరబ్రహ్మ స్వరూపం*గానే ఆరాధించే సంప్రదాయం మనది. అట్టి లలితకళలకు సమాహార స్వరూపంగా విభాసిల్లిన విద్య - *నాట్య విద్య.* ఈ విద్య కోసం బ్రతికేవారూ, ఈ విద్యతో బ్రతికేవారూ ఎందరో నేటి సమాజంలో అగ్రగాములుగా నిలిచినవారూ ఉన్నారు. వారికీ వీరికీ, నాట్యమే సర్వస్వం అయితే వీరు సృష్టించే తీరులు వేరు. ఈ విద్యను ప్రప్రథమంగా మానవాళికి అందించిన శాస్త్రమే- భరతమునిచే ప్రణీతమైన *నాట్యశాస్త్రం.* ఆ మాటకొస్తే ఈ శాస్త్రమే తొట్టతొలి- అలంకార శాస్త్రంగా పేరొందింది. ఇందు స్పృశింపబడని విషయాలు తక్కువ. లలితకళా సమాహారతకూ నైర్దేశికం ఇదే. దీనిని ఆధారంగా చేసికొని ఎన్నో అలంకార శాస్త్రాలు తరువాతి కాలంలో వెలుగుచూశాయి.

నాట్యాన్ని నేర్చేవారు, నేర్పేవారు, పాడేవారు, ఆడేవారు, వ్రాసేవారు, విమర్శించేవారు ఇలా ఎన్నికోణాలలో యోచిస్తే అన్ని కోణాలలోనూ ఈ గ్రంథం సమాధానమిస్తుంది. మార్గనిర్దేశకము అవుతుంది.

ఇక ఈ *నాట్యశాస్త్రం*లో నృత్తము, నాట్యముల గురించి చెప్పి నృత్యాన్ని స్పృశించలేదు. తరువాత వచ్చిన *అభినయ దర్పణాదుల్లో* నృత్యం చేర్చబడింది. అలాగే అష్టరసాలనే చెప్తూ శాంతాన్ని స్పృశించలేదు. అయితే స్థాయీభావాలలో 'శమము'ను చెప్పడం మూలంగా తరువాతి వారు దీనిని చేర్చారు. పై విషయాలకు కారణం నృత్త నాట్యాలలో నృత్యం మిళితమని, అష్టరసాలవల్ల కలిగే పరిణామం 'శాంత'మనే.

ఇట్టి గంభీరమైన శాస్త్రచర్చ ఈ వ్యాసానికి ఎందుకు?

అంటే ఇట్టి ఎన్నో లోతైన విషయజాలాన్ని అవగతం చేసికొనిననాడే రచయిత, ఆచార్యులు వారివారి సృజనల్లో రాణించగలరని నా ప్రగాఢ నమ్మకం. ఈ వ్యాసం - నేను చేసిన నాట్యరచనలనూ వానిని వేదికపైకి ఎక్కించిన తీరులను పరిచయం చేసే ముఖ్యోద్దేశ్యం గల్గినది కావడంచేత ముందుగా నా నాట్య కజ్జాల కొరకు నేనాశ్రయించిన శాస్త్రమిది- దానిని నేను చూచిన దృక్కోణమిదీయని చెప్పుకోవడం కొరకే.

ఒకరకంగా ఈ వ్యాసం 'స్వోత్కర్ష' కొరకు చెప్పానా? అనిపించింది. కొంత తప్పుగానూ తోచింది. కాని సోదరి శ్రీమతి అనూరాధ మన తరువాతి తరంవారికి మార్గదర్శకాలు కావడం కొరకని చెప్పడం నిజమేననిపించింది. అందుకే ఈ రచన. కాని ముందుగా *నే చెప్పేమాటేమంటే పరమేశ్వరుడైన గురుదేవుడు నా రచనలను, కల్పనలను, నృత్యీకరణలను, నటనలను, విమర్శలను చేయించాడనీ, ఈ పనులన్నీ శ్రీ స్వామి సంకల్పాన్ని నా ద్వారా చేయించారని సవినయంగా చెప్పుకొంటూ* ఇక ఉపక్రమిస్తున్నాను.

అది 1976-77 విద్యాసంవత్సరం. నాకప్పుడు 13సం॥ల వయస్సు. అప్పటికే నాకు వెంపటి పెద సత్యం, వేదాంతం పార్వతీశం, పసుమర్తి కృష్ణమూర్తి గార్లన్నా అపార గౌరవం. నా గురువు, అన్నయ్యగు వేదాంతం రాధేశ్యామ్ వద్ద విద్యనభ్యసిస్తూన్న రోజులు. వీరిని, వీరి నాట్య విన్యాసాలను రోజూ చూస్తూ ఉండటం, కూచిపూడి పాత యక్షగానాలను చూస్తూ ఉండటం ఒక వంతైతే, పెద సత్యం, కష్ణమూర్తి, వేదాంతం రాఘవయ్య చిత్రీకరించిన చలన చిత్రాదులను బాగా చూడటం ఆ పైన పాత తరపు చలన చిత్ర నటీనటులను బాగా ఇష్టంగా అనుసరించడం,

అనుకరించడంలు నాలోని 'కళాకారుణ్ణి' బయటకు తెచ్చాయి. అదే సమయంలో దండిభొట్ల వేంకటశాస్త్రిని ఓతూరి మా కళాక్షేత్రంలో సన్మానించారు ఘనంగా. అబ్బురంగా అనిపించి 'ఎందుకలా' అని అడిగాను, అక్కడున్న కార్యకర్తలు వారు *పార్వతీకళ్యాణం* అనే యక్షగానాన్ని రచించారని చెప్పారు. ఆ సరసనే పి.వి.కృష్ణశర్మనీ సత్కరించారు. అదీ అడిగాను- వీరు దానిని నృత్త్యీకరించారన్నారు. ఆ తరువాత *పార్వతీకల్యాణ* ప్రదర్శన జరిగింది. ఆసాంతం చూశాను.

ఏదో ఒక ఊహ-ఏదో ఒక అంతర్మథనం చోటు చేసుకున్నాయి ఆ పసి హృదయంలో. తరువాతి రోజు ఆగకుండా మా ఊరి సినిమా హాల్లో 'భూకైలాస్' అనే సినిమాను చూశాను. దాంట్లో నర్తనాలు, నటనలు మరో ప్రక్కనన్ను కదిలించాయి. అంతే... *భూకైలాసమనే* యక్షగానం గురుదైవం నాచేత వ్రాయించింది. ఏమో అందులో ఛందో, అలంకారిక విషయాలకు ఎంత స్థానముందో తెలీదు. కానీ గీత పద్యాల్లో మాత్రం ఆనాటికే నాకు కొంత ప్రవేశం ఉంది.

యక్షగానాల బాణీలు కొంత వింటున్నవే కదా! ఎన్టీ రామారావు ధరించిన 'రావణ' పాత్ర నేనూ-మిగిలిన పాత్రలు నా మిత్రులు - సహాధ్యాయులచే పోషింపచేశాను. పసుమర్తి మురళీ కృష్ణ 'శివుడు', పసుమర్తి శ్రీనివాస శర్మ 'పార్వతి', భాగవతుల భాస్కరరామశర్మ నారదుడు ఇలా... (వీరప్పుడు ప్రఖ్యాత కళాకారులే)

దీంట్లో సంప్రదాయబద్ధంగా ముందు పూర్వరంగ- రంగపూజా విధులు అనంతరం కథాగాన గద్యలున్నాయి. రంగంలోనికి నల్గురు మంత్రుల మధ్య నన్నుమించి పొడవున్న ఒక దండాన్ని భుజానుంచుకొని 'రావణుడి'గా నేను ప్రవేశించాను.

వలుగుడువరునలతో ప్రవేశం. మంత్రులు మాత్రం నాకంటే ముందు- వారివెనుక హుందాగా మీసాలు ఎడంచేత్తో త్రిప్పుతూ నేను (రావణుడు), చిన్నతనం కావడంచేత నాట్యధర్మిగా రూపానురూపం ఉండనే వున్నది. ప్రవేశ దరువులు, సంవాద దరువులు బాగానే ఉన్నాయి. ఈ మధ్య నా పాత కాగితాల్లోంచి ఈ నాటకం తాలూకు కొన్ని కాగితాలు బయట పడ్డాయి.

**"రావణాసురుడు రణకుతూహలుడు,**
**శివభక్తాగ్ర గణ్యుడిదె వెడలె"...**

అంటూ ప్రవేశదరువు ఉంది.

అయితే పూర్తిగా నాకూ గుర్తులేదు నాటకమంతా... ఇప్పుడా 33 ఏళ్ళ క్రితం - మాటాయె!... ఏవో తీపి జ్ఞాపకాలు మినహాయిస్తే గుర్తున్నవి తక్కువేమరి. ఆ తరువాత ఏకపాత్రాభినయాలూ, పారడీ యక్షగానాలు, పేరడీ సినిమాలు నా మిత్రులతో ఎన్నో చేస్తూనే వచ్చాం 1979 దాకా. ఆ రోజుల్లోనే మా మేనల్లుడు చి॥ డియస్వీ శాస్త్రి క్కూడా దుర్యోధనుడి వేషం వేసి మా ఊరంతా త్రిప్పేవాణ్ణి అతడికి అప్పుడు మూడేళ్లే మరి. ముద్దుగా ఉండేవాడు. ఆ రోజుల్లో నేను చేసిన చిన్న చిన్న నాటకాల ప్రదర్శనలకు మా పెద్దలు అబ్బురపడేవారు. పెద సత్యం గారైతే ఏకంగా నన్ను మద్రాసు తీసికెళ్తాననేవారు. పి.వి.జి.వారీనాటికీ ఆ విషయాలు చెప్తూ నవ్వుతూంటారు... సరే ఈ విషయాలెందుకు లెండి ప్రస్తుతానికొద్దాం.

నా కాలేజీ రోజులయ్యాక నేను నా మిత్రుడు పసుమర్తి వెంకటేశ్వర శర్మ కలిసి *మహిషాసురమర్ధని* యక్షగానం రూపొందించాం. దీంట్లో పద్యాలన్నీ నాచేత వ్రాయబడ్డాయి. నృత్యీకరణ, దర్వులు వారివే. 1986లో *శ్రీ వేదాంతం కూచిపూడి కళాపరిషత్తు*ను విజయవాడలో నెలకొల్పి *శ్రీ కృష్ణవిజయమ*నే నృత్యరూపకాన్ని 1988లో అనుకుంటా రచించి నా శిష్యబృందంతో కలసి *హనుమంతరాయ గ్రంథాలయం*లో ప్రదర్శించాం. దీంట్లో వాద్య బృందంతో సహా 40 మంది కళాకారుల పైమాటే నల్లాన్ చక్రవర్తుల బుచ్చయా చార్యులు దీనికి సంగీతం చేశారు. నాది కంసపాత్ర 'దేవకీవసుదేవుల' వివాహానంతర ఘట్టం నుండి కంస సంహార- ఉగ్రసేన పట్టాభిషేకం వరకూ ఈ నృత్యరూపకం నిడివి 3గం॥లు.

పూర్వరంగ, రంగపూజ, మంగళా చరణాది కాలయ్యాక కంసుడు ప్రవేశించే దరువు....



రావణ బ్రహ్మగా...

**'కొలువు తీరె కంసచక్రవర్తి-భుజబల స్ఫూర్తి,**
**అగణితమౌ యశోదీప్తి-దశదిశలకు చెందె వ్యాప్తి** ॥కొలువు॥

దాదాపుగా 'నా' ప్రతినాయక పాత్ర ప్రవేశాలను 'త్రిశ్ర' గతిలోనే రూపొందిం చాను. కారణం వీర, రౌద్రరసాలకు త్రిశ్ర, ఖండ జతులు ఉత్తేజాన్ని యిస్తాయని కాగా కొంత 'అడవుసాము' ఆస్కారం ఉండి నాటకా రంభంలోనే ఉత్తేజాన్ని కల్గిస్తూ ప్రేక్షకులను 'ఉన్ముఖీకరణ'ము చేసే ప్రయత్నమది. త్రిశ్ర జాతిలో ప్రవేశ దరువు కాగానే వెంటనే 'భటుల' చే కైవారాలను గీతికలో చెప్పించి 'చతురస్ర' జాతిలో నర్తకీమణుల చేత 'జావళీ'ని చేయించాను.

**"వలరాజ నా మోవి కావలెనా?**
**నెలరాజ నా విందు కావలెనా...**

త్రిశ్రం కాగానే చతురస్రం వాడటం వల్ల వీరం నుండి శృంగారంలోనికి మళ్ళించే యత్నం. ప్రవేశదరువులో నృత్తాత్మక నాట్యాన్ని చేయించడం నాకుతోచిన ఆలోచన. అందులో తాండవాత్మక అడవుసాము-ఇందులో లలితాత్మక విన్యాస హేతిక... అంటే 'ఎండలోని వారు నీడకొచ్చినట్లు'. ఎండలోని చుర్రుదనము, నీడలోని చల్లదనము చవిచూచిన రసహృదయ-ప్రేక్షక వర్గం ఇకమీదట ప్రదర్శన అయ్యేవరకూ ధ్యాసను ప్రక్కకు మరల్చరన్నది నాయాలోచన.

కంసుడు రౌద్రాన్ని పొందాక అంటే తాను విష్ణువైరియైన కాలనేమియన్ రాక్షసావతారుడని తెలిశాక సాధుధిక్కారాన్ని చేసే రంగంలో ఖండజాతిని

**"ధిక్కారములు సల్పి విప్లవాగ్నులు రేపి**
**కల్లోలములు సేయుడీ... విష్ణు జనులను గూల్చుడీ...**
**నారాయణాయన్న నాల్కలను గోయండి**
**శ్రీ హరియనియన్న జీల్చండి దేహముల**
**రాజాధిరాజైన కంసుడే ఈ భువికి**
**దేవాధి దేవుడని జాటించి దెల్పండి** ॥ధిక్కార॥

ఇందులో కంసుని చేత రౌద్రస్ఫోరకంగా నడకలను మాత్రం నడిపిస్తూ రాక్షస, భటులచేత మాత్రం నర్తనం చేయించడం జరిపాను. కారణం కంసుని దర్పం ఈ విధంగానే ఇనుమడింస్తుందనేది నా మతం. అలాగని అసలు నర్తించడని కాదు. అవసరమైనమేరకే కాని రాక్షసాదులు మాత్రం అతి మాత్రంగానే, ఇందుచేత ప్రేక్షకులకు కంసునిపట్ల కొంత అసామరస్యభావం కల్గాలి. వెంటనే వచ్చే యజ్ఞయాగాది క్రతుధ్వంసాలు, మౌనియతిగణాలను చేసే హింసలు, ముని పత్నుల జుత్తులను ఈడ్చే చర్యలు సహాయపడతాయి. ఈ ఖండజాతిని పూర్తిచేసిన మీదట మిశ్రంలో విలంబంలో మునులు, దేవతలు, నారదాదులు శ్రీహరిని వేడుకొనే శరణార్త నాదాత్మక గీతం చేయించడంలో ఒక్కసారిగా కరుణరసం కళావేదికంతా అల్లుకోకమానదు కదా! కరుణ రసానికి సమాధానం అద్భుతరసం.

దీనిని లక్ష్మీనారాయణుల దర్వులో చూపడంతో... శ్రీవారి సాక్షాత్కారంతో అమృత వర్షం కురిసి హర్షాతిరేకు లౌతారు ప్రేక్షకవర్గం. దీనికి 'సీసపద్యం' వ్యంజనమౌతుంది. ఇలా *శ్రీ కృష్ణ విజయం నృత్యరూపకం*లో నా రచన, నృత్య కల్పనాలు సన్నివేశం మరింత కొంగ్రొత్తదనంగా ఉండాలని అనిపించి స్వరలఘుగీతం చేశాము చరణాల్తో...

**"మధురము మన స్నేహము రాధా...**
**కథలకు నవరూపమూ...** అంటూ చరణాల్లో...
**"శశికిరణమునకు సరసిజము పగిది**
**వశములు సడలెను ఇరువురి తనువులు**
**పరమ శివునికి సరసన సతివలె**
**నిరతము సుఖముల సముఖము నిలువగ** ॥మధురము॥

**"అతివకు అలకలు అతిసొబగులమర**
**అతనునియలగులు మన మున దగిలెను**
**తరగని వలపులు జెరగని ప్రణయము**
**తెరమరుగెరుగక తిరముగ నిలుచును** ॥మధురము॥

ఇందులో లలితాత్మకమైన చతురస్రపు నడకలు, రాధాకృష్ణులు-సోయగంపు విలాస భంగిమలు చేయించి రసరమ్యచకితులను గావించే విషయంలో సఫలుడనే నయ్యాను.

కాగా గోపికలు శ్రీకృష్ణుని కొరకు చేసే నిరీక్షణ పద్యాలలోను తదనుగుణంగా కృష్ణుని రాక-వారితో చెలిమి నర్తనంతో చేయించాను. వివిధ రాగస్వరాల మేళవింపుతో పద్యాలలో సౌమ్యతను, రాగాల మేళవింపు (మ్యూజిక్ బిట్స్)తో పులకింతలను తెప్పించే ప్రయత్నం. ఈ పద్యం చూడండి... ముక్త పదగ్రాస్తాలంకారంతో.... సీసం

**"గోపీ జనోల్లాసు గోపాలు జూతురే,**
**లలిత తమాల పల్లవము లార!**
**లలిత తమాల పల్లవపాదు జూతురే,**
**మరువక పున్నాగ తరువులార!**
**మరువక పున్నాగతరువాసు జూతురే**
**రమణీయ వికచ నీరజములార!**

**రమణీయవికచనీరజనేత్రు జూతురే,**
**దళిత పాప తులసీ దళము లార!**
**దళిత పాపతులసీ దళహారు జూతురే!**
**తమ్మివిల్తు దోహదమ్ములార!**
**తమ్మి విల్తు దోహదాకారు జూతురే,**
**మధువనీ వాస వధువులార!!**

ఇందులో ప్రతి పాదం వెనుక పాదంలోని చివరి వాక్యంతో మొదలౌతుంది. ఇక్కడ రమ్యమైన సంగీతంతో మేళవించిన సాహిత్యంలోని వైచిత్ర పాత్రచేసే నర్తనానికి ఆలంబనం. ఇదే నేను రసస్ఫూర్తిని కల్గించడానికి లలితాత్మక సన్నివేశాల్లో వాడే నృత్యీకరణ పద్ధతి. నా ఉద్దేశ్యంలో నృత్యీకరణమునకు – హావభావ నర్తన విన్యాసాలకు సమతుల్యతను గల్గిన సంగీత సాహిత్యాలను జోడించు కొన్నపుడే రసస్ఫూర్తి ఇనుమడించేది యని, అందుకే నాకు తెలిసిన బాణీని కట్టుకొని ముందు రచించడము – రచించేటపుడే నర్తన విన్యాసాలకు నటనకు అనువైన పదజాలాన్ని ప్రోదిచేసి రూపొందించడం జరుపుకొంటాను.

ప్రఖ్యాతము, కల్పితము, మిశ్రమములనే పద్ధతులు ఆయా మహాకవులు అనాదిగా పాటించిన, పాటిస్తున్న విషయమే. ఆ పద్ధతులనే నేనూ ఆశ్రయించాను. నా రచనల్లోను, నృత్యకల్పనలలోను అంటే పెద్దలు చూపిన పద్ధతులను యథాతథంగా అనుకరించడం, నా దైన బాణీలో కల్పన, పెద్దలను ఆదర్శంగా తీసికొని నా బాణీని దానికి కూర్చడం. ఈ మూడు విధాలు నాకిష్టమయినవే. నా కబ్బినవేకూడాను –గురుకృపాభాగ్యములుగా కొన్ని ఉదాహరణములు :–

*నర్తనశాల* నృత్యరూపకం తిక్కనాచార్యుని *మహాభారతంలోని విరాటపర్వమును*, వ్యాసులవారి *భారతం*లోని విరాటపర్వాన్ని కొంత చదువుకోగల్గాను. తిక్కనాచార్యుని నాటకీయతకీ ఘట్టం దర్పణం. అసలీ రూపకాన్ని రచించవలసిన అవసరంలేదు. మిత్రుడు పసుమర్తి వెంకటేశ్వర శర్మ కొరకు చేశానీ కావ్యం. ఏవో కారణాలవల్ల వారీ రచనను వాడుకొనలేదు. ఏళ్ళు గడిచాయి.

నాకు తెలీకుండానే మా 'డియస్వీ శాస్త్రి' సంగీత రచన చేశాడు. ఆ రోజుల్లో విద్యార్థిదశలో నా దగ్గరే ఉంటున్నాడు. చిరంజీవి వేదాంతం వెంకటాచలపతి (వెంకు) శాస్త్రికి ఈ విషయంలో ప్రేరకుడు. 'యశోద' అనే నర్తకి ఆరోజుల్లో నా పర్యవేక్షణలో నాట్య శిక్షణ పొందుతూంది. వారిర్వురికీ ఈమె తోడ్పాటు వారిపని పూర్తికాగానే మెల్లగా నాకు చెప్పారు. దీన్ని చేయాలి మనం అని, నాకు తప్పనిపించినా తప్పలేదు.

పెద్దలు కొందరు *నర్తనశాల*ను నవలారూపంగా రచించి ఎంతసమర్థుడయినా పరస్త్రీని బలాత్కరించబోవడం – ఆశించడం వల్ల కీచకుడు పరలోకవాశుడయ్యాడని ఈ విషయం మినహాయిస్తే అతడు కూడా సమర్థుడుగా కరుణజూపారు. ఈ విషయం నాకు నచ్చింది కాదాయెను. కారణం మదమాత్సర్యాలతో మత్తెక్కి వల్లమాలిన కామ ప్రకోపంతో మహాసాధ్వీమణి ద్రౌపది దేవిని కామించడం తప్పు. సైంధవుడూ అలాటివాడేగా మరి. రావణుదు కూడాను, వీరిని అలా అని వదిలేయగలమా?... అలాగంటే వీరిని బోలినవారు కొల్లలుగా రారూ, వ్యాసభారతంలో కీచకుని కాముకుడుగా, నీచుడుగానే చూచాడు. తనకు తానే వీరుణ్ణి అని చెప్పగానే గర్వీగా పోలుస్తాడు.

ఇక తిక్కన *భారతం*లో *రూపాభిమాని, నానాభరణ ధరణశీలుడు, దుర్విదగ్ధుడు, బలగర్వితుడు, సింహబలుడు, కాముచేజిక్కిన నెమ్మనంబు గలవాడు, చేటును కల్గించేమానము కలవాడు, మనోజవికార మగ్నుడు, నరాధముడు, వివేకహీనుడు, సత్వహీనుడు రాగసాగరపూరనిమగ్నుడు, చపలుడు, దురభిమాని* యని పోల్చడం జరిగింది. నేనీపాత్రను పరిచయం చేసిన తీరును చూడండి

**సింహబలుడు ధీరశూరఘనుడు దర్పాన్వితుండు,**
**కీచకుండు రణవిహరణగుణుడు బహుబలాన్వితుడు**
**మత్స్యరాజ్యదండ నాథుదరివీర భయంకరుండు**
**ఛిదుర గదాభీలుడితడు మల్లయుద్ధమర్మజ్ఞుడు ॥సింహ॥**

**అనుచరణ సంసేవితుడితడు జయగానప్రియుడు**
**విరటరేని కూరిమిమరిదితడు కడుస్వతంత్రుండు**
**దిగ్దిగంత పరివ్యాపిత యశోకరుడు భయంకరుడు**
**యక్షకిన్నెరాధి కాధ్య బలగర్విత మహితుడితడు ॥సింహ॥**

**శృంగార పయఃపాయి యితడు మరురాజ్యచరుడు**
**నిరత వధూ సరసాన్వితుడితడు కడుయందగాడు**
**మధుపాన సరాగచిత్త సుఖలాలస మానసుండు**
**బహు రత్నాభరణాంచిత శోభిత సమ్మోహకరుడు ॥సింహ॥**

ధర్మజుని పాత్ర ప్రవేశ విషయంలో కొంత యధానువాద పద్ధతిని సాగినా భీమార్జున ద్రౌపద్యాదుల విషయంలో మిశ్రమ కల్పితాలుగానే చేశాను. కిచకుని విషయంలో తిక్కనాచార్యుడు

చేసిన పరిచయ విశేషణాలను కీచకుని ప్రవర్తనలో రూపకాంతం వరకూ చూపిస్తూ ప్రవేశదర్వు నాదైన బాణీలోనే రచన చేశాను. నృత్యీకరణలో పూర్తిగా నా బాణీని చూపాను.

నర్తనంతో పాటుగా నటన నాకభిమతం. కొండొకచో నటనకే ప్రాముఖ్యం ఎక్కువ. రసభావాలకు భంగంకాని నర్తనం చేసే పద్ధతి నాది. నర్తనంగావిస్తూనే సాత్వికాది భావాలను ప్రోదిచేస్తాను. పాత్రను ప్రేక్షకులు క్షుణ్ణంగా అవగతం చేసుకొనే వరకు సాత్వికాభినయ ప్రకటనకు పెద్దపీట వేస్తాను. ఇదే నాట్యమంటే నా ఉద్దేశ్యంలో. పాత్ర స్వభావాలను చంపే నృత్యాన్ని చేయించను. అనవసరమైన చోట ఇక చాలునన్నంత వరకూ చేయించే తత్వమూనాకున్నది. ఉదాహరణకు ఉభయభారతాల్లోనూ బృహన్నల ఉత్తరాదులకు నృత్యాన్ని నేర్పే క్రమాన్ని పొడిపొడిమాటల్లోనే చెప్పారు. కొందరు నాటక కర్తలు పాటలను, కీర్తనలను చేశారు. సినిమాలో పెదసత్యంగారు గణపతి కౌత్వం, కీర్తనలు చేయించారు. ఈ సందర్భంలో నేను పెద సత్యంగారిని కొంత మార్గదర్శికతను చేసుకొంటూనే నా బాణీని చేశాను.

ముందుగా నమస్కారవిధి, గణపతి, నాట్యపుష్పలు నమస్కార విధులను రచించి చేయించాను. ఇందులోని స్వర, జతి, రాగగమనాలు, సాహిత్యము నృత్యోద్దిష్టంగానే సాగుతుంది. దీనిలో వివిధ పాదభేదాలు, ఉభయ చారీ విన్యాసాలు, నృత్తహస్త విన్యాసాలు చేయించాను. ఇక్కడ ఇవి అవసరం. ఈ సన్నివేశంలో నర్తనం పరాకాష్ఠ దశకు చేరాలి. చేకూర్చాను. సున్నితమైన సన్నివేశాలలో లలితమైన నర్తనానికి అవకాశం యిస్తూ హావ ప్రకటనకే పెద్ద పీటవేస్తాను. అలాగే భీమ కీచక యుద్ధసన్నివేశాన్ని వివేచించాల్సిందే. కళాశాస్త్రంలో యుద్ధము, మరణము మొదలైనవి అనుచితాలుగా చూపకూడనివన్నారు. కానీ, కొంత అతిక్రమించాల్సి వచ్చింది. అవి తప్పుగా నాకు తోచలేదు. కారణం ఈ సన్నివేశం లేకపోతే రూపకం ప్రాణాన్ని కోల్పోతుంది. అప్పుడు అభాసయోగం చుట్టుకోదా మరి.

రసభంగమనేది నటునికి, రచయితకి, దర్శకునికి పంచ మహాపాతకాలని మించేదిగా చేస్తుంది. ఇక్కడ ఈ మూడు నేనే కాబట్టి అంత పాపానికి పాల్పడేది లేదనే నా నిర్ణయం. దీని ముందు అది స్వల్పం. ఐతే ఈ సన్నివేశానికి పాపం ఆపాదింప బడకుండా సాహిత్యాన్ని వ్రాయలేదు. అందుచేత రచయితగా తప్పించుకున్నాను. కేవలం (మ్యూజిక్ బిట్టు) స్వరాలమీద చేయించడంతో నర్తన ద్రోహిని కాలేదు. జతులు లేవు కాబట్టి, కేవలం మల్లయుద్ధపు పట్టులను మాత్రమే చూపడం చేత రక్తపాతం లేదు కాబట్టి యుద్ధదోషం లేదు. ఇక క్రిందపడిన కీచకుని తెరచాటు చేసి చేడియలు తీసుకెళ్ళడంతో శవదర్శనమూ లేదు. కాబట్టి ఆ దోషాలేవీ రచయిత, దర్శకుడు, నర్తకుడు అయిన నాకు అంటలేదనే నమ్మాను. కాదు.. కాదు.. చూచిన విజ్ఞులు ప్రశంసా పూర్వకంగా చెప్పారు. ఈ పట్టునాకు గురుకృపాలబ్ధంగా అబ్బిందనే అంటాను.

నాటకాదిని భీముని ప్రవేశదర్వులో కూడా 'భోజన దర్శన' పాపం అంటకుండా కేవల వర్ణనతో సరిపెట్టాను.

**గారెలు, బూరెలు, నేతి బొబ్బట్లు, అప్పడాలు, వడలావడలున్**
**పాయసాన్నాలు, చిత్రాన్నాలును దండిగ ద్రుటిలో చేయగలన్**
**అల రాజేంద్రులు సైతమావురని ద్రేన్పుగట రసనల నూరింతులన్**
**నలు చెరగుల ఈ పృథివీస్థలిలో నాకు సరిలేరు ఓ రాజా!!**
**పాక శాస్త్రమున ప్రవీణతల్లల వలలుండను ఓ మహారాజా**
**మిమ్మాశ్రయించి వచ్చినాడనిటు భీముని బంటును ఓ రాజా...**

నిజానికిది యథామూలానువాదం కాదు. అసలీవర్ణన మూలభారతాల్లోలేదు.

*సౌన్దరనందమనే బుద్ధుని గాథ*ను నృత్యనాటికగా చేయవలసి వచ్చింది. దీనిని 'కాంటూరి పింగళకవులు' పద్యకావ్యంగా రచించారు. దీన్ని యథామూలానువాదంగా వ్రాసి నృత్యీకరించి ప్రదర్శించడం ఆ అడిగిన వారియభిమతం. దాన్ని చదివాక బుద్ధుని చూపించాల్సిన కోణం మూలంలో చెప్పిన పద్ధతి చాలదనిపించింది. నృత్యనాటికాపద్ధతిలో అందుకే ముందుగా మూడ్నాల్లు రంగాలను సృజించాల్సివచ్చింది. అలాగని చెప్తే ఆ అడిగినవారికి అంతగా రుచించలేదు. నేను వారికి తలొగ్గనూ లేదు. కారణం నా పంథామీద నాకున్న నమ్మకం. తీరా ప్రదర్శన ముగిశాక ఆ పెద్దాయన మంచిపనిచేశారు మాష్టారు అన్న కితాబిచ్చారు. ముందుగా బుద్ధుని పాత్రగురించి ప్రశంశాగానం నర్తక నర్తకీమణులచేత చేయించి దాంట్లో...

**"సప్తాశ్వమ్ముల నధిరోహించి**
**లోకతిమిరముల నణచుభాస్కరుడు**
**రోదసిని వీడి జ్ఞానబోధనల**
**పాదచారియై నేల దిగినాడో...**
**ఇతడే కదా శాక్య వంశోద్భవుడైన**
**సిద్ధార్థుండను లోకరక్షకుడు – ఇతడే కదా...**

ఈ సందర్భంలో అశ్వాలను బోలి ముందు మలచబడిన కళాకారుల వెనుక హుందాగా రథికునిలా సంచరించడం (సూర్యుని బోలి) చూపించి వెంటనే ఆ అశ్వాలుగా ఉన్న కళాకారులందరూ ఓంకారము వలె మలచబడి వారిమధ్య జ్ఞానముద్రతో బుద్ధుని చూపడం జరిగింది. నిజానికి ఇట్టి నృత్యీకరణములు 'పద్మభూషణములు' వెంపటి చిన సత్యం గారి జ్ఞానఫలంగా ప్రతిఫలించినట్టివే. అంటే దీనిని వారినుండి యథాతథంగా తీసికొన్నానని కాదు. వారిట్టి వెన్నో చేయడం చేత వారిని ఆదర్శంగా గమనించడంచేత నాకు స్ఫురించినవే. ఇలాగే బుద్ధుని బోధివృక్షాన్ని వారి జ్ఞాన పీఠాన్ని కళాకారుల చేతనే చూపడం జరిగింది.

*గోదాకల్యాణం* లోనూ గోదాదేవి బాల్యంలో చెలులతో ఆడుకొంటూ వారికి శ్రీహరి లీలలను చెప్తూ దశావతార వర్ణనం చేయించాను. ఆయా అవతార మూర్తిని చూపేటప్పుడు ఆయా విశేషాలను అంటే ఆయుధాలు, వాహనాదులన్నింటినీ ఆ బాలనర్తకీమణులచేతనే చూపడం జరిగింది. వెంట వెంటనే ఈ మార్పులు పూర్తిగా సాహిత్యాన్ననుసరించే చూపడం జరిగింది.

> **"చక్రిని వీడరె చెలులార**
> **శ్రీ కృష్ణుడె జగతికి జీయయనుచును**
> **లక్ష్మీ నాథుని లతా పర్ణుని**
> **రవిశశి నేత్రుని పొగడగరారే ॥చక్రిని॥**
>
> **ముచ్చుసోమకుని మత్స్యమై ద్రుంచి**
> **మందరమును తన మూపుపైమోసి**
> **మోహినిగా యమృతమును నొసగి**
> **కిటిరూపముతో పుడమిని గాచిన ॥చక్రిని॥**

ఇలా శ్రీహరియవతార విశేషాలనన్నింటినీ వెంటవెంటనే చూపడం చేత ప్రేక్షకుల మన్ననలను పొందేయవకాశ మొచ్చింది. *గజాననీయం* రూపకం అనువాద పద్ధతిలో కాక పూర్తిగా నా కల్పనలతోనే రచింపబడింది. ఆ మాటకొస్తే నా రచన సాగేటపుడే కొంత నృత్యీకరణకు దారి సుగమమౌతుంది. అలాగే రాస్తాను. బాలవినాయకుని నలుగుతో బొమ్మచేసిన పార్వతిని చూచి చెలులు–

> **ఆనాడా మరుదేగుదెంచి మిము గల్పంగోరి నిర్దేహుడై**
> **ఈనాడీ ప్రతిమా ప్రమాణమున సాంగీభూతుడై జేరెనో?**
> **ఓ నాగాభరణార్థగేహిని! వినీలోత్ఫుల్ల పద్మాసనా!**
> **ప్రాణం బేర్పడ జేయుమమ్మ జననీ బ్రహ్మాదు లోహోయనన్.**

ఆనాడు శివపార్వతులను కలుపుటకు మన్మథుడు తన శరీరాన్ని కోల్పోయాడు. ఏలాగో మరల మరోవిధంగా బ్రతికాడు. అశరీరుడై మన్మథుడు శరీరం కోసం తిరుగుతూ నేడీ ప్రతిమలో చేరాడేమోయన్నట్లు అందంగా ఉందమ్మా! ప్రాణంబోసి మరో మన్మథునివలెనే రెండవసారి పునః జన్మించడం కాగా మన్మథుడశరీరుడు, ఈతడు గజముఖుడు.

ఇదే గాథను *వినాయక చవితి* యనే పేరుతో పునః నేనే వ్రాసి నా శిష్యప్రశిష్యులతో కలిసి ప్రదర్శనలను చేశాను. దాంట్లో ఇట్టి కల్పనలు మరెన్నో. ఇలా చెప్పుకుపోతే ఇదో గ్రంథమవుతుంది. కానీ ప్రస్తుతం కావలసింది వ్యాసమేకదా ముగిద్దాం. అయితేనే రచించినవి నేను నృత్యీకరించి నా శిష్యులతో కలసి ప్రదర్శించినవి, నేరచించి పరులకొరకు నృత్యీకరించినవి, కూచిపూడి నాట్యపద్ధతికి సంబంధించిన అన్ని విధాలైన ప్రక్రియలు అంటే *నృత్యనాటకాలు, యక్షగానాలు, నృత్యరూపకాలు, సమకాలీన కథలు, కేళికలు, నృత్యనాటికలు,* కలాపాలు 60కి పైగానే చేశాను. కాదు పరమగురుడు చేయించాడు.

అంతే కాదు ఎన్నో కీర్తనలు, శబ్దాలు..., పదాలు, జావళీలు, వంటి వ్యస్థాంశాలు, బృంద నృత్యాలకనువైన పాటలు, ప్రముఖసంస్థలను పరిచయం చేసే (థింసాంగ్స్) పరిచయగీతాలు చాలా వెలువరించారు. నృత్యీకరించి ప్రదర్శించాను, ప్రదర్శింప చేశాను.

ఈ విషయంగా మరొక్కసారి నేను సవినయంగా చెప్పుకొనేదేమంటే పరమగురుడు నన్ను నిమిత్తమాత్రునిగా పెట్టుకొని నా చేత చేయించినవే నే రచించిన, నృత్యీకరించిన, ప్రదర్శించినవన్నీనూ, *రామకృష్ణపరమహంస చరితకు, తరిగొండ వేంగమాంబ, శ్రీనివాస కళ్యాణమ్* వంటి కొన్నింటిని మలచి ప్రదర్శించే సమయాల్లో నాకా స్ఫూర్తిని నిలువుటద్దంలా పరమగురుడు నిల్చి నిదర్శనాలనిచ్చాడు. ఒక్కోసారి స్వామి మన సహచరుల రూపంలోనో, సంస్థానిర్వాహకుల రూపంలోనో నన్నుత్తేజం చేశాడనే భావిస్తా.

నేను చేసినవి తక్కువ, గురుడు నా చేత చేయించినవే ఎక్కువ. నా రచనల్లో, ప్రయోగాల్లోనూ బాగోనివేవయినా ఉంటే నావి, బాగున్నవన్నీ పరమగురునివే. ఈ మంత్రమే నేను భావితరాలవారికిచ్చే సందేశము.

# శ్రీమదగ్నిమహాపురాణము

– పుల్లెల శ్రీరామచంద్రుడు

వాఙ్మయంలో అనేక ప్రక్రియలు ఉన్నాయి. వాటి అన్నింటి ప్రధానోద్దేశ్యం మానవునికి సన్మార్గానికి ఉపదేశించడమే. ప్రతి ఒక్క మానవుడూ సన్మార్గాన్ని అనుసరించినట్లయితే సమాజం అంతా తనంతతానే సన్మార్గంలో ఉంటుంది. ఈ సన్మార్గప్రవృత్తికే 'ధర్మం' అని పేరు. ధర్మశబ్దానికి ప్రసిద్ధమైన నిర్వచనాలు రెండు మూడున్నాయి. *ఇది చెయ్యాలి* అని వేదం ఏది బోధిస్తుందో అది 'ధర్మం' అనేది ఒక నిర్వచనం. ***చోదనా లక్షణోఽ ర్థో ధర్మః*** (జై.సూ.) మానవుల అభ్యుదయానికీ, అనగా ఐహిక సుఖానికీ, నిఃశ్రేయసానికీ, అనగా పారలౌకిక సుఖానికీ, (మోక్షం అని కూడా దీనికి అర్థం చెప్పవచ్చును). సాధనమైనది ధర్మం అనేది మరొక నిర్వచనం. ***యతో–భ్యుదయనిః శ్రేయససిద్ధిః సధర్మః*** (వై.సూ.) అసలు ధర్మ శబ్దానికే 'ధరించేది', 'నిలబెట్టేది' అని అర్థం. అనగా లోకవ్యవహారం అస్తవ్యస్తం కాకుండా, నిలబెట్టేదానికి ధర్మం అని పేరు.

ఈ ధర్మం ప్రవృత్తిరూపమూ, నివృత్తిరూపమూ అని రెండు విధాలుగా ఉంటుంది. ఈ రెండు విధాలైన ధర్మాన్నీ కూడా వేదపురాణాదులు బోధిస్తాయి. వేదంలో ఉన్న పూర్వభాగం అంతా ప్రవృత్తిరూపధర్మమైన కర్మకాండను ఉపదేశిస్తుంది. ఉత్తరభాగం –దానికే వేదాంతం అని పేరు – జ్ఞానాన్ని ఉపదేశిస్తుంది. జ్ఞానమే నివృత్తిరూపధర్మం. ఈ కర్మ చెయ్యాలి, ఆ కర్మ చెయ్యాలి అని పూర్వభాగం బోధిస్తే, ఆ కర్మలన్నీ ఇచ్చే ఫలం అశాశ్వతమైనది; అందుచేత *ఫలదృష్టితో కాకుండా కర్తవ్యతామాత్రదృష్టితో కొంతకాలం కర్మలను ఆచరించగా కొన్నాళ్ళకి చిత్తం పరిశుద్ధం అవుతుంది; అప్పుడు ఆ కర్మలన్నీ పరిత్యజించి ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చెయ్యాలి* అని చెపుతుంది ఉత్తర భాగం.

పురాణాలన్నీ కూడా ఇంచుమించు ఈ విషయాలనే బోధిస్తాయి. వేదోక్తాలైన కర్మలన్నీ ఏ విధంగా ఆ యా ఫలాలు ఇస్తాయో ఫలనిరపేక్షంగా ఆచరిస్తే చిత్తశుద్ధిని కలగచేస్తాయో, అదేవిధంగా తత్తద్దేవతోపాసనలు, తదంగాలైన మంత్ర జపాదులు, దేవాలయనిర్మాణ దేవతాపూజాదులు కూడా ఈప్సితార్థసిద్ధినీ కలిగిస్తాయి. ఇది ప్రవృత్తిధర్మంలో అంతర్గతం అయినది. ఈ విషయాలు బోధిస్తూ అనేకమైన *శాక్త – శైవ – వైష్ణవాగమాదులూ* ఉన్నాయి. కొన్ని పురాణాలు ఈ విషయాలను కూడా ప్రతిపాదిస్తాయి. *అగ్నిపురాణంలో* ఈ విషయాలు అత్యధికంగా నిక్షిప్తమై ఉన్నాయి.

భారతీయులు అతిశయోక్తిప్రియులు. ఇది *వేదాలు, స్మృతులు, పురాణాలలోనూ*, చివరికి లౌకికవాఙ్మయం అయిన *కావ్యాల్లోనూ* కూడా కనబడుతుంది. ఏదైనా పనిచేస్తే దానివల్ల మంచిఫలం కాని, చెడ్డఫలంకాని కలుగుతుంది అని చెప్పేటప్పుడు గోరంతను కొండంతగా చేసి చెప్పడం మనకు అలవాటు. ఉదాహరణకి – చాతుర్మాస్యయాగం చేసిన వానికి లభించే పుణ్యం అక్షయ్యమైనది. *అక్షయ్యం హ వై చాతుర్మాస్యయాజినః ఫలం భవతి* అని వేదంలో చెప్పబడింది. ఆ విధంగా అది అక్షయ్యమే అయితే ఇతర యాగాలతో పనే ఉండదు. ప్రతి ఒక్కడూ చాతుర్మాస్యయాగం చేస్తే సరిపోతుంది. అందుచేత ఇక్కడ అక్షయ్యం అనగా ఏనాటికీ తరగని పుణ్యము అని అర్థం కాదు; ఎక్కువ పుణ్యం లభిస్తుంది అని తాత్పర్యం అని వ్యాఖ్యానం చెప్పవలసి వచ్చింది. ఇదే విధంగా *అశ్వమేధయాగం చేసినవాడూ, అశ్వమేధయాగ ప్రక్రియ తెలిసినవాడూ కూడా బ్రహ్మహత్యాపాపం నుంచి విముక్తులవుతారు.* ***తరతి తరతి బ్రహ్మహత్యాం యో– శ్వమేధేన యజతే య ఉచైనమేవం వేద*** అని మరొకచోట చెప్పబడింది. విధానం తెలుసుకుంటేనే అంత ఫలం లభిస్తున్నప్పుడు ఎంతో శ్రమపడి చెయ్యడం ఎందుకు అని ఆశంకించుకొని వ్యాఖ్యాతలు – బ్రహ్మహత్య చెయ్యాలని మనస్సులో సంకల్పించినా కూడా పాపమే. అశ్వమేధయాగప్రక్రియ తెలుసుకుంటే ఈ మానసికపాపం నశిస్తుంది. నిజంగా బ్రహ్మహత్య చేసి ఉంటే ఆ పాపం పోవడానికి యాగం చెయ్యాలి అని సమన్వయం చేసి చెప్పారు. ఇలా వందలకొలది ఉదాహరణలు చూపవచ్చు.

*ఇది ఒక విషయంలో ఉన్న మంచి చెడ్డలను చెప్పేవిధానం మాత్రమే. దానిని అక్షరశః గ్రహించకూడదు; సత్యంగా*

*భావించకూడదు* అని మీమాంసకులు మనకు అనేకస్థలాలలో స్పష్టంగా చెప్పే ఉన్నారు. శాస్త్రంలో ***నహి నిందాన్యాయం*** అని ఒక న్యాయం ఉన్నది. ***నహి నిన్దా నిన్ద్యం నిన్దితుం ప్రవర్తతే, అపి తు స్తుత్యం స్తోతుమ్*** అనేది ఆ న్యాయం. *ఏదైనా ఒక విషయాన్ని కాని, వస్తువును కాని, వ్యక్తిని కాని నిందిస్తున్నారంటే అల్లా నిందించడంలో వారి తాత్పర్యం కాదు; ఒకదానికి ఉన్న ప్రాశస్త్యాన్ని చెప్పడానికే మరొకదాన్ని నిందించడం జరుగుతుంది* అని ఈ న్యాయానికి అర్థం. దీన్నే కొంచెం మారుస్తే ***నహి స్తుతి న్యాయం*** అవుతుంది. ***నహి స్తుతిః స్తుత్యం స్తోతుం ప్రవర్తతే అపి తు నిన్ద్యం నిన్దితుమ్*** అని. ఒక దానిని స్తుతిస్తున్నారంటే దానిని స్తుతించడంలో తాత్పర్యం కాదు నిందించాలనుకొన్న దానిని నిందించడంలో తాత్పర్యం అని ఈ న్యాయం ఏర్పడుతుంది. ఈ దృష్టితో చూస్తే వేదాలలో కనబడే స్తుతి రూపంలో కాని నిందారూపంలో కాని ఉన్న అతిశయోక్తులు మనకు అర్థం అవుతాయి. అలా కాకపోతే అవి చాలా విడ్డూరంగాను, విపరీతంగాను కనబడతాయి.

**స్కన్ధే కవాటే పాషాణే ఆర్ద్రవస్త్రం న నిక్షిపేత్ ।**
**అథవా నిక్షిపేన్మూఢః రౌరవం నరకం వ్రజేత్ ॥**

అని ఒక స్మృతివాక్యం. *తన భుజం మీద కాని, తలుపు మీద కాని, బండ్రాతి మీద గాని తడిబట్ట ఉంచకూడదు. అథవా ఎవడైనా మూఢాత్ముడు అలా ఉంచితే రౌరవ నరకం లోనికి వెళ్ళిపోతాడు* అని దీని భావం. తడి బట్ట భుజం మీద చాలాసేపు ఉంచుకుంటే అనారోగ్యం చేయవచ్చు! తలుపునాని చిమికి పోవచ్చు! రాతి మీద చాలసేపు ఉంటే బట్ట చిమికి పోవచ్చు. అందుచేత అలా చేయవద్దని చెప్పడం బాగానే ఉంది. అలా ఉంచితే రౌరవంలో పడతాడు అనేది అత్యతిశయోక్తి. కొందరు వేద బాహ్యులనీ, వారి చెవిలో వేదవాక్యాలు పడితే అతికఠోరమైన శిక్ష ఇవ్వాలనీ చెప్పే వాక్యాల వంటి వాక్యాలు కూడా ఈ కోవకి చెందినవే. వాటి తాత్పర్యం వేరనీ, ఆనాటి విధి నిషేధవాక్యాలు ఆ విధంగానే ఉండేవనీ గ్రహించకపోతే మొత్తం ఈ వాఙ్మయం మీదనే చాలా మందికి వైమనస్యమూ, వైముఖ్యమా కలిగే ప్రమాదం ఉన్నది. అది కనబడుతూన్నది కూడా.

పురాణాల విషయం కూడా అంతే. పురాణాలలో అనేక వ్రతాలు చెప్పబడి ఉన్నాయి. ప్రతి ఒక్క వ్రతానికి చివర – *ఇది వ్రతాలన్నింటిలోకీ అత్యుత్తమమైన వ్రతం. దీన్ని మించిన వ్రతం మరొకటి లేదు* అని చెప్పడం జరుగుతుంది. ఇలాంటి స్థలాలలో అన్నింటిలోనూ మనం వెనక చెప్పుకున్న ***నహి నిందా న్యాయాన్నే, న హి స్తుతి న్యాయాన్నే*** సమన్వయించుకోవాలి. లేకపోతే కుదరదు. అదేవిధంగా కొన్ని పురాణాలలో ఒక్కొక్క దేవతకు ప్రాధాన్యం ఇచ్చి, ఆ దేవతకు సంబంధించిన కథలు చాలా చెప్పి, ఆ దేవతయే జతత్సృష్టి – స్థితి – లయాలకు కారణమనీ, ఇతర దేవతలందరూ ఈ దేవతకు దాసులవంటి వారనీ వర్ణించడం జరుగుతుంది. దానితో 'ఈ' పురాణంలో చెప్పినట్లు విష్ణువే ప్రధాన దేవత అంటూ వైష్ణవులూ, శివుడే గొప్పవాడని శైవులు, దేవియే సర్వోత్తమ దేవత అని శాక్తేయులూ, మరొకదేవత గొప్పదనీ మరికొందరూ చెపుతూ, తమకిష్టమైన దేవతకు ప్రాధాన్యం ఇచ్చిన పురాణాలే ప్రమాణాలనీ, ఇతర పురాణాలు అప్రమాణాలనీ వాదులాడుకుంటూ ఉంటారు. చివరికి సుందోపసుంద న్యాయంచేత అన్ని పురాణాలు కూడా అప్రామాణ్య పరాహతాలు కావలసి వస్తుంది. అందుచేత వివిధ వ్రతాల విషయంలో అనుసరించిన సమన్వయాన్నే దేవతల విషయంలో కూడా అనుసరించవలసి ఉంటుంది.

బహుశా ఈ లాంటి భ్రాంతి కలగవచ్చుననే ఉద్దేశ్యంతోనే ప్రతి పురాణంలోనూ, సంక్షిప్తంగానో, విస్తృతంగానో, అక్కడక్కడ నివృత్తి ధర్మాన్ని కూడా బోధించడం కనబడుతుంది. ఈ అగ్ని పురాణంలో అక్కడక్కడ అద్వైత సిద్ధాంతానికి సంబంధించిన విషయాలు సూత్రరూపంగా చెప్పినా చివరి ఆరు అధ్యాయాలలో మార్గాన్ని గూర్చి, అద్వైతతత్త్వాన్ని గూర్చి అతి విస్తృతంగా చెప్పబడింది. కొన్ని అధ్యాయాలలో భగవద్గీతాసారం చెప్పబడింది.

**"అహం సాక్షీ చ చిన్మాత్రో జాగ్రత్స్వప్నాదికస్య చ।**
**నాజ్ఞానం చైవ తత్కార్యం సంసారాదికబన్ధనమ్,**
**నిత్యశుద్ధ బుద్ధముక్త సత్యమానన్ద మద్వయమ్।**
**బ్రహ్మాహమస్మ్యహం బ్రహ్మ పరంజ్యోతిర్విముక్త ఓమ్॥**

*అ.పు. 377-20,21*

**యత్తద్బ్రహ్మ యతః సర్వం యత్సర్వం తస్య సంస్థితమ్,**
**అగ్రాహ్యక మనిర్దేశ్యం సుప్రతిష్ఠం చ యత్పరమ్.**
**పరాపరస్వరూపేణ విష్ణుః సర్వహృది స్థితః**
**యజ్ఞేశం యజ్ఞపురుషం కేచి దిచ్ఛన్తి తత్పరమ్.**
**కేచిద్విష్ణుం హరం కేచిత్ కేచిద్బ్రహ్మాణ మీశ్వరమ్,**
**ఇన్ద్రాదినామభిః కేచిత్ సూర్యం సోమం చ కాలకమ్,**
**బ్రహ్మాదిస్తమ్బపర్యన్తం జగద్విష్ణుం వదన్తి చ.** *అ.పు. 382.16.19*

ఒకే పరమాత్మ వివిధనామరూపాలతో వర్ణింప బడుతున్నాడు; వాస్తవంలో జీవపరమాత్మలకే భేదం లేదు; ఉన్న భేదం అంతా వ్యవహారికదశలోనే అని గ్రహించిన పిమ్మట ఆ యా దేవతల విషయంలో ఉత్కర్షాపకర్ష బుద్ధికి కాని, ఆ యా పురాణాల ప్రామాణ్యాప్రామాణ్యచింతకు కాని అవకాశం లేదు.

ఇలాంటి అద్వైతదృష్టిని ప్రసాదించి, ఆపాతతః ఆంతరంగికవిరోధం ఉన్నట్లుగా కనబడే శ్రుతులు, స్మృతులు, పురాణాలలో కాని ఆంతరంగిక విరోధం ఏదీ లేదనీ, ఈ మూడింటికీ పరస్పరవిరోధం కూడా లేదనీ ప్రతిపాదించడం చేతనే శంకర భగవత్పాదులు *శ్రుతిస్మృతి పురాణాలయులు*గా కొనియాడబడుతున్నారు. అందుచేత కొందరు విభిన్న సాంప్రదాయకులు భావించినట్లు కొన్ని పురాణాలే ప్రమాణాలు, కొన్ని కావు అని కొందరు ఆధునికులు భావిస్తున్నట్లుగా అతిశయోక్తి భరితాలూ అవడంచేత ఏ పురాణమూ కూడ పరిగ్రాహ్యం కాదు అనీ అనుకోకుండా, సరియైన అవగాహన తో ఈ పురాణాలను పఠిస్తే లాభం పొందడానికి అవకాశం ఉంటుంది అని చెప్పడానికే ఇంతగా వ్రాయవలసి వచ్చినది.

కేవలమూ ఋషిదేవతాదుల కథలు, రాజుల చరిత్రలూ చెప్పడమే కాకుండా అన్ని పురాణాలలోనూ కూడా ప్రసక్తానుప్రసక్తంగా రాజధర్మాది లౌకిక విషయాలు కూడా ఎన్నో చెప్పబడి ఉన్నాయి.

ఆ విధంగా చూస్తే పురాణాలన్నీ ప్రాచీన భారతదేశానికి సంబంధించిన ఆచార వ్యవహారాదు లకు, మత విశ్వాసాదులకు, తదితర సాంస్కృతిక విషయా లకూ, విద్యాస్థానాలకూ దర్పణాలని చెప్పవచ్చును.

---

# సంజీవదేవ్ మానవత

**సం**జీవదేవ్ తన రచనలన్నింటిలో మానవుడు కేంద్రంగానే ఆలోచనలు సాగించారు. మానవతకు అడుగడుగునా ప్రాధాన్యత యిచ్చారు. అయితే వివేచన ఒకవైపు వికసిస్తుండగా, రమణీయకతపై శీతకన్ను పడినట్లు ఆయన భావించారు. కనుక రమణీయకతను కలుపుకుపోయి, అలాంటి మానవతను మనో (వికాస) మానవత అందాం అంటున్నారు. బహుశ యీ విషయంలో ఆయనతో వివాదం వుండే ఆస్కారం లేదేమో!

కొన్ని మాటలకు విపరీతార్థాలు రూఢిగా వచ్చాయి. అందులో "సూపర్" అని తగిలించడం ఒకటి. మన పూర్వీకుల గురించి, ముఖ్యంగా ఋషులు, యోగుల గురించిన ఆధారాల కంటె, నమ్మకాలు, గాథలే ఎక్కువగా ప్రచారంలో వున్నాయి. మన యోగులు ప్రత్యేక మానసిక శక్తులు ప్రదర్శించినట్లు న్యూరాలజిస్టులు ప్రస్తావించారని సంజీవదేవ్ రాశారు. ఇందుకు అట్టే నిదర్శనలు లభించడం లేదు. కాని సాధారణ మానవులకు భిన్నంగా విపరీత మేధస్సు లక్షణాలకు వివిధ రంగాలలో వివిధ కాలాలలో చూపిన, చూపుతున్న వారున్నారు. అవి కూడా మానవశక్తులే గాని, మానవాతీతాలు కావుగదా. ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

రమణీయకతకు ప్రాధాన్యత యిచ్చి మానవతకు పరిపుష్టి చేకూర్చాలని సంజీవదేవ్ ఉద్దేశించినప్పుడు ఒకే ఒక జాగ్రత్త వహించాలేమోననిపిస్తున్నది. ఇన్నాళ్ళుగా కళలు, రమణీయకతా రంగమంతా దైవ ప్రాధాన్యతతో, మత ప్రాతిపదికలతో సాగింది. అవి లేకుండా రమణీయత లేదనేటంతవరకూ తీసుకెళ్ళారు. వాస్తవానికి అన్ని కళల్ని మతం, దైవం పేరిట భ్రష్టు పట్టించారు. మనిషి మానసికంగా బానిస కావడానికి కళల్ని ప్రయోగించారు. ఈ ప్రభావం నుండి బయట పడడానికి కూడా సంజీవదేవ్ సూచించిన ప్రత్యామ్నాయ పద్ధతి అనుసరణీయం. మానవ విలువలతో కూడిన కళలు, రమణీయకత నేటి అవసరం కూడా.

సంజీవదేవ్‌ను ఎవరితోనూ పోల్చదలచలేదు. కాని ఆయన రచనలు పరిశీలించిన తరువాత, రమణీయకత, కళలు, మనోవిజ్ఞానం, వ్యక్తుల అంచనా, అనుభవాలు, జ్ఞాపకాలు అవలీలగా, అవగాహన చేసుకుని మనకు మంచినీళ్ళ ప్రాయంగా అందించడంలో ఎరిక్ ఫ్రాంతో సంజీవదేవ్‌ను పోల్చడం ఔచిత్యంగా వుంటుందని పిస్తున్నది. తెలుగులో సంజీవదేవ్ చెప్పిన చాలా విషయాలు ఇందుకు నిదర్శనాలు.

*– నరిసెట్టి ఇన్నయ్య – మిసిమి వ్యాసాల పుస్తకం నుంచి...*

# ముత్యాలసరాల్లో ధ్వని

*– అల్లంశెట్టి చంద్రశేఖరరావు*

కవిత్వం హృదయ సంబంధి. కవిత్వానికి ఆవేశం కావాలి. *All good poetry is the spontanious over flow of powerful feelings* అంటాడు వర్డ్స్‌వర్త్. కవితావేశం పొంగి పొరలుతున్నప్పుడు కవి మనస్సులోని భావాలు అచ్ఛాదన లేకుండా బహిర్గతం ఔతాయి. కవి ఏ వేదనైతే అనుభవిస్తున్నాడో అదే వేదనను పాఠకుడు గూడ అనుభవించ గలగాలి. ఇద్దరి భావాలూ మేళవించాలి. అప్పుడే కవి హృదయం అర్థం అవుతుంది. *అందుకే పొయిట్రీకి పేరా ఫ్రేజింగ్ పనికిరాదనే* వారు రోణంకి అప్పలస్వామి మాష్టరు.

ప్రతిపదార్థ తాత్పర్యాల ద్వారా కవిత్వాన్ని వివరించలేం. ఎవరికి వారే అర్థం చేసుకోవాలి. అనుభవించాలి. పదార్థాల రుచిని మాటలద్వారా చెప్పలేం. మైసూరుపాక్‌లోను, లడ్డూలోనూ సెనగపిండి, పంచదార వాడతారు. కాని దేనిరుచి దానిదే. తింటేగాని రుచి తెలీదు. అలాగే కవిత్వంగూడ. అనుభవిస్తేగాని లోతు తెలీదు. కవితారసపు అనుభూతి వర్ణనాతీతం.

భావాన్ని వ్యక్తీకరించే సాధనం భాష. భాష పదాల సముదాయం. ఒక భాషలోని పదాలకు ఆ భాషలో అర్థాలు వుంటాయి. అర్థాలు తెలుసుకుంటే కవిత్వాన్ని కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. మన లాక్షణికులు మూడు రకాలుగా అర్థాన్ని వింగడించారు. అభిద, లక్షణ, వ్యంజన. పుస్తకాన్ని చూపిస్తూ, 'ఇది పుస్తకం' అంటే పుస్తకం అన్న మాటకు అర్థం పుస్తకం (ఒక వస్తువు). గిరీశం, 'మీనాన్న అగ్గిరావుడోయ్' అంటే వెంకటేశం తండ్రిపేరు అగ్గిరాముడు అని కాదు. 'కోపిష్టి' అని అర్థం. ఇక్కడ మనిషి లక్షణం గ్రహించబడింది. ఇది లక్షణ. *మీరుండగా ఆవిడ విధవెలాగౌతుంది* అని మధురవాణి గిరీశంతో అంటుంది. దీని అర్థం తెలియాలంటే 'ఆవిడ' ఎవరో తెలియాలి. ఆవిడ విధవా? కాదా తెలియాలి, ఆవిడకీ, గిరీశానికీ వున్న సంబంధం తెలియాలి. ఈ మాటలు ఎవరు ఎవరితో ఏ సందర్భంలో అన్నారో తెలియాలి. అప్పుడే ఈ వ్యంగ్యార్థాన్ని మనం గ్రహించగలం. వ్యంగ్యంము ప్రధానమైతే ధ్వని అనిపించుకొంటుంది. ఇది వ్యంగ్యంకంటే రమణీయ మైనది. ధ్వని అంటే 'సౌండ్' అని అర్థం కాదు. దీనిని ఇంగ్లీషులో 'సజెషన్' అంటున్నారు. ధ్వని స్ఫటికంలోని నీరులాంటిది. ఇది బయటికి కనిపించదు. కాని ఆ నీరుపోతే స్ఫటికానికి తళుకు వుండదు.

కవిత్వానికి శరీరం ఏది, ఆత్మ ఏది అన్న విషయంలో లాక్షణికులు భిన్నా భిప్రాయాలు వ్యక్తం చేశారు. *కావ్యస్యాత్మా ధ్వనిః* అని ఆనంద వర్ధనుడు అన్నాడు. అసలు ధ్వని అన్నదే లేదని ధ్వన్య భావాదులన్నారు. ధ్వని కేవలం భావన కాదు అంటూ ఉదాహరణలతో ధ్వని సిద్ధాంతాన్ని ఆనందర్ధనుడు, అతని అనుయాయులు నిరూపించారు.

ఒక అత్త కోడలు పూటకూళ్ల ఇల్లు నడుపుకుంటున్నారు. కోడలు భర్త వ్యాపారం చేసుకుంటూ ఊళ్లు తిరుగుతున్నాడు. ఒక సాయంకాలం ఒక బాటసారి వాళ్లింటికి వచ్చాడు. యువకుడు. అందగాడు. కోడలు స్వైరిణి. తనను కోరికతో చూస్తున్న అతనితో ఆమె ఇలా అంటుంది.

**ఒడలెరుగ దిచ్చట శయించుచుండు నత్త**
**నేనో, యిచట పరుందును, నీవో, రేయి**
**నంధుడవు, పాంథ, దివసకమందె దీని**
**చక్కగా చూడు, పడకు, మాశయ్యలందు.**

వాచ్యార్థము 'పడకు' అని నిషేధ రూపంలో ఆ బాటసారి ఇందులోని ధ్వనిని గ్రహించలేని మందబుద్ధి ఐతే ఆమెతో ఆ రాత్రి శయ్యాసౌఖ్యాన్ని పొందలేడు. వాచ్యార్థము నిషేధ రూపంలో వున్నా ఆడువారి మాటలకు అర్థాలు వేరులే అనుకొని 'పడకు' అంటే 'పడు' అనే విధి అర్థాన్నే గ్రహించాలి.

అలాగే వాచ్యార్థము విధి రూపంలో వుంటే ధ్వని నిషేధ రూపంలో వుండవచ్చు. ఆత్మను దర్శించ గలిగినవారు ధన్యులు. కొందరి కళ్లకి అలంకారాలు ధరించిన షోకేస్‌లోని బొమ్మల అందాలు మాత్రమే కనిపిస్తాయి. అటువంటి

వాళ్లు మెచ్చుకుంటే మించిపోయింది ఏమీలేదంటూ –

*కొయ్యబొమ్మలు మెచ్చు కళ్లకు*

*కోమలుల సౌరెక్కునా?* అంటారు గురజాడ అప్పారావు గారు.

కథాకథనమే ప్రధానంగా వున్న రచనలకు ప్రతిపదార్థ తాత్పర్యాలద్వారా వివరించవచ్చు. అటువంటి రచనలలో గూడ అక్కడక్కడ గొప్ప కవిత్వంతో కూడిన పంక్తులు గోచరిస్తాయి. వాటికి వ్యాఖ్యానాలు అవసరం ఔతాయి. ఈ వ్యాఖ్యానాలు వ్యాఖ్యాతల అనుభూతుల అనుభవాల నుండి ఏర్పడ్డవి మాత్రమే అని గుర్తుంచుకోవాలి.

ముత్యాలసరాల్లో కవి బరంపురంలో సంఘసంస్కరణ ప్రవీణుల సంగతుల మెలగి ఒకనాటి వేకువజామున తలుపు తట్టి భార్యను లేపుతాడు. ఆమె తలుపు తీసి బయటకు వస్తుంది. ఆకాశంలో తోకచుక్క వెలుగుతూ వుంటుంది. కవి భార్యతో –

*కంటివే (నేనంటి) మింటను*

*కాముబాణం బమరి యున్నది*

*ముత్యాలసరాల*లో కవి అన్న మొదటి వాక్యం ఇది. తోకచుక్క వల్ల కీడు జరుగుతుందనుకోవడం మూఢ నమ్మకం అంటాడు. *తరవాత తోకచుక్క ఒక నక్షత్రం అంటూ దానిని సంఘసంస్కరణ ప్రయాణ పతాకగా తాను తలుస్తాను* అంటాడు.

బరంపురంలో జరిగిన విశేషం ఇలా చెప్పాడు.

*మొన్న పట్టమునందు ప్రాజ్ఞులు*

*మొట్ట మొదటి మెట్టు యిదియని*

*పెట్టినారొక విందు జాతుల జేర్చి; వినవైతో?*

అని గొప్పగా చెప్పుకొంటుంటే దానికి ఆమె –

*కలిపి మెసగిన యంతమాత్రనె*

*కలగబోదీ యైకమత్యము*

*మాల మాదిగ కన్నె నెవతనో*

*మరులు కొనరాదో?* అంటుంది కోపంగా.

ఇక్కడ 'మరులు కొను' అని విధి రూపంగా వున్నా నిషేధార్థమే గ్రహించాలి. ఇది ఆ ఇల్లాలి భావన. దీనినే భర్త గ్రహించాలి. మనువాడాలి అన్నది కవిగారి సజెసన్. ఈ వాక్యం ద్వారా గురజాడ అప్పారావు గారు ఒక సందేశాన్ని ఇస్తున్నారు. సహపంక్తి భోజనాలు మొదటి మెట్టు మాత్రమే. కులాంతర వివాహాలు చేసుకోవాలి. అప్పుడే ఐకమత్యం. ఇది గురజాడ అప్పారావు అభిప్రాయం. కాస్టు వున్నంత వరకు కాస్టిజమ్ వుంటుంది అనేవారు రోణంకి అప్పలస్వామి మాష్టారుగారు.

*ముత్యాలసరాల*లో కవి అన్న మొదటి వాక్యం

*కంటినే (నేనంటి) మింటను*

*కాముబాణం బమరి యున్నది*

శృంగారంతోనే ప్రారంభం. బరంపురంలో సహపంక్తిలో కూర్చొని వచ్చిన భర్తపై ఆమెకు కోపం వుండడం సహజం.

**మాల మాదిగ కన్నె నెవతనో**

**మరుకొనరాదో?**

**అనుచు కోపమునాపజాలక**

**జీవితేశ్వరి సరులు నాపై**

**చరిచి, చనె క్రొమ్మెరుగు చాడ్పున**

**మనసు వికలముగాన్.**

మనసు వికలమైంది. ఎందువల్ల? భర్తచేసిన ఘనకార్యం వల్లా? తోటికోడలు దెప్పినందువల్లా? భర్తమీద కోపంవుంటే చర్రున ఇంటిలోనికి వెళ్లిపోవాలి గాని వెళ్లేముందు మెడలోని *ముత్యాలసరాల*తో భర్తను చరచడమెందుకు?

మింటను కాము బాణంబమరి యున్నది కదా!! మి

## కవి రాక్షసుడు

**కవి** రాక్షసుడు గోదావరి జిల్లాలోని దాక్షారామ నివాసి అయినట్లు, ఒక *లక్షణ గ్రంథాన్ని* రచించినట్లు *అప్పకవీయము* ద్వారా తెలుస్తుంది. ఆ గ్రంథము లభించడం లేదు. ఇతడే వేములవాడ భీమకవి అంటారు కొందరు, కాని ఆధారాలు లేవు.

కవి రాక్షసుడు *ఆదినారాయణ చరిత్ర*మును వ్రాసినట్లు ఒక *లక్షణ గ్రంథము* బట్టి తెలుస్తుంది. *దేవకీనంద శతకము* కవి రాక్షసకృతి అని ఒక పద్యము వలన తెలుస్తుంది. కాని ఆ శతకము వెన్నెలకంటి జన్నయ రచనగా ప్రసిద్ధి. *కవి రాక్షసీయము* లోని పద్యాలు కొన్ని *ఆనందరంగరాట్ఛందము*లో ఉదహరించబడ్డాయి. కవి రాక్షసుడు *షడర్థ నిర్ణయము* అనే నిఘంటువును, వందల శ్లోకాల *కవి రాక్షసీయము*ను సంస్కృతములో రచించాడని అంటారు. ఆ గ్రంథాలు లభించడం లేదు. *అప్పకవీయము*ను బట్టి కవి రాక్షసుడు అనంతామాత్యుని కంటె పూర్వము వాడని తెలుస్తుంది గాని, సరైన కాల నిర్ణయము జరగలేదు. – *ప్రాచీన కవులు*, ముప్పల సుబ్బరామయ్య.

# నామ విజ్ఞానము

(గతసంచిక తరువాయి...)

- యార్లగడ్డ బాలగంగాధర రావు

వేదములు నాలుగయినా, అందు ఒక్కొక్క వేదము నందు శాఖా బాహుళ్యముచే బహు మార్గములు కలిగివున్నా అవి బోధించే అనుసరణమంతా యాగమును గూర్చియే. అనగా ఒకే యాగము అనేక శాఖలలో చెప్పబడినప్పటికి, అవి అన్నీ చెప్పేది ఒకే యాగమును గూర్చి మాత్రమే. అట్లే వేదశాఖల యందున్నట్టి శబ్దములకు కూడా నియతమైన కార్యమును కలిగించుటలో, నిశ్చితమైన శక్తి కలిగి యుండుటయు గమనింప వచ్చును. అనగా ఒకే శబ్దము భిన్న భిన్న శాఖలలో ఉండవచ్చును గాక! శాఖాభేదముచే ఆ శబ్దోచ్చారణము (స్వర, దీర్ఘాదులు) భిన్నముగావచ్చును. అప్పుడు ఆ శబ్దము, ఏ స్వరముతో, ఏ శాఖలో నున్నదో, ఆ స్వరము కలిగిన శబ్దము ఆ శాఖ లోని యాగాది క్రియలను ఉపయోగిస్తుంది.

ఈ పై వివరణము వలన శబ్ద ప్రాధాన్యము, ఆ శబ్దము బ్రహ్మము అని తెలియ వచ్చినది. బ్రహ్మమైన ఈ శబ్దము, వైఖరీ, మధ్యమా, పశ్యంతీ అవస్థలకు ముందు 'పరా' అవస్థ యందున్నదని చెప్పుదురు. అనగా పరా అవస్థకు ముందు బ్రహ్మమున్నది. ఆ బ్రహ్మము పరా యందు వాక్కుగా పరిణమించు నన్నమాట. ఎక్కడ? ఎప్పుడు? బ్రహ్మమునకు వాక్కునకు గల ఐక్య మెట్టిది. భేద మెట్టిది. బ్రహ్మము అవాఙ్మానస గోచరము. నిజమునకు ఐక్య భేదములు గలవా! అనిన లేవనియే సమాధానము.

బ్రహ్మమే వాక్కుగా పరిణమించు ననుట సత్యము. బ్రహ్మమనగా నిచ్చట భావము. దీని నిట్లు వివరించుటకు ప్రయత్నింతము. ఇతరులకు ఏదో చెప్పాలని మనకు అనిపించింది. ఆ అనిపించినది భావము. అది వాక్కుగా ఎలా పరిణమించు చున్నది? శబ్దమునకు భౌతికమూలము వాయువు. (అభౌతిక మూలము భావము) బ్రహ్మము ఎప్పుడైతే అనిపించినదో ఆ ఉత్తర క్షణమున యోగము నందు చెప్పబడిన మూలాధార చక్రము నందు గల వాయువు సంస్కారమును (ప్రేరణను) పొందుచున్నది. దాని వలన అభివ్యక్తమగు శబ్దబ్రహ్మము పరావాక్కు కనుక పరా వాక్కు మూలాధారము నుండి వెలువడు చున్నదని, అది బ్రహ్మముతో అభిన్నతమని తేలుచున్నది. అనగా అవాఙ్మానస గోచరమగు బ్రహ్మము, గోచరమగు స్థితిలోనికి పరిణమించు చున్నది. ఈ స్థితి పరాస్థితి. నాగేశభట్టు కూడ పరా వాక్కు మూలాధార చక్రము నందలిదని, పశ్యంతి నాభి యందలిదని, మధ్యమ హృదయ గతమని, వైఖరి కంఠ దేశస్థమని చెప్పాడు.

**జ్ఞాతమర్థం వివక్షోః పుంసః ఇచ్ఛయా జాతేన ప్రయత్నేన**
**యోగో ఏవ మూలాధారస్థ పవన సంస్కారః । తదభివ్యక్తం**
**శబ్దబ్రహ్మ స్వప్రతిష్ఠయా పరావాగిత్యుచ్యతే**
**పరావాఙ్మూల చక్రస్థా పశ్యంతీ నాభి సంస్థితా**
**హృదిస్థా మధ్యమా గేయ వైఖరీ కంఠ దేశగా.**

*అధికపాఠము, వాక్యపదీయము.*

పైన చెప్పుకున్న 'అనిపించడం' ఇందు ఇచ్ఛగా చెప్పబడింది. భావ గతమైనది (మానసికము), వాయువు (శరీరగతము)ను ప్రేరేంపించును. అది శబ్దముగా వెలువడును. పాణినీయ శిక్ష ఇలా చెపుతోంది.

**అత్మాబుద్ధ్వా సమర్థ్యార్థాన్ మనోయుంక్తే వివక్షయా**
**మనః కాయాగ్ని మాహంతి స ప్రేరయతి మారుతమ్**

అట్లు ప్రేరేపింపబడిన మారుతము (వాయువు) పరమాణు రూపమైన శబ్దముతో అభిన్నము. అనగా ఇచ్ఛచే ప్రేరేపింపబడిన మారుతమే శబ్దము. భర్తృహరి దానినే ఈ విధంగా చెప్పాడు.

**స మనోభావ మా పద్య తేజసా పాక మాగతః**
**వాయు మావిశతి ప్రాణమ్ అథాసౌ సముదీర్యతే**

113, బ్రహ్మకాండము, వాక్యపదీయము.

బ్రహ్మము మనః స్థితిని పొంది, తేజస్సు వలన

ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు, ఫోన్ : 9849499169

పాకమును పొంది ప్రాణవాయువును ఆవేశించి, శబ్దముగా వెలువడుచున్నది. అనగా, పైన చెప్పిన భావమును (బ్రహ్మము) ఎప్పుడైతే వ్యక్తి వెలువరింపదలచినాడో, ఆ క్షణమున అది వాయువును (మూలాధారమందు) ప్రేరేపించి, దాని మూలమున శబ్దముగా బయటకు వచ్చుచున్నదన్నమాట. ఇలా ఎంత చెప్పినా పరా వాక్కు, పశ్యంతి, మధ్యమా, వైఖరుల వలె, సాధారణుల అనుభవమునకు అంది వచ్చునది కాదు. అది యోగులకు మాత్రమే సాధ్యమగును. నిజానికి, సాధారణుల కందరకు తెలియ వచ్చునది వైఖరి మాత్రమే. పశ్యంతి మధ్యమలను తెలిసికొనుటకు కూడ సాధన అవసరము. అయితే ప్రయత్న సాధ్యము. కాని 'పరా' కొరకు ప్రయత్నించుటే సాధారణులకు అసాధ్యము. కావుననే, పై విధముగా ఇంత చెప్పిన భర్తృహరి, 'పరా' ను వదిలి

*వైఖర్యా మధ్యమాయాశ్చ పశ్యంత్యాశ్చై తదద్భుతమ్*
*అనేక తీర్థభేదాయా స్త్రయ్యా వాచః పరం పదమ్*

143, బ్రహ్మకాండము, వాక్యపదీయము.

అని మూడు అవస్థలనే చెప్పియున్నాడు. ఇందలి పశ్యంతిని కూడా సాధారణులు గుర్తింప లేరు. అది యోగులకు పరిమితము. కాని పరా వాక్కు యోగులకు కూడా ఒక విధముగా అతీతమే. నిజానికది నిర్గుణ బ్రహ్మ రూపమై సర్వ వ్యవహారాతీతమైనది. అయితే అంత మాత్రం చేత వాక్కు నాలుగు విధములు కాక పోదు. పరాతో కలసి వాక్కు నాలుగు విధములని ఋగ్వేదభాష్యము, మహాభారతము చెప్పుచున్నవి. భర్తృహరి పైవిధంగా మూడింటిని చెప్పినా, సాధారణములైన వ్యాకర్తలకు అందుబాటులో నున్నవి రెండేనని, చెప్పి యున్నాడు. మూడవది యోగులకు మాత్రమే తెలియ నగునని ముందు చెప్పడం జరిగింది.

**ద్వా వుపాదాన శబ్దేషు శబ్దవిదోవిదుః**
**ఏకో నిమిత్తం శబ్దానా మవరోऽర్థే ప్రయుజ్యతే.**

44, బ్రహ్మకాండము, వాక్యపదీయము.

శబ్ద తత్త్వాన్ని ఎరిగిన వేత్తలు, మాట్లాడ బడుతున్న (అర్థవంతములైన శబ్దములను) మాటలను రెండు విధాలుగా గుర్తిస్తున్నారు. ఆ రెండు విధములలో ఒక విధము, రెండవ విధమునకు నిమిత్తమగుచున్నది (కారణమగుచున్నది, వెలువరించు చున్నది). ఆ రెండవ విధమైనదే (శబ్దము) అర్థమును బోధించుటకై ఉపయోగపడుచున్నది.

ఆ రెండు విధము లేవనగా మధ్యమా వైఖరులు. ఒకడు రాముడు అనే పదాన్ని ఉచ్చరించాడని భావిద్దాము. ఆ పదం ఉచ్చరింప బడుతున్నపుడు, ముఖయంత్రము నందలి నాలుక, పెదవులు మొదలగునవి కదలు చున్నవి గదా! వాని కదలికల వలనే అతడు మాట్లాడుచున్నాడని మనకు ద్యోతక మవుతోంది. ఇది వైఖరి. అనగా ఆ కదలికల వలన కలిగిన శబ్దము (ఇక్కడ రాముడు) వైఖరి. ఇది మనకు వినపడుతుంది. రాముడు అనే పదాన్ని ఉచ్చరించాలని అనిపించింది. అతనికి – అంటే రాముడు అనే శబ్దం వాడి బుద్ధిలో వుంది. ఆ బుద్ధిలో ఉన్నది (రాముడు) మధ్యమ. రెండింటిలోను గల శబ్దము ఒక్కటే. అది రాముడు. భేదమెక్కడ? దీనినిలా అర్థం చేసుకుంటానికి ప్రయత్నం చేద్దాము.

ఒక చీకటి గదిలో రేడియో వుంది. చీకటి వలన కనుపించడం లేదు. దీపం వెలిగిస్తే – రేడియో కనపడింది. అయితే చీకటిగా వున్నప్పుడు రేడియో అక్కడ వున్నట్లా, లేనట్లా! ఉంది గదా! మరి ఎందుకు కనిపించలేదు? చీకటి గనుక. దీపం వెలిగిస్తే ఏమయింది. రేడియో కనపడింది. వస్తువొకటే. కాని దానికి రెండు అవస్థలు సంప్రాప్తించాయి. కనపడక పోవడం, కనపడడం. అలాగే రాముడు అని పలుకక పోయినా, వక్త బుద్ధిలో రాముడున్నాడు. పలికితే, – దీపం వెలిగిస్తే రేడియో కనపడినట్లు, రాముడు అనే శబ్దం శ్రోతకు అంది వచ్చింది. కాని రాముడొకడే. బుద్ధిలో వున్న రాముడు వక్తకు పరిమితం. పలికితే అంది వచ్చిన రాముడు శ్రోతకు పరిమితం. వ్యాకర్తలు ఈ రెంటినీ విశ్లేషింపగలరు. యోగులు పశ్యంతిని కూడ గ్రహింప గలరు. పరాను గ్రహించడం వారికి కూడా సాధ్యమయ్యేది కాదు. ఇది శబ్దబ్రహ్మ తత్త్వం.

ఇక్కడ తెలియవలసింది మరొకటుంది. ముందు చెప్పిన విషయం ఒకటి ఇక్కడ జ్ఞాపకం చేసుకోవాలి. ఈ వ్యవహారమంతా – ఆ మాట్లాడుతున్న భాష, వక్తకు, శ్రోతకు తెలిసినప్పుడే అనేది. అప్పుడు మాత్రమే దానికి – అంటే ఆ మాట్లాడుతున్న భాష పట్ల వారిరువురికి అవగాహనాక్షమత్వం ఉన్నట్లు (Mutual intellegibillity).

అది కొరవడితే ఒకరు చెప్పేది మరొకరికి అర్థం కాదు. అంతేగాక, ఇరువురిది ఒకే భాష అయినా, వక్త ఉద్దిష్టమైన దానిని గూర్చిన పూర్వజ్ఞానం. శ్రోతకు ఉంటే తప్ప వక్తవ్యాంశం బోధపడదని కూడా చెప్పుకున్నాం.

అలాంటి పూర్వజ్ఞానం కొరవడిన సందర్భంలోనే వివరణ, లేక అర్థం అనేవి అవసరమవుతున్నాయి. పదాలకు వివరణ వుంటుందే తప్ప, ఆ పదం బోధించే దానికి సమానమైన పదం భాషలో మరొకటి ఉండదని కూడ చెప్పుకున్నాము. కావ్యభాషలోని పదాలకు నిఘంటువుల్లో కానవచ్చేవి వివరణలేనని కూడ చెప్పుకోవడం జరిగింది.

ఇక ఇప్పుడు వక్తకు, శ్రోతకు తెలిసిన పదమే అయినా దానిని గూర్చిన బోధ ఎలా జరుగుతోందో తెలుసుకుందాము. పైన వక్త భావనలో అంటే మధ్యమా అవస్థలో 'రాముడు' అనే పదం ఉన్నదని చెప్పాము కదా! అతడు దానిని వెలువరిస్తే వైఖరి అయిందని, అది శ్రోతకు బోధపడిందని గదా చెప్పుకున్నాము. ఇది ఎలా జరిగిందనేది ప్రశ్న. ఈ ప్రశ్న చదువరులకు కొంత అసంబద్ధంగా కన్పిస్తుంది. ఎందుకంటే వక్త శ్రోతలకేగాక, దీనిని చదువుతున్న వారికి కూడా రాముడెవరో తెలుసు గనుక. నిజానికి ఈ తెలివిడే గదా అర్థ బోధ కలిగిస్తోంది. కనుక పై ప్రశ్న అసంబద్ధంగా కన్పించడంలో ఆశ్చర్యం లేదు. కాని సమస్య కూడా ఇక్కడే వుంది.

వక్త ఉద్దేశించిన రాముడు దశరథుని కుమారుడా లేక, వక్త బంధువుల్లోని వ్యక్తియా! దశరథరాముడే అయితే శ్రోతకు కూడా అతనికి గల పురాణ జ్ఞానాన్ని బట్టి దశరథరాముడని గ్రహిస్తాడు. అంటే వక్తవ్యాంశం పట్ల, వక్త, శ్రోతలకు సమమైన అవగాహన, ప్రాతిపదికలున్నాయి గనుక బోధకు ఇబ్బంది కలుగలేదు. అలా కాక, వక్త ఉద్దేశంలోని రాముడు, అతని బంధువుల్లోని వాడై, వాడిని గూర్చిన ఎరుక శ్రోతకు లేకుంటే! అపుడు పాఠకులు ఒక ప్రశ్న అడుగవచ్చును. సమానమైన ప్రాతిపదిక లేనప్పుడు, సంభాషణకే తావు లేదు గాదా అని.

నిజమే. ప్రాతిపదిక ఉండే వుంటుంది. కనుకనే వారిరువురి మధ్య సంభాషణ ప్రారంభమైనది. కాని, వక్తకు ఇద్దరు, ముగ్గురు రాములు తెలుసు. కాని శ్రోతకు గల పూర్వ పరిచయంలో వక్త ఉద్దేశించిన వారిలో ఒకరో ఇద్దరో రాములు మాత్రమే తెలుసు కాని, వక్తకు ఇద్దరు, ముగ్గురు రాములు తెలుసు. కాని శ్రోతకు గల పూర్వ పరిచయంలో వక్త ఉద్దేశించిన వారిలో ఒకరో, ఇద్దరో రాములు మాత్రమే తెలుసు. మూడో రాముడు శ్రోతకు తెలియదు. ఇంతకు ముందెప్పుడైనా, మూడో రాముని గూర్చి తెలియచెప్పా ననుకుని గాని, లేదా, యథాలాపంగా సంభాషణా క్రమంలో – మూడో రాముని గూర్చి వక్త ప్రస్తావిస్తున్నాడని అనుకుందాము. అప్పుడేమవుతుంది. శ్రోతకు బోధ జరుగదు. సంభాషణ సాగిపోతూ ఉంటుంది. కాని అది శ్రోతకు తెలిసిన రాముని గురించి కాదని కొంత సేపటికి గాని అతనికి బోధ పడదు. ఎందుకంటే ఈ మూడో రాముని గురించిన పూర్వజ్ఞానం శ్రోతలో లేదు. లేక అంతకు ముందు అతన్ని గూర్చి ప్రస్తావన వస్తే చెప్పివున్నా, శ్రోత స్మృతిపథంలోనికి ఆ మూడో రాముడు రావడం లేదు. సంభాషణలో అస్తవ్యస్త స్థితి ఏర్పడుతుంది. శ్రోత తాను చెప్పేది బోధపరచుకోవడం లేదని వక్తకు అనిపిస్తుంది. లేదా, శ్రోత, వక్తను, అతడు ఏ రాముని గూర్చి మాట్లాడుతున్నావని అడుగుతాడు. అప్పుడు ఉద్దిష్ట రాముని వివరాలు చెప్పడం జరుగుతుంది. అప్పుడు వక్త భావన శ్రోతకు బోధపడుతుంది.

ఇది గాక మరొక విశేషముంది. వక్త భావనలోని రాముడు అనేపదం, దశరథరాముని గూర్చే ననుకుందాము. శ్రోతకు గల పురణా పరిచయం వలన శ్రోతకు అది బోధపడిందని కూడ అనుకుందాము. ఈ బోధ ఎలా జరిగిందనేది ప్రశ్న. ఈ ప్రశ్న కూడా అసంబద్ధమనిపిస్తోంది గదూ! అలా అనిపించడం సహజం. ఎందుకంటే, ఈ వ్రాస్తున్నది తెలుగు. చదువుతున్న వారు తెలుగువారు. ఈ భాషపట్ల, వివరిస్తున్న అంశంపట్ల మనకు గల పరిచయం వలన అలా అనిపించడం సహజం. దానికేమి. కాని కొంత ఆలోచించండి. రాముడు అనేది ఏమిటి? వ్రాతలో ఉన్న పదం. అంటే లిఖిత రూపం. ఉచ్చరిస్తే, ధ్వని రూప మైన శబ్దం.

ఈ అక్షర సముదాయంలో (arthographic form) గాని, ధ్వనుల సమాహారరూపం (Phonetic tablet) లో గాని, దశరథుని కుమారుడు గాని, లేదా ఉద్దిష్ట వ్యక్తి మరొకరు గాని, ఎక్కడ ఉన్నారు? ఆ అక్షరాల్లోనా? ఆ ధ్వనుల్లోనా? ఆ రెంటిలో ఏదైనా ఒకటే. ఒకే పదానికి గల రెండు రూపాలు. కాని అది రాముడు అనే వ్యక్తికి ఎలా సంకేతమైంది? అది తెలుసుకోవడానికే ఈ శాస్త్రం. దీనిని తరువాత చర్చిద్దాము.

ప్రస్తుతానికి కావలసింది, వ్రాసిన లేక ఉచ్చరించిన రాముడు అనేది, రాముడు అనేది, రాముడనే వ్యక్తిని ఎలా బోదిస్తోంది అని. ఇలా ప్రశ్నించడాన్నే అపహసిస్తారని ఇంతకు పూర్వం చెప్పింది. సాధారణంగా ఏం చెపుతామంటే,

రాముడనే వ్యక్తికి అది పేరు గనుక, ఆ పేరు విన్నంతనే రాముడని తెలుస్తుంది గదా అని. (అది ఎలా ఆ వ్యక్తికి సంకేతమైనదనే దానిని తరువాత తెలుసు కుందా మనుకున్నాము గదా). అంటే ఏమన్నమాట. ఒక వ్యక్తికి పేరు రాముడు అనేది ఆ భాషా వ్యవహర్తల కందరికి తెలుసునన్నమాట. అలాగే వేపచెట్టు అంటే, అది ఫలానా చెట్టు అనే జ్ఞానం అందరికి వుంది గనుక! అంటే ఆ పదాలు ఆ వ్యక్తిని సూచించడం లోను, ఆ చెట్టును సూచించడం లోను రూఢి అయ్యాయన్న మాట. అందువలన వక్త శ్రోతల మధ్య అవగాహనాక్షమత్వం ఏర్పడి బోధ జరుగుతోందన్న మాట. కనుక అర్థ బోధ జరగాలంటే అది రూఢి జరిగిందన్న మాట. అలా అనిపిస్తుంది. అది అంత మాత్రమే అయితే, ఇంతగా చర్చింప వలసిందే ముంటుంది? పై వలె బోధ జరిగిందనుకోవడం సాధారణం. కాని బోధ జరుగుతోంది అలా కాదు.

తెలుగు లిపి నేర్చుకున్నాము గనుక 'రాముడు' అని వ్రాయగలం. ఈ భాష నేర్చుకున్న వాడు దానిని చదువగలడు. దాని వలన ఆ పదం ఉద్దేశిస్తున్న రాముడెవరో సందర్భాన్ని బట్టి అవగతం చేసుకున్నాను. అలాగే 'వేపచెట్టు' అని వ్రాస్తే కూడ, తెలుగు లిపి నేర్చుకున్నవాడికి అర్థం అవుతుంది. నిజంగా అవుతుంది. నిజంగా అవుతుందా! కాదు. వేపచెట్టును చూసిన వాడికే, రాముడెవరో తెలిసిన వాడికే అర్థమవుతుంది. తెలియడానికి – ఆపదాలు మాత్రమే తెలుస్తాయి. అందుకే, అక్షరాలు నేర్పుతున్నపుడు పుస్తకాల్లో బొమ్మలు ముద్రించడం. కొంచెం సేపు, అపుడే తెలుగు ప్రాంతానికి వచ్చి తెలుగు నేర్చుకుంటున్న ఆంగ్లేయుని భావిద్దాము. సందర్భానుసారంగా, అతనికి వేపచెట్టు, రాముడు అనే పదాలు చదువను, వ్రాయను నేర్పించామనుకుందాము.

అప్పుడు అతనికి ఏమి బోధ పడినట్లు? అవి తెలుగు పదాలు అని మాత్రమే తెలుస్తుంది. అంతే తప్ప రాముడంటే ఎవరో, వేపచెట్టు అంటే ఏమిటో తెలియదు. ఆ తరువాత రాముడెవరో, వేపచెట్టు అంటే ఏమిటో వివరించాము.

ఆ పిమ్మట ఎప్పుడో, ఏదో సందర్భంలో, ఆ రెండు పదాల ప్రసక్తి బోధనలో వచ్చిందనుకుందాము. అప్పుడు అతనికి అర్థం అవుతుంది. ఇదెలా సంభవించింది? ఆ పదాలు అతనికి పరిచయంగావడం ఆ పదాల భావం అతనికి అంతకు పూర్వమే తెలిసివుండడం. కాబట్టి వక్త ఉద్దిష్ట భావాన్ని గూర్చిన జ్ఞానం, శ్రోతకు ఉన్నప్పుడే, భాషా వ్యవహారానికి ప్రాతిపదిక ఏర్పడుతుంది. ఈ ప్రాతిపదికనే అవగాహనాక్షమత్వం అంటున్నాము. మరోమాటలో, దానినే అర్థం అంటున్నాము. కనుక ప్రాతిపదిక లేనపుడు, అవగాహనాక్షమత్వం లేనపుడు, వక్త శ్రోతలు ఒకే భాషకు చెందిన వారైనా, వేరు వేరు భాషలకు చెందిన వారైనా ఒక్కటే. అంటే వక్త భావం, ఆ భావానికి వాగ్రూపమైన పదాలను గూర్చిన జ్ఞానం శ్రోతకు పూర్వమే ఉండాలి. రెండూ వుండాలా, ఒకటే వుంటే చాలా! రెండూ ఉండాలి. పదం మాత్రమే పరిచయమై, అది బోధించే భావం తెలియకపోతే ప్రయోజనం లేదు. వ్యవహారానికి ఫలసిద్ధి కలుగదు! భావం మాత్రమే తెలిసివుంటే! దీనికి మొదలు స్థితే లేదు.

ఎలాగంటే వక్తబుద్ధిలోని భావం, అంటే (మధ్యమ) ముందే శ్రోతకెలా తెలుస్తుంది? భావం వాగ్రూపమై, అంటే పదమై, ఆపదం, శ్రోతకు వైఖరి రూపంలో అంది, ఆ పదాన్ని గూర్చిన భావం అతనికి అతః పూర్వం తెలిసి ఉన్నప్పుడే, వక్త ఉద్దేశించినది శ్రోతకు బోధ పడుతుంది. అంటే భావం, తిరిగి భావంతో సమసించి నపుడే బోధ కలుగుతుంది.

అది ఎలాగంటే వక్తకు ఏదో చెప్పాలనిపించింది. ఆ చెప్పాలనిపించింది భావం. దాని కనువైన పదం వక్తలో రూపు దిద్దుకుంటోంది. (ఇదంతా మధ్యమ). ఆ పదాన్ని వాగ్రూపంలో అంటే ధ్వని రూపంలో, శబ్ద రూపంలో ఉచ్చరించాడు. (అంటే వైఖరి లోనికి భావం అనూదితమైంది). గాలిలో ఆ శబ్దం ప్రయాణించింది. శ్రోత శ్రవణేంద్రియాన్ని తాకింది. తాకిన ఆ శబ్దాన్ని గూర్చిన పూర్వ జ్ఞానం శ్రోత బుద్ధిలో, భావంలో, మనసులో వుంది. ఇపుడు వైఖరీ రూపంలోని శబ్దం తిరిగి భావంగా పరిణమిస్తుంది. వక్త భావించినది శ్రోతకు అర్థమైంది.

ఆ శబ్దాన్ని గూర్చిన పూర్వజ్ఞానం లేకుంటే – వైఖరీ అవస్థలోని ధ్వనులు, ఒక ధ్వని సముదాయంగా, పదంగా మాత్రమే మిగిలిపోతుంది. భావంతో సమసింపదు. అర్థంకాదు. అప్పుడు అదంటే (ఆ పదమంటే) ఏమిటని శ్రోత వక్తను అడుగుతాడు. అదే చదువుతున్నదయితే నిఘంటువు చూస్తాడు. లభ్యమైన వివరణతో ఉద్దిష్టమైనది భావంతో సమసించి బోధ కలుగుతోంది లేక అర్థమవుతుంది.

కనుక బోధ కలుగుతుంది లేక అర్థమవుతోంది అనే దానికి మూలం, భావం భావంతో సమసించడం. అంతే తప్ప పదాలకు అర్థాలుండవు. భావం వుంటుంది. పదంగా వ్యక్తమవుతుంది.

పై విషయాన్ని భర్తృహరి ఇట్లు నిరూపించి యున్నాడు.

**యథా ప్రయోక్తు: ప్రాగ్ బుద్ధి: శబ్దేష్వేవ ప్రవర్తతే**
**వ్యవసాయో గ్రహీతౄణా మేవం తేష్వేవ జాయతే**

53, బ్రహ్మకాండము, వాక్యపదీయము

వక్త యొక్క బుద్ధి, (శబ్దమును ప్రయోగించు వాని బుద్ధి) అర్థమును బోధించదానికి ముందు అతడు ఉపయోగించు చున్న శబ్దము నందు ఆ ఉద్దిష్టార్థము ఎలా ప్రవర్తించుచున్నదో అదే విధముగా ఆ అర్థమును గ్రహించు శ్రోత బుద్ధి యందు, ఆ అర్థము శబ్దము నందు ప్రవర్తించు చున్నది. అనగా వక్తకు ముందుగా అర్థము (భావము) భాసిస్తుంది. పదము, శబ్దము గోచరమవుతుంది. శ్రోత ముందుగా శబ్దాన్ని గ్రహిస్తాడు. దాని ద్వారా ఉద్దిష్టార్థాన్ని (భావాన్ని) గ్రహిస్తాడు.

దీనినే మరొక సూత్రములో ఈ క్రింది విధముగా సంస్థాపించినాడు.

**నసో ఽస్తి ప్రత్యయో లోకే య శ్శబ్దానుగమా దృతే**
**అనువిద్ధ మివ జ్ఞానం సర్వం శబ్దేన భాసతే**

123, బ్రహ్మకాండము, వాక్యపదీయము

శబ్ద సంబంధము లేక జ్ఞానము (అర్థము) లేదు. సమగ్రమైన జ్ఞానము (అర్థము) శబ్దముతో అభిన్నమై భాసించును.

**ఆత్మరూపం యథా జ్ఞానే జ్ఞేయరూపం చ దృశ్యతే**
**అర్థరూపం తథా శబ్దే స్వరూపం చ ప్రకాశతే**

50, బ్రహ్మకాండము, వాక్యపదీయము.

జ్ఞానము (అర్థము), అది ఉద్దేశిస్తున్న దాని స్వరూప స్వభావములు ఎట్లు ఉండునో అది అట్లే భాసించును. అట్లే దానిని ఉద్దేశిస్తున్న శబ్దము నందు, దాని స్వరూపము భాసించు చున్నది. అనగా రెంటికి తాదాత్మ్య స్థితి, శబ్దము, అర్థాన్ని, తన రూపాన్ని కూడా ప్రదర్శిస్తున్న దన్నమాట.

కనుక భావము (అర్థము) శబ్దముగా పరిణమించు చున్నది. ఆ శబ్దము తిరిగి, శ్రోత భావముతో సమసించి అర్థస్ఫూర్తిని కలిగించుచున్నది. శబ్దార్థములకు గల సంబంధమును భర్తృహరి

**'శబ్దో వాప్యభిజల్పత్వ మాగతోయాతి వాచ్యతామ్'.**

127, వాక్యకాండము, వాక్యపదీయము

అను శ్లోకార్థమున ప్రతిపాదించి యున్నాడు.

*శబ్దముతో అర్థమునకు, అర్థముతో శబ్దమునకు గల అభేద రూప సంబంధము అభిజల్పము. ఆ అభిజల్పముచే శబ్దమే అర్థమగుచున్నది.* అభిజల్ప పదాన్ని ఇంకా ఇలా వివరిస్తున్నాడు.

**సోఽ య మిత్యభి సంబంధాత్ రూపమేకీకృతం యదా**
**శబ్దస్యార్థేన తం శబ్దం మభిజల్పం ప్రచక్షతే.**

128, వాక్యకాండము, వాక్యపదీయము

శబ్దమునకు గల అర్థము వలన అదే ఇది, ఇదే అది అను తాదాత్మ్య భావము కలుగుచున్నది. (ఉదా: రేడియో అనుదానిని ఉచ్చరించినపుడు అది 'శబ్దము'. దానిని వినినంతనే, రేడియో అను వస్తువు (అర్థము) బోధపడుచున్నది. అప్పుడు రేడియో అను పదమునకు, రేడియో అను వస్తువునకు (అర్థము) తాదాత్మ్య స్థితి). శబ్దము ఎప్పుడు అర్థముతో ఏకీభూత మగునో అనగా అభిన్నముగా భావింపబడునో అప్పుడు ఆ శబ్దము అభిజల్పముగా చెప్పబడును. కనుక శబ్దము అర్థము ఒకటే. ఇక ఈ శబ్ద ప్రాముఖ్యమెట్టిదనగా శబ్దము లేక వ్యవహారము లేదు. అనగా ప్రపంచమే లేదు. ఈ భావమును...

**శబ్దేష్వే వాఽఽశ్రితా శక్తి ర్విశ్వస్యా ఽస్య నిబన్ధనీ**
**యన్నేత్ర : ప్రతిభాత్మాఽయం భేదరూపః ప్రతీయతే.**

118, బ్రహ్మకాండము, వాక్యపదీయము

**శబ్దస్య పరిణామోఽయ మిత్యామ్నాయ విదో విదుః**
**ఛన్దోభ్య ఏవ ప్రథమ మేత ద్విశ్వం వ్యవర్తత**

120, బ్రహ్మకాండము, వాక్యపదీయము

అను విధముగా భర్తృహరి వివరించియున్నాడు.

ఈ ప్రపంచమునకు కారణమగు శక్తి, శబ్దములను ఆశ్రయించి యున్నది. ఆ శబ్దమనెడి నేత్రముచే ప్రతిభారూపమగు ఈ ప్రపంచము (ప్రపంచమునందలి వ్యవహారము) విభిన్న రూపములుగా గోచరమగుచున్నది. ఈ

ప్రపంచము, శబ్దము యొక్క పరిణామమేనని వేదపండితులు తెలుసుకొనుచున్నారు. మరియు ఈ ప్రపంచము ముందుగా వేదముల వలననే తెలియబడుచున్నది, అని పై శ్లోకముల భావము. కనుక శబ్దము బ్రహ్మమని, శబ్దమే అర్థమని, అర్థమే శబ్దమని ఆ రెండును అభిన్నమని, దానిని తెలియుట ప్రతిభ మూలముననని, ఆ ప్రతిభ బుద్ధిగతమని తెలియుచున్నది. ఇప్పుడు కాళిదాసు 'వాగర్థావివసంపృక్తౌ...' అనుట లోని ఆంతర్యము ఇదేనని తెలియుచున్నది గదా! అట్టి ఈ శబ్దము లేక భాషను గూర్చి, అనగా దాని ఉత్పత్తిని గూర్చి, అనేక వాదములు గలవు. అందు భారతీయమతము ప్రధానముగా భాష దైవదత్తమనునది. దీనిని హేతువాదులు అంగీకరింపరు. అనగా వారు దైవ అస్తిత్వమును అంగీకరింపరు.

హేతువునకు మూలము కార్యకారణ సంబంధము. కార్యమున్నప్పుడు కారణముండును గదా! కనుక భాష ఉన్నప్పుడు, దాని ఉత్పత్తికి కారణముండును. అంతే తప్ప నిర్వచనమున కందని, ఊహాజనితమైన దైవమునకు ఆ కారణము నాపాదించుట తప్పు అని వారి వాదము.

పాశ్యాత్యులు ఆధునిక కాలమున భాషాశాస్త్రమును (Linguistics) అభివృద్ధి పరచిరి. వారు, ధ్వన్యుచ్చారణము నకు సహకరించు అవయవములు, వాని చలనము అనగా స్థానకరణములు, ప్రయత్న భేదములను చూపి, భిన్న ధ్వనుల ఉత్పత్తిని నిరూపించిరి. ఇంకను, డింగ్ డాంగ్ వాదము. బౌబౌ వాదము మున్నగునవి కలవు. కాని అవేమియు నిరూపణమునకు నిలుచునవి కావు. కాగా ఆధునిక భాషాశాస్త్రమే నేడు అత్యధిక ప్రచారములో నున్నది.

ఆధునిక భాషాశాస్త్రవేత్తలు (Linguists) భాష దైవదత్తమను వాదమును త్రోసిపుచ్చిరి. వారి నిరాకరణమునకు ప్రథమ కారణము దైవము అస్తిత్వము నిరూపింప రాని దగుట. కాని దైవదత్తమని నమ్ము వారింకను గలరు. వారి దృష్టిలో దైవమనునది దర్శింప దగినది. అనుభవైక వేద్యము. ఇది వ్యక్తి నిష్ఠము. నిరూపింప శక్యము గానిది. కనుక ఆధునిక భాషావేత్తలు దీని నంగీకరింపరు. ఇచట లోతుగా పరిశీలింపదగు అంశములు గలవు. ఆధునిక కాలమున భాషాశాస్త్రము అనేక ముఖముల విస్తరించిన మాట వాస్తవము. పైక్, నిడా మున్నగు వారు క్రొత్త పుంతలు తొక్కి నూతన అంశములను ఆవిష్కరించి నదియు వాస్తవము. కాని భాషా సృష్టి విషయమున సమాధానము దొరికినదిగాదు. అది అట్లుండ, ఆధునిక భాషాశాస్త్రము పాశ్చాత్యుల వలననే సంప్రాప్తించినదని చాలా మంది నమ్మిక. ఇది అసత్యము. భాషాశాస్త్రమునకు మొదటి బీజము పాణిని యందే కలదు.

దీనిని, బ్లూమ్ ఫీల్డు, మాక్స్ ముల్లర్ మున్నగు వారు అంగీకరించియే యున్నారు. స్థాన, కరణ ప్రయత్నాదులును పాణినీయము నందు గలవు. వాక్యనిర్మాణమును గురించి, అందలి వివిధ అవయవముల నిర్మాణము, వాని యందలి అంతరంగిక సంబంధమును భారతీయ వ్యాకర్తలు నిరూపించియే యున్నారు. వ్యుత్పత్తిని గూర్చియు తగుపాటిగా పూర్వవేత్తలు శ్రమించియే యున్నారు. కనుక భాషాశాస్త్రమునకు పాశ్చాత్యులు ఆద్యులనుట చెల్లి రాదు. మిక్కిలి అట్లనుట భావ దాస్య మనక తప్పదు. ఇక పూర్వులు భాషను దేవదత్త మనుటకు కారణములు సంస్థాపింప వలసి యున్నది.

ముందు బ్రహ్మము విషయము ప్రస్తావింపబడినది. తెలియవచ్చినది జ్ఞానము. తెలియనది బ్రహ్మమని చెప్పబడినది. దీనిని నిరూపించుటకు పెద్ద ప్రయత్న మవసరము లేదు. లోకములో కొన్ని సమాధానము చెప్పలేని ప్రశ్నలుండును. ఎంత వివరణ మిచ్చినను, అవతలి వాడు, వేధించుచున్న వేళ, ఎవరి నడుగుదువు, దేవుని అడుగు మనుటయు కలదు గదా ! దీని నెట్లు అర్థము చేసుకొనవలయును? తెలియనది, వివరించి చెప్పుటకు అశక్తులైనప్పుడు గదా, ఈ విధముగా పలుకుట జరుగు చున్నది. మరి ఇచ్చట దైవమెవరు. తెలియక పోవుటయే గదా! ఆ దైవమే బ్రహ్మము.

దీనిని మరింత వివరముగా చెప్పుకుందాం. ఏదైనా ఒక విషయము మన మనసున పొడగట్టినది మొదలు, దానికి సమాధానము దొరకు వరకు మనసు తీవ్రముగా ప్రయత్నించు చుండును. అది భౌతికమైన దానికి భౌతిక సాధనములతో, సమాధానము ఆవిష్కరించుటకు ప్రయత్నింతుము గదా! ఈ, మనసున పొడముట ఎట్లు జరిగినదో చెప్పగలమా? అది ఆ వ్యక్తికే ఏల పొడమినదో చెప్పగలమా? అశక్తులమేగదా! ఆ పొడమిన అంశమున కగు సమాధానము, పరిష్కారము, లోకోపకారమైనచో, అతడు మాన్యుడే గదా! అతని కీర్తి దశదిశల వ్యాపించును గదా! మార్కొని, జేమ్సువాట్, ఎడిసన్,

లూయీ పాశ్చర్, జగదీశచంద్రబోస్, సి.వి.రామన్, ఎల్లాప్రగడ సుబ్బారావు గారలు ప్రఖ్యాతులగుటకు కారణమేమి? వారు కనుగొనిన అంశములు, లోకోపకారములగుటయేగదా! వారు కూడ 'కనుగొనినామన్నారు' తప్ప, సృష్టించితిమని ఏల చెప్ప లేక పోయిరి.

కారణము, ప్రాయికముగా అవి సృష్టి యందున్నవి. వారు వానిని ఆవిష్కరించిరి. లోకములో ఎందరో వుండగా వారికే ఆ అంశములు మనమున పొడగట్టుట ఏల! కారణము తెలియగలమా! అనగా ఇతరుల ఊహకందనిది వారికి అందినది. తత్పూర్వులకు, ఆయా రంగములలో నిష్ణాతులైన వారికి కూడా ఏల అంద లేదో తెలియరాదు గదా! ఆ, తెలియక పోవుటకారణముగనే గదా అందిన వారిని దైవాంశ సంభూతులనుట జరుగుచున్నది. కనుక తెలియనది దైవము. మన ఊహకు అందనిది, మన హేతువాదమునకు అందనిది దైవము. హేతువునకు గల కారణములను అన్వేషించు సకల ప్రయత్నములు ఎచ్చట ఆగిపోవునో అచ్చట దైవము, లేక బ్రహ్మము ప్రారంభమగునన్నమాట. దీనిని ఈ విధముగా నిరూపింపవచ్చును.

ఊహ పొడముట సంకల్పము. ఆంగ్లమున చెప్పికొన్నచో అది హైపోథసిస్ (Hypothesis) సంకల్ప శబ్దానికి *మోనియర్ విలియమ్స్ డిక్షనరీ* Conception or idea or notion formed in the mind or heart, to form a resolution, అనే అర్థాలను ప్రతిపాదిస్తోంది.

హైపోథసిస్ అనే పదానికి *ది రాండమ్ హౌస్ డిక్షనరీ ఆఫ్ ది ఇంగ్లీష్ లాంగ్వేజ్* (The Random House Dictionary of the English Language) a proposition or set of propositions set forth as an explanation for the occurance of specified group of phenomena, either asserted merely as a provisional conjecture to guide investigation (working hypothesis) or accepted as highly probable in the light of estabilished facts, (2) a proposition assumed as a premise in an argument, (3) the anticedent of a conditional proposition (4) a mere assumption or guess, అనే అర్థాలను ప్రతిపాదిస్తూ ఈ పదం గ్రీకుభాష నుండి వ్యుత్పన్నమని, దానికి అర్థాలుగా base, supposition అనే వానిని సూచించింది. కనుక మనసులో ఒక విషయాన్ని గూర్చి పొడమిన వివేచన సంకల్పము.

సంకల్పము కలిగినది మొదలు దానికి సమాధానము అన్వేషించుటకు తహతహ మొదలగును. విషయము భావసంబంధమైన, ఆ తహతహ ఆలోచనా పరంపరకు మూలమగును. లోచనమన్న కన్ను. కంటితో భౌతిక వస్తువులను చూడగలము. భావ సంబంధి విషయములను ఆలోచింతుము. **అనగా లోచనమునకు మించినది ఆలోచనము.** ఇక విషయము భౌతికమైన, మనమున పొడమిన దానిని నిరూపించుటకు, భౌతిక సాధనములతో అన్వేషణ ప్రారంభమగును. ఇది పరిశోధన. కాగా ఆలోచనము తపస్సు. పరిశోధనకూడా తపస్సే. రెండు విధాలైన అన్వేషణలకు, మూలము సంకల్పము. కాగా ఆశించినది ఫలితము. ఒక విధముగా సత్య స్థాపనము. మరి, అన్ని విధములైన అన్వేషణములకు, సమాధానము, ఫలితము, సత్యము లభించుచున్నదా! ఎన్ని విధాల ఆలోచించినా, ఎన్ని మార్గాలలో పరిశోధించినా కొన్నింటికి సమాధానము లభింపకుండుటకు కారణమేమి? సంకల్పము తప్పు అనగలమా! సంకల్పమెందుకు కలిగినది.

పూర్వ కార్యకారణ సంబంధము లేక సంకల్పము కలుగునా! అట్టి సంకల్పము కలిగిన వ్యక్తులు అందరు అవ్యుత్పన్నులగుదురా! కాదు గదా! మరి అట్టి వారి ప్రయత్నమేల ఫలింప లేదు. అనగా ఏమన్నమాట! సమస్యకు సమాధానమున్నదని మనసు చెప్పుచున్నది. కాని లభించుట లేదు. అట్లే చాల సందర్భాలలో కార్యములు అనుభవమునకు వచ్చుచున్నవి. కాని, దాని కగు కారణములు అంతుబట్టకున్నవి. ఒకటి ఊహిద్దాము. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి స్థానమున ఉత్పత్తి యగుచున్నది. కాని ఎవరును ఉపయోగించుటలేదు.

ఉత్పత్తి ఆపివేయబడినది. మరి అప్పటివరకు ఉత్పత్తియైన విద్యుచ్ఛక్తి ఏమైనది. దాని ఉనికియే లేదే! దీనికేమి కారణము. వృక్ష సంతతిలో కొన్ని ఏకవార్షికముగా, కొన్ని బహువార్షికముగా ఫలించుటకేమి కారణము. మనిషికి అంగములు ఖండింపబడిన అవి తిరిగి ఏల ఉత్పన్నములు కావు. కొండొకచో మరణము ఏల సంభవించుచున్నది.

వృక్షములలో కొన్నింటియందు మరల చిగురు వచ్చుచున్నదే. తాడి చెట్లు, ఈత చెట్లు మున్నగునవి తల నరికిన ఏల చచ్చుచున్నవి. ఇవి ప్రశ్నలే గదా! మరి వీటికి సమాధానమేమి? అది వాటి ధర్మము అనుచున్నాము. ఇది ప్రశ్నకు సమాధానమగునా! ఈ సమాధానములు చెప్పి చిన్న పిల్లలను సమాధాన పరుపగలమా! ఇట్టి సందర్భముననే గదా, సమాధానము చెప్ప లేని దౌర్బల్యముతో, విసుగుతో వారిని కోపపడుట జరుగుచున్నది. ఆ అడిగినవారు కొంత వ్యక్తులైన... సమాధానము చెప్పలేని మన అశక్తతను మరుగుపరిచి వారిని అవహేళన చేయుట, పిచ్చివారని భావించుట చేయుచుంటిమి గదా! లేదా, మొట్టమొదట చెప్పుకున్న సమాధానము ఉండనే వున్నది. అది దేవుని అడుగుమనుట.

**కనుక మనకు తెలియనిది దైవము (తెలిసినది జ్ఞానము).** అదియే బ్రహ్మము. కాకున్న దైవ శబ్దమునకు fate, chance అను అర్థములు, దైవ కృత మనుదానికి Caused by devine power or nature, natural (opposite to artificial) అను అర్థములు, దైవ గతి అను దానికి Course of destiny, fortune అను అర్థములు. దైవయోగమను దానికి Juncture of fate, fortune, chance అను అర్థములు ఎట్లు పొసగును. అట్లే బ్రహ్మ శబ్దమునకు the Absolute, the Eternal (not generally an object of worship but rather of meditation and knowledge) అను అర్థము ఎట్లు పొసగును. పై అర్థములు ప్రతిపాదించుచున్న వాని భావమేమి? తెలియనిది, మానవుని బుద్ధికి అవగతముకానిది అని మాత్రమే కాదా! లోకమున అమాయకుడైన వానిని, అతడొక బ్రహ్మమనుటకేమి కారణము. ఇట్లు అనేక విధముల, **మానవుని బుద్ధికి, వివేచనమునకు అందని దానిని బ్రహ్మ శబ్దముతో, దైవ శబ్దముతో సంభావించుట జరుగుచున్నది.** అదే విధముగా, భాష ఉత్పత్తి ఎట్లో తెలియకున్నది. దానినే పూర్వులు దైవదత్త మనిరి తప్ప. దైవమొకడు కలడని, అది అతని సృష్టి అని భావించి కాదు. లోకమున ఇన్ని జాతులు, అన్ని జాతుల వారికి అన్ని భాషలుండుటకు కారణములేమని చెప్పగలము. చెప్పలేము. కనుకనే దైవదత్త మనుట! అయితే వాగ్దేవతను సరస్వతిగా, ఆమెకు పతిగా బ్రహ్మమును చెప్పుట జరిగినది. దానికి సమాధానము వివేచింప వలసి యున్నది. పురాణముల కల్పనము సాధారణులైన జనులకు, దానితో మనకు పని లేదు. సరస్వతి ప్రస్తావన ఋగ్వేదము నందు ఇట్లున్నది.

**పావకాన స్సరస్వతీ వాజేభిర్వాజినీవతీ యజ్ఞంవష్టు ధియావసుః**

*(ప్రథమమండలము, ప్రథమ అనువాకము మూడవ సూక్తము, 10వ సూత్రము)*

పావిత్ర్యమును సిద్ధింపజేయునది, అన్నమును, కర్మలను చేయించునది, సంపదకు నిమిత్తమైనది యైన సరస్వతి, హవిస్సు రూపమైన అన్నమును గ్రహించి మా యజ్ఞమును సఫలము చేయుగాక! అని పై ఋక్కునకు అర్థము.

**చోదయిత్రీ సూనృతానాం చేతంతీ సుమతీనామ్ యజ్ఞం దధే సరస్వతీ**

*(అందే 11వ సూత్రము).*

సత్యము, ప్రియము అయిన భాషణలను కలిగించునది, శుభకర్మలు చేయుటయందు మా బుద్ధిని ప్రవర్తింపచేయునది అగు సరస్వతి మా యజ్ఞమును ధరింపవలెను.

**మహో అర్ణ స్సరస్వతీ ప్రచేతయతి కేతునా ధియో విశ్వావిరాజతి.**

*(అందే 12వ సూత్రము).*

ప్రవాహమును ధర్మముచేత గొప్పగా నీటిని కలిగించునది, కర్మాచరణము గావించు వారి యందు సమస్త జ్ఞానమును ప్రకాశింపచేయునదియై సరస్వతి విరాజిల్లును. ఇందు మొదటి రెంటియందు వాగ్రూప మగు సరస్వతియు, చివరి దాని యందు నదీ రూపమగు సరస్వతియు, వాగ్రూపమగు సరస్వతియు ప్రస్తావించబడిరి.

అనగా ఋగ్వేద కాలమునాటికే ఒకే పదమునకు రెండర్థములు పొసగింపబడిన వన్నమాట. ఇది ఒకే పదమునకు నానార్థకల్పనము. ముందు ఒక భావమునకు ఒకే శబ్దమని చెప్పబడినది. ఇది దానికి భిన్నము.

దీని నెట్లు సమర్థించుట. **ఒక భావమునకు ఒక శబ్దము లేక ఒక శబ్దము ఒకే భావమునుద్దేశించునను సిద్ధాంతమునకు తిరుగులేదు.**

ఇచ్చట కూడా అదే కలదు. సరస్వతి శబ్దము 'సరస్' అను పదముపై 'వత్' చేరుటచే ఏర్పడినది. సరస్ శబ్దమునకు మూలము 'సృ' అను ధాతువు. దీనికి ద్రవము అని భావము. సరస్ అను శబ్దమునకు ప్రవహించునది, సరస్సు, జలాశయము అని అర్థాలు. వత్ శబ్దమునకు కలిగిన (Possess) అని భావము.

సరస్వతి శబ్దము, జలాశయములు, సరస్సులు, అధికముగా గల ప్రాంతము అనే అర్థాన్నిస్తుంది. నది, ఆ పేరు గల నది అనే అర్థాలను సంతరించుకుంది. భాష కూడ ప్రవాహము వంటిది. వాగ్ఝరి అని అంటున్నాము గదా! ఆ విధముగా వాక్కు, వాగ్దేవి అనే అర్థాలు సంతరించుకున్నది. అంటే భావము ప్రపంచీకరణము పొందినది. అంతే తప్ప మూల భావము ఒక్కటే. అయితే నానార్థములు గల పదములన్నియు ఇట్టివి కాక పోవచ్చును.

అప్పుడు, వేర్వేరు భావములకు మూలముగా భాసించు పదము, వేరు వేరు భాషలకు చెంది, ఒకే భాషలో ఒదిగి పోయి, కాలాంతరమున, భిన్నార్థమును భాసింపజేయు పదమునకు మూలమైన మూలభాష ఏదియో తెలియక పోవచ్చును. అంతే తప్ప ఒక **భావమునకు ఒకే శబ్దము అనుదానికి విప్రతిపత్తి లేదు.**

అట్లే వేరు వేరు పదములు, ఒకే భావమును భాసింప జేయవు. స్త్రీయను భావమును చెప్పుపదములు అనేకములు గలవనిపించును. ఎట్లనగా తరుణి, మగువ అను రెండును స్త్రీ అను అర్థమునే ఇచ్చుచున్నవి గదా! కాని తరుణి ఆమె వయసును సూచించును. మగువ, ఆమె వివాహిత అనే భావాన్నిస్తుంది. కనుక ఒకే భావము నిచ్చుచున్నట్లు అగుపించు శబ్దములకు రూఢ్యర్థము ఒకటే అయినా, భావఛాయలో భేదముండును. ఇప్పటి మన చర్చ వాగ్దేవిని గూర్చి కదా! ప్రవాహధర్మము కలది వాక్కు కనుక ఇది సరస్వతి, వాక్కుకు మూలము భావము. అది బ్రహ్మము. కనుక సరస్వతికి, పతి బ్రహ్మగా భావింపబడినది. ఇందు అసమంజసత్వము లేదు గదా!

ముందు భాషను లేక శబ్దమునకు పరా, పశ్యంతీ మధ్యమా, వైఖరీ అను నాలుగు అవస్థలు కలవని చెప్పబడినది. బ్రహ్మకును నాలుగు ముఖములు. అనగా నాలుగు అవస్థలనే నాలుగు ముఖములుగా పూర్వులు భావించినారని తలపవలయును. అయితే బ్రహ్మకు అయిదు తలలు గలవని, అందు అయిదవ దానిని పరమశివుడు ఖండించెనని పురాణకథనము కలదు. దీనికేమి సమాధానము కలదని అడుగవచ్చును. దానికి గల కథనము, బ్రహ్మ గర్వించి తన పంచమ శిరముతో శివుని (లయకారకుని) దూషించుటచే, అతడు కోపించి, కాలభైరవునిచే దానిని ఖండింపచేసెననుట. జగత్తు సృష్టి, స్థితి, లయములను మూడు ధర్మములను కలిగియున్నదనుట స్పష్టము. ఆ మూడింటికి మూడు పేర్లు. అవి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. లయమును దూషించుట అనగా, దాని ధర్మమును దూషించుట. లయము లేకున్న ఏమగును? సృష్టి జరుగును. స్థితి ఉన్నది. లయము లేకున్న, సృష్టి పెరిగి పోవును. ఇది విపత్కర స్థితి. అందువలన అట్టిది సంభవింపకుండుటకై అది ఖండింపబడినదని భావింప నగును. లేక దుర్మేధావితనము ఖండింపబడినది తలప వలయును.

శబ్దపరముగా చూచిన అయిదవ ముఖము పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరి అను నాల్గింటిలో 'పరా' అవస్థకు పూర్వమందున్న స్థితి. సాధారణులు పశ్యంతినే గమనింపలేరని యోగులకు మాత్రమే సాధ్యమగునని, 'పరా' అవాఙ్మానస గోచరమైనది, యోగులకు కూడా తెలియరాదని ముందు చెప్పుకొనుట జరిగినది. ఇక దానికి ముందున్న స్థితి యనగా, సృష్టికి మూలమైన స్థితి. దానిని తెలియుట అసాధ్యము. కారణము, ఎన్ని తెలిసినను, ఎంత తెలిసినను, తెలియ వలసినది ఇంకను ఉండనే వుండుచున్నది.

*అణోరణీయాన్, మహతో మహీయాన్, పూర్ణమిదం పూర్ణమ్* అనునవి తెలుపుచున్నది ఆ తత్త్వమునే గదా! అయిదవ శిరము ఖండింపబడిన దనగా, 'అది' వున్నది కాని లేనట్లు చేయబడినది. అనగా, బ్రహ్మము కలదు. కాని దానిని తెలియుట అసాధ్యము. ఎంత తెలిసినను, తెలియవలసినది ఉన్నది అను భావమును, ఖండించుట ద్వారా తెలుపబడినదని భావింపనగును. పై బ్రహ్మమునకు బ్రహ్మ అను మూర్తిమత్వము కల్పింపబడి, అతడు గర్వించినాడని చెప్పుటలో అంతరార్థము కూడా, బహుశః అతితెలివి అనగా దుర్మేధావితనము అవాంఛితమని చెప్పుట కావచ్చును. శబ్దమును బ్రహ్మముగా భావించుటలోని భావన ఇది. భాష దైవదత్త మనుటలోని అంతరార్థమును పూర్వులిట్లు భావించిరనియే తలచుట సమంజసము. అంతే తప్ప లోక సామాన్యమైన భావనలోని సాకార దైవమని భావించుట కాదు. నిజానికి బ్రహ్మకు ఎన్ని ముఖములు? నాలుగా, అయిదా? ఛాందోగ్య బ్రాహ్మణం రెండని చెపుతోంది. అవి (1) ఆహారాన్ని గ్రహించే నోరు, (2) స్త్రీ జననేంద్రియము. దీని భావన సృష్టి, మనుగడలు. కనుక బ్రహ్మమనే పదం ఏక భావనలోగాక అనేక భావనల్లో వర్తిస్తోంది. అంతే తప్ప సాకార దైవమని కాదని స్పష్టమవుతోంది.

నామవిజ్ఞానశాస్త్రాన్ని పరిచయం చేయడానికి ఇంత వివరణ అవసరమా అని అనిపించవచ్చు. భాషలో వున్నవన్నీ నామాలే అని భావించడం కారణంగా, అవి ఎలా పుడుతున్నాయో దానిని గ్రహించడం కొంతకు కొంత అవసరం. ఆ దిశగానే పై వివరణ అవసరమైనది. ఇక్కడ మరొక మాట కూడా చెప్పుకోవాలి. నామ విజ్ఞానమంటే నామాలను గూర్చిన చర్చ గనుక, అన్ని పదాలు నామాలేనని చెప్పటం జరిగింది కనుక, భాషలోని అన్ని పదాలను ఇది చర్చిస్తుందని భావింపరాదు. వానిని చర్చించడానికి నిఘంటువులున్నాయి, భాషావేత్తలున్నారు. కాని నిఘంటువులలో చేరనివి, సాధారణంగా, భాషావేత్తలు చర్చింపనివి. గ్రామనామాలు, వ్యక్తినామాలు, గృహనామాలు, జంతునామాలు, వృక్షనామాలు మున్నగునవి, ఇతరుల పరిశీలనకు నోచుకోని వాటిపై నామశాస్త్రజ్ఞుడు దృష్టి సారిస్తాడు.

అయితే ఈ చర్చ, భాషలోని అన్ని పదాలను గూర్చి అవగాహన చేసుకోవడానికి, ఆ వైపు దృష్టి మరల్చడానికి, ఆలోచనను మరింత పదును పెట్టుకోవడానికి, దాని పరిధిని మరింత విస్తృతం కావించు కోవడానికి ఉపకరిస్తుంది. మరో మాట! నామాల పుట్టుపూర్వోత్తరాలను చర్చించేదే, ఈ శాస్త్రమైనా, దీని పరిధులు దీనికున్నాయి. కారణం మానవ మేధకు గల పరిమితులే. ‘పిల్లి’ అనే పదం ఒక జంతువును సూచిస్తుందని, మూలంలో దాని భావం అల్పమనే దానిని సంకేతిస్తుందని ముందు చెప్పుకున్నాం. ఆ జంతువును (పిల్లిని), లేక ఆ భావనను (అల్పము) ఆ శబ్దంతోనే ఎందుకు సంకేతించాడు మానవుడు? అలాగే ‘పెట్టె’ అనే పదం పెట్టు కోవడానికి (ఏవైనా వస్తువులను) ఉపకరించే సాధనాన్ని సూచిస్తుంది అని చెప్పగలము. కాని ప్రక్రియను (పెట్టుకోవడం) ‘పెట్టు’ అనే ధ్వని సముదాయంతో, అంటే ఆ శబ్దంతోనే ఎందుకు సంకేతించామో చెప్పలేము. అంటే పదానికి ఆ పదంతో ఉద్దేశించే దానికి గల సంబంధమేమిటి? ఒక చెట్టును తాడిచెట్టు అని, మరొక దానిని వేపచెట్టు అని సంభావించడంలో, ఆ చెట్ల లక్షణాలేమైనా, ఆ ధ్వనులు ప్రతిబింబిస్తున్నాయా? అంటే సంబంధముందా లేక కేవలం సంకేతాలేనా? అనే ప్రశ్నలున్నాయి. ఇవి నేడు పుట్టినవి కావు. చాల పూర్వకాలం నుండి ఈ చర్చ ప్రాచి, ప్రతీచి ఖండాల్లో జరిగింది. జరుగుతోంది.

ఈ సందర్భంలో వ్యాసభగవానుడు చెప్పిన –

**‘యేన లింగేన యోదేశో యుక్తస్సముపలక్ష్యతే,**
**తేనైవ నామ్నాతం దేశం వాచ్యమాహుర్మనీషిణః**

-11, ఆదిపర్వం, పర్వసంగ్రహనామము,

ద్వితీయాధ్యాయం, వ్యాసమహాభారతం మననం చేసుకోవడం సముచితం. మానవుడు భౌతిక ప్రపంచంలో తాను చూస్తున్న, తన అనుభవం లోనికి వస్తున్న ప్రతివస్తువును, విషయాన్ని గుర్తు పెట్టు కోవడానికి, దాన్ని గూర్చి ఇతరులకు తెలియజెప్పడానికి కొన్ని భాషా సంకేతాలేర్పరుచుకుంటాడు. ఆ విధంగా ఏర్పడ్డవే ప్రాక్తన మానవుని మొదటి భాషా సంకేతాలు అనే భావనను వెలిబుచ్చాడు. C.L.Barbara తన *The Story of Language* అనే పుస్తకంలో (page 26). అవి ప్రాయికంగా నామవాచకాలవుతాయి. అందులో కూడా మొదటివి సంజ్ఞానామవాచకాలే అయివుంటాయి. జాతి నామవాచకాలు, గుణసంబంధమైన సంజ్ఞలు క్రమంగా అనంతర పరిణామంలో ఏర్పడతాయి. ఈ విధంగా ఏర్పరచుకున్న సంజ్ఞలకు వాటిచే ఉద్దిష్టమైన వాటికి అవినాభావ సంబంధముంటుంది.

Premitive man felt that the relationship between name and thing (Between symbol and referred ) has close and intimate. (P.142 Our Language, Simeon Potter 1961). పైన పెట్టె (Box) అనేది వస్తువులు పెట్టుకోవడానికి ఉపయోగించే పనిముట్టు అని చెప్పుకున్నాము. అయితే ఆ పనిముట్టు తయారీలో ఉపయోగించిన నిర్మాణ ద్రవ్యాన్ని బట్టి దానికి విశేషణాలు కూడా చేర్చడం జరుగుతుంది. ఇది ఒక దాని నుండి మరో దానిని వివక్షించడానికి ఉపకరిస్తుంది. ఉదా: కొయ్యపెట్టె, ఇనుపపెట్టె. శబ్దానికి గల అర్థాన్ని బోధించే శక్తిని భారతీయ అలంకారికులు ‘అభిధ’ అన్నారు. అంటే ముఖ్యార్థాన్ని బోధించే శక్తి ‘అభిధ’. ముఖ్యార్థానికి బాధ కలిగినపుడు, దానితో సంబంధం వుండే మరొక అర్థాన్ని స్ఫురింపజేసే శక్తి. ఇది రూఢిని బట్టి గాని లేక ప్రయోజనాన్ని బట్టి గాని కలుగుతుంది. అయితే ఇక్కడ ఒక సమస్య వుంది. ఈ ఏర్పరచుకున్న సంజ్ఞలు కేవలం ముఖ్యార్థసూచకాలేనా లేక సహజార్థ సూచకాలు కూడానా అనేది ఆ ప్రశ్న. మీమాంసకులు రెండూ సహజార్థ బోధకాలని అభిప్రాయపడ్డారు. కాగా నైయాయికులు కూడా

ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అయితే పరిణామం చెందే ద్రవ్యంతో తత్సంబంధమైన జాతి వుంటుంది గనుక అన్నీ జాతి వాచకాలేనని బౌద్ధులు అభిప్రాయపడ్డారు. ఇవి భారతీయపండితుల అభిప్రాయాలు. కాగా పాశ్చాత్యుల అభిప్రాయాలు రెండింటిని పైన చూశాము. వారు ఇటీవలి వారు. నిజానికి ఈ చర్చ, చాల పూర్వకాలం నుండి, అంటే ప్లేటో దగ్గర నుండి జరుగుతోంది. భాషలోని యితర పదజాలం వలెనే, సంజ్ఞా పదజాలానికి కూడా అర్థం వుందనే చర్చసాగింది. ఉద్దిష్ట వస్తువుకు, దాని పేరుకు (పదం) గల సంబంధాన్ని కనుగొనడానికి, భాషలోని ఇతర పదజాలం వలె, యివి కూడా ఒక భాగమే గనుక దీని ఉనికి ఏమిటో నిర్దేశించడానికి, ఈ విధమైన చర్చజరిగింది.

దీనిని చర్చించిన వారిలో J.S.Mill, Jesperson, Hockett, Isac Taylor, Wittenstein, George Stewart మున్నగు వారు ప్రముఖులు. The name means the object, the object is its meaning అంటాడు Wittenstein. అయితే సంజ్ఞా నామవాచకాలకు వాచ్యార్థమే వుంటుంది తప్ప, సహజార్థం ఉండదు. అంటే అర్థ రహితాలని 'మిల్' పండితుని అభిప్రాయం. నిజానికి ఈ సమస్యపై భారతీయ పండితుల్లోను, పాశ్చాత్యపండితుల్లోను పై రెండు అభిప్రాయాలు వున్నాయి. రెండూ ఆమోదింపదగ్గవే. కారణమేమంటే ప్రతివస్తువుకు, దాని పేరుకు గల సంబంధాన్ని వివరించడం, అన్ని వేళలా సాధ్యంకాదు. ఉదాహరణకు ముసలయ్య అనే పేరు గల వ్యక్తి పుట్టినపుడు కాదు గదా! అది అతని పూర్వికుల పేరై వుండవచ్చు. చిరంజీవి అనే పేరు పెట్టడంలో, అతడు దీర్ఘకాలం జీవించాలని, అతని తల్లిదండ్రుల వాంఛ కావచ్చు. లేదా, ముసలయ్య వలె, పూర్వికుల పేరు గావచ్చును. ఇదే విషయం, మిగతా అన్ని పేర్లకు అంటే స్థలనామాలకు, ఇతర నామాలకు వర్తిస్తుంది. కాని స్థలనామాల విషయంలో, ముఖ్యంగా అవి ప్రాచీనమైన స్థలాలైతే, వాటికున్న పేర్లు, తప్పకుండా ఆ రెండింటి సంబంధాన్ని పట్టి యిస్తాయి.

ఏమైనప్పటికి పేర్లు అనేవి రావడానికి మూలకారణం 'గుర్తింపు'. The fundemental purpose of names is to provide the means of identification అంటాడు Isac Taylor. పరిణామక్రమంలో, అనేకానేక అంశాల ప్రభావం కారణంగా, ఈ పేర్లలో చాలా వైవిధ్యం చోటు చేసుకుంది. పేర్లనేవి, అవి పెట్టిన మానవుల ఛాయలేనంటాడు (Names are always shadows of the men who give them) Names on the Land అనే గ్రంథంలో జార్జి ఆర్. స్టీవార్ట్.

ఇలా ఎంత చెప్పుకున్నా పదానికి, దానిచే ఉద్దిష్ట మవుతున్న దానికి గల సంబంధం ఏమిటో, వివరించటం అన్ని పదాల విషయంలో సాధ్యమయ్యేది కాదు. అందువల్లనే దీనికి పరిమితులున్నాయని చెప్పటం జరిగింది. అయితే సాధారణ వ్యుత్పత్తి వేత్తలకంటె నామశాస్త్రజ్ఞుడు మరింత నిశితంగా శబ్దాలను వివేచిస్తాడు. సాధారణ వ్యుత్పత్తి వేత్తలు నిజానికి తమ పరిశీలనను, కృషిని ప్రముఖంగా సాహిత్య సంబంధి పదాలకు మాత్రమే పరిమితం చేశారు. అందులోను దేశ్యపదాలు విస్మరింపబడ్డాయి. అందువల్లనే మన నిఘంటువులు పరిమిత ప్రయోజనాన్ని మాత్రమే చేకూరుస్తున్నాయి. ఇటీవలి కాలంలో మాండలిక, వృత్తి పదకోశాలు వెలువరింప బడ్డాయి. అవి వృత్తి సంబంధమైన పదాలను కోశస్థం చేశాయి. అర్థాలను సమకూర్చాయి. జిల్లాల వారీగా కొన్ని మాండలికాలపై కూడా కొంత కృషి జరిగింది.

ఆంధ్ర విశ్వవిద్యాలయం, తెలుగు వ్యుత్పత్తి పదకోశాన్ని తయారు చేయించింది. ఇది సాహితీ సంబంధమైన పదాలతో పాటు, సాధారణ శబ్దాలను కూడా వివేచించింది. అయితే ఈ అన్ని నిఘంటువులు స్థల, గృహ, వ్యక్తి, వృక్ష, జంతు నామాలను విస్మరించాయి. వృక్ష, జంతు, నామాల విషయంలో ఒక దినుసు చెట్టు అని, ఒక జంతువు అని మాత్రమే వివరించాయి.

తెలుగు అకాడమీ, ఆంధ్రదేశంలోని మందు మొక్కలపై ఒక గ్రంథం వెలువరించింది. అందులో కొంత ప్రయోజనకరమైన సమాచారం వుంది. ముఖ్యంగా అది ఆయుర్వేద వైద్యుల కుపయుక్తం. కాని స్థల, గృహ వ్యక్తి నామాల విషయంలో మొన్నమొన్నటి వరకు ఈ మాత్రపు కృషి కూడ జరుగలేదు.

ఇటీవలి కాలంలో పరిశోధకులు ఈ విషయంపై దృష్టి మళ్లించడం జరిగింది. గణనీయమైన కృషి జరిగింది. అది కూడ ఎక్కువ భాగం స్థలనామాలపై మాత్రమే. మిగిలిన గృహ, వ్యక్తి, జంతు నామాలపై, నామ మాత్రమైన కృషి జరిగింది. ఈ పరిశీలన ఇంకా విస్తృత పరిధిలో జరుగవలసిన అవసరం ఎంతైనా ఉంది. భాషలోని అన్ని పదాలను గూర్చి విశ్లేషణ జరిగినపుడే, భాషాపరిశోధనకు సౌష్ఠవమేర్పడుతుంది. ఇది నామవిజ్ఞాన శాస్త్ర పరిచయం. మి

# జానపదుల హాస్యం

- దామెర వేంకట సూర్యారావు

*జాతికి జీవన నాళిక జానపద గీతిక* అన్నారు ఆరుద్ర *సినీవాలిలో*. *పల్లె సారస్వతం వేద సారస్వతం వంటిది* అంటారు నేదునూరి గంగాధరం. జానపదసాహిత్యం జాతి సమిష్టిసంపద. జాతి హృదయానికి ప్రతిబింబం. శిష్ట సాహిత్యానికి జానపదుల వాఙ్మయం ప్రాతిపదికవంటిది. చాలాకాలం జానపద వాఙ్మయం ఉపేక్షకు గురైంది. *ముదివిటులు, విధవలు, పద కవితలు, మారుబాస, బాపన వర్యుల్* అని ఈసడించారు మన పండితులు. కాని ఒక జాతి ఆచారాలు, విచారాలు, అలవాట్లు, ఆశయాలు అన్నీ ఆ జాతి సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి.

శృంగారం, హాస్యం, కరుణ, వీరం లాంటి మనో భావాలన్నీ మౌఖిక సాహిత్యంలానే రసస్థితిని పొందాయి. మన శిష్ట సాహిత్యంలో, అందునా ప్రాచీన సాహిత్యంలో శృంగారానికి ఇచ్చిన ప్రాధాన్యం ఇతర రసాలకి లేదు. భోజుడు *శృంగార ప్రకాశం* రాశాడు. భవభూతి *ఏకోరస కరుణ ఏవః* అని కరుణను ప్రధాన రసంగా ప్రతిపాదించాడు. సంస్కృతి వాఙ్మయం హాస్యాన్ని చిన్నచూపు చూసింది. సంస్కృత నాటకాల్లోని విదూషకుడు కూడా తిండిపోతు, ఒక వికృతరూపి, వాచాలుడు. దీని ప్రభావం ప్రాచీన తెలుగు సాహిత్యం మీద ప్రసరించింది. *మృచ్ఛకటికం* వంటి ఒకటి రెండు నాటకాల్లో తప్ప సంస్కృత నాటకాల్లో ఆరోగ్యకరమైన హాస్యం లేకపోయేసరికి భారతీయ భాషలన్నింటిలోను ఇదే పరిస్థితి ఉత్పన్నమయింది.

ఐతే సగటు తెలుగువాడికి హాస్య ప్రయత్నం లేదనలేం. అనాదిగా బావామరదళ్ల సంభాషణల్లోనూ మేనత్త మేనమామ పిల్లలు మేలమాడుకోవడంలోనూ, వియ్యాలవారి ఒయ్యారాల్లోనూ, వదినామరదళ్ల పాటల్లోనూ, పెళ్లీ పేరంటాల్లోనూ, పల్లెల్లోని పండుగ పబ్బాల్లోనూ, కంది చేలల్లో పనిచేసే పడుచుల పాటల్లోనూ హాస్యం లాస్యం చేస్తూనే ఉంది. శతాబ్దాల నుంచి తెలుగువారిని అలరిస్తున్న *తెనాలి రామలింగని కథలు, పరమానందయ్య శిష్యుల కథలు* తెలుగు వాడి హాస్య ప్రియత్వానికి జయపతాకలు

జానపదసాహిత్యంలో మాత్రం హాస్యం సముచిత స్థానానికి నోచుకొంది. వాస్తవానికి జానపద సాహిత్యంలో స్థానం సంపాదించని ఏ భావమూ పండిత వాఙ్మయంలో వన్నెకెక్కదు. భావాన్ని వ్యక్తం చేసే ధోరణిలో మార్పు కనిపిస్తుంది గాని మూలంలో రెంటికీ తేడా ఉండదు. పండిత పామరుల్లో ఉన్న వాచా వైఖరీ విభేదమే ఈ తేడాకి కారణం.

**వేణికాభరమందు వెదురుటాకు / కలికికోడల యెబ్బంగి గలిగె చెపుమ**
**పలికి పలికించు కొనుటేమి ప్రాభవంబో / అత్త నీ వీపు వెలిమిడి మాటనేమి?**

అనే పద్యంలో అత్తాకోడళ్ల సంభాషణలో ఉన్న భావానికి మూలం జానపదసాహిత్యంలో కనిపిస్తుంది.

**కోడల కోడల కొడుకు పెళ్లామా / కొడుకూరిలో లేడు కోక యెక్కడిదే**
**అత్త అత్త ఓ అత్త గారా / మామ ఊళ్లో లేడు మట్టెలెక్కడివే**

జానపదుల హాస్యం మన జాతీయమైన హాస్యం. ఇది నిత్యనైమిత్తిక వ్యవహారాల్లో చేయూతనిచ్చి జీవితంలోని యాంత్రికతను దూరంచేసి, జీవితాన్ని సరసంగా మార్చి బ్రతుకు బాటను సుగమం చేసే హాస్యం.

ఆయా సందర్భాలకు అనుగుణంగా పాడే పాటలు ఎన్నో తెలుగులో ఉన్నాయి. దంపుడు పాటలు, ఊడుపుల పాటలు, చందమామ పాటలు, చెంచిత పాటలు అనూచానంగా పాడబడుతూ జీవితంలో నిత్య నూతనమైన చైతన్యాన్ని నింపే హాస్యాన్ని అందిస్తున్నాయి. నన్నయ *భారత* రచనకు ముందే తెలుగునాట *వన్నెల పదాలు, గొబ్బెమ్మ పాటలు, నాగే గీతాలు, నివాళి పదాలు, శంకర గీతాలు* మొదలైన దేశిపాటలు ఉండేవని తెలుస్తుంది. పాల్కురికి సోమన తన కాలంనాటి దేశి సాహిత్యాన్ని పేర్కొన్నాడు.

---

డాక్టరు దామెర వేంకట సూర్యారావు, ఫోన్ : 9885188431

ఈ జానపదుల పాటల్లో అసభ్యమైన హాస్యాన్ని అందించేవి కూడా ఎక్కువగా ఉన్నాయి. ఆడామగా విచక్షణ లేకుండా తిరునాళ్లలోనూ, జాతర్లలోనూ పాడే పాటల్లో శృంగార హాస్యాలు విడదీయరానివిగా కలిసిపోయి, బండ హాస్యాన్ని సృష్టించమూ ఉంది.

ఐతే అసభ్యతకు తావీయని హాస్యం ఆడవాళ్ల పాటల్లో దొరుకుతుంది. *నలుగుల పాటలు, నాగవల్లి పాటలు, అలక పాన్పు పాటలు, తలుపు ద్గగర పాటలు, వియ్యపురాలిమీద పాటలు, అత్తగారిమీద పాటలు, అల్లుడిమీద పాటలు* ఆడవాళ్లు పాడేవారు. వీటిలో హాస్యం మృదువుగా ఉండడమే గాక పండితుల హాస్యానికి కూడా మార్గ దర్శకంగా ఉండేది. చిన్న పిల్లల పాటల్లోని హాస్యం ముద్దుముద్దుగా, మృదువుగా ఉండేవి.

**అక్కల కఱ్ఱ ముక్కల పీట**
**కూర్చో వదినా కూర్చో**
**వేపచెక్క వెల్లుల్లిగడ్డ పోకతమ్మి వేసుకో**
**కాకిబొద్దు గచ్చకాయ మెక్కి విందు తీర్చుకో**
**అల్లి మట్ట మఱ్ఱిరొట్ట పైటి వేసి కట్టుకో**
**ఉల్లిపూలు నువ్వుచేరు కొప్పు నిండా పెట్టుకో**
**అత్తమాట కొత్తకుండ సవితి పోరు దిద్దుకో**
**ఆలగోలు బాలగోలు రవ్వ వదినామాన్పుకో**

ఇది శబ్దాశ్రయ హాస్యం ఇందులో పరిహాస వాక్యాలు కేవలం మాటల గుత్తులు. కాని ఉపదేశ వాక్యాలు సత్యస్ఫూర్తి కలిగినవి. హాస్యాలంబన వదిన ప్రేమకు పాత్రమైనదేగాని ద్వేషానికి కాదు.

వృత్తి, ప్రవృత్తి, సాంఘికాచారం, నమ్మకం, మానవ సంబంధాలు, అనుభూతులు సందర్భానుసారంగా జానపద సాహిత్యంలో హాస్యంగా రూపాంతరం చెందుతాయి.

**ఇంట్లున్న ముసల్దాన్ని / ఈగమింగిన దాన్ని సూస్తే**
**దొడ్లున్న దోరావును దోమమింగేరా! / వంటి వాటిలో శబ్ద చమత్కారం**
**తమ్మళ్ల పాపయ్య జుట్టు / జుట్టుకు మద్దెల గట్టు**
**కట్టకుంటె ఒట్టు బెట్టు**

వంటి పాటల్లో అంత్యప్రాసలు కనిపిస్తాయి.

**నీళ్లకు బోరా నిమ్మ అంటే / నిద్ర వస్తదే అమ్మ**
**కట్టెలకు బోరా కమ్మ / కడుపు నొప్పి మాయమ్మ**

ప్రాసగతమైన హాస్యం అలరిస్తుంది. జానపద హాస్యంలో సూటితనము, వాడితనమూ ఎక్కువే.

**ఏలని మొగుడు ఎట్లుంటేమి? / కుట్టని రైకె గూట్లుంటేమి?**
**ఊరు ఏలేవారు ఉత్తములైతే / పాలు పొంగినట్లు పొంగుదురు ప్రజలు**

**జానపద రూపకాలు-హాస్యం:**

రంగస్థలాన్ని ఆశ్రయించిన జానపదకళల్లో *భామాకలాపం* విశిష్టమైనది. ఇందులో విదూషకుడు ఆడవాళ్లలో ఆడది, మగవాళ్లలో మగవాడు. సత్యభామ చేత *ఒసే మాధవీ!* అని శ్రీకృష్ణుని చేత *ఓరీ మాధవా!* అని పిలవబడే పాత్ర. ఇతని హాస్యం ఆంగికవాచిక ఆహార్యాది సర్వాంగాంలతోనూ దర్శనం ఇస్తుంది, అసభ్యత కూడా ధ్వనిస్తుంది. ఈ హాస్యనటుడిలో *అనర్గళవాగ్ధారా, అనేక విషయాలను గురించి పరిజ్ఞానం, సభాభిరుచిని బట్టి కొంచెం పచ్చిగావుండి బండ జనాన్ని కూడ పకాలున నవ్వించ గల మోటుతనం, అవగుణాన్ని హేళన చేయగల నేర్పు కనిపిస్తాయి* అంటారు హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు. రాధను శ్రీకృష్ణునకప్పగిస్తూ బావమరుదులు నిన్ను ఎవ్వరేమన్నా!

**కదురెఱ్ఱగా కాల్చి కంట్లోను పెట్టు**
**తోటికోడలి బిడ్డ కూటి కేడుస్తుంటే**
**పేడి చెక్కాతోను పెణతూడగొట్టు**
**ఇరుగు పొరుగుల వారు నిన్నేమియన్నా!**
**ఇల్లు తగలబెట్టి మళ్లీ రావమ్మా!**
**బుదులెరుగదు చాల ముద్దులే గాని**
**బుద్ధులొచ్చేదాక దిద్దుకోవయ్యా!**
**అని హాస్యగాడు పాడతాడు.**

దక్షిణాంధ్రయుగంలోని *యక్షగానాల్లో* హాస్య పాత్రలకు వికటాంగుడు, కేతినాయుడు, సంతోష మొదలైన పేర్లున్నాయి. కూచిపూడి వారి *గొల్లకలాపాల్లో* గొల్లభామతో పాటు సుంకరి కొండడు, ప్రవేశిస్తాడు. ఇతడి వాలకం, చేష్టలు హాస్య ప్రధానంగా ఉంటాయి. గొల్ల భామను పాలు, పెరుగు అమ్ము కున్నందుకు సుంకం కట్టమని అడిగి, అది ఇవ్వకపోతే కనీసం ముద్దు ఇమ్మని అడుగుతాడు. వీరి సంభాషణలు శృంగార హాస్యాలు మేళవించి ప్రేక్షకులను రంజింప జేయడంలో కొంత మోటు సరసం కూడ చోటు చేసు కొంటుంది. *బోడిగాని కలాపం* కూడా జానపద సంప్రదాయానికి చెందిన కళా రూపమే. ఇది ఒకరకంగా *యక్షగానాల్లోని* సింగి-సింగడుల ప్రణయ కలాప హాస్యాన్ని పోలినదే.

*మోహన చుక్క బొట్టు / నిక్కి నిక్కి చూచుకొంటూ / వచ్చేరా బోడిగాడు*

అని పాడుతూ ప్రవేశించే బోడిగాడు తనని తాను పరిచయం చేసుకొని, తన భార్య, ప్రియురాలు రాత్రి ప్రక్కలోంచి మాయమైందని చెప్పి కీచుగొంతుతో ఏడుస్తూ *ఎందు బోతివే సింగీ* అని విలపిస్తాడు.

ఆ తర్వాత సింగి ఎరుకలసాని వేషంలో ప్రవేశిస్తుంది. సింగి-సింగడుల మధ్య జరిగే సంవాదంలో అనేక పురాణ గాథలు, లోక ఇతివృత్తాలు, సామాజిక పరిస్థితులు ప్రస్తావనకు వస్తాయి. హాస్యాన్ని పరాకాష్టకు తీసుకు పోయిన కలాపం *తోలు బొమ్మలాట*. ఇందులో హాస్యపాత్ర గంధోళి గాడు. పాటక జనం దృష్టిలో ఇతడే కథానాయకుడు. ఇతని భార్య గయ్యాళి. అల్లుడు అత్తగారి హృదయాన్ని చూరగొన్న అందగాడు.

చాటుమాటులు లేని సరసం ఇందులో ఉంటుంది. *తోలు బొమ్మలాటల్లో* అనంతర కాలంలో బంగారయ్య, కేతిగాడు, జుట్టుపోలిగాడు, అల్లాటప్పాగాడు లాంటి హాస్యపాత్రలు దర్శనమిచ్చేవి. ఈ పాత్రల ప్రయోజనం ప్రజలను ఆనంద పరచడమే. ఈ పాత్రలు సజీవంగా ప్రజల మధ్య నిలిచిపోయాయి. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధమైన *తూర్పు భాగవతం* లో హాస్యం పోషించేపాత్రను 'భాగవతుడు' అంటారు. ఈ పాత్ర సంభాషణలో కొంచెం పండిత భాషలో ఉంటాయి.

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో *చిందు భాగవతం* ప్రాచుర్యం వహించింది. ఇందులో హాస్యగాడు 'బుడ్డర ఖాన్' ఇతడు తలకు కిరీటం ధరించడం ప్రత్యేకత. సందర్భానుసారం ఉర్దూ పదాలు మాటల్లో చోటుచేసుకొని ప్రేక్షకుల్ని నవ్విస్తాయి. పగటివేషాల్లో కూడా సద్యః స్ఫూర్తితో కూడిన హాస్యం అలరిస్తుంది.

జానపదుల పాటల్లోని, కళల్లో హాస్యం మోటుగా ఉన్నా ఒకానొక విలక్షణ సంస్కృతికి దర్పణం. ఆయా ప్రాంతాల సజీవ భాషను ఉపయోగించుకుని ప్రజలకు సందేశం, వినోదం, విజ్ఞానం అందించేవి. మి



ఎడ్గర్ ఎలన్ పో

# అనుసరణలు

**అ**నువాదాలంత స్పష్టంగా అనుసరణలను గురించి చెప్పడం కష్టం. చిత్తశుద్ధి గల రచయితలైతే ఫలానా కవిని అనుసరించాను అని చెప్పుకుంటారు. అలాంటి వారు కానప్పుడు పాఠకుడైనా, విమర్శకుడైనా అనుసరణని కనుగొనడం కష్టం.

అమెరికన్ రచయితల అనుసరణ విషయంలో... ఎడ్గర్ ఎలెన్ పో కవిత ఆధునిక ఆంధ్ర కవులలో - ముఖ్యంగా అభ్యుదయ కవులలో - పలువురిని ప్రేరేపించింది. ఎలెన్ పో "బాడీలేన్" అనే ఫ్రెంచి కవికి వరవడి పెట్టడం ద్వారా 'సింబాలిజం' అనే ఉద్యమానికి ప్రథమస్థానంలో ఉన్నాడు. సింబాలిజంను అంతో ఇంతో ఆపోశన పట్టిన శ్రీరంగం శ్రీనివాసరావు గారికి ఎడ్గర్ ఎలెన్ పో ఇష్టుడు కావడంలో ఆశ్చర్యం లేదు. ఆయన *మహాప్రస్థానం* లోని గేయాలలో ఒకటైన *గంటలు*, ఎలెన్ పో *ది బెల్స్* అనే దానికి అనుసరణ.

ఈ *గంటలు*కు ప్రకాశవంతమైన అనుసరణ నార్ల వెంకటేశ్వరరావు *మంటలు! మంటలు!* అనే గేయం. మార్క్‌ట్వైన్ వ్రాసిన *ఇండియన్ క్రౌ* అనుసరణ నార్ల వెంకటేశ్వరరావు *కాకి*. ఇది *మాటా మంతీ* లో ఒకటి. *దారిన పోయే దానయ్య* అనే రూపకం *మిస్టర్ ఎక్స్ పాసెస్ బై* అనే దానికి అనుసరణ. దీనిని గోపీచంద్ రచించారు.

ఇక అమెరికా రచయితల ప్రభావం గురించి - ఓ హెన్రీ ప్రభావం ఆధునికాంధ్ర కథకులపై విశేషంగా ఉంది. పాత రచయితలలో గుడిపాటి వెంకటచలం *సరస్వతీ ప్రసన్నం, వేదాంతం,* మొదలైన కథలలో చివరి మలుపు ఓ హెన్రీ ప్రభావమనడానికి సాహసిస్తున్నాను. యువ రచయితలలో వాకాటి పాండురంగారావు *అపరాజిత* మొదలైన కథలలో చివరి మలుపులూ ఓ హెన్రీ ప్రభావమే. రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనావిధానంలోనూ, బుచ్చిబాబు *చివరికి మిగిలేది* మొదలైన నవలలోనూ హెమింగ్వే ప్రభావం - కథనరీతి, వాక్యాలు మధ్య ఆపటం, సగమే పలకటం వంటివి నామటుకు నాకు కనిపిస్తున్నవి.

- తిరుమల రామచంద్ర



దిజ్ఞాగాచార్యుడు

# దిజ్ఞాగ

- కొమ్మనమంచి జోగయ్య శర్మ

*పక్కనున్న దిజ్ఞాగాచార్యుని చిత్రము సతీష్ చంద్ర విద్యాభూషణుడు వ్రాసిన ఇండియన్ లాజిక్ అనే గ్రంథములో ప్రకటితమైనది. దిజ్ఞాగుని రూపు టిబెట్టులోని తగ్యూరు గ్రంథము నుండి తీసుకొనబడింది.*

*ఈ చిత్రములో గమనించ దగినది కుళ్ళాయి. బౌద్ధము తొలి కాలములో బౌద్ధ భిక్షువులు శిరోవేష్ఠనము ధరించుట నిషిద్ధము. మహాయానము వచ్చిన తరువాత బౌద్ధ భిక్షువుల దుస్తులలో కూడా మార్పువచ్చింది. వివిధాకృతులు గల కుళ్ళాయిలు వాడుకలోకి వచ్చాయి. ఈ చిత్రములో దిజ్ఞాగాచార్యులు ధరించినది పండితులు ధరించు ఎఱ్ఱకుళ్ళాయి. ఇది పొడుగుగా నుండి మెడ మీద నుండి క్రిందకు దిగజారి పైకి పోను పోను కోను తేరి యుండును. పండితుడెంత యుత్తమ శ్రేణికి చెందిన వాడయితే కుళ్ళాయి వెనుక భాగమంత క్రిందికి వీపు మీదకి దిగజారి యుంటుంది.*

*శాంతి రక్షితులవారు ఈ పండిత శిరోవేష్ఠమును క్రీ॥శ॥ 749 లో టిబెట్టునకు తీసుకుని వెళ్ళినట్లు చెబుతారు. పండిత అన్నది విక్రమ శీల బౌద్ధ విద్యాపీఠమున విద్యార్థులకు ఉత్తీర్ణతా సూచకముగా నొసగ బడుచుండిన పట్టపు బిరుదు. ఈ పండిత శిరోవేష్ఠనము దిజ్ఞాగాచార్యుల వారి తర్కశాస్త్ర వైశారద్య సూచకముగా వచ్చినదే కావచ్చును.*

*దిజ్ఞాగాచార్యుల వారి ఊర్ణమయ వస్త్రము, బౌద్ధము శీతల ప్రదేశములో వ్యాపించిన పిదప బౌద్ధ భిక్షువులును బ్రాహ్మణులవలెనే తగిన శీత నిరోధక వస్త్రములను ధరించుట కనుమతి యొసగబడినది. పై చిత్రము యొక్క అరచేతిలో సకలానర్థక పాపనివారకమై, టిబెట్టు భాషలో దోర్జియనబడు వజ్రము కూడ వుంది. చిత్రము చుట్టూ వున్న పరివేష్టము దిజ్ఞాగాచార్యులు సిద్ధులనుటకు గుర్తు.*

---

దిజ్ఞాగాచార్యుడు (క్రీ.శ. 480–569): ఈతడు గొప్ప తర్క పండితుడు. బౌద్ధ మతములో తర్కశాస్త్ర రచనలను ప్రవేశపెట్టిన వారిలో మొట్టమొదటి వాడు.

దిజ్ఞాగాచార్యుడనియు, భదంత ధీరనాగుడనియు నీతనికి వ్యవహారము గలదు. కవికులతిలకుడగు కాళిదాసీతని సమకాలమువాడని ప్రతీతి.

దిజ్ఞాగుని జన్మస్థానము మదరాసు రాజధానిలోని కాంచీనగరమునకు సమీపమున నున్న సింహవక్త్ర నగరమని కొందరు పేర్కొనిరి. ఈ నగరమేదో నేడు గుర్తించుటకు వీలుగా లేదు. నేటి నెల్లూరునకు విక్రమసింహపురమని ప్రసిద్ధి గలదు. బహుశ ఈ విక్రమసింహపురమే ఆ సింహవక్త్ర నగరముగా బేర్కొనబడెనేమో. ఇది కాంచీ పురికి గొంతలో గొంత దగ్గరగా నున్నది కూడ. ఇదే నిజమైనచో దిజ్ఞాగుని జన్మస్థలము ప్రస్తుత నెల్లూరు నగరమగును. మహామహోపాధ్యాయ సతీశచంద్ర విద్యాభూషణ్‌గారు తమ హిందూ తర్కశాస్త్ర చరిత్రలో *(హిస్టరీ ఆఫ్ ది ఇండియన్ లాజిక్)* 'దిజ్ఞాగుడు తన జీవితములో జాలకాల మాంధ్ర దేశమున గడపె' నని వ్రాసి యున్నారు. జన్మస్థల మేదైనను ఇతడాంధ్ర దేశమందలి వేగిదేశమునకు సమీపముననున్న బౌద్ధవిహారములో నివసించి యున్నట్లు టిబెట్టుగాథలు పేర్కొను చున్నవి. కాగా దిజ్ఞాగుడాంధ్రదేశము వాడని గుర్తింపవచ్చును.

తొలుత నీతడు నాగదత్తుడను గురువునొద్ద జేరి బౌద్ధమతమునందలి థేరవాదము నవలబించాడు.

తరువాత ఆచార్య వసుబంధుని శిష్యుడై థేరవాద మహాయానములను గూర్చి కూలంకష విజ్ఞానమును సంపాదించాడు. అనంతరము కొంతకాలమునకు బౌద్ధవిద్యాధి దేవతయగు మంజుశ్రీ సాక్షాత్కరించగా నా దేవత యను గ్రహమువలన బౌద్ధ ధర్మ విశేషముల నన్నిటిని గ్రహించి, నాలందకు వెడలి యచటి సుదర్శయుడు మున్నగు బ్రాహ్మణులను వాదమున జయించి బౌద్ధమతాధిక్యమును

ప్రతిష్ఠించెనట. అది మొదలు దిజ్నాగుడు ఉత్కళము, మహారాష్ట్రము మున్నగు దేశముల సంచరించి, యచటి వైదికమతాను యాయులగు పండితులతో శాస్త్ర చర్చలొనర్చి యుద్దండ పండితుడనియు, తర్కపుంగవు డనియు పేరు గాంచెను. కుమారిలభట్టు, పార్థసారథి, మిశ్రుడు మున్నగు వారీతనితో శాస్త్రవాద మొనర్చిన వారిలో ప్రధానులు.

ఈ విధముగా నీతడు జీవితాంతము పండితులతో శాస్త్రీయములగు వాదోపవాదము లొనర్చి, మహామేధావియై గొప్ప తార్కికుడై పేరుగాంచి ప్రసిద్ధి చెందాడు.

తన యనుభవము నంతను క్రోడీకరించి -

1. *ప్రమాణ సముచ్ఛయము*
2. *ప్రమాణ సముచ్ఛయ వృత్తి*
3. *న్యాయ ప్రవేశము*
4. *హేతు చక్ర డమరుకము*
5. *ఆలంబన పరీక్ష*
6. *ఆలంబన పరీక్షావృత్తి*
7. *త్రికాల పరీక్ష*
8. *న్యాయావయవము* మున్నగు ననేక గ్రంథములను

రచించాడు. ఇవి తర్కశాస్త్ర గ్రంథములు. *కుందమాల* యనెడి నాటకము కూడ నీతడు రచించినట్లు ప్రసిద్ధి గలదు. ఇవన్నియు సంస్కృతభాషలో వ్రాయబడినవి. బౌద్ధ మతాధిక్యమును నిరూపించుటే యాతని వాదములకును, రచనలకును ముఖ్యాశయం. అక్షపాదుడు, కణాదుడు మొదలగు ప్రాచీన నైయాయికులవలంబించిన పంచావయవ వాక్యమును ఈతడు మూడవయవములతో కుదిర్చినాడు. ఉపమానమునకును, శబ్దమునకును ప్రామాణ్యమును నిరాకరించి, ప్రత్యక్షానుమానములను గల్పించిన బుద్ధిశాలి దిజ్నాగుడు.

"ఓ మేఘ సందేశ కావ్యమా! రసజ్ఞులైన నిచుళకవి ఉన్న ఈ ప్రదేశం నుంచి బయలుదేరి సమస్త దేశాలలోనూ వ్యాపించు. త్రోవలో దిజ్నాగాచార్యుడు చేసే దురాక్షేపాలను లెక్కచేర్చకు. వాటికి నాస్నేహితుడు నిచుళకవి తగు సమాధానాలు చెపుతాడులే మహా శైలం వంటి ఆ దిజ్నాగాచార్యుడికి నీవల్ల శృంగభంగం అవుతుందిలే..."

**మేఘసందేశకావ్యం నుంచి....**

## చే జారిన శిల్పసంపద!

**1816** ప్రాంతంలో సర్వేయర్ జనరల్‌గా పనిచేసిన కల్నల్ కానిన్ మెకంజీ మన దేశంలోని గ్రామాల చరిత్రలు వ్రాయించాడు. ఆ నాటి గ్రామ పెద్దల నుండి తీసుకున్న కైఫీయత్తులే మెకంజీ వ్రాయించిన చరిత్రలకు మూలాధారం. ఈ చరిత్ర ప్రతులు శిథిలమవుతుండగా వాటిని తిరగ వ్రాయించి ప్రాచ్యలిఖిత భాండాగారంలో భద్రపరచుట ద్వారా సి.పి. బ్రౌన్ ఆంధ్రదేశ చరిత్రకు, ఆంధ్ర సాహిత్యానికి అపారమైన సేవ చేశాడు. వారు భద్రపరచిన ప్రాచీన పత్రాలు మన చరిత్ర రచనకు తోడ్పడ్డాయి. కృష్ణాజిల్లా ఘంటసాల ఘనకీర్తిని తెలిపే విలువైన చారిత్రక సంపద మనకు ఎంతో మిగిలివుండేది. ఆనాడే ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ తీసుకున్నా చారిత్రకమైన శిల్పసంపద పరాయి దేశాలకు పోయి వుండేదికాదు. బౌద్ధ శిల్పాలు బట్టలుతికే బండలుగా మారి శిథిలమై వుండేవి కావు. బుద్ధుని నిలువెత్తు శిలా విగ్రహం ఎనిమిది వేల రూపాయలకు దళారీల వద్దకు చేరి మాయ్యమయ్యేది కాదు.

1920లో ఘంటసాలలోని కోటదిబ్బలో ఒక రైతు దున్నుతుంటే 60 శిల్పాలు బయటపడ్డాయట. అందులో ప్రతి ఒక్కటి శాక్యముని జీవితాన్నో, జాతక కథనో చిత్రించిన శిలాఫలకమేనట. దొరికిన శిలాఫలకాలనన్నిటినీ గ్రామస్తులొక చెట్టుక్రిందకు చేర్చి గుట్టవేసి వుంచారట. కొన్నాళ్ళకు పాండిచ్చేరి నుండి ఎం.డి. జోనియన్ దూబ్రియేల్ ఏజెంట్ వచ్చి అయిదు వేల రూపాయలకు రాళ్ళు మొత్తం కొని, తీసుకుపోయాడట. అక్కడ నుండి అవి పారిస్‌లోని గుయ్‌మెట్ మ్యూజియం చేరుకున్నాయి. ఒకసారి దూబ్రియల్ స్వయంగా వచ్చి కొన్ని బౌద్ధ విగ్రహాలు కొనుక్కుపోయాడట. ఆ విధంగా ఘంటసాల బౌద్ధ శిల్పసంపద శాశ్వతంగా చేయి జారిపోయింది. ఘంటసాల శిల్పాలలో ముఖ్యమైన శిల్పం బోస్టన్‌లో వున్నట్టు బ్రిటీష్ మ్యూజియం అసిస్టెంట్ కీపర్‌గా పని చేసిన డగ్లర్ బారెట్ తెలిపాడు.

**- ఎ.కె.ఆర్.బి. కోటేశ్వరరావు.**

# కవుల విలువ!

అల్లసాని పెద్దనార్యుల స్వరూపస్వభావాదులు మనకు దెలియకపోవుట వింతయేమి? ఈ నడుమ గతించిన కవుల గూర్చియైనను సమగ్రములైన యంశములు మనకు దెలియునా? కొక్కొండ వేంకటరత్నము పంతులు కీర్తిశేషులైరి. అయి యెంతో కాలమైనదా? లేదు. పదునైదేండ్లకు దక్కువయై యుండునేమో? మనలో ననేకులాయనను జూచికూడనున్నారు. ఆయన యెప్పుడు పుట్టిరో, యేయూర బుట్టిరో, యాయన జన్మపత్రమెట్లుండెనో, యేగురువువొద్ద నాయన విద్యనభ్యసించిరో, యెప్పుడాయన మతమును మార్చుకొనిరో, యే గ్రంథము నాయన మొదట వ్రాసిరో మీలో నొక్కనికైన దెలియునా? ఆయన వఱకు గూడ నెందులకు? ఈ నడుమ ననగ నాలుగైదు సంవత్సరముల లోపల గైలాసగతులయిన ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రులవారెప్పుడు కవిత్వ మారంభించిరో, భారతాంధ్రీకరణమున కేల బూను కొనిరో, వ్యాకరణ శాస్త్రమెంత వఱకెవరియొద్ద నభ్యసించిరో, యాయన తండ్రి యెవరో మీలోనొక్కనికైన దెలియునా?

మీ కొఱకు సమస్త శ్రమలకు లోనై మిమ్ము సుఖపెట్టుచున్న కవులు- లోకమునకు తన భావపరిమళమును వెదజల్లి తాను పచ్చకర్పూరమువలె నిగిరిపోయిన కవులను, తాము కడుపులు మాడ్చుకొని మీ మనస్సులకు విలువ లేని విందొనర్చిన కవులను-అట్టికవుల నాదరించు క్రమమిదియేనా? నూఱు సంవత్సరముల లోపలె నెందఱు కవులు పరమపదించిరో యెఱుగుదురా? ఇప్పటివారినే మీరిట్లు మఱచుట తగునా? మీరు శ్రమచేసి వారి చరిత్ర లేఖనమునకు దగిన సామాగ్రిని సంపాదించుట కష్టము. సంపాదించినను సందర్భశుద్ధిగ వ్రాయుట కష్టము. అందువలన వర్తమాన శతాబ్దకవుల చరిత్రములు లేవనుకొందము.

ఇన్ని పుస్తకభాండారములున్నవి కదా! ఇన్ని పాఠశాలలున్నవి కదా? ఇన్ని తాళపత్రగ్రంథ నిలయములున్నవి కదా! వావిలాల వాసుదేవ శాస్త్రులవారి పటము దేనిలోనయినా నున్నదా? బెల్లపుకొండ హనుమంత రావు విగ్రహమే మూలనైన వ్రేలాడుచున్నదా? మండపాక పార్వతీశ్వర శాస్త్రుల వారేగోడమీద నుండియైన దుమ్ముతో, దుష్కరప్రాససంధానబంధుర ధోరణితో విరాజిల్లుచున్నారా? ఎందరి పేర్లిట్లు చెప్పవచ్చును? ఇక జమీందారుల సందర్శన శాలలో కారలైలు కనబడును గాని, కందుకూరి వీరేశలింగం కనబడరే! బెన్‌జాన్సను కనబడునుగాని, దేవులపల్లి వారగపడరే! సర్ వాల్టరు స్కాటు కనబడునుగాని, శిష్టు కృష్ణమూర్తి శాస్త్రులు గారగపడరే! ఆంధ్రులమైపుట్టిన మనమాంధ్రకవుల గూర్చియే యింత యనాదరణముతో నుంటిమే! అరవ కవులను, గర్ణాటకవులను, మహారాష్ట్రకవులను, హిందీకవులను మనమాయింక నాదరించుట! తండ్రి శ్రాద్ధము పెట్టనివాడు పినతండ్రి తద్దినము పెట్టునా? ఇంకను దేశభక్తియని తెయితక్కలాడుట యెందులకు? గావుకేకలు వైచుటెందులకు? వీరావేశములెత్తి విహరించుటెందులకు? వాణీదాసున కంతలో దగ్గు తెమలకుండ వచ్చుటచేత నూరకుండెను. అంతట నేనిట్లంటిని. నూఱు సంవత్సరముల లోపల నాంధ్రదేశము నలంకరించిన కవుల యందర చరిత్రములను బ్రకటించుటకు గావ్యనిధి చెలికాని లచ్చారావుగారు పూనుకొని యున్నట్లు వింటిని. కావున గవులెల్లరు తమ చరిత్రములోని ముఖ్యాంశములను వ్రాసి యాయనకు బంపవలయును.

**- పానుగంటి లక్ష్మీనరసింహారావు**

నాటకకర్తగా, వ్యాసకర్తగా, హాస్యస్రష్టగా ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ప్రతిభామూర్తి పానుగంటి (1865-1940) కథా కథనరీతిలో సాగుతూ ఉండిన తెలుగు నాటకంలో బుద్ధిగమ్యమైన సంవాద పద్ధతిని ప్రవేశపెట్టింది పానుగంటివారే. ఆయన చేసిన *సాక్షి ఉపన్యాసాలు* సంఘ దురాచార నిర్మూలన కరంబులును, పండిత పామర రంజకంబులును, సరస హాస్యాద్భుత రసమయంబులును, గంగా ఘరీ ప్రతీకాశ ధాటీ విరాజితంబులును, అమృత మాధురీ ధురీణంబులును, అపూర్వ భాసురంబులును, జ్ఞాన దాయకంబులును, హర్ష దాయకములై ఆంధ్రావళి అభిమానాన్ని విరివిగా పొందాయి. ఈ ఉపన్యాసంలో చివరగా పేర్కొన్న లచ్చారావు (1885-1923) తెలుగు భాషా సారస్వత సమున్నతికి ప్రశంసనీయమైన కృషిచేసిన పిఠాపురం ప్రముఖుడు. ఎనిమిది దశాబ్దాల క్రితం వాణీదాసుని నోట వ్యక్తమయిన పానుగంటివారి ఆవేదనను, లచ్చారావు వంటి సౌజన్యుల కృషినీ *డిక్షనరీ ఆఫ్ నేషనల్ బయోగ్రఫీ*ని పోలిన సమగ్ర రూపంలో ఫలింపజేసే సంకల్పం ఈనాటికైనా మనకున్నదా?

# చదవండి...

– ఎన్నార్కె




❖ **ఆముక్త మాల్యద :** ఇదొక సాహిత్య, ఆధ్యాత్మిక సమీక్ష. చేసిన వారు కొత్త వెంకటేశ్వరరావు. ఆముక్తమాల్యదకు ఇంతకు పూర్వం వాఖ్యానం వ్రాసిన వేదం వెంకటరాయశాస్త్రి గారు స్పృశించని అనేక అంశాలను వివిధ కోణాల నుంచి విశ్లేషించి చూపారు. గ్రంథమంతా ఆముక్త ప్రథమాశ్వాస వ్యాఖ్యానమే. విష్ణుచిత్తుని కథాతాత్పర్య విస్తరణమే. ఆముక్త మాల్యదలానే ఇది అవశ్య పఠనీయం.

*పేజీలు 300, వెల : ₹ 150/-, ప్రచురణ కర్తలు విశాలాంధ్ర పబ్లిషర్స్.*




❖ **పర్యావరణ కథలు :** పూర్ణచంద్ర తేజస్వి వ్రాసిన కన్నడకథలు. అనువాదకులు శాఖమూరు రామగోపాల్. కన్నడ భాషలో సుమారు 16 సార్లు పునర్ముద్రణకు నోచుకున్న పుస్తకమిది. జ్ఞానపీఠ పురస్కారం పొందిన కుప్పళ్ళి వెంకట రమణ పుట్టప్ప గారి కుమారులే పూర్ణచంద్ర తేజస్వి. వీరు రామ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణగార్ల సమ సమాజ వాద సిద్ధాంతాల అభిలాషి. వీరి రచనలలో అణువణువునా స్వరమానవ సౌభ్రాతృత్వం కనిపిస్తుంది. వీరు తమ కన్నడ రచనలను స్వయంగా ముద్రించి, సముచిత ధరకే పంపిణీ చేసేవారు.

*పేజీలు 200, వెల : ₹150/-, ప్రతులు కావలసినవారు శాఖమూరి రామగోపాల్, ఇం.నెం.5-10, రోడ్డు నెం. 21, దీప్తి శ్రీనగర్, మియాపూర్ పోస్టు, హైదరాబాద్ 49కి వ్రాయండి.*




❖ **వాక్కుకు వయసు లేదు :** నిరంతర సృజనాత్మక సాహితీ మూర్తయిన డాక్టర్ సి.నారాయణరెడ్డిగారు 2012 జూలై 29న ఎనభై రెండవ సంవత్సరంలో పాదం మోపారు. వారు కొన్ని సంవత్సరాలుగా ప్రతి పుట్టిన రోజుకు తమ రచనలతో ఒక కొత్త పుస్తకం ప్రచురిస్తారు. ఈ సంప్రదాయం ప్రకారం ఈ సారి వెలువడినదే ఈ గ్రంథం. వారి వయస్సుకు తగ్గట్టు ఇందులో 82 కవితలున్నాయి.

*పేజీలు 180, వెల : ₹150/-, ప్రతులు నవోదయ బుక్ హౌస్‌లో లభ్యమవుతాయి.*




❖ **కృష్ణారెడ్డిగారి ఏనుగు :** కన్నడ పరిమళంతో సొగసులద్దుకున్న కన్నడ అనువాద కథల ముత్యాల హారం. ప్రచురించ బడ్డ ఈ పదహేను కథలలోనూ కన్నడిగుల జీవన విధానం ఎంతో హృద్యంగా పొదగ బడింది. లబ్ధప్రతిష్టులైన కథకులే అందరూ. ముఖ్యంగా పేర్కొనదగినది పూర్ణచంద్ర తేజస్విగారు వ్రాసిన కృష్ణారెడ్డి గారి ఏనుగు. ఒక ఏనుగు నేపథ్యంతో ఒక చిన్న పట్టణం ప్రజాజీవితాన్ని దర్పణం చేసిన కథ. ఏనుగు చేసే చిలిపి పనులు కొన్ని, ప్రజలు అంటగట్టేవి మరికొన్ని. మానవ సంబంధాలలో పెనవేసుకొన్న పిరికితనం, బాధ్యతారాహిత్యం, పలాయన వాదం చక్కగా విశ్లేషించ బడ్డాయి. ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే వ్యభిచారం మరోకథ. ఇలా అన్నీ దేనికవే. శాఖమూరు రామగోపాల్ గారి అనువాదం సులభగ్రాహ్యంగా ఉంది. మన సోదర భాషయిన కన్నడ సాహిత్య స్థాయి మనం తప్పక తెలుసుకోవాలి. ఇటువంటి పుస్తకాలను తప్పక చదవాలి.

*పేజీలు 200, వెల : ₹100/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9052563666 లో సంప్రదించండి.*




❖ **జీవించు - నేర్చుకో- అందించు :** ఆధునిక తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి స్వతంత్ర వాఖ్యానాలతో కూడిన రచన. రచయితయిన తుమ్మేటి రఘోత్తమ రెడ్డి – ఈ వ్యాఖ్యానాలను ఒక సాహిత్య ప్రక్రియగా భావించారు. ఇంతకు ముందే కొందరు పేర్కొన్న విషయాలను వస్తుసమగ్రత కోసం తన దృష్టినుంచి తిరిగి వాఖ్యానించారు. చాలా కోట్స్ వారి అనుభవాల నుంచి రూపుదిద్దుకున్నవే. వీటన్నిటినీ వారు స్నేహం, ప్రేమ, చదువు, సాహిత్యం, కళలు ఇలా వివిధ రకాలుగా, 27 అధ్యాయాలుగా విభజించారు. ఒక తరంలో ప్రోది చేయబడ్డ జీవన జ్ఞానాన్ని తరువాత తరానికి అందజేయాలనే రచయిత ఆకాంక్ష అభినందనీయం.

*పేజీలు 140, వెల : ₹ 75/-, లభించు చోటు నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్.*



❖ **అసామాన్య విశాఖలో విశాఖమాన్యులు :** సత్యమూర్తి చారిటబుల్ ట్రస్ట్, విశాఖపట్నం పేరిట మోదు రాజేశ్వరరావు  పెద్దసైజులో సమర్పించిన అసామాన్య పుస్తకం. విశాఖపట్నంలో పుట్టిన లేదా పెరిగిన 250 మంది మాన్యుల చరిత్రను వీలయినంత విషయ వివరణలతో ఒక్క పేజీకి మాత్రమే పరిమితమయినా క్లుప్తంగా అర్థవంతంగా ఒక రకంగా సంపూర్ణంగా చెప్పడం గొప్ప విశేషమనే భావించాలి. ఈ పుస్తకాన్ని తెలుగులోనే కాకుండా హిందీ, ఇంగ్లీషు, భాషలలోనూ ప్రచురించి మూడు పుస్తకాలను ఒకే రోజు, ఒకే వేదికపై ఆవిష్కరించటం ఒక అపూర్వ సంఘటనన. సాహిత్యంలో జీవిత చరిత్రలను ఇష్టపడేవారు. విశాఖను ప్రేమించేవారు తప్పకుండా తమ వద్ద ఉంచుకో దగ్గ పుస్తకం.

*పేజీలు 250, వెల : ₹ 250/-, ప్రతులు కావలసినవారు ఫోన్ : 9396447227 లో సంప్రదించండి.*



❖ **వేమన అనుభవసారం:** రచయిత సుప్రసిద్ధ కవి, విమర్శకులయిన అనుమాండ్ల భూమయ్య. 15 అధ్యాయాలుగా విషయ విభజన జరిగిన ఈ రచన గురు, శిష్యుల మధ్య సంభాషణ రూపంలో సాగుతుంది. 'ఆత్మతత్త్వమెరుగు నతడె యోగి', 'తన్ను తానెరిగిన తానెపో బ్రహ్మము', 'దారి చూపు ఘనుడు దైవంబుకాడో' అనే మకుటాలు (ఇవి మచ్చుకి మాత్రమే) తెలియ చెబుతాయి రచయిత ఎంతగా వేమన జీవనాడిని పట్టుకోగలిగాడో అని. సామాజిక కట్టుబాట్లు మూఢనమ్మకాలు, సామాజిక స్థితిగతులపై తనదైన శైలిలో వాఖ్యానం చేసిన వేమన రచనలు జ్ఞానభాండాగారాలు. వాటిని ఒక క్రమంలో వెలువరించటంలో రచయిత కృతకృత్యుడైనాడు.

*పేజీలు 130, వెల : ₹ 75/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 0889 7073999లో సంప్రదించండి.*




❖ **బసవ పథం :** ముఖ్యసంపాదకులు – గుత్తి చంద్రశేఖరరెడ్డి. 12వ శతాబ్దంలో వెల్లువెత్తిన సాంఘిక విప్లవంలో, వర్గ, వర్ణ, కుల బేధాలు పాటింపక హిందూమతంలో ఉంటూనే, తాను పుట్టిన అగ్రజాతినే తిరస్కరించి, మానవులందరూ ఒక్కటే అని ఎలుగెత్తి చాటిన బసవలింగని సిద్ధాంత తాత్త్వికను అందరి దృష్టికి తీసుకొని వచ్చే ప్రయత్నమే, *బసవ పథం* అనబడే ఈ త్రైమాసిక పత్రిక లక్ష్యం. ఆనాడే వీరశైవం తీసుకొని వచ్చిన సాంఘిక విప్లవ స్రవంతి మనల్ని ఆనందాశ్చర్యాలలో ముంచివేస్తుంది. వార్షిక చందా 60/- రూ. పంచ వార్షిక చందా 250-  బసవ సమితి. శ్రీ బసవేశ్వర వృత్తం, బెంగుళూరు.

*పేజీలు:52, వెల: ₹15, ప్రతులు కావలసినవారు ఫోన్ :* 080 22265505 *లో సంప్రదించండి.*



# దిక్కులేని సామాన్యుడు...

బాగా చదివి ఎమ్‌సెట్లో మొదటి రాంకు వస్తే
డాక్టర్లవుతారు - ఇంజనీర్లవుతారు.

✶ తర్వాత రెండో తరగతిలో పాస్ అయినవారు గ్రూప్-I రాసి
(ఎన్నో ధక్కామొక్కీలు తర్వాతే అనుకోండి)
డాక్టర్లకు, ఇంజనీర్లకు ఆదేశాలు ఇస్తారు.

✶ తర్వాత మూడో క్లాసులో పాసయిన
వారు - లాయర్లుగా మారి - రాజకీయాలలోకి
వచ్చి పైవారినందరినీ అదుపులో పెడతారు; పరుగులెత్తిస్తారు.

ఇక కాలేజీ పూర్తి చేయలేని వాళ్ళు
రియల్ ఎస్టేట్ - పరిశ్రమలు, వ్యాపారాలు పెట్టి
రాజకీయులను తమ జేబులో పెట్టుకుంటారు.

✶ అస్సలు చదువురానివారు - నేర ప్రపంచంలో
వెలిగిపోతారు - ఈ మాఫియా గుప్పిట్లో
పై వాళ్ళందరూ - బొమ్మలే.

సరే ఇదీ చేతగాదా - ఇక మిగిలింది
కాషాయం-రుద్రాక్షలు-ఆశ్రమాలు పెట్టి
గుంపు భజనలు చేయిస్తారు.
పైన చెప్పిన వాళ్ళందరూ - వీళ్ళకాళ్ళ దగ్గరే పడి ఉంటారు.

*ఓరీ సామాన్యుడా! నీకు దిక్కెవరు?*



*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు** ₹

| | | |
|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు - *ఎ.వి.రెడ్డి* | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-3 " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | 150.00 |
| 8. | దూర తీరాలలో... - *వి. అశ్వినికుమార్* | 60.00 |
| 9. | అమాహా " | 60.00 |
| 10. | అంతర్వీక్షణం " | 50.00 |
| 11. | సిద్ధార్థ " | 50.00 |
| 12. | నాలో నేను " | 30.00 |
| 13. | అగాధం " | 75.00 |
| 14. | కథాంజలి-1 **- ఎస్సారె** | 80.00 |
| 15. | కథాంజలి-2 " | 110.00 |
| 16. | THE THUNDERCLOUD " | 120.00 |
| 17. | మిసిమి వ్యాసాలు - *నరిసెట్టి ఇన్నయ్య* | 125.00 |
| | **ఇతరములు** | |
| 18. | భట్టిప్రోలు కథలు | 150.00 |
| 19. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *ఎమ్. కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ.హరిమోహన్ ఝూ, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం -*ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు - *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 50.00 |
| 12. | మిళింద ప్రశ్నలు - *బోధచైతన్య* | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ - అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 60.00 |
| 15. | శీలం-ధ్యానం - *బోధ చైతన్య* | 150.00 |
| 16. | లోకక్షేమగాథలు - *బోధ చైతన్య* | 100.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 2. | యతిగీతం- స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |


మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ........................................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ........................................................................

వీథి ........................................................................

పేట ........................................................................

ఊరు ........................................................................

పిన్ ........................................................................

సెల్ ........................................................................

**3. సంతకం :** ........................................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

అలాగే ఐదు సంవత్సరాలకు ₹1200 పంపండి. అందమైన 2010 మిసిమి పుస్తకాల బైండు అందుకోండి.

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



తన్మయ స్నానం

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



స్నిగ్ధ సుకుమారి